వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 7 సంచిక : 2 హైదరాబాద్ 91 ఫిబ్రవరి 2009 పేజీలు : 56 రు. 10

❖ ఫోకస్ : మతోన్మాదం కొత్త రంగులు
నాలుగు వ్యాసాలు

❖ స్విస్ బ్యాంకుల్లో భారతీయుల ఖాతాలు

❖ సత్యం కంప్యూటర్స్ కుంభకోణం

❖ రాయలసీమపై రెండు వ్యాసాలు

❖ అంతర్గామలో ఆకలి చావులు

❖ ఆర్య - ద్రావిడ సమ్మేళనం

వీక్షణానికి మీ చేయూతనందించండి !

ఆరు సంవత్సరాలుగా ప్రతినెలా మీతో సంభాషిస్తూ, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపై కొత్త ఆలోచనలను, వైవిధ్యపూరితమైన చర్చను ప్రోత్సహిస్తూ, మీ ఆదరణ చూరగొంటూ వస్తున్న వీక్షణం తన ఆర్థికస్థితిని కూడ మీతో పంచుకోదలచుకుంటున్నది.

వీక్షణం ఇప్పుడు నడుస్తున్న పద్ధతిలో, పెరుగుతున్న న్యూస్ ప్రింట్ ధరలు, ప్రింటింగ్ ఖర్చులు, కార్యాలయ నిర్వహణ, పోస్టింగ్ వంటి ఖర్చులన్నీ కలుపుకుంటే ఒక్కొక్క ప్రతికి ఉత్పత్తివ్యయం రు. 14 గా ఉంటున్నది. కాగా ప్రతి సంచికకూ చందాదారులు చెల్లించేది రు. 10. అందులో పోస్టేజి ఖర్చులు మినహాయిస్తే వాస్తవంగా చెల్లిస్తున్నది రు. 9 కన్న తక్కువ. పత్రిక విడిప్రతిని దుకాణాలలో కొనుక్కునేవారు రు. 10 చెల్లించి కొనుక్కున్నపటికీ, ఏజెంట్ కమిషన్ పోగా వారి నుంచి పత్రికకు అందేది ఒక్కొక్క ప్రతికి రు. 6 మాత్రమే. అంటే పత్రిక ఒక్కొక్క ప్రతి చందాదారుల విషయంలో రు. 5 లోటుతో, విడిప్రతి కొనుగోలుదారుల విషయంలో రు. 8 లోటుతో నడుస్తున్నదన్నమాట. పత్రిక ఎన్ని ప్రతులు ఎక్కువ అమ్మకమైతే అంత ఎక్కువగా లోటు పెరుగుతుందన్నమాట. ప్రస్తుతానికి ప్రతినెలా రు. 25,000 లోటుతో పత్రిక నడుస్తున్నది. ఏ పత్రిక అయినా తన ఉత్పత్తి వ్యయాన్నంతా పాఠకులనుంచే రాబట్టడం జరగదు. ఉత్పత్తివ్యయంలో కొంతభాగాన్ని ధరగా నిర్ణయించి మిగిలిన భాగాన్ని వ్యాపార ప్రకటనల రూపంలో సేకరించడం ఆనవాయితీ. ఎన్ని ఖర్చులు పెరిగినా గత నాలుగు సంవత్సరాలుగా ధరనుగాని, వార్షిక చందాను గాని పెంచలేదని, వీక్షణంకు ఇప్పటివరకూ ప్రభుత్వ ప్రకటన తప్ప ఇతర ప్రకటనలు కూడా ఎక్కువగా రావడం లేదని మీకు తెలుసు. వీక్షణం ను నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ సంస్థ సర్వేలు చేయడం ద్వారా సంపాదించిన నిధులను వీక్షణం కొరకు ఖర్చుపెడుతున్నది. ఆ పరిస్థితి ఇంకా ఎక్కువ కాలం కొనసాగే అవకాశం లేదు.

ఈ పరిస్థితిలో వీక్షణంను ఆదుకొని, ఆర్థికవనరులను కల్పించి, మనుగడను సుస్థిరం చేయవలసింది మీరే. ఇది మీ పత్రిక, దీన్ని కాపాడుకోవడం, పది కాలాలపాటు నిలిచేలా చూడడం మీ బాధ్యత.

అందుకోసం

- పాఠకులందరూ చందాలు కట్టవచ్చు.
- ప్రతి చందాదారూ మరొకరిని చందాదారుగా చేర్పించవచ్చు, లేదా మిత్రులొకరికి వీక్షణం సంవత్సర చందా కానుకగా ఇవ్వవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో మీకు తెలిసిన దుకాణదారు వీక్షణం తెప్పించేలా, సక్రమంగా బకాయిలు చెల్లించేలా చూడవచ్చు.
- మీకు తెలిసిన వారెవరయినా వ్యాపార ప్రకటనలు ఇవ్వగలిగిన స్తోమత, అధికారం కలిగి ఉంటే వారిద్వారా వీక్షణంకు ప్రకటనలు ఇప్పించవచ్చు.

వీక్షణంను ఆదుకొండి

తెలుగునాట ఇటువంటి పత్రిక ఇది ఒక్కటే, దీని మనుగడకు, విస్తరణకు మీ చేయూతనందించండి

చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120	మూడు సంవత్సరాల చందా	రు. 350
ఐదు సంవత్సరాల చందా	రు. 550	పది సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

వీక్షణం 91

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఫిబ్రవరి 2009
సంపుటి : 7
సంచిక : 2

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	**రు.**	**120**
3 సంవత్సరాల చందా	**రు.**	**350**
5 సంవత్సరాల చందా	**రు.**	**550**
10 సంవత్సరాల చందా	**రు.**	**1000**

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు,
డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

కార్పొరేట్ మోసాలకు ఒక సూచిక

'ఆస్తి అంటే దొంగతనమే' అని పందొమ్మిదో శతాబ్ది ఫ్రెంచ్ తత్వవేత్త ప్రౌధాన్ అన్నమాట బహుశా ఇవాళ ఆనాటికన్న ఎక్కువగా ప్రతిధ్వనిస్తున్నట్టున్నది. ఆ మాటకు అన్నిటికన్నా పెద్ద నిదర్శనం సత్యం కంప్యూటర్స్ కుంభకోణం. ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలలో గత రెండు దశాబ్దాలలో గణనీయమైన ప్రాధాన్యత పొందింది. రాజకీయ నాయకులూ, సామాజిక నాయకులూ సత్యం విజయాలను ఆదర్శవంతమైన నమూనాగా చూపడంతో తెలుగు సమాజంలో సత్యం కంప్యూటర్స్ కు చెరపరాని స్థానం వచ్చింది. అటువంటి సంస్థ పేకమేడలా కూలిపోవడం, ఆ సంస్థలో జరిగిన మోసాలు ఒక్కొక్కటిగా బయట పడుతుండడం మన సమాజ అవ్యవస్థకు అద్దం పడుతున్నాయి. ఆస్తి ఎంత ఎక్కువగా పోగు పడుతుంటే అంతగా అనుమానించవలసి ఉంటుందనీ, అంత ఎక్కువగా దొంగతనం జరిగిందని అర్థం చేసుకోవలసి ఉంటుందనీ ఈ ఉదంతం తెలియజెపుతోంది. నిజానికి ఆస్తి పోగుచేయడం అనే దొంగతనం ఒంటరిగా రాదు, దానితోపాటే అబద్ధాలు ఆడడం, దొంగ లెక్కలు చెప్పడం, మోసం చేయడం, సామాజిక నియమాలనూ చట్ట నిబంధనలనూ అతిక్రమించడం, దౌర్జన్యం సాగించడం వంటి అనేక అక్రమాలు కలిసివస్తాయి. అయితే ఈ అక్రమాలన్నిటినీ సత్యం కంప్యూటర్స్ అధినేత రామలింగరాజు ఒక్కరే చేశారనడం కూడ పూర్తి నిజం కాదు. ఆయనకు ఎక్కువ బాధ్యత ఉండవచ్చుగాని, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలోనే, ఆర్థిక విధానంలోనే ఇటువంటి అక్రమాలకు, మోసాలకు చోటున్నది. పెట్టుబడిదారీ ఆస్తి పోగుపడడమే ఇటువంటి మోసాలతో జరుగుతుంది. మనదేశ చరిత్రే చూస్తే తొలితరం పారిశ్రామికవేత్తలు టాటా బిర్లాల నుంచి ఇటీవలి అంబానీల మీదుగా ఐటి, రియల్ ఎస్టేట్ వగైరా వ్యాపార సంస్థల నిర్వాహకుల దాకా మోసం చేయకుండా బడా పెట్టుబడిదారులుగా ఎదిగినవారెవరూ లేరు. మరీ ముఖ్యంగా 1947 తర్వాత ప్రణాళికాబద్ధ, మిశ్రమ ఆర్థిక విధానాల పేరుతో సాగిన క్రమమంతా బడాపెట్టుబడిదారుల మోసాలకు ప్రభుత్వం, రాజకీయ నాయకులు, ఆకాంక్షలు అండగా నిలిచిన చరిత్రే. మధ్యలో సాధికారత సాధించడం కొరకు కొన్ని చట్ట నిబంధనలు, నియమాలు విధించడం జరిగింది గాని అవన్నీ కాగితాలకే పరిమితమయి పోయాయి. ఆ చరిత్రలో భాగంగానే సత్యం కంప్యూటర్స్‌కు గత ఇరవై సంవత్సరాలుగా ఏదో ఒక పేరుమీద పన్నుల మినహాయింపులు, రాయితీలు దొరికాయి. ఉచితంగానో తక్కువ ధరకో వందలాది ఎకరాల భూములు అందాయి. ప్రజాధనంతో రూపొందిన విద్యుత్తు, నీరు, ఇతర సౌకర్యాలు చౌకగానో, ఉచితంగానో అందాయి. జూదంలా నడిచే స్టాక్‌మార్కెట్లలో ప్రాధాన్యత దొరికి, చిన్న మదుపుదారులను మోసగించే అవకాశం దొరికింది. అంటే ఇటువంటి సంస్థ ఏ మోసాలకూ పాల్పడకపోయినా, పాలక విధానాల వల్లనే పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని కైంకర్యం చేసే అవకాశం ఉంది. ఇక ఆ సంస్థ నిర్వాహకులు చట్ట నిబంధనలను ఉల్లంఘించదలచుకుంటే, చట్టబద్ధ నిఘా, పర్యవేక్షక సంస్థల కళ్లు కప్పదలచుకుంటే, లంచాలు పెట్టి తమ ఇష్టారాజ్యంగా పనులు నడిపించుకునే రాజమార్గాలు ఉండనే ఉన్నాయి. సత్యం కంప్యూటర్స్ విషయంలో ఇవన్నీ జరిగాయి. వందల, వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తూ కూడ పన్నుల మినహాయింపుల వల్ల రాష్ట్ర ఖజానాకు ఒక్క పైసా కూడ చెల్లించకుండానే, రాష్ట్ర ప్రజల వనరులను దుర్వినియోగం చేసే అవకాశం సత్యం కంప్యూటర్స్ వంటి అనేక సంస్థలకు అందజేసి, అందుకు ప్రతిగా వందలకోట్ల రూపాయల ముడుపులు మింగిన ఘనచరిత్ర మన ప్రభుత్వాధినేతలది. అంటే ఇవాళ సత్యం కుంభకోణంగా బయటపడుతున్నది నిజానికి మన వ్యవస్థ కుంభకోణం. మన పాలనావిధానాల కుంభకోణం. మన రాజకీయార్థిక విధానాల కుంభకోణం. నిజమైన ప్రజానుకూల రాజకీయార్థిక పాలనా విధానాలు అమలయ్యేదాకా సత్యం కుంభకోణాల వంటివి ప్రతిరోజూ, ప్రతిక్షణమూ జరుగుతూనే ఉంటాయి. అటువంటి వందలాది కుంభకోణాలలోంచి ఎప్పుడో ఒకసారి సత్యం కుంభకోణం వంటి ఉదంతాలు బయట పడుతుంటాయి. అలా బయటపడినప్పుడు మాత్రం హాహాకారాలు చేసి, ఏవో పైపై ఉపశమన చర్యలు మాత్రం తీసుకుని, నిరంతరం జరిగే, జరుగుతున్న కుంభకోణాలను, అసలు అక్రమాలను కొనసాగనివ్వడం మన పాలకవర్గాల ఉనికికి పునాది. అలా నిర్లిప్తత వహించే అలవాటును మన మధ్యతరగతికి, ఆలోచనాపరులకు, ప్రజలకు అంటించడానికి కూడ పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఆ మొద్దు నిదురనుంచి బయటపడి, నిరంతర జాగరూకత వహించినప్పుడు మాత్రమే ఇటువంటి కుంభకోణాలు పునరావృతం కాకుండా ఉంటాయి. వీ

మహాకూటమి ప్రత్యామ్నాయమా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయడమే ఏకైక లక్ష్యంగా తెలుగుదేశం, భారత కమ్యూనిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), తెలంగాణ రాష్ట్ర సమితి ఒక మహాకూటమిని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఇక్కడ ఒక అవసరమయిన లక్ష్యం సాధించడానికి అక్రమమైన సాధనం తయారు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ లక్ష్యం తప్పనిసరిగా నెరవేరవలసినదే. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజావ్యతిరేక, అవినీతిమయ పాలన తప్పనిసరిగా రద్దు కావలసిందే. దాని స్థానంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వపు అవలక్షణాలు లేని ప్రజానుకూల పాలన నెలకొనవలసిందే. కాని కాంగ్రెస్ ను ఓడించాలని ప్రయత్నం చేస్తున్న మహాకూటమిలోని భాగస్వామ్య పక్షాలకు అటువంటి ప్రత్యామ్నాయాన్ని సూచించే, నెలకొల్పే స్వభావం గాని, అర్హతగాని ఉన్నాయా? ఈ కూటమికి గద్దెమీద ఉన్న వారిని దించేయాలనే ఏకసూత్ర కార్యక్రమం తప్ప ప్రజా సంక్షేమం కొరకు ఏదో చేయాలన్న తపన లేదు. సూత్రబద్ధ ఐక్యతగాని, సిద్ధాంత ఐక్యతగాని లేవు. ఈ కూటమికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ తన పాలనాకాలంలోనే రాష్ట్ర పాలనను ప్రపంచ బ్యాంక్‌కు అప్పగించి, రాష్ట్ర ప్రజల మీద డెబ్బై వేల కోట్ల రూపాయల రుణభారాన్ని మోపింది. అలా ప్రపంచబ్యాంకు నుంచీ, బహుళజాతి సంస్థల నుంచీ ప్రవహించిన నిధులను, రాష్ట్ర వనరులను తాకట్టుపెట్టి, అమ్మివేసి సంపాదించిన నిధులను ఆశ్రితుల బొక్కసాలలో నింపి అవినీతిని సంపూర్ణంగా విస్తరించింది. ఆ అవినీతి పాలనను ప్రశ్నించిన ప్రజలపై, ప్రజాసంఘాలపై అతి దుర్మార్గమైన అణచివేతను ప్రయోగించింది. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం ఏయే అక్రమాలకు పాల్పడుతున్నదో అన్నిటికన్నీ తెలుగుదేశం సాగించింది. ఇవాళ మహాకూటమిలో చేరుతున్న ఇతరపక్షాలు ఆ కారణం వల్లనే తెలుగుదేశాన్ని ఓడించడానికి 2004లో కాంగ్రెస్‌తో జతకట్టాయి. ఇప్పుడు కాంగ్రెస్‌ను ఓడించడానికి తెలుగుదేశంతో జతకట్టడమంటే అది ప్రత్యామ్నాయం కాజాలదు. ఇద్దరూ దొంగలే అని తెలిసి ఒక దొంగకు వ్యతిరేకంగా మరొక దొంగతో చేతులు కలపడమే అవుతుంది. ప్రజాజీవితం వైపు నుంచి చూసినప్పుడు ఆ రెండు పార్టీల మధ్య తేడా ఏమీలేదు. ఇంతకీ పాలనా విధానాలలో కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్య మాత్రమే కాదు, వాటికీ ఉభయ కమ్యూనిస్టు పార్టీలకూ కూడ తేడా ఏమీలేదని బెంగాల్ పాలన రుజువు చేస్తున్నది గనుక, మహాకూటమి ప్రత్యామ్నాయం కాకపోయినా సముచితమనే అనుకోవాలి. ఇక ప్రత్యేక రాష్ట్ర సాధనకోసమే ఉన్నానని చెప్పుకునే తెరాస, పచ్చి తెలంగాణ వ్యతిరేక పార్టీలతో చేతులు కలపడం అవకాశవాదానికి పరాకాష్ఠ. ఈ మొత్తం నాటకంలో మన పార్లమెంటరీ రాజకీయ పక్షాలన్నిటికీ అధికారం కోసం పిల్లిమొగ్గలు వేయడమే తప్ప ప్రజానుకూల రాజకీయార్థిక పాలనా విధానాల లక్ష్యం లేదని తేట తెల్లమవుతోంది.

కాశ్మీర్ ఎన్నికలు

రెండు నెలలపాటు ఏడు విడతలుగా జరిగిన జమ్ము-కాశ్మీర్ ఎన్నికల తతంగం ఎట్టకేలకు 87 స్థానాల రాష్ట్ర శాసనసభలో ఏ ఒక్క రాజకీయ పక్షానికీ ప్రభుత్వం స్థాపించగల ఆధిక్యత రాని స్థితిలో ముగిసింది. 28 స్థానాలతో మొదటి స్థానంలో ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్, 17 స్థానాలతో మూడో స్థానంలో ఉన్న కాంగ్రెస్ అవకాశవాద కలయికతో రాష్ట్ర ప్రభుత్వాన్ని స్థాపించాయి. ఎన్నికల ఫలితాల అనంతర అవకాశవాద కలయికల సంగతి ఎట్లా ఉన్నా, మన ఎన్నికల వ్యవస్థ ఎంత అస్తవ్యస్తంగా ఉన్నదో, ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయ సూచికలు ఎట్లా కాజాలవో, ప్రజలు ఎన్నికలను తమ మౌలిక సమస్యలు తీర్చే సాధనాలుగా కాక, తక్షణ ఉపశమనంగా ఎలా చూస్తున్నారో ఈ ఎన్నికలు మరొకసారి చూపాయి. ప్రజాస్వామ్యానికి చిహ్నమని చెప్పే ఎన్నికలను నడపడానికి ప్రభుత్వాలు ఎంత హింసనూ దౌర్జన్యాన్నీ అమలు చేయవలసి వస్తున్నదో చూస్తేనే ఈ ఎన్నికలలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అర్థమవుతున్నది. ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన హురియత్ కాన్ఫరెన్స్ నాయకులందరినీ నిర్బంధించి, ఒక కోటి జనాభాకు ఐదు లక్షలమంది సైనిక బలగాలను, పారా మిలిటరీ బలగాలను, పోలీసులను ఏర్పాటుచేసి, అనేక రకాల నిర్బంధ చట్టాలను అమలు చేసి, భయోత్పాత వాతావరణాన్ని నెలకొల్పి ఎన్నికలు జరిపి, వాటిలో ప్రజాభిప్రాయం బయటపడిందంటే అంతకన్న హాస్యాస్పదం మరొకటి ఉండదు. ఆరు దశాబ్దాలుగా దేశం మొత్తం మీద, ప్రత్యేకించి కాశ్మీర్‌లో జరుగుతున్న పద్ధతిలోనే ఈ ఎన్నికలు కూడా జరిగాయి. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, సంపూర్ణంగా ప్రకటించడానికి అవకాశం వచ్చిననాడుగాని వారు ఎవరిని తమ ప్రతినిధులుగా ఎన్నుకుంటారో తెలియదు. అప్పటిదాకా ప్రజావంచకులే ప్రజా ప్రతినిధులుగా రాజ్యం ఏలుతుంటారు.

లిబరేషన్ టైగర్స్ పతనం?

శ్రీలంక సైనిక బలగాలు ఎల్.టి.టి.ఇ. స్థావరాలమీద దాడులను విస్తృతం చేశాయి. యాభైవేల మందికి పైగా సైనికులతో కూడిన ప్రభుత్వ బలగాలు విమానాలతో, హెలికాప్టర్లతో, యుద్ధ నౌకలతో, కాల్బలంతో టైగర్ల స్థావరాల మీద దాడిచేశాయి. ఈలం రాజధానిగా ప్రఖ్యాతమైన కిల్లినోచ్చితో పాటు, దేశంలోని ఉత్తర, ఈశాన్య భాగాలలో ఉన్న తమిళ ఈలం వాదుల కేంద్రాలన్నిటినీ పట్టుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. వందలాది మంది ఈలం సైనికులు మరణించినట్టు శ్రీలంక సైన్యం ప్రకటిస్తోంది గాని, అంతకు ఎన్నోరెట్లు సాధారణ తమిళ ప్రజానీకం కూడా ఆ దాడులలో చనిపోయి ఉంటారు. శ్రీలంక సైనికులు కూడ పెద్ద ఎత్తునే చనిపోయి ఉంటారు. ఈ దాడుల ఫలితంగా టైగర్ల అధినేత ప్రభాకరన్ స్థావరం కూడా ధ్వంసమైపోయిందని, ఆయన పరదేశానికి పారిపోయి ఉంటారని శ్రీలంక ప్రభుత్వం ప్రకటిస్తున్నది. ఈ దాడి, విధ్వంసం, పతనం, పలాయనం వార్తలు ఎలా ఉన్నా, టైగర్లు ప్రస్తుతానికి ఓడిపోయినట్టే కనబడుతున్నా, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆకాంక్ష మాత్రం సమసిపోదు. శ్రీలంకలో తమిళ జాతి ఆత్మగౌరవ చిహ్నంగా స్వతంత్ర తమిళ రాజ్యం అనే ఆకాంక్ష ఎప్పటికీ మరణించదు. తరతరాలుగా సింహళ జాతి దురహంకారంతో, పాలకవర్గాల మద్దతుతో తమిళ ప్రజానీకం మీద సాగుతున్న వివక్ష, అన్యాయం, దౌర్జన్యం, దోపిడీ, పీడనలను రద్దుచేసే లక్ష్యంతో తమిళ ఈలం ఆకాంక్ష తలెత్తింది. ఆ ఆకాంక్షకు నాయకత్వం వహించిన ఎల్.టి.టి.ఇ. ఎన్ని తప్పులయినా చేసి ఉండవచ్చు. ప్రపంచ ప్రజల దృష్టిలో ఒక టెర్రరిస్టు సంస్థగా ముద్ర తెచ్చుకుని ఉండవచ్చు. ఆ తప్పుల ఫలితంగానే ఇవాళ ఓటమి పాలయి కూడా ఉండవచ్చు. కాని టైగర్లు తమ పతాకంగా ఎత్తిపట్టిన తమిళ ప్రజల స్వయం నిర్ణయాధికార కాంక్ష, దోపిడీ పీడనల పట్ల వ్యతిరేకత ఎప్పుడూ సమున్నతంగా ఎగురుతూనే ఉంటాయి. ఒక లిబరేషన్ టైగర్స్ పడిపోయినా మరొకరెవరో ఆ పతాకను ఎత్తిపట్టు కోవడానికి, ఆ న్యాయమైన ప్రజా ఆకాంక్షను ముందుకు తీసుకు పోవడానికి, లేచి నిలుస్తూనే ఉంటారు.

వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : మతోన్మాదం - కొత్త రంగులు, కొత్త హింసా రూపాలు



భారత ఉపఖండంలో విభిన్న మతాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణలకు కొన్ని శతాబ్దాల చరిత్ర ఉన్నప్పటికీ బ్రిటిష్ పాలన మొదలైన తరువాత హిందువులకు, ముస్లింలకు మధ్య, 1947 తరువాత హిందువులకు, మైనారిటీ మతాల ప్రజలకు మధ్య జరుగుతున్న ఘర్షణలు ప్రత్యేకంగా చూడవలసినవి.

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.



– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028










- **కైతునకల దండెం** – మాదిగ కవిత్వం – సంపాదకులు : కృపాకర్ మాదిగ పొనుగోటి, జూపాక సుభద్ర – దండోరా ప్రచురణలు, 170 పేజీలు, 1/8 డెమీ, రు.80, ప్రతులకు : పి. కృపాకర్, 13-6-462/ఎ/27, భగవాన్‌దాస్ బాగ్, తాళ్లగడ్డ, హైదరాబాద్ – 500067 సెల్ : 9948311667, ఇ మెయిల్ : krupakarmadiga@gmail.com
- **కొడవటిగంటి కుటుంబరావు రచనా ప్రపంచం – 1** – కథలు – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 463 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు : సి.ఎస్.ఆర్. ప్రసాద్, సి-132, శ్రీనివాసనగర్ కాలనీ, గుంటూరు – 522 006. ఫోన్ : 98854 46750
- **సంబరం** – సాహిత్య వ్యాసాలు – హెచ్చార్కె – స్పృహ సాహితీ సంస్థ ప్రచురణలు – 164 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : జూలూరు గౌరీశంకర్, 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044; రాష్ట్రంలో అన్ని పెద్ద పుస్తకాల షాపుల్లో; రచయిత ఇ మెయిల్ : hrkodidela@yahoo.com
- **కథక చక్రవర్తి** – రేగులపాటి కిషన్‌రావు – విజయలక్ష్మి ప్రచురణ – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : రేగులపాటి విజయలక్ష్మి, కవితా నిలయం, ఇ.నెం. 10-1-436, సంతోష్‌నగర్, రాంనగర్, కరీంనగర్ – 505 001. సెల్ : 9849246980
- **మండుతున్న గాయాలు** – సల్వాజుడుం బాధిత మహిళల హృదయ స్పందనలు – బి.డి. దమయంతి – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 91 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : నవోదయ పబ్లిషింగ్ హౌస్; నవయుగ పబ్లిషింగ్ హౌస్; దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్ షాప్
- **వరవరరావు కవిత్వం** – వరవరరావు – స్వేచ్ఛా సాహితి ప్రచురణ – 838 పేజీలు, రాయల్, సాదా ప్రతి రు. 300, గ్రంథాలయ ప్రతి రు. 450
- **పరిచయాలు** – ఎన్. వేణుగోపాల్ – స్వేచ్ఛా సాహితి ప్రచురణ – 194 పేజీలు, 1/8 డెమీ, రు. 50


  పై రెండు పుస్తకాల ప్రతులకు : స్వేచ్ఛా సాహితి, జి1, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ – 500 029; రాష్ట్రంలోని అన్ని ప్రధాన షాపుల్లో
- **చిరస్మరణీయులు** – (బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న ముస్లిం యోధులు) – సయ్యద్ నశీర్ అహమ్మద్ – ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్ – 223 పేజీలు, 1/8 డెమీ, సాధారణ ప్రతి రు. 100, గ్రంథాలయ ప్రతి : రు. 125, ప్రతులకు : ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, శివప్రసాద్ వీధి, కొత్తపేట, వినుకొండ – 522 647, గుంటూరు జిల్లా. ఫోన్ : 9440241727
- **నడిచే దీపాలు** – బాలల భవిష్యత్తు కోసం... – సమన్వయం : కె.ఎన్. రావ్ – ప్రగతి ప్రచురణలు – 48 పేజీలు, 1/8 క్రౌన్, రు. 18, ప్రతులకు : కె.ఎన్. రావ్, ప్రగతి మెస్ పై అంతస్తు, సుభాష్‌నగర్, నిజామాబాద్. సెల్ : 99129 80686
- **కొలనుపాక, నులకచందయ్యల ఆదిజాంబవ మహాపురాణము** – పరిశోధకుడు : పులికొండ సుబ్బాచారి – ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణలు – 144 పేజీలు, 1/4 క్రౌన్, రు. 100, ప్రతులకు : రిజిస్ట్రార్, ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాసవనం, కుప్పం – 517425, ఫోన్ : 08570-278220











'**వీ**క్షణం' జనవరి సంచికలో ఆహ్వానించదగ్గ పరిణామాలు కనబడ్డాయి. మొదటిది సామాన్యప్రజల అభిప్రాయాలను నేరుగా సేకరించి ప్రచురించడం. రెండోది ప్రగతిని కోరే ఇతర పత్రికల ప్రకటనలు వెయ్యడం. మూడోది మీకు ఆర్థికంగా తోడ్పడగలిగే వ్యాపార ప్రకటనలు స్వీకరించడం. వ్యాస రచయితల అభిప్రాయాలతోనే ఏకీభవించనవసరం లేదని చెప్పుకున్న మీ సంపాదకవర్గం వ్యాపార ప్రకటనల గురించిన సంజాయిషీ ఇచ్చుకోనవసరం లేదనుకుంటాను. మీ పత్రిక బాగా కొనసాగాలనీ, ఇంటర్నెట్‌లో కూడా లభ్యం కావాలని కోరుతున్నాను.

– రోహిణీప్రసాద్
అట్లాంటా, యు.ఎస్.ఎ.

ఒక దేశం ఆర్థికాభివృద్ధి జాతీయాదాయం, తలసరి ఆదాయం పెరుగుదలలు మాత్రమే కాదని, నిజమైన మానవాభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అని సంక్షేమ అర్థశాస్త్రం, ఆత్మహత్యల నివారణ పై పరిశోధనలు సాగించిన నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ అమర్త్యసేన్ ఆదర్శాల కనుగుణంగా మీరు వీక్షణంలో ప్రచురిస్తున్న పరిశోధనాత్మక విషయాలు, వ్యాసాలు బాగుంటున్నాయి. మానవాభివృద్ధి సూచివలె 'మరణాల సూచి' సభ్య సమాజాన్ని ఆలోచింపజేసేలా ఉన్నాయి. మానవ హక్కులు, సాటి మనిషిని ఆదుకోలేని శాస్త్ర పరిశోధనలు, మానవతా దృక్పథం లేని పరిశోధనలు అవసరం లేదని చెప్పడం ఆదర్శ సమసమాజానికి నాంది అవుతుంది. ఆ దిశగా ఉన్న మీ సేవలు, పరిశోధనలు అభినందనీయం.

– గుండేటి రమేష్
అగ్రహారం, కరీంనగర్

ఇంగ్లిష్ వారపత్రిక 'అవుట్‌లుక్'లో అరుంధతీ రాయ్ ప్రచురించిన వ్యాసాన్ని తెలుగులో జనవరి 'వీక్షణం'లో ప్రచురించినందుకు కృతజ్ఞత. టెర్రరిజాన్ని మనం చూసే చూపులోనే తేడా ఉంది. అయితే దురదృష్టవశాత్తూ ఆ తేడా మెయిన్‌స్ట్రీమ్ మీడియానే ప్రసాదిస్తోంది. పాలకవర్గాన్ని ఎదిరించాల్సిన, కనీసం నిలదీయాల్సిన మీడియానే దానితో కుమ్మక్కవడం మన ప్రజాస్వామ్యపు హీన దశ. ఇదిగో ఇలాంటి వ్యాసాలు ఆ కుట్రను భగ్నం చేసి, నిజాలను పాఠకులకు తెలియజేసేందుకు తోడ్పడుతాయి. బెర్టెల్ ఓల్‌మాన్ 'మార్క్సిజం అంటే ఏమిటి?' వ్యాసం ఎంతో సరళంగా సాగి నూతన తరపు పాఠకులకు సైతం కీలక విషయాలు అవగతమయ్యేట్టు ఉంది. కాని, వ్యాసప్రక్రియ పైన 'వీక్షణం' నిర్వహించిన వర్క్‌షాప్‌పై రిపోర్ట్ ఈ సంచికలో ఉంటుందని ఆశించాం. నిరాశపడ్డాం. వచ్చే సంచికలోనైనా ప్రచురించండి.

– దుప్పల రవికుమార్
శ్రీకాకుళం

వీక్షణం జనవరి 2009 ప్రత్యేక సంచికలో సామాజిక బాధ్యతతో వస్తున్న పత్రికలను ఒక దగ్గర పరిచయం చేయడం బాగుంది. ఇన్ని పత్రికలు చదవాల్సినవి ఉన్నాయని తెలిపినందుకు ధన్యవాదాలు.

– కె. రమేష్
కరీంనగర్

వీక్షణం జనవరి సంచికలో వెలువడిన బెర్టెల్ ఓల్‌మన్ 'మార్క్సిజం అంటే ఏమిటి?' చాలా బాగుంది. ఆ పుస్తకం మొత్తాన్ని తెలుగు చేసి వీక్షణంలో ప్రచురిస్తే బాగుంటుంది.

– భరత్
గుంటూరు

వీక్షణం జనవరి సంచికలో సామాన్యుల అభిప్రాయాలను ఫోకస్‌గా అందీయడం చాలా బాగుంది. ప్రజలు పడుతున్న బాధలూ, జీవితం పట్ల వారి వ్యాఖ్యలూ చాలా లోతైన దృష్టిని ఇచ్చేవిగా ఉన్నాయి. ఇలా విభిన్న ప్రజాసమూహాలకు, రంగాలకు సంబంధించి వివిధ అంశాలపై ప్రజాభిప్రాయాలను సేకరించి, ప్రచురించడం వలన సమాజ ఆలోచనా స్థాయి పెరుగుతుందని భావిస్తున్నాను.

– ఉమాశంకర్
విజయనగరం

అనివార్య కారణాల వల్ల వ్యాసప్రక్రియపై 'వీక్షణం' వర్క్‌షాప్ వాయిదా పడింది. – సం.

ఫిల్మ్ తెలంగాణ 2009
లఘు చిత్రాల పోటీ

అమెరికాకు చెందిన డిస్కవర్ తెలంగాణ ఇన్‌కార్పొరేటెడ్ సంస్థ, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ సంయుక్తంగా **'ఫిల్మ్ తెలంగాణ 2009'** డిజిటల్ లఘు చిత్రాల పోటీని ప్రకటిస్తున్నాయి. చిత్ర నిర్మాణం సాధారణ ప్రజలకు అంతగా అందుబాటులో ఉన్న వ్యవహారమేమీ కాదు. కాని, డిజిటల్ చిత్ర నిర్మాణ సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన పరిణామాల వల్ల అది చాలామందికి అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ కెమెరాల సహాయంతో ప్రస్తుతం ఎవరైనా సులభంగా లఘు చిత్రాలను నిర్మించవచ్చు. అతితక్కువ శ్రమతో అతి ఎక్కువ మందికి చేరగలిగిన ఈ మాధ్యమాన్ని ఉపయోగించుకొని తెలంగాణ నుంచి చిత్ర నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, తెలంగాణ గురించి దృశ్య రూపంలో చిత్రీకరణ జరగాలనే కోరికతో, తెలంగాణ నుంచి కొత్త యువ నైపుణ్యాన్ని వెలికితీయాలనే ఆలోచనతో ఈ పోటీని ప్రకటిస్తున్నాము. తెలంగాణ సంస్కృతి, తెలంగాణ వనరులు, తెలంగాణ సమస్యలు, తెలంగాణలో స్థలాలు, తెలంగాణ ప్రజలు, తెలంగాణ చరిత్ర–పోరాటాలు అనే ఆరు అంశాలపై ఔత్సాహికులు తమ చిత్రాలను ఈ పోటీకి పంపించవచ్చు. ఈ పోటీకి వచ్చిన చిత్రాలను ఐదు నిమిషాల లోపు నిడివి గల చిత్రాలుగా, పది నుంచి ముప్పై నిమిషాల లోపు నిడివి గల చిత్రాలుగా రెండు తరగతులుగా విభజించి వేరు వేరు ప్రక్రియలలో మొత్తం రెండు లక్షల రూపాయల నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుంది. పోటీకి తమ చిత్రాలను పంపించదలచిన వారు ఫిబ్రవరి 7, 2009 లోపు రు. 500 ప్రవేశ రుసుము మనీ ఆర్డర్‌తో **కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ, ఫిల్మ్ భవన్, కలెక్టరేట్ రోడ్, కరీంనగర్ – 505 001** కి దరఖాస్తులు పంపాలి.

వివరాలకు film.telangana@gmail.com ను గానీ, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు **వారాల ఆనంద్ (94405 01281)** ను గానీ సంప్రదించాలి.

బాక్సైట్ తవ్వకాలకు అనుమతి

విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలు అనుమతులు ఇచ్చాయి. విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి, చింతపల్లి మండలాల పరిధిలో గల 1649 హెక్టార్ల అటవీ భూముల్లో నిక్షిప్తమై ఉన్న 224 మిలియన్ టన్నుల బాక్సైట్ ఖనిజాన్ని వెలికి తీయడానికి రస్ అల్ ఖైమాకు చెందిన ఎన్‌రాక్ కంపెనీతో ప్రభుత్వం 14 ఫిబ్రవరి 2007న ఒప్పందం కుదుర్చుకుంది. గిరిజనుల ఆందోళనలు, విపక్షాల అభ్యంతరాలతో సంబంధం లేకుండా అనుమతులు మంజూరయ్యాయి.

సభ్యత్వం రద్దు

ఫిరాయింపుల నిరోధ చట్టం కింద ముగ్గురు టి.ఆర్.ఎస్. అసమ్మతి ఎం.ఎల్.ఎ. లు – మందాడి సత్యనారాణరెడ్డి, సోయం బాపూరావు, తూర్పు జయప్రకాశ్‌రెడ్డిల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ డిసెంబర్ 22న స్పీకర్ సురేష్ రెడ్డి తీర్పునిచ్చారు. ముందే రాజీనామాలు చేసిన ఆరుగురు శాసనసభ్యులు సభ్యత్వ రద్దు నుంచి బయటపడ్డారు. స్పీకర్ సస్పెన్షన్‌ను హైకోర్టులో సవాలు చేయడంతో కోర్టు నాలుగు వారాలపాటు స్టే విధించింది.

భీమ్‌రావ్ బాడ కూల్చివేత

హైదరాబాద్ నాంపల్లిలోని భీమ్‌రావ్ బాడ 1153 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, హౌసింగ్ బోర్డ్‌కు చెందిన ఈ స్థలంలో అరవై ఏళ్ల క్రితం నిజాం కాలంలో వేములవాడ, కరీంనగర్, సిద్ధిపేటల నుంచి వలసవచ్చిన మత్స్యకారులు ఇక్కడ స్థిరపడ్డారు. 1979లో జరిగిన సర్వేలో ఈ వాడను అధికారికంగా గుర్తించారు. 1995లో అప్పటి ప్రభుత్వం డిఫామ్ పట్టాలు కూడా ఇచ్చింది. అయితే డిసెంబర్ 26 రాత్రి ఇందిరాభవన్ పేరిట నిర్మించదలచిన పి.సి.సి. కార్యాలయం కోసం భీంరావ్‌బాడను నేలమట్టం చేశారు. దీనిపట్ల సర్వత్రా నిరసన వ్యక్తమైంది.

తెలంగాణ విద్యార్థి గర్జన

హైదరాబాద్‌లో నిజాం కళాశాల మైదానంలో డిసెంబర్ 29న జరిగిన 'తెలంగాణ విద్యార్థి గర్జన' సభకు భారీ ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టి.ఆర్.ఎస్. అధినేత కె.సి.ఆర్. మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంతోపాటు, 2004 ఎన్నికల్లో నమ్మి అండగా నిలిచిన అందరినీ కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రజా గాయకుడు గద్దర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇంటింటికీ తిరిగి తెలంగాణ ఆవశ్యకతను వివరించాలన్నారు.

కమిషన్లపై కమిషన్లు

అనంతపురం జిల్లాలో హత్యలపై విచారణకు జస్టిస్ ఎ. గోపాలరావు కమిషన్ (సెప్టెంబర్ 2004); ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉప కులపతి సింహాద్రిపై విచారణకు జస్టిస్ వామనరావు కమిషన్ (అక్టోబర్ 2004); దేవాదాయ భూముల కేటాయింపుపై విచారణకు జస్టిస్ ఎ. వెంకటరామి రెడ్డి కమిషన్ (జూన్ 2005); రైతుల ఆత్మహత్యలపై జస్టిస్ రామచెన్నా రెడ్డి కమిషన్ (అక్టోబర్ 2005); కుప్పం బిందుసేద్యం అవకతవకలపై జస్టిస్ టి.ఎచ్.బి. చలపతి కమిషన్ (డిసెంబర్ 2005); పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం అమల్లో అక్రమాలపై జస్టిస్ పాండురంగారావు కమిషన్ (ఆగస్ట్ 2006); డిపెప్‌లో అక్రమాలపై జస్టిస్ వెంకటరామిరెడ్డి కమిషన్ (మే 2007); రఘురామ్ సిమెంట్స్‌కు భూ కేటాయింపులపై జస్టిస్ రామకృష్ణం రాజు కమిషన్ (మే 2007); నాదరగుల్ భూములపై జస్టిస్ రామకృష్ణం రాజు కమిషన్ (మే 2007); మక్కా మసీద్ కాల్పులపై జస్టిస్ భాస్కరరావు కమిషన్ (మే 2007); ముదిగొండ కాల్పులపై జస్టిస్ పాండురంగారావు కమిషన్ (జూన్ 2007) లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కమిషన్‌లు ఎన్ని వేసినా, నివేదికలు ఎన్ని వచ్చినా, బాధ్యులపై చర్యలు, సూచనల అమలు లేవు.

స్వప్నిక మృతి

యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన వరంగల్ ఇంజనీరింగ్ విద్యార్థిని స్వప్నిక 21 రోజులు మృత్యువుతో పోరాడి, హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో డిసెంబర్ 31 ఉదయం మరణించింది. పోస్ట్ మార్టం కోసం ఆమె మృతదేహాన్ని వరంగల్ ఎం.జి.ఎం. ఆస్పత్రికి తరలించారు. తరువాత మృతదేహాన్ని భవానీ నగర్‌లోని ఆమె స్వగృహానికి తీసుకెళ్లారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో ప్రజలు, విద్యార్థులు, రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంతాపాన్ని తెలియజేశారు.

రైతులకు దెబ్బలు

నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి గ్రామ శివారులో ఉదయ సముద్రం ఎత్తిపోతల నిర్మాణ పనులకు జనవరి 1న భూమి పూజ చేసేందుకు నల్గొండ ఎం.ఎల్.ఎ. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ పురుషోత్తం రెడ్డి వెళ్లారు. భూముల సర్వే ప్రక్రియ పూర్తికాకుండానే ఎవరి భూమి ఎంత పోతుందో, పరిహారం ఎంత ఇస్తారో చెప్పకుండా పనులెలా మొదలుపెడతారంటూ రైతులు జె.సి.బి. యంత్రాలకు అడ్డుగా నిల్చున్నారు. రైతులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తదనంతర పరిణామాల్లో రైతులను కాంగ్రెస్ కార్యకర్తలు కొట్టడమే కాక, అక్కడి నుంచి తరిమికొట్టారు.

వంద రూపాయలకే వంట సరుకు?

ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి జనవరి 5న పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలో తాను చదివిన వి.ఆర్. కళాశాల సభా ప్రాంగణంలో పార్టీ తొలి విధాన ప్రకటన చేశారు. పి.ఆర్.పి. అధికారంలోకి వస్తే ఇరవై ఐదు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో నూనె, కిలో ఉప్పు, కిలో చింతపండు అన్నీ కలిపి వందరూపాయలకే తెల్ల రేషన్‌కార్డు కలిగినవారికి అందజేస్తామని తెలిపారు.

మాలల సింహగర్జన

అమలాపురం కాంగ్రెస్ ఎం.పి. హర్షకుమార్ నేతృత్వంలో జనవరి 11న రాజమండ్రిలో మాలల సింహగర్జన జరిగింది. దీనికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల నుంచి ఆ సామాజికవర్గానికి చెందిన ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వర్గీకరణ ప్రయత్నాలు మానుకుని, సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాలని అన్నారు. వీ

పాలకుల రహస్య అక్రమ ఖాతా సొమ్ముతో మన విదేశీ అప్పును తీర్చడమే కాక, పన్నులే లేని పాలనను అందించవచ్చునని, అలా పోగుపడిన సంపద వివరాలను, అనేక ప్రశ్నలను మన ముందుంచుతునార్ను ఢిల్లీకి చెందిన న్యాయవాది **బిజన్ ఘోష్**

స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సంపద

ఇది దిగ్భ్రాంతికరమైన విషయం. ఒలింపిక్స్ పోటీల్లో అక్రమ సంపాదన ఖాతాలు కూడా భాగమైతే బహుశా భారతదేశం ఏ పోటీ లేకుండా బంగారు పతకం సాధిస్తుంది. రెండో బహుమతి, రజత పతకం సంపాదించే రష్యా ఎంత దూరంలో ఉంటుందంటే, భారతీయుల సంపద నిలువల్లో రష్యన్ల నిలువలు పావు వంతు కూడా కాదు. ఈ అక్రమ సంపాదన నిలువల జాబితాలో మొదటి ఐదు పేర్లలో అమెరికా లేనేలేదు! ఆ ఐదుగురిలో మిగతా నలుగురికి కలిపితే ఎన్ని నిలువలున్నాయో ఒక్క భారతీయులకే అంత కన్నా ఎక్కువ ఉన్నవి.

స్విట్జర్లాండ్‌లో బ్యాంకులుగాని, ప్రభుత్వంగాని తమ దగ్గర నిధులు దాచుకున్న వాళ్ల పేర్లు బయటపెట్టవు. అలా బయటపెట్టాలని అంతర్జాతీయంగా ఎంతో ఒత్తిడి వచ్చిన మీదట ఇటీవలనే స్విట్జర్లాండ్ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ఏ దేశస్తుల ఖాతాలు ఉన్నాయో ఆ దేశపు ప్రభుత్వం కోరితే ఆ పేర్లు ప్రకటిస్తామని చెప్పింది. కాని భారత ప్రభుత్వం అలా పేర్లడగడానికి కూడ సిద్ధంగా లేదు. అక్రమంగా ఈ దేశపు సంపదను తరలించుకుపోయి స్విట్జర్లాండ్ బ్యాంకులలో దాచుకున్న వారెవరో తెలుసుకోవాలనే కోరిక భారత ప్రభుత్వానికి ఎందుకు లేదో ప్రత్యేకించి చెప్పాలా!

ప్రభుత్వం ఆ పని చేయాలని ఒత్తిడి తెచ్చే ఒక ప్రజా ఉద్యమాన్ని మనం నిర్మించవలసి ఉంది. ఈ దేశంలో అత్యున్నత స్థానాలలో ఉన్నవాళ్లు, అతి శక్తిమంతులు సాగిస్తున్న అవినీతి కార్యకలాపాలను బహిర్గతం చేయడానికి వచ్చిన గొప్ప అవకాశం ఇది. ఈ వివరాలు చదవండి. నిజాయితీపరులైన భారతీయ పౌరులందరికీ ఈ సంగతి చెప్పండి. ఈ విషయమై ఆందోళన విస్తృతమయ్యేలా చూడండి.

నిజంగా భారతదేశం పేదదేశమేనా? ఎవరంటారు? కావాలంటే స్విస్ బ్యాంకులను అడగండి. ఆ దేశపు బ్యాంకులలో వ్యక్తిగత ఖాతాలలో భారతీయుల సొమ్ము ఒక లక్షా యాభై వేల కోట్ల డాలర్లు (దాదాపు డెబ్బై రెండు లక్షల కోట్ల రూపాయలు) ఉంది. అదంతా అక్రమ సంపాదనే. అది మన దేశం విదేశాలకు బాకీ పడిన సొమ్ము కన్న పదమూడు రెట్లు ఎక్కువ. ఇప్పుడు చెప్పండి భారతదేశం పేద దేశమేనా?

అక్రమార్జనపరులైన పారిశ్రామికవేత్తలు, అవినీతిపరులైన రాజకీయవేత్తలు, లంచగొండి ఐఎఎస్, ఐఆర్ఎస్, ఐపిఎస్ అధికారులు తమ అక్రమ, వ్యక్తిగత ఖాతాలలో స్విస్ బ్యాంకులలో ఒక లక్షా యాభై వేల కోట్ల డాలర్లు దాచుకున్నారు. దేశంలోనే ఉంటే అక్రమ సంపాదనగా బయటపడే, పన్నులు చెల్లించవలసి వచ్చే ఈ సంపదను అక్రమంగా విదేశీ బ్యాంకులకు తరలించారు. దేశపు విదేశీ రుణానికి పదమూడు రెట్లు ఎక్కువైన ఈ ధనంతో దేశంలో పేద, మధ్యతరగతి వర్గాల నలభై ఐదు కోట్ల ప్రజలకు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయలు ఇవ్వవచ్చు. ఇంత పెద్ద మొత్తం భారతీయ ప్రజలను దోపిడీ చేసి, మోసం చేసి కూడబెట్టినదే. ఈ అక్రమ ధనాన్ని గనుక వెనక్కి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తే రాత్రికి రాత్రి దేశపు విదేశీ రుణాన్నంతా చెల్లు వేయవచ్చు. అలా విదేశీ అప్పంతా తీరిపోయిన తరువాత కూడ పన్నెండు రెట్ల ధనం మిగిలే ఉంటుంది. ఆ మిగులు ధనాన్ని సాధారణ వడ్డీకి ఇచ్చుకున్నా దాని మీద వచ్చే వడ్డీ కేంద్ర ప్రభుత్వపు వార్షిక బడ్జెట్ కన్నా ఎక్కువ. అంటే కేంద్ర ప్రభుత్వం ప్రజల మీద ఒక్క పైసా పన్ను విధించకుండా ఆ వడ్డీ సొమ్ముతోనే దేశాన్ని సుభిక్షంగా పరిపాలించవచ్చు.

ఈ దేశం నుంచి స్విట్జర్లాండ్‌కు ప్రతి సంవత్సరం ఎనభై వేలమంది ప్రయాణం చేస్తారు. అందులో ఇరవై ఐదు వేల మంది చాలా తరచుగా వెళ్లి వస్తుంటారు. 'అంత తరచుగా వెళ్లి వస్తున్నారంటే వాళ్లు కేవలం పర్యాటకులు కాదన్నమాట. వాళ్లకక్కడ ఇంకేదో పని ఉండి ఉంటుంది' అని అన్నారు అక్రమ సంపాదనపై నిఘా వేసే ఒక అధికారి. ఇక వీళ్లే కాక స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉన్న ప్రపంచ వాణిజ్య సంస్థ కార్యాలయంలో చర్చలకోసం వెళ్లి వస్తూ ఉండే వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారుల గురించి మనం మాట్లాడుకోనక్కరలేదు.

ఒక్కసారి ఈ కింద ఇచ్చిన వివరాలు చదవండి. అక్రమార్జన పరులైన వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల కుంభకోణాలు, లంచగొండి అధికారులు, సినిమా నటులు, అక్రమంగా సెక్స్ వ్యాపారం చేసే వాళ్లు, రక్షిత వన్య ప్రాణుల వ్యాపారం చేసేవాళ్లు అటువంటి అనేక మంది ఈ దేశపు సంపదను, సౌభాగ్యాన్ని ఎలా పీల్చి పిప్పి చేశారో అర్థమవుతుంది. ఇంతకూ ఇదంతా కేవలం స్విస్ బ్యాంకుల కథ మాత్రమే. ఇతర అంతర్జాతీయ బ్యాంకుల వ్యవహారాలు మరెన్నో.

స్విస్ బ్యాంకింగ్ అసోసియేషన్ 2006 నివేదిక ప్రకారం స్విట్జర్లాండ్ భూభాగంలోని బ్యాంకులలో ఇతర దేశస్తుల ఖాతాలు ఈ విధంగా ఉన్నాయి :

మొదటి ఐదు దేశాలు – భారతదేశం 1456 బిలియన్ డాలర్లు; రష్యా 470 బిలియన్ డాలర్లు; యూనైటెడ్ కింగ్‌డమ్ 390 బిలియన్ డాలర్లు; ఉక్రెయిన్ 100 బిలియన్ డాలర్లు; చైనా 96 బిలియన్ డాలర్లు.

లెక్క వేసి చూడండి ఒక్క భారతదేశానికి మిగిలిన నాలుగు దేశాల కన్నా ఎక్కువ నిధులున్నాయి. ఇదంతా 1947 నుంచి ప్రజల మీద బహిరంగంగా జరిగిన లూటీ.

ఈ సొమ్మును మనం వెనక్కి తీసుకురాగలమా? మానవ జాతి చరిత్రలో తెలిసిన అన్ని దోపిడీలలోకి అతి పెద్ద దోపిడీ ఇది. 1947 నుంచి మామూలు మనిషి మీద సాగిన దోపిడీ ఇది. అధికార పీఠం ఆక్రమించిన మనుషులు చేసిన దోపిడీ ఇది. అందులో రాజకీయవేత్తలు, ప్రభుత్వాధికారులు, వ్యాపారులున్నారు.

నిజానికి ఆ జాబితాలో అన్ని రకాల వాళ్లు ఉంటారు. ఎందుకంటే ఈ దేశంలో ఎటువంటి విచారణా భయమూ, శిక్షా భయమూ లేకుండా ఎవరైనా దోపిడీ చేయవచ్చు. ఇలా ఈ దేశంలో నుంచి తరలించుకు పోయిన సొమ్మును ప్రపంచంలో పన్నులు లేని స్వర్గాలుగా పేరుపొందిన అనేక దేశాలలో రహస్య బ్యాంకు ఖాతాలలో దాచుకుంటూ ఉన్నారు. ఆ మేరకు భారత ఆర్థిక వ్యవస్థ నష్టపోతోంది. ఇటువంటి రహస్య ఖాతాలు ఎట్లా నడుస్తాయో, ఈ పన్నులు లేని స్వర్గాలలో నియమాలు, నిబంధనలు ఏమిటో సాధారణ భారతీయులకు తెలియక పోవచ్చు. కాని చాలామందికి స్విస్ బ్యాంక్ ఖాతాలు అనే మాట తెలుసు. అదేదో తప్పుడు పని అనీ, రహస్యమనీ పేద దేశాల నుంచి ధనిక దేశాలకు సంపదను బదిలీ చేసే ఒక మార్గమని తెలుసు.

నిజానికి ఈ పన్నులు లేని స్వర్గాలనేవి పాశ్చాత్య ప్రపంచం పేదదేశాలకు వ్యతిరేకంగా చేస్తున్న ఒక కుట్ర అని భావించే అర్థశాస్త్ర వేత్తలు, ద్రవ్య నిపుణులు కూడా ఉన్నారు. ఇరవయ్యో శతాబ్దంలో అనేక పాశ్చాత్య దేశాలు ఈ పన్నులు లేని స్వర్గాలను ప్రోత్సహించాయి. పేద దేశాలనుంచి, అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి అక్కడ అసలే కొరతగా ఉన్న పెట్టుబడిని తమ దేశాలకు తరలించుకుపోయాయి. మార్చ్ 2005లో ట్యాక్స్ జస్టిస్ నెట్‌వర్క్ అనే సంస్థ ప్రకటించిన పరిశోధనా ఫలితాల ప్రకారం భూగోళం మొత్తం మీద ధనవంతులైన వ్యక్తులు తమ నిధులలో పదకొండు లక్షల యాభై వేల కోట్ల డాలర్ల (దాదాపు ఐదు కోట్ల యాభై రెండు లక్షల కోట్ల రూపాయలు) సొమ్మును విదేశాలలో దాచుకున్నారు.

ఈ అక్రమ సంపదలో అత్యధికభాగం ప్రపంచంలో పన్నులు లేని స్వర్గాలుగా పేరుబడిన 70 దేశాల బ్యాంకులలో ద్రవ్యసంస్థలలో ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది. ఆ సంస్థ చేసిన పరిశోధనలను బలపరుస్తూ రేమండ్ బేకర్ అనే అర్థశాస్త్రవేత్త 'కాపిటలిజమ్స్ ఎకిలస్ హీల్ : డర్టీ మనీ అండ్ హౌ టు రెన్యూ ది ఫ్రీ మార్కెట్ సిస్టం' అనే పుస్తకంలో ఇలా పేదదేశాల నుంచి పాశ్చాత్య దేశాలకు 1970ల మధ్య నుంచి ఇప్పటివరకు కనీసం ఐదు లక్షల కోట్ల డాలర్లు (దాదాపు రెండు కోట్ల నలభై లక్షల కోట్ల రూపాయలు) ఉంటుందని అంచనా వేశాడు.

అలాగే నిపుణులు వేసిన అంచనాల ప్రకారం ప్రపంచ జనాభా లోని ఒక్క శాతం సంపన్నుల దగ్గర మొత్తం ప్రపంచ సంపదలోని 57 శాతం పోగుపడి ఉంది. అందులో అత్యధిక భాగం ఈ పన్నులు లేని స్వర్గాలలోనే ఉంది.

అందులో భారతదేశపు వాటా ఎంత ఉంటుందో ఎవరైనా ఊహించవచ్చు.

(స్విట్జర్లాండ్ నుంచి వచ్చిన వార్తల ఆధారంగా రాసి ఇంటర్నెట్ మీద ప్రచారం చేస్తున్న వ్యాసం) వీ

కార్పొరేట్ సంస్థలు, స్టాక్ మార్కెట్లు ప్రభుత్వాల అండదండలతో ప్రజల ఆస్తులను, భూములను, వేలకోట్ల ధనాన్ని ఎలా దోచుకుతింటున్నాయో సత్యం కంపెనీ ఉదంతాన్ని వివరిస్తూ, ఈ పరిణామాల్ని విశ్లేషిస్తున్నారు **కె.వి. కూర్మనాథ్**

'సత్యమే' అబద్ధం - పెద్దల సహకారం నిజం

'సత్యం' కూలిపోయింది. దాంతోపాటు ఒక అబద్ధం కూడా బట్టబయలైంది. కార్పొరేట్లు, ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, పోలీస్ వ్యవస్థ – వీటన్నిటి మధ్య సమన్వయం, సయోధ్య ఎంత బాగుంటాయో కూడా ఈ ఉదంతం బహిర్గతం చేసింది. ప్రభుత్వం తలచుకుంటే తమకు కావల్సిన వాళ్లని ఎంత అడ్డగోలుగా (ఈ పదానికి ఒక చారిత్రక సందర్భం ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో పాల్గొనడానికి వస్తూ మావోయిస్ట్ పార్టీ ఒక భూబకాసురుల చిట్టా ప్రకటించింది. ఇది చూసి 'మరీ ఇంత అడ్డగోలుగా మాట్లాడితే ఎలా?' అని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు) కాపాడుకుంటారో, కాపాడుకోగలరో కూడా ఇది నిరూపిస్తోంది.

నిజానికి రామలింగరాజు దేశానికి ఎంతో మేలు చేసినట్టే. స్టాక్ మార్కెట్ వెలుగులు ఆర్థిక ప్రగతికి చిహ్నమని అనుకునే వాళ్ల భ్రమలు తొలగిపోయాయి. కార్పొరేట్ ప్రపంచం, స్టాక్‌మార్కెట్లు ఎన్నెన్ని అక్రమాలు చెయ్యగలవో, తప్పుడు మార్గాల్లో ప్రజల ధనాన్ని తినెయ్యగలవో చేసి చూపించాడు. అభివృద్ధికి సంబంధించిన గణాంకాల వివరాలు కేవలం ఊహాజనితమైనవేనని, అవి కార్పొరేట్ సంస్థల కల్పనాశక్తికి తార్కాణమని రుజువు చేశాడు. అద్భుతమైన కల్పనాశక్తితో ఒకచోట ఉన్న సంపదను లేదని నమ్మించి, అంకెల గారడీ మాత్రమేనని చెప్పి, మొత్తం సంపదను ఎలా మింగివేయవచ్చో కూడా చేసి చూపించాడు.

రామలింగరాజులో రెండు పార్శ్వాలున్నాయి. దాదాపు పాతికేళ్ల క్రితమే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రాముఖ్యతను గుర్తించి, కంపెనీ పెట్టి, ఆ రంగంలో అవకాశాలను వినియోగించుకొని దేశంలోనే పెద్ద ఐటి కంపెనీల్లో ఒకదానిగా 'సత్యాన్ని' తయారు చేసాడు. సంపన్న దేశాల పరిశ్రమలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు, ఆరోగ్యసేవలు వంటి రంగాల్లో ఐటి వినియోగం అనూహ్యంగా పెరిగింది. అయితే పెరిగిన ఐటి అవసరాలను తీర్చడానికి అవసరమయ్యే నిపుణులు అక్కడలేరు. ఉన్న కొద్ది శాతానికీ అత్యధికంగా వేతనాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. అందుకే ఈ పనులను ఇతరదేశాల్లోని కంపెనీలకు ఔట్ సోర్సింగ్‌కు ఇస్తారు.

ఐటి సొల్యూషన్స్ తయారు చెయ్యడం మాత్రమేకాక, ఔట్ సోర్సింగ్ రంగంలో రాబోయే అవకాశాలను పసిగట్టిన కొద్దిమంది ఐటి పారిశ్రామికవేత్తల్లో రామలింగరాజు ఒకడు. ఆయా అవకాశాలను దొరకబుచ్చుకోవడానికి ఎంతో కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఆయా పనులను అర్థం చేసుకోవడం, అవి చెయ్యగలిగే మనుషులను తయారు చేసుకోవడం, సొల్యూషన్లు ఊహించడం, తయారు చెయ్యడం, అవి సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో పరీక్ష చెయ్యడం, అవి క్లయింట్ల వ్యాపార విధానంలో అమలు పరచడం మామూలు విషయం కాదు. ఇవేవీ అంతకు ముందు ఉన్నవి కావు.

ఈ పనులను అర్థం చేసుకునే వాళ్లను – బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఆరోగ్యం, విద్య, టెలికాం, ఉత్పాదక, విమానయానం రంగాల్లోని నిపుణులను ఆకర్షించి, వాళ్లకి ఐటి నాలెడ్జిని ఇచ్చి ఆయా పనులకు తయారు చెయ్యడంలో ఐటి కంపెనీలు చేసిన కృషిలో 'సత్యం' పాత్ర కూడా ఎంతో ఉంది. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో ఐటి అంటే 'సత్యం', 'సత్యం' అంటే ఐటి. రామలింగరాజు కాక ఎంతోమంది ఎన్నో ప్రయత్నాలు చేసి ఉన్నా కూడా ఆ పేరు అట్లా స్థిరపడిపోయింది. తొమ్మిదేళ్లపాటు చంద్రబాబు, ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ప్రభుత్వాలు చేసిన రామలింగరాజు భజన కూడా దీనికి ఒక కారణం.

ఇది నాణానికి ఒక కోణం. రెండోకోణం ఏమిటంటే, ఐటి రంగంలో ఎలా అయితే అవకాశాలను ముందుగా ఊహించాడో, లిబరలైజేషన్ పుణ్యమా అని జడలు విప్పుకుంటున్న స్టాక్ మార్కెట్‌లో

ఔట్ సోర్సింగ్ అంటే

ఒక టెలికమ్యూనికేషన్ కంపెనీకి ఫోన్ సర్వీసులు అందించడమన్నది ప్రధానమైన వ్యాపకం. కస్టమర్ల బిల్లులు తయారు చెయ్యడం, కస్టమర్ల సమస్యలు వినడం, సంస్థలోని ఉద్యోగుల జీతభత్యాల వివరాలను తయారు చెయ్యడం వంటి పనులు ఆ కంపెనీకి అదనపు బాధ్యతలు. ఇవి బాగా చేసే కంపెనీలకు ఆ పనులను అప్పగిస్తే టెలికాం కంపెనీ పని ఒత్తిడి తగ్గుతుంది.

ఇంకా, ఒక క్రెడిట్ కార్డ్ కంపెనీ ఉందనుకుందాం. ప్రపంచవ్యాప్తంగా ఎటిఎం లతో, లక్షలాది షాపుల్లోని కార్డ్ స్వైపింగ్ మెషిన్లతో, ఇంటర్నెట్‌లోని ఇ–కామర్స్ వెబ్ సైట్లతో క్రెడిట్ కార్డ్‌లను అనుసంధించాల్సిన అవసరం ఉంటుంది. దీనికి అవసరమైన ఐటి సొల్యూషన్లు, వాటిని వినియోగించడం, పర్యవేక్షించడం, తప్పులు సరిదిద్దడం వంటి పనులు ఐటి కంపెనీలు మాత్రమే చెయ్యగలవు. ఇంకోలా చెప్పాలంటే ఈ పనులు క్రెడిట్ కార్డు కంపెనీ చెయ్యాల్సిన అవసరం లేదు.

అలాగే విమానయాన, సమాచార, విద్య, ఆరోగ్య రంగాల వంటి అనేక రంగాల్లోని ఐటి అవసరాలను తీర్చేపని ఐటి కంపెనీలకు అప్పగించే ధోరణి ఇరవై ఏళ్ల క్రితమే మొదలైంది.

కూడా ఎలాంటి 'అవకాశాలు' ఉన్నాయో రామలింగరాజు రెండో పార్శ్వం గుర్తించింది. అందుకే రెండు అవకాశాలనూ వదులుకోలేదాయన. దేన్నీ నిర్లక్ష్యం చెయ్యలేదు. ఒక పక్క ఐటి రంగం విస్తృతిని, కొత్తపోకడలను గమనిస్తూనే, వాటికి తగ్గ ప్రణాళికలు తయారు చేస్తూనే, మరోపక్క స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కంపెనీని లిస్టు చెయ్యడం, అనుబంధ సంస్థలను తెరవడం, వాటిని వందల కోట్ల రూపాయలతో సత్యం చేత కొనిపించడం వంటి పనులు చేసాడు.

ఉదాహరణకి, 1999లో సత్యంకి సత్యం ఎంటర్‌ప్రైజెస్ సొల్యూషన్స్ అనే అనుబంధ కంపెనీ ఉండేది. ఈ కంపెనీని సత్యం ఐదువందల కోట్ల రూపాయలకు కొనింది. ఈ డబ్బంతా రామలింగరాజు మిత్రుల ఖాతాల్లోకి వెళ్లింది. ఆ కంపెనీ అంత విలువ చేస్తుందా, అంతకంటే తక్కువ డబ్బుకే వేరే కంపెనీలు కొని ఉండవచ్చా అన్న సందేహాలు ఎన్నో వచ్చాయి. కానీ అన్నీ చట్టప్రకారం, సెబీ నిబంధనల మేరకు ఆ కంపెనీని అనుకున్న డబ్బిచ్చి కొన్నారు.

ఇండియా వరల్డ్ అన్న వెబ్‌సైట్‌ను కూడా అంతే మొత్తంతో సత్యం కంపెనీ కొనడం కూడా పెద్ద దుమారమే లేపింది. ఇంటర్నెట్ ప్రపంచంలో అంత పేరులేని వెబ్‌సైట్‌ను అంత డబ్బుతో ఎలా కొంటారని ఎవరెన్ని ప్రశ్నలడిగినా, బినామీ పేరుతో సత్యంకు కావల్సిన వాళ్లకే ఆ డబ్బంతా వెళ్లిపోయిందని ఎన్నో ఆరోపణలు వచ్చినా లెక్క చెయ్యలేదు.

కంపెనీకి వచ్చిన లాభాలు, వనరుల్ని యిలా సొంత దుకాణాలకు, సొంత మనుషులకు మళ్లించడం అప్పట్నించే మొదలైంది. అయితే 2000 నుంచి ఈ ధోరణి మరింత వికృతంగా, దుర్మార్గంగా సాగింది. అంతా చట్టాలు, నిబంధనల మేరకే జరగడం విశేషం.

2001లో రామలింగరాజు, అతని కుటుంబీకులకు సత్యం కంపెనీలో 22.78 శాతం వాటా ఉండేది. ఇది 2008 చివరకు 8.60 శాతానికి పడిపోయింది. ఇట్లా షేర్లు అమ్మడం ద్వారా రామలింగరాజు కుటుంబం రెండు వేల కోట్ల రూపాయలు సంపాదించింది. ఇందులో సగానికి పైగా 2006 ఏప్రిల్-జూన్ మాసాల్లో సంపాదించిందే.

నిజానికి షేర్లు అమ్మడం నేరుగా జరిగింది కాదు. అలా అమ్మితే ఎప్పటికప్పుడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించాలి. అది మదుపర్లకు, ప్రపంచానికి తెలిసిపోతుంది. ఇది తప్పుడు సంకేతం అవుతుంది. అందుకే రామలింగరాజు కుటుంబం ఒక వినూత్న పద్ధతి (నిజానికి అంత కొత్త పద్ధతేమీ కాదు. చాలా కార్పొరేట్ సంస్థల ప్రమోటర్లు చేసే పనే) ఎంచుకున్నారు. ఆయన భార్య, తమ్ముళ్లు, కొడుకులు, మరుదులు, వాళ్ల భార్యలు, పిల్లలు, వేలువిడిచిన బావలు వీళ్లందరి పేర్లమీదా లెక్కకు మించిన కంపెనీలు తెరిచారు. దాదాపు అన్నీ రియల్ ఎస్టేట్ లేదా ఆగ్రో - ఫార్మ్ కంపెనీలు. ఈ కంపెనీలు (మేటాస్ ఇన్‌ఫ్రా, మేటాస్ ప్రాపర్టీస్‌లతో సహా) భూములు కొనడం, కొనిపించడం చేస్తుంటాయి. ఇలా పెట్టిన లెక్కకుమించిన కంపెనీలకు పెట్టుబడి ఎక్కడి నుంచి తెచ్చారంటే, రాజుకుటుంబ సభ్యుల దగ్గరున్న సత్యం షేర్లను తనఖాపెట్టి. ఎవరి దగ్గరా అంటే, డష్ బ్యాంక్, ఐఎల్ఎఫ్ఎస్, డిఎస్‌పి మెరిల్‌లించ్ వంటి సంస్థల దగ్గర. ఇది చట్టబద్ధమే. కొంత వ్యవధిలో షేర్ల విలువ ఎంత ఉంది, దాని సరాసరి కట్టి దానిని ఆధారంగా చేసుకుని ఎంత వరకు అప్పివ్వవచ్చో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు నిర్ణయిస్తాయి. ఈ తనఖా అమలయ్యే వ్యవధిలో ఒకవేళ షేర్ల విలువ పడిపోతుంటే తనఖా ఉంచుకున్న సంస్థలు వాటిని అమ్మివేయవచ్చు. ఇదీ చట్టబద్ధమే.

నిజానికి ఇది కార్పొరేట్ల ప్రమోటర్లకు ఒక గొప్ప పెన్నిధిలాంటిది. తాము నేరుగా మార్కెట్లో అమ్మితే వచ్చే చెడు ప్రభావం, యిలా పరోక్షంగా అమ్మిస్తే ఉండదు. ఈ లొసుగే చిన్న మదుపర్ల డబ్బుకు శాపంగా పరిణమించింది. అప్పిచ్చిన సంస్థలకు, ప్రమోటర్లకు లాలూచీ ఉండే అవకాశం చాలా ఉంది. అంతా స్పష్టంగా అర్థమవుతున్నా సరే, దీన్ని ఎవరూ రుజువు చెయ్యలేరు.

ఒక ఉదాహరణ చూద్దాం. డిసెంబర్ 16 (ఏ రోజైతే ఏడు వేల కోట్లతో మేటాస్ ఇన్‌ఫ్రా, మేటాస్ ప్రాపర్టీస్‌ను కొందామని సత్యం బోర్డు నిర్ణయం తీసుకుందో) తర్వాత సత్యం షేరు విపరీతంగా పడిపోవడం ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్ల కోపం, తీవ్రమైన వ్యతిరేకత చూసాక రామలింగరాజు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నా, షేర్ల విలువ పతనం ఆగలేదు.

ఇందుకు విరుగుడుగా, తర్వాత బోర్డు మీటింగ్‌లో షేర్ బై బ్యాక్ (మార్కెట్ విలువ కంటె కొంచెం ఎక్కువ ధరకు షేర్లను కంపెనీ కొంటుంది) చేస్తామని, దీనివల్ల కంపెనీ మీద ఇన్వెస్టర్ల విశ్వాసం పెరుగుతుందని ప్రకటించారు. కంపెనీ రిజర్వుల్లో ఐదువేల కోట్ల రూపాయలు ఉండడంతో, ఇందులో కొంత ఇస్తారని ఏళ్ల తరబడి అనుకుంటున్న ఇన్వెస్టర్లకు కొంచెం ఆశ కలిగింది. (ఈ ఆశ మీదే, ఇంకా చెప్పాలంటే దురాశ మీదనే మొత్తం స్టాక్ మార్కెట్ మాయ ఆధారపడి ఉంది.) మళ్లీ సత్యం షేర్లను కొనడం మొదలెట్టారు. ఒక దశలో రు. 130కి పడిపోయిన షేర్, రు. 184 వరకు పెరిగింది. రు. 9000 కోట్లకు పడిపోయిన మార్కెట్ కాపిటలైజేషన్ (మొత్తం కంపెనీ షేర్లను ఆనాటి విలువతో హెచ్చిస్తే వచ్చే మొత్తాన్ని మార్కెట్ కాపిటలైజేషన్ అంటారు. ఇది ఊహాజనితమైన విలువ. ఎందుకంటే, కంపెనీ విలువ ఇంత ఉందని చెప్పి అందరూ అమ్మడం మొదలు పెట్టారంటే, అందుబాటులో ఉండే షేర్లు మొత్తం ఎక్కువై, దాని విలువ పడిపోతుంది. ఫలితంగా మార్కెట్ కాపిటలైజేషన్ పడిపోతుంది.) ఐదారు రోజుల్లో పన్నెండు వేల కోట్లకు పెరిగింది.

అయితే ఇది జనవరి 7న రామలింగరాజు చేసిన కుట్ర ప్రకటనతో దాదాపు వెయ్యి కోట్లకు (షేరు విలువ ఇరవై ఐదు రూపాయలకు) పడిపోయింది. తప్పు ఒప్పుకుని ఎంతో ఔన్నత్యం ప్రకటించాడని రామలింగరాజుని ఇప్పటికీ పొగుడుతున్న మేధావులు, ఐటి నిపుణులు ఉన్నారు. వాళ్లుకూడా గమనించనిది (లేదా గుర్తించడానికి ఇష్టపడనిది) ఏమిటంటే, పశ్చాత్తాప ప్రకటనకు ముందు కూడా ప్రణాళిక ఉందని. డిసెంబర్ 23 నుంచి జనవరి 5 వరకు కొన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు దాదాపు 2.5 కోట్ల సత్యం షేర్లు అమ్మాయి. తాము అప్పులివ్వడానికి తనఖాగా పెట్టుకున్న షేర్లు ఇవి. షేర్ల విలువ అనూహ్యంగా పడిపోయిన డిసెంబర్ 17నో, 18నో లేక షేర్ బై బ్యాక్ ప్రకటన వచ్చాక షేర్ల విలువ పెరిగాక జరిగిన అమ్మకాలివి. ఈ అమ్మకాలు కూడా జనవరి 5న ముగిసాయి. రాజుగారు ఆ తర్వాత ముప్పై గంటల్లో పశ్చాత్తాపం ప్రకటించారు. ఫలితంగా షేరు విలువ ఇరవై ఐదు రుపాయలకి పడిపోయింది. అంటే తనఖా పెట్టుకున్న బ్యాంకులకు నష్టమేదీ కలగలేదన్నమాట. కాని చిన్న మదుపర్లు వేల కోట్లలో నష్టపోయారు.

ఈ కుంభకోణంలో మరో ముఖ్యమైన అంశమేమిటంటే, తాను ఏడేళ్లుగా కంపెనీ లెక్కలను ఎక్కువ చేసి చూపించానని రామలింగరాజు చెప్పాడు. అదీ ఏదో వందో, రెండొందలో ఎక్కువో తక్కువో చేసి చూపడం కాదు. ఏకంగా వందల వేల కోట్లు. రాజుగారు ఒప్పుకున్నదేమిటంటే

ఏడేళ్ల కాలంలో ఏకంగా రు. 7136 కోట్ల మేర ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు, ఉన్న అప్పును తక్కువ చేసి చూపించానని, అందుకు తీవ్రంగా 'పశ్చాత్తాప' పడుతున్నానని. నిజానికి ఈ డబ్బంతా రాజు అకౌంట్లోకి, కుటుంబ సభ్యుల చేతిలోకి వెళ్లిందన్నది ప్రధాన ఆరోపణ. ఆయన చెప్పిందే నిజమనుకున్నా, అసలు ఇన్ని సంవత్సరాలు లెక్కలను తప్పు చేసి చూపిస్తుంటే సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా), రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ కమిటీ సంస్థలు ఏం చేస్తున్నట్టు?

సెబీ చట్టం, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ చట్టాల ప్రకారం కంపెనీల ఆదాయ వ్యయాల లెక్కలు పకడ్బందీగా ఉండాలి. కంపెనీలకు అంతర్గతంగా ఒక ఆడిటింగ్ వ్యవస్థ ఉంటుంది. ఇవి సరిచూసాక కంపెనీ ఛీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) దాన్ని ఆమోదించాలి. కంపెనీలకు ఉండే బోర్డ్‌లోని ఆడిట్‌కమిటీ (ఈ కమిటీలో ఇండిపెండెంట్ డైరక్టర్లు ఉంటారు) ఈ లెక్కలను సరి చూసి ఆమోదించాలి. ఇది కాక కంపెనీ షేర్ హోల్డర్లు నియమించే బయటి ఆడిటర్ (సత్యం విషయంలో ప్రైస్ వాటర్ హౌస్) స్వతంత్రంగా కంపెనీ ఇచ్చిన లెక్కలను సరిచూడాలి. ఖర్చులకు, ఆదాయనికి, బ్యాంక్ బాలెన్స్‌లకు సంబంధించి పత్రాలను ఆయా సంస్థలతో సంప్రదించి సరిచూసి అప్పుడు సంతకం పెట్టాలి.

ఇవన్నీ నియమాలు, చట్టాలు. వీటి ప్రకారం అవసరమయ్యే అన్ని పత్రాలను, స్టేట్‌మెంట్లను సత్యం యాజమాన్యం సృష్టించింది. రాజు 'గౌరవప్రదమైన' వ్యక్తి కాబట్టి ఆ పత్రాలను సందేహించాల్సిన అవసరమే కలగలేదు ఎవ్వరికీ. ఆఖరికి కంపెనీ వ్యవహారాలను 'తామరాకు మీద నీటి బొట్టులాగా' చూడాల్సిన ఇండిపెండెంట్ డైరక్టర్లు కూడా వీటిని చూసీ చూడనట్టు వదిలేసారు.

సత్యం బోర్డులో తొమ్మిదిమంది సభ్యులుంటే అందులో ఆరుగురు – డా. మంగళం శ్రీనివాసన్, డా. క్రిష్ణ పాలెపు, ప్రొఫెసర్ మెందు రామ్మోహనరావు, వినోద్ ధామ్, టి.ఆర్. ప్రసాద్, వి.ఎస్. రాజు – ఇండిపెండెంట్ డైరెక్టర్లు. ఇందులో క్రిష్ణ పాలెపు అనే వ్యక్తి కార్పొరేట్ గవర్నెన్స్ (అంటే కంపెనీల్లో పరిపాలన ఎలా ఉండాలి) విషయాలు విడమర్చి చెప్పడంలో ప్రపంచంలోనే పెద్ద స్పెషలిస్ట్. రామ్మోహన్‌రావు అయితే భవిష్యత్ వ్యాపారవేత్తలను తయారు చేసే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు కులపతి. వీళ్ల ఇండిపెండెన్సంతా కంపెనీ ఇచ్చే తాయిలాలపై ఆధారపడి ఉంటుంది. అందుకే రామలింగరాజు తన కుందేలుకు మూడు కాళ్లున్నాయంటే 'అవును కదా' అని ఒప్పుకున్నారు. 'మిరియాలు తాటికాయలంత' అని అంటే 'అవునవును' అని సర్టిఫికెట్ ఇచ్చారు.

ఇవన్నీ తెలియని, తెలుసుకుందామన్నా అవకాశం లేని మదుపర్లు రాజు 'పశ్చాత్తాపం' ప్రకటించేదాకా కంపెనీ షేర్లలో డబ్బులు పెడుతూనే ఉన్నారు.

అసలు కంపెనీ బాలెన్స్ షీట్లను తారుమారు చేస్తే శిక్ష ఏమిటి? అసలు పడుతుందా? పడినా ఎన్నేళ్ల తర్వాత? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకదు. దొరకదు అనేదాని కంటే, శిక్షలేకుండానే బయట పడతాడని దాదాపు అందరికీ తెలిసిందే. ఎందుకంటే, రాజుకీ గత ముఖ్యమంత్రికీ, ప్రస్తుత ముఖ్యమంత్రికీ ఉన్న సంబంధ బాంధవ్యాలు జగమెరిగిన సత్యం.

రాజు జనవరి 7న తప్పు ఒప్పుకుంటే, వేలకోట్ల కుంభకోణం ఉందని ప్రపంచానికి ప్రకటించినా పోలీసులు మాత్రం ఆయనను అరెస్ట్ చెయ్యడానికి రెండురోజులు వేచి చూసారు. రామలింగరాజునీ, రామరాజునీ అరెస్ట్ చేసాక సిఎఫ్ఒ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకోవడానికి ఇంకో రెండు రోజులు చూసారు. రాజు ఇంకో తమ్ముడు సూర్యనారాయణ ఇంటినీ ఆఫీసునూ సోదా చెయ్యడానికి పదిహేను రోజులు తీసుకున్నారు. మిగతా కుటుంబ సభ్యులను (వీళ్లందరి పేర లెక్కకుమించిన కంపెనీలు, ఆస్తులు ఉన్నాయని మరోపక్క, పక్కా సమాచారమున్నా కూడా) విచారించలేదు. రాజు ఇద్దరు కొడుకులు (తేజరాజు, (జూనియర్) రామరాజు) రెండు కంపెనీలను (మేటాస్ ప్రాపర్టీస్, మేటాస్ ఇన్‌ఫ్రా) నడుపుతున్నారు. అసలు సత్యం కొందామని ప్రయత్నించిన కంపెనీలు ఇవే. వీళ్లను కూడా ఇప్పటివరకూ విచారణ సంస్థలు ప్రశ్నించలేదు. అంతా మర్యాదపూర్వకంగా జరుగుతోంది.

చిన్న నేరాలు చేసేవాళ్లను, విప్లవ సంస్థలకు, పార్టీలకు సహాయం చేస్తున్నారని వేలాది మందిని, వాళ్ల కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేసి, వేధించి, వెంటాడి తప్పుడు కేసులు పెట్టే ప్రభుత్వం, రామలింగరాజు చేసిన కుంభకోణాల పట్ల 'ఏదో పోనీలే చిన్నతప్పు చేసాడు' అన్న ధోరణిలో ప్రవర్తిస్తోంది. ఎందుకంటే, రాజు నోరువిప్పి ఏయే పార్టీలకు ఎంతెంత డబ్బిచ్చాడో చెబితే చాలామందికి ఇబ్బంది అవుతుంది.

రాజు ఇచ్చిన కళ్లజోడు

రామలింగరాజు తెలివికి అసలు అంతు ఉందా అని అనిపిస్తుంది. తన 'పశ్చాత్తాప ప్రకటన'లో మొత్తం తను చేసిన మోసం విలువ రు. 7136 కోట్లని చెప్పాడు. ఇక అంతే, సెబీ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, కేంద్ర ప్రభుత్వం, తీవ్ర మోసాలను పరిశోధించే (సీరియస్ ఫ్రాడ్స్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) సంస్థ, పోలీసులు, మదుపర్లు, జర్నలిస్టులు అందరూ ఇక ఆ రు. 7136 కోట్లు అనే చట్రంలోనే ఆలోచించడం మొదలు పెట్టారు. ఇంకా అందులోనే ఉన్నారు. రాజు ఇచ్చిన ఆ కళ్లజోడుతోనే ప్రపంచం చూస్తోంది.

రాజు 'పశ్చాత్తాపం' ప్రకటించారని, అందుకు మెచ్చుకోవాలని, తప్పు కాయాలని వాదించేవాళ్లు తక్కువేమీ లేరు. కానీ రాజు ఇంకొన్ని విషయాలు కూడా చెప్పి ఉంటే బాగుండేది. తాము పెట్టిన కంపెనీ లోంచే ఎందుకు వాటా తగ్గించుకుంటూ వచ్చారు? అలా తగ్గించుకున్నందువల్ల సంపాదించిన రెండువేల కోట్ల రూపాయలతో ఏం చేసారు? లెక్కకు మిక్కిలిగా ఎగ్రికల్చరల్ కంపెనీలు ఎందుకు పెట్టారు? తమ కంపెనీ షేర్లను ఎవరైనా రాజకీయ నాయకులకూ వాళ్ల చుట్టాలకూ ఇచ్చారా? ఎంత ఇచ్చారు? ఇన్ని తప్పులు చేస్తున్నా ఉత్తమ వ్యాపారవేత్త, 'కార్పొరేట్ గవర్నెన్స్ అమలులో గొప్ప కంపెనీ' అవార్డులను ఎందుకు తీసుకున్నట్టు? కొడుకుల పేర్లమీద తెరిచిన మేటాస్ కంపెనీల్లో ఆయా కంపెనీలు చేపట్టిన ప్రాజెక్టుల్లో ఏ రాజకీయ నాయకులకైనా వాళ్ల కుటుంబ సభ్యులకైనా వాటాలున్నాయా? ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు అమెరికాలో పార్టీ ఫండ్‌ను కూడబెట్టడంలో తాను ఎలాంటి సహాయం చేసాడు? ప్రస్తుత కాంగ్రెస్‌పార్టీకి తాను ఎన్ని కోట్ల రూపాయలు సమకూర్చాడు? – ఇలాంటి ప్రశ్నలకు వివరణాత్మకంగా జవాబు చెప్పి ఉంటే, పశ్చాత్తాపం పడి ఉంటే బాగుండేది.

నిజంగా 'పశ్చాత్తాపం'లో కొన్ని అంశాలు నిజమనుకున్నా, సగం పశ్చాత్తాపం పడడం, వాస్తవాలను ఇంకా మరుగుపరచడం ఇంకా పెద్ద మోసం కాదా?

వీ

నిత్యావసర వస్తువుల ధరలు నిలకడగా ఉండటమో లేదా పెరగటమో అనేది కచ్చితంగా ఆయా ప్రభుత్వ విధానాలపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు **వి. చలపతిరావు**

ధరలెందుకు పెరుగుతున్నాయి?

గత ఏడు, ఎనిమిది నెలల నుండి నిత్యావసర వస్తువుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా పప్పు దినుసులు, బియ్యం, గోధుమలు, చింతపండు, కూరగాయలు వగైరా వంటి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలకు భారమవుతున్నాయి. ఇలా పెరుగుతున్న ధరలు అదుపు కోసం ప్రభుత్వం ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ ధరల సమస్య దేశంలోని నలభై శాతం పేదల, మరొక నలభై శాతం మధ్యతరగతి ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్న మాట వాస్తవం. అయినా అటు కేంద్ర ప్రభుత్వం కాని ఇటు రాష్ట్ర ప్రభుత్వం కాని ధరల విషయం పట్టించుకోక నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విడ్డూరంగా ఉంది. నిత్యావసర వస్తువుల ధరలే కాక పారిశ్రామి కోత్పత్తులు ఇతర వాడకం వస్తువుల ధరలు కూడ అదుపు లేకుండా పెరుగుతున్నాయి. ముఖ్యంగా గృహనిర్మాణంలో అత్యవసరం అనుకొనే సిమెంట్ ధర కూడ అదుపు లేకుండా పెరగడం గమనార్హం. ఈ స్థితి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంక్ మార్కు మార్కెట్ ఎకానమీని ప్రోత్సహించడం వలన దాపురిస్తున్నదా? మొన్న పార్లమెంట్‌లో ధరల పెరుగుదలపై విపక్షాలు, అధికారపార్టీ కలిసి ప్రభుత్వాన్ని నిలదీసినప్పుడు ఆర్థికమంత్రి చిదంబరం చెప్పిన జవాబును బట్టి చూస్తే పైమాటే నిజమని తోస్తున్నది. స్థూల జాతీయ ఉత్పత్తి ఎనిమిది శాతంగా ఉన్న మన దేశంలో వస్తువుల ధరలు ఇలా పెరగడం మామూలే అని ఆయన ధరల పెరుగుదలను సమర్థించారు.

సాధారణంగా మార్కెట్లో ఏవైనా వస్తువుల ధరలు పెరగటానికి కారణం, ఆ వస్తువులకి గిరాకి ఎక్కువ కావడమో లేదా ఆ వస్తువుల గిరాకీకి తగ్గట్టుగా సరఫరా లేకపోవడమో అని ఆర్థికశాస్త్ర సూత్రం చెప్తుతుంది. లేదా ఆ ప్రత్యేక వస్తువులను బ్లాక్ మార్కెట్ వర్తకులు అధిక లాభాల కోసం అక్రమ నిలువలు చేసి అయినా ఉండాలి, లేదా పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెరిగి ధరల పై ప్రభావం పడైనా ఉండాలి. ఇవేవి కాక ఆర్థికమంత్రి చెప్పే కారణం ఇందుకు భిన్నంగా ఉంది. ఆర్థికమంత్రి చెప్పేది కుంటిసాకా నిజమా ఆర్థికవేత్తలు, విశ్లేషకులు ప్రజలకు స్పష్టం చేయాలి.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కారణం పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడమేనని చిదంబరం చెప్పినదానికి భిన్నంగా చెప్పారు. ఇందులో ఎవరు చెప్పినది నిజమో తెలియదు. పూర్వం ఇందిరాగాంధీ హయాంలో కూడా ఒకసారి చక్కెర ఇతర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఆనాడు సరుకులు పెద్ద ఎత్తున చీకటి బజారు గోదాములలోకి జారుకొన్నవి. కానీ దాని తరువాత వచ్చిన మొరార్జీదేశాయి ప్రభుత్వ హయాంలో బజారులో తోపుడు బండ్లపై పెట్టి చక్కెర సరసమయిన ధరలకు అమ్మారు. అంతకు పూర్వం గల 'లైసెన్స్ కోటా రాజ్' (ఇందిరాగాంధీ హయాంలో) విధానంలో సడలింపు తీసికువచ్చిన ఫలితంగా నిత్యావసర వస్తువులు ఓపెన్ మార్కెట్‌లో సరసమయిన ధరలకు లభ్యమవుతున్నాయని ఆనాడు జనతా పార్టీ ప్రభుత్వం చెప్పుకుంది. ఇక్కడ చెప్పే విషయం ఏమిటంటే నిత్యావసర వస్తువుల ధరలు నిలకడగా ఉండటమో లేదా పెరగటమో అనేది కచ్చితంగా ఆయా ప్రభుత్వ విధానాలపై ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు గత రెండేండ్ల నుండి కాంగ్రెస్ హయాంలో వివిధ వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయంటే ఈ ప్రభుత్వ విధాన ప్రభావమే అని చెప్పవచ్చు. ఈ సంగతి ప్రతిపక్ష పార్టీల నాయకులకే కాక కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుసు.

ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుంటే, ఇంకొకవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారి అవతారం ఎత్తి హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను ప్లాట్లుగా చేసి హుడా ద్వారా ఎన్నడూ కనీవినీ ఎరగని రీతిలో విపరీతమయిన ధరలకు పెద్ద ధనవంతులకు కంపెనీ వారికి వేలం పాటలో అమ్మేస్తోంది. మొన్న కోకాపేట భూముల వేలంపాటలో ఎకరా ధర ఎక్కువగా పదిహేడు కోట్ల రూపాయలకు అమ్ముడు పోయిన సంగతి అందరికీ తెలిసిందే. అంటే ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల బాధపడుతున్న సామాన్య ప్రజలు ఇక ముందు చిన్న ఇల్లునో, ప్లాటును కూడ కొనడానికి కలలు కనడానికి వీలు లేకుండా ఈ ప్రభుత్వం చేస్తోంది. భూమి, నీరు, వాయువు ఇవి ప్రకృతి ఇచ్చిన మహాప్రసాదం. వీటిపై పన్నులు వేయడం దేనికి అని ఎన్.టి.ఆర్. ప్రభుత్వం భూమి శిస్తును తీసేసింది. కాని ఈ ప్రభుత్వం నివసించడానికి చారెడు భూమిని కూడా ప్రియం చేస్తోంది. మీటర్లు బిగించి తాగునీరును ప్రియం చేస్తారట. పేదలకు ఉచిత విద్య, వైద్యం కూడ దొరకకుండా ఈ ప్రభుత్వం కార్పొరేట్ విద్యా వైద్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఇలా ప్రజలకు కావలసిన మౌలికావసరాలు, ఇంటి జాగ, మంచినీరు, ఆహారం ఇతర నిత్యావసర వస్తువులు ప్రియం కావడానికి ప్రభుత్వమే కారణం అవుతోంది. కంచే

గొప్ప ఉద్యమ వారసత్వాన్ని ఇచ్చిన, త్యాగ సంప్రదాయాల్ని నెలకొల్పిన తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష యాగాలకు, చిలక జోస్యాలకు, అవకాశవాదాలకు బలవుతున్న వైనాన్ని వివరిస్తున్నారు **కె. ప్రభాకర్**

జ్యోతిష్యంతో తెలంగాణ వచ్చేనా?

2009 లో తెలంగాణ తప్పకుండా వస్తుందని జ్యోతిష్యుడు కూడా చెప్పాడని పత్రికల్లో వార్తలు చూశాక ఇవ్వాళ్టి తెలంగాణ ఉద్యమాన్ని, రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న వైఖరులను మళ్లీ ఒకసారి మననం చేసుకోవాలనిపిస్తుంది.

1969 నాటి ఉద్యమాన్ని తమ రక్తతర్పణతో ఉవ్వెత్తున ఎగిసిపట్టిన 369 మంది తెలంగాణ అమరవీరుల త్యాగాలు మళ్లీ వృథాకాబోతున్నాయా అనిపిస్తుంది!

ఆనాటికే ఇరవై ఐదు వేలకు పైగా తెలంగాణ ప్రాంత ఉద్యోగాల్ని కొల్లగొట్టారని వాళ్ల పోరాటం రుజువు చేసింది. అందువల్లే ఆనాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి జిఒ 36ను విడుదల చేయడం, అదీ అమలుకాక 1985 దాకా తెలంగాణేతరులు తెలంగాణ ప్రాంత ఉద్యోగాలను, చదువులను కొల్లగొట్టడం యథేచ్ఛగా సాగుతూ వచ్చిందని జై భారత్‌రెడ్డి కమిషన్ గుర్తించింది. 1985లో ఎన్.టి. రామారావు జిఒ 610ని విడుదల చేయడం, యాభై ఎనిమిది వేలకు పైగా అక్రమంగా వచ్చి చేరిన ప్రాంతియేతరులను మార్చ్ 31, 1986 లోగా పంపిస్తామని చెప్పి ఇరవై రెండు ఏళ్ల కాలం గడిచిపోయినా ఆ ఉత్తర్వు అమలు కాకపోగా, నూట ఇరవై రకాలుగా రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ పాలకులు తెలంగాణకు అన్యాయం చేశారని ప్రభుత్వమే నియమించిన గిర్‌గ్లాని కమిషన్ స్పష్టం చేసింది.

అన్యాయాల పరంపరకు వ్యతిరేకంగా 1996లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, కవులు, కళాకారుల చైతన్యం ఉద్యమంగా మళ్లీ రగులుకోవడం, దాని పర్యవసానంగా 2004 లో ఒక రాజకీయ రూపం తీసుకొని టిఆర్ఎస్ ఆవిర్భవించడం జరిగింది.

అనేకమార్లు రాజకీయ ప్రక్రియను నమ్మి మోసపోయిన తెలంగాణ ప్రజా ఆకాంక్ష టిఆర్ఎస్‌ను విశ్వసించింది. తెలంగాణ లేకపోతే రాకపోతే రాళ్లతో కొట్టి చంపమని చెపుతూ, ఓ నెత్తుటి చుక్క చిందకుండా, కనీసం కర్రనా విరగకుండా ఉద్యమాన్ని, ప్రజల ఆకాంక్షల్ని నిలువరించడంలో ఆ పార్టీ క్రియాశీలక పాత్రే నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వంలో చేరి లాబీలు, కన్సెన్సస్‌లతో రాజకీయ పార్టీల మద్దతు సంపాదించడం, అనేక రాజకీయ పార్టీలు తెలంగాణను 'సెంటిమెంట్' (రాజకీయ విశ్వాసం)గా పరిగణిస్తూ తెలంగాణ అనకపోతే తమ విశ్వసనీయతను ప్రదర్శించుకోలేని స్థితిని తెలంగాణ ఉద్యమ చైతన్యం తీసుకవచ్చిందనేది కాదనలేని వాస్తవం!

ఒకనాడు అసెంబ్లీలో తెలంగాణ పదాన్ని ఉచ్చరించనీయని

చేను మేసినట్లు, ప్రజల సంక్షేమం గురించి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఈ విధంగా ధరలు పెరగడానికి స్వయంగా కారణం కావడం పూర్తిగా అప్రజాస్వామికం. హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే, నిత్యావసర ధరలు ఈ విధంగా పెరుగుతుంటే మన ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ద్రవ్యోల్బణం శాతం 4.87 నుంచి 4.50కి పడిపోయిందని చెప్పాడు. ఇది ఎలా సాధ్యం? ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ వగైరా ఇతర ప్రభుత్వ ఏజెన్సీలు ఇచ్చే గణాంకాలను ఎలా నమ్మాలి. పార్లమెంట్ సభ్యులెవరూ ఈ గణాంకాలలోని వాస్తవికతను ప్రశ్నించినట్లు లేదు.

కోకా కోలా, పెప్సి లాంటి శీతల పానీయాలలో పురుగుల మందు శాతం 17 శాతం వరకు ఉందని, కనుక ఇది తాగడం వలన ముఖ్యంగా వీటికి అలవాటు పడ్డ యువత ఆరోగ్యం ప్రమాదంలో ఉందనీ, గత రెండేళ్ల నుండి నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వాలు వాటి అమ్మకాలపై నిషేధంపెట్టి, అవి తయారుచేసే కంపెనీల భూ యాజమాన్యాలను విచారణచేసి చర్యలు తీసుకోవడంలేదు. అటు పల్లెలలో, బస్తీలలో మురికివాడలలో గుడుంబా కల్తీకల్లు తాగి పేద కార్మిక ప్రజలు అనారోగ్యాలకు గురై చివరకు అర్ధాంతరంగా ప్రాణాలను కోల్పోతున్నారు. తమ కుటుంబాలను అనాథలుగా చేసి వెళ్లిపోతున్నారు. ఈ విధంగా పెద్ద ఎత్తున మానవ వనరుల వృద్ధి ప్రమాదంలో ఉన్నా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టగలవని అనుకోవడం అత్యాశే అవుతుందేమో.

ఈరోజు రాజకీయ నాయకులు లక్షలు ఖర్చుచేసి ఎన్నికలలో గెలిచి కోట్లు సంపాదించాలనే ధ్యాసలో ఉన్నారు. అలాంటి రాజకీయ నాయకులకు బ్లాక్‌మార్కెటీయర్లతో, ల్యాండ్ మాఫియాలతో, ఇతర అసాంఘిక శక్తులతో దోస్తీ ఉంటోంది కానీ, బీద మధ్యతరగతి ప్రజల కష్టాలగురించి పట్టించుకొనే తీరికేలేదు. సంఘకార్యకర్తలు, వినియోగదారుల సంఘాలు, విద్యావంతులు, లాయర్లు, డాక్టర్లు, ఆర్థికవేత్తలు అందరూ కలిసి సమైక్యంగా ధరల అదుపు విషయంలో పోరాడవలసి ఉంది. ✦

సమైక్యవాద పార్టీని తెలంగాణకు 'సై' అనిపించగలిగిందీ తెలంగాణ ప్రజల చైతన్యమే. అట్లాంటి ప్రజా చైతన్యాన్ని తమ ఓట్ల కోసం, సీట్ల కోసం ఎత్తుల పొత్తుల్లో ఎవరితోనైనా అంటకాగటాన్నే ఇవ్వాళ తెలంగాణ ప్రజానీకం జీర్ణించుకోలేకపోతోంది.

టిడిపి తెలంగాణ కోసం తీర్మానం చేయాలన్న దేవేందర్ గౌడ్ వెళ్లిపోయిన తర్వాత తెలంగాణపట్ల అనుకూల నిర్ణయం తీసుకోవడం వెనుక 'సెంటిమెంట్'ను అర్థం చేసుకోవచ్చు.

రాజకీయ పార్టీలు ప్రజలని ఓటర్లుగానే చూస్తున్నాయనీ, ఓట్లు-సీట్లు, ఎత్తులు పొత్తులు తప్ప తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని గురించి మాట్లాడడం తనకు ఆవేదన కలిగించడం వల్లే తెలంగాణ కోసం బయటికి వచ్చానని ప్రకటించిన నవతెలంగాణ పార్టీ (ఎన్‌టిపి) నేత తెలంగాణను ఉద్యమం ద్వారానే సాధించుకోవాలని 'తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి'తో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతానని ప్రకటించిన ఎన్‌టిపి నవంబర్ 1న తానే తెలంగాణను ప్రకటించుకోంది.

తెలంగాణ పట్ల తమ వైఖరిని స్పష్టం చేయండి అంటూ తెలంగాణ ప్రజలు 'ప్రజారాజ్యం' నేతను నిలదీయడంతో మీ మనస్సును అర్థం చేసుకోలేనా? ఈ గడ్డ దాటేలోపు నా నిర్ణయం ప్రకటిస్తానని చెప్పి అందరూ కోరుకుంటే తెలంగాణ కోసం 'ఢిల్లీ'లో ప్రయత్నిస్తాం అని, సామాజిక తెలంగాణ మా లక్ష్యం అని ప్రకటించడం ఓ విడ్డూరం.

తెలంగాణను కోరుకోవడమంటేనే అరవై ఏళ్ల ఆంధ్ర వలస పాలనలో తాను కోల్పోయిన రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక అంశాల్ని, నీళ్లల్లో, నిధులల్లో, కొలువుల్లో తమ జీవితాల్లో కోల్పోయిన వాటిని పునరుద్ధరించుకోవడం అని ఆ ఉద్యమాన్ని గమనిస్తున్న వాళ్లకు, మద్దతునిస్తున్న వాళ్లకు తెలుసు. కాని 'ప్రజారాజ్యం' విశాలాంధ్రలో ప్రజారాజ్యంలా ప్రవర్తిస్తూ తెలంగాణపట్ల తన వైఖరిని స్పష్టం చేస్తోంది. అట్లాంటి 'ప్రజారాజ్యం' చేతిలో నవ తెలంగాణ పార్టీ తెలంగాణ అంశాన్ని పెట్టడం మరింత ఆశ్చర్యాన్ని, ఆవేదనను కలిగిస్తోంది.

తెలంగాణ ఉద్యమ శక్తులని, మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్షల్ని మరొకసారి మట్టుపెట్టే ప్రయత్నం జరుగుతోంది. 2009 లోపు తెలంగాణ రావడం లేదా, 2009లో తెలంగాణ రావడం అనే 'జ్యోతిష్యం' మళ్లీ తెలంగాణ అమరవీరుల త్యాగాల్ని, ఆ త్యాగాల నేలమీద నిలిచి ఆ రక్తపు మరకల్ని కనుమరుగు చేయడం లక్ష్యంగా అపహాస్యం కొనసాగుతోంది. తెలంగాణ మా లక్ష్యంకాదు 'తెలంగాణ' పేరిట రాజకీయ ప్రక్రియ మా లక్ష్యం అని రాజకీయ పార్టీలు చెప్పకనే చెపుతున్నాయి.

అందుకే ఇవ్వాళ దాదాపు అన్ని పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్ష ప్రజాస్వామికమైనదని ఆమోదం తెలిపినా రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కనీసం 'బిల్లు' రూపంలోకి రాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

బహుశా రేపటి ఎన్నికల్లో ఎవరు తెలంగాణ అనకపోయినా 'తెలంగాణ'లో ఓట్లు పొందడం సాధ్యం కాదు గనుక ఓట్ల కోసం ఇట్లాంటి వైఖరిని తీసుకున్నారనేది స్పష్టం. అయినా ఓట్ల ద్వారా సీట్లు పొంది తెలంగాణ సాధించలేరని గత చరిత్రంతా (1972 నుండి) రుజువు చేస్తున్నది. కనుకే అట్లాంటి ద్రోహపు పార్టీల మద్దతుతో మళ్లీ గెలిచి తెలంగాణ ప్రజల్ని ఓడించాలని చూస్తున్నవి.

2009లోపు తెలంగాణ రాకపోయినా ఆ తర్వాత వచ్చినా జరిగేదేమి లేదు. ఇప్పటికే తెలంగాణ ఐదు జిల్లాలను కొండ చిలువలా చుట్టుకున్న 'రింగ్‌రోడ్డు', గ్రేటర్ హైదరాబాద్, రేపటి తెలంగాణకు 'మహాసెజ్'గా మారనుంది. టోల్‌గేట్ కీపర్లుగా తమ పంటపొలాల్ని బహుళజాతి, ఆంధ్రా వలసపాలకుల కుట్రల్లో కోల్పోయి పోలేపల్లులుగా, సిరిసిల్లలుగా మాయమైపోవడం, మరింత ఉధృతంగా ఉత్సాహంగా పోతిరెడ్డి పాడుల, పోలవరం, పులిచింతలలు తెలంగాణను ముంచెత్తడం కోసం ఈ రాజకీయ ప్రక్రియ ఎత్తులు - పొత్తులు అని అర్థమవుతోంది.

దీనికి ప్రత్యామ్నాయంగా తెలంగాణ అంటేనే తమ బతుకు బాగు కోసం జరిగే పోరాటం అని గుర్తించగలిగిన శక్తులన్నిటినీ ఏకం చేస్తూ 'ప్రజాఉద్యమం' ద్వారానే తెలంగాణ కోసం పోరాడాల్సి ఉంది. జ్యోతిష్యాలు, లాబీయింగ్‌లు, ఎత్తులు పొత్తులు ఓట్లు సీట్లు కాకుండా జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తిని నిజమైన తెలంగాణ పార్టీలు కొనసాగించవలసి ఉంది. వీ

రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాలను పోలుస్తూ అన్ని రకాలుగా వెనుకబడిన రాయలసీమ ప్రాంతం గురించి వివరిస్తున్నారు **ఎ. రంగారెడ్డి**

వివక్షకు గురవుతున్న రాయలసీమ

అభివృద్ధి అనే పదానికి నిర్వచనం కేవలం తలసరి ఆదాయంలో పెరిగే ప్రక్రియ; అర్థశాస్త్ర నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అభిప్రాయంలో కేవలం ఆదాయాలు, సంపదలు పెరగడమే కాదు, పౌరునికి పూర్తి స్వేచ్ఛతో తన శక్తి ఉపయోగించడానికి అభివృద్ధిలో భాగస్వామ్యం ఉండాలి. సాధారణంగా కోరికలవలనే ఉత్పత్తి ఏర్పడుతుంది. చివరికి అభివృద్ధి అనేది మానవాభివృద్ధిలో కలిసిపోతుంది. మానవాభివృద్ధి ఏకైక లక్ష్యం ఏమిటంటే ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ, వారే విధానాలను ఎంపిక చేసుకొని ఆచరిండం. ఈ లక్ష్యం బహు పెద్దదైనా కాని, సులభమైంది ఏమంటే దీర్ఘకాలంలో అందరు సంక్షేమంగా ఉండాలి. ప్రజలే ప్రజల అభివృద్ధి తెచ్చుకోవాలి. 1990లో ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం వారు మానవాభివృద్ధి నివేదికను తీసుకొస్తూ దానిలో ప్రతి రాజ్యం, ప్రాంతం అభివృద్ధిని తెలిపింది. భారత ప్రభుత్వం 2001లో అన్ని రాష్ట్రాలలో వచ్చిన మానవాభివృద్ధి సూచికలను ర్యాంకులలో తెలిపింది. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ప్రోత్సహించింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కన్నా ముందుగానే (దిగ్విజయ సింగ్ ముఖ్యమంత్రి కాలంలో) మానవాభివృద్ధి నివేదికను తయారు చేసింది.

మానవాభివృద్ధి సూచిక అనేది దీర్ఘకాలిక ఆరోగ్యకరమైన జీవనం, జ్ఞానం, మెరుగైన జీవన ప్రమాణాలతో కలిపి చేసింది. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం మానవాభివృద్ధి సూచిక అనేది అక్షరాస్యత రేటు, పాఠశాలలో హాజరు రేటు, ఆయుః ప్రమాణం, స్థూలజాతీయోత్పత్తి లో తలసరి ఆదాయంతో నిర్మించింది. 2001 నాటికి జాతీయ మానవాభివృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్ స్థానం 15 రాష్ట్రాల తర్వాత ఉంది. దక్షిణ రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మానవాభివృద్ధి సూచికలో చివరి స్థానంలో ఉంది. అఖిల భారత మానవాభివృద్ధి రేటు సగటు కన్నా ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంది. సార్వత్రికంగా అభివృద్ధిని కోస్తా ఆంధ్రాను పంజాబ్‌తో, తెలంగాణను బీహార్‌తో, రాయలసీమను రాజస్థాన్‌తో గతంలో పోల్చేవారు.

జిల్లాలవారిగా పోలిస్తే మానవాభివృద్ధి రేటులో హైదరాబాద్ ముందు నుండి మొదటి స్థానాన్ని 0.717 తో కైవసం చేసుకొంది. ఇప్పటికీ మహబూబ్‌నగర్ 0.397 తో చివరి స్థానంలో ఉంది. 2005-06 నాటికి సగటున తెలంగాణలో ఐదు జిల్లాలు (వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్), కోస్తా జిల్లాలలో (శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం), రాయలసీమ జిల్లాలో (కర్నూల్, అనంతపూర్, కడప) అట్టడుగున ఉన్నవి. ఇప్పటికి పేదరికంలో అతిగా వెనుకబడిన జిల్లాల్లో విజయనగరం, శ్రీకాకుళం, మహబూబ్‌నగర్ ఉన్నవి. హైదరాబాద్, రంగారెడ్డి, కృష్ణా, గుంటూరు అధిక మానవాభివృద్ధి రేటుతోఉన్నవి. మానవాభివృద్ధిలో, మహిళాభివృద్ధి, మహిళా సాధికారత అధికంగా లేకపోవడం కూడా తేడాగా ఉండడం గుర్తించబడింది. ఆర్థికంగా, రాజకీయంగా నిర్ణయాధికారాలు మహిళలకు లేవు. మహిళా సాధికారత సూచికను మూడింటిని బట్టి తెలుస్తుంది. అవి మహిళలు స్థానిక సంస్థలకు ఎన్నికైన సంఖ్య, మహిళలపై ఉండే హింసరేటు, బాలబాలికల సంఖ్యారేటు. మహిళాభివృద్ధి సూచికలో 2001 నాటికి రాయలసీమ జిల్లాలు కర్నూలు, కడప, అనంతపురం అతి స్వల్పస్థాయిలో ఉన్నవి. మూడు ప్రాంతాల మధ్య ఉండే తేడాలు మానవాభివృద్ధి రేటులో పెద్దగా మార్పులు రాలేదు.

మహిళా సాధికారత కొలిచే సూచికలో కృష్ణా, పడమటి, తూర్పు గోదావరి, చిత్తూరు, గుంటూరు అగ్రస్థానంలో ఉన్నాయి. అల్పస్థానంలో మహబూబ్‌నగర్, వరంగల్, కర్నూల్, ఆదిలాబాద్ ఉన్నవి . హైదరాబాద్ మానవాభివృద్ధి సూచిక, మానవ పేదరికపు సూచిక, మహిళాభివృద్ధి సూచికలలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నా, మహిళా సాధికారత కొలిచే సూచికలో 23 జిల్లాలలో 16వ స్థానంలో ఉంది. హైదరాబాద్‌లో మహిళలకు సాధికారత ప్రాధాన్యత తక్కువగా ఉంది. అంతేగాక మహిళలపై అధిక హింస, బాలికల సంఖ్య కూడా తక్కువగా ఉంది. హైదరాబాద్ నగరంలో మహిళల సంక్షేమం తక్కువగా ఉంది.

వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడిన తర్వాత కోస్తా ఆంధ్రాలో తరగతుల ఉద్యమాలు, కుల ఉద్యమాలుగా మారాయి. మహిళా ఉద్యమాలు, దళిత, ఆదివాసుల ఉద్యమాలు, రైతుల ఉద్యమాలు, ప్రాంతీయ గుర్తింపు ఉద్యమాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ అనేది ఒకపక్క ఆశ, మరోపక్క నిరాశల మధ్య ఏర్పడింది. నీటి కింద సాగుతో దక్షిణ కోస్తాంధ్రా జిల్లాలు వ్యవసాయంలో అధిక దిగుబడులతో ముందడుగు వేశాయి. రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాలు అట్టడుగున ఉన్నాయి. దానికి కారణం వర్షాధారంపై ఆధారపడడమే. మానవాభివృద్ధి రేటు పెరగడానికి సాగునీరు పరోక్షంగా ప్రథమ స్థానాన్ని తీసుకున్నది. ప్రాంతీయ అసమానతలు జిల్లాలలో ఎలా ఉన్నాయో, మానవాభివృద్ధి రేట్లు కూడా దాదాపు అలాగే ఉన్నాయని చెప్పవచ్చు.

ఆర్థికాభివృద్ధితో ప్రజల సంక్షేమం పెరుగుతుందనీ, ఆదాయాలలో, కొనుగోలు శక్తులలో సమగ్ర మార్పు వస్తుందనీ భావించబడింది. అభివృద్ధిని చిలికే విధానం వలన అన్ని వర్గాలకు ఆదాయాలు వస్తాయని భావిస్తే, అది లోపభూయిష్టంగా మారడం, దీనివలన పంపిణీ, పేదరికాలు మారలేదు. ధనికులు మరింత ధనికులు, పేదవారు మరింత పేదవారు అయ్యారు. నిజానికి సగటు తలసరి ఆదాయంలో భారతదేశం కన్నా ఆంధ్రప్రదేశ్ తక్కువగా ఉండేది. ఇప్పుడిప్పుడే 2002-05లో ఆ రేఖను దాటుతూ ఉంది. గత ఐదు సంవత్సరాల (2000-05) లో తలసరి ఆదాయం, స్థూల రాష్ట్ర ఆదాయం సంవత్సరానికి ఐదు శాతం పెరుగుతోంది. దీనికి బలమైన కారణం జనాభా రేటు తగ్గుముఖం పట్టడమే అని చెప్పవచ్చు.

అది ఆదాయం, ఆదాయం కానిది కావచ్చు, ఆరోగ్యం, విద్య, బలహీనతలు, నష్టభయాలు, ఉపాంతీకరణ, అభివృద్ధికి దూరంగా పేదవారిని పెట్టడం జరుగుతోంది. గ్రామీణ ప్రాంతంలో పేదరికమనేది 1973-74లో 48.4 శాతం నుండి 2004-05 నాటికి 11 శాతానికి తగ్గింది. జాతీయ పేదరికంలో ఆంధ్రప్రదేశ్ పేదరికం సగం మాత్రమే. నగరాల పేదరికం 1993-94 లో 37 శాతం ఉండేది. 2005 నాటికి 28 శాతం ఉంది. అంటే నగరాలలో పేదరికం అధికంగా ఉంది.

సచార్ కమిటీ నివేదిక (2006) జాతీయ సాంపుల్ సర్వే ఆధారంగా చెప్పడమేమంటే ఎస్.సి., ఎస్.టి. కలిపితే అతి పేదవారు, వారిలో 16 శాతం గ్రామీణ ప్రాంతంలోను, 41 శాతం పట్టణ ప్రాంతంలో ఉన్నారు. అలాగే ముస్లింలలో 7 శాతం గ్రామీణ పేదవారు, 35 శాతం పట్టణంవారు ఉన్నట్లు చెప్పారు. ఇతర వెనుకబడిన కులాలలో పేదరికం సమగ్ర సగటు గ్రామీణ పేదరికంలో ఉంది. నగర ప్రాంతంలో హిందువులకన్నా, ముస్లింలే అధిక సంఖ్యలో పేదరికంలో ఉన్నారు.

జాతీయ సాంపుల్ సర్వే ప్రకారం తెలంగాణలో పేదరిక సంఘటన తక్కువగా ఉంది. రాయలసీమ జిల్లాలైన అనంతపూర్, కర్నూల్‌లలో పేదరిక సంఘటన అధికంగా ఉంది. వ్యవసాయాభివృద్ధి, భూమి, వ్యవసాయకూలీల ఉత్పాదకతలు, భూమిపంపకం, వ్యవసాయేత రాభివృద్ధి, ఆహార సాపేక్ష ధరలు, ద్రవ్యోల్బణ రేటు, ఆహార నిల్వలు, కోశ వ్యవస్థలో లోటు, అభివృద్ధి వ్యయాలు, గ్రామీణ వ్యవసాయేతర ఉపాధులు, అవస్థాపన, మానవాభివృద్ధి, మహిళల సమానత, వికేంద్రీకరణలు, పేదరికపు స్థాయిలలో తేడాలకు కారణమని గట్టిగా చెప్పవచ్చు. రెండు రూపాయల కిలో బియ్యమనేది ఆహారధరల సూచికను పూర్తిగా మార్చేసింది. వినియోగదారు ధరల సూచిక 2001-06 మధ్య ఆహార వస్తువులపై క్షీణత కనపడుతోంది. సాధారణ ధరల సూచికలో ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ జాతీయ స్థాయికన్నా తక్కువగా ఉంది.

2007-08 నాటికి ఆంధ్రప్రదేశ్ రుణం - స్థూల దేశీయ ఉత్పత్తి నిష్పత్తి సూచికలో 21 రాష్ట్రాలకన్నా దిగువన ఉంది. అది 26.91 శాతం మాత్రమే. గత నాలుగు సంవత్సరాలలో వచ్చిన ఆర్థికాభివృద్ధి గ్రామీణ - పట్టణ ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ప్రయత్నం చేసింది. 2004 నుండి ప్రభుత్వం వ్యవసాయరంగం వైపు మొగ్గు చూపుతోంది. తెలంగాణలో ఏడు జిల్లాలు (రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం, హైదరాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్), ఉత్తర కోస్తాంధ్రలో రెండు జిల్లాలు (విశాఖపట్నం, శ్రీకాకుళం) ఈ మధ్య వృద్ధి రేటులను పెంచాయి. అవస్థాపన సౌకర్యాలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికి జాతీయ స్థాయి కన్నా తక్కువగా ఉంది. ద్రవ్యోల్బణం తక్కువగా ఉండడానికి కారణం ఆహార వస్తువుల ధరలు తక్కువగా ఉండడమే. ఈ మధ్యనే కోశలోటు, రెవెన్యూ లోటు తగ్గించడమయింది. ఇప్పటికి ఆంధ్రప్రదేశ్ విద్య, వైద్యరంగం మీద దేశస్థాయిలో ఖర్చులు తక్కువ చేస్తోంది. ఇప్పటికి 94 శాతం ఉద్యోగాలు ఈ రాష్ట్రంలో అసంఘటిత రంగంలో ఉన్నాయి. వీరికి ఉద్యోగ భద్రత, పని భద్రత, సామాజిక భద్రత ఉండదు. గ్రామీణ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లనే వలసలు జరుగుతున్నాయి.

ఇప్పటికీ బాల కార్మిక వ్యవస్థ బలంగా ఉన్న రాష్ట్రం మనదే. రాయలసీమ జిల్లాల్లో అది కొద్దిగా ఎక్కువే. భారతీయ సాంపుల్ సర్వే ప్రకారం 82 శాతం వ్యవసాయ కుటుంబాలు రుణగ్రస్తులు. దేశంలోనే అధిక శాతం మన రాష్ట్రమే. ప్రభుత్వ బ్యాంకులు ద్వారా 30 శాతం రైతులకు మాత్రమే రుణాలు మంజూరవుతున్నవి. ఇప్పటికీ సన్నకారు రైతుల నికరాభివృద్ధి వ్యవసాయంలో అనిశ్చితమే. ప్రభుత్వ ఆరోగ్య పథకాలను నగరవాసులే అధికంగా వాడుకొంటున్నారు. గ్రామస్తులు ఉపయోగించుకోలేక పోతున్నారు. దానికి కారణం అవస్థాపన సౌకర్యాలు లేకపోవడమే. విద్య, వైద్య సౌకర్యాలు ఆదివాసులకు ఇంకా అందలేదు. నల్లమల అడవులలో ఉండే చెంచులు ఇక కనబడరేమో.

విద్యారంగంలో కొఠారి కమిషన్ సెలవిచ్చిన ఆరు శాతం బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేకపోవడం, నగరాలలో వీధికో పాఠశాల ఉన్నా, గ్రామాల్లో పాఠశాలలు సరిగా లేకపోవడంతో విద్య ప్రియమైన వస్తువుగా మారింది.

రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం అనేక స్వయం ఉపాధి పథకాలు అమలు పరచినప్పటికి దేశ సగటుకన్నా మనం వెనుకబడి ఉన్నాం. మహిళల మీద అధికంగా హింస ఉన్న రాష్ట్రాలలో మన రాష్ట్రం కూడా ముందు ఉన్నది. మహిళలు సామాజికంగా ఎదిగినా, ఆర్థికంగా ఇప్పటికీ ఎదగలేదు. అధికంగా మహిళలు అసంఘటిత రంగంలోనే ఉన్నారు. మహిళల సాధికారత సూచిక, బాలల అభివృద్ధి సూచిక, మహిళల అభివృద్ధి సూచికలలో మొదట కోస్తా, తెలంగాణ, చివర రాయలసీమ ఉంది. 22 జిల్లాలలో 15 జిల్లాలు (హైదరాబాద్‌ను మినహాయిస్తే) పర్యావరణ సూచికలు సగటు కన్నా తక్కువ ఉన్నాయి. రంగారెడ్డి, విశాఖపట్నం జిల్లాలు అట్టడుగున ఉన్నాయి. కాలువలు, చెరువులు క్షీణించడంతో భూగర్భ జలాలపై ఉన్న రాయలసీమ జిల్లాలలో పర్యావరణం అధికంగా దెబ్బతిన్నది. క్షామం పిలువకపోయినా, వచ్చే అతిథి అతి దొడ్డ జిల్లా అనంతపురం. పంచాయతీ రాజ్ సంస్థలకు ఇప్పటికి సరైన విధులు, నిధులు (29 పద్దులు) ఇవ్వకపోవడంతో గ్రామాలు ఇప్పటికి పరాన్నజీవులుగానే ఉన్నాయి. గత యాభై సంవత్సరాలలో చేసిన తప్పులను తెలుసుకొని వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు, కొన్ని దక్షిణ తెలంగాణ, ఉత్తర కోస్తా జిల్లాలకు అభివృద్ధి ఫలాలు ఇంకా ఇవ్వాలి.

ఐక్యరాజ్య సమితి ప్రేరణతో ప్రపంచ దేశాలు, రాష్ట్ర ప్రభుత్వాలు మానవాభివృద్ధిని కొలువడానికి ప్రయత్నం చేస్తున్నాయి. 1990

తమ ప్రాంత వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికి ఎవరైనా ఉద్యమించవచ్చు కాని, మరో ప్రాంత ఆకాంక్షలకు పోటీగా వాదనలు తేవడం సరికాదంటున్నారు **మహమ్మద్ షఫీయొద్దీన్, దేవాత్ సురేష్**

ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు

అభివృద్ధికి నోచుకోలేక, పాలకుల నిర్లక్ష్యానికి గురై, పేదరికంతో బాధపడుతూ, తాగు, సాగు నీటికి సకల ఇబ్బందులు ఎదుర్కొంటూ నిధుల పంపిణీలో సమాన వాటా రానందుకు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటును కోరుకుంటున్నామని రాయలసీమ నాయకులు ప్రకటిస్తే అందులో అర్థం పరమార్థం ఉన్నాయి. అలా కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తే మాకు కూడా రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం కావాలి అనే వాదన కేవలం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని నీరుకార్చడానికి మాత్రమే కొందరు స్వార్థపూరిత రాజకీయ నాయకులు తెరమీదికి తెస్తున్నారనేది తెలంగాణ గడ్డపై పుట్టిన సగటు పౌరునికి సైతం అర్థమయిపోయింది.

పైగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే, ఆంధ్ర ప్రాంతం వారితో కలిసి సహవాసం చేయడం మరింత కష్టమవుతుంది అనే రాయలసీమ ప్రాంతం వారి వాదన మరీ వింతగా, విడ్డూరంగా ఉంది. ఈ వాదన రాయలసీమ, ఆంధ్రప్రాంతాలు రెండు కలిసి తెలంగాణ ప్రాంతాన్ని దోచుకోవడానికి, ఇక్కడున్న వనరులను తరలించుకోవడానికి చేసే వాదన తప్ప మరేది కాదు. ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాలు కలిసి ఉండటానికి లేక విడిపోవడానికి తెలంగాణ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేదు. అయినా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వాదన నినాదం ఈ రోజు కొత్తగా పుట్టుకొచ్చింది కాదు. కొంతమంది స్వార్థపూరిత రాజకీయ నాయకులు పబ్బంగడుపుకోవడానికి ఆవిర్భవించింది కాదు. 1969లో అంటే ముప్పై తొమ్మిది సంవత్సరాల క్రితం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున నింగికెగసి, ఒక్కసారిగా కనుమరుగయిపోయిన విషయం. ఆనాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని నీరు కార్చడానికి తెలంగాణ ప్రాంత రాజకీయ నాయకులు, కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులకు అమ్ముడుపోయారన్నది చారిత్రక సత్యం. కాని ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఉద్యమం ప్రారంభమయింది ఇటీవలనే అనేది మరచిపోరాదు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ సందర్భంగా తెలంగాణ ప్రాంతంలోని కొంతమంది నాయకుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తెలంగాణ పేద ప్రాంతాన్ని ధనిక ఆంధ్రప్రాంతంతో విలీనం చేయడం తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ఆటంకమని ఆనాటి ప్రధాని నెహ్రూ అన్నారు.

మొదట ఆంధ్రరాష్ట్ర రాజధానిగా కర్నూలును, తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణతో రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించారు. అప్పటి రాయలసీమ నాయకులు కర్నూలును రాజధానిగా కొనసాగించవలసిందిగా ఎందుకు పట్టుబట్టలేదో తెలియాలి? ఆంధ్ర ప్రాంతంవారు కూడా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు లాంటి పట్టణాలను రాజధానిగా చేయాలని ఎందుకు కోరలేదు. ఈ రాజకీయాలన్ని కూడా తెలంగాణ ప్రాంతంపై ప్రేమతో చేసినవి మాత్రం కావు. హైదరాబాద్‌ను రాజధానిగా చేసుకొని మిగతా తెలంగాణ ప్రాంతాన్ని తమ అవసరాలకు వినియోగించుకుందామనే కుట్రలో భాగంగా, ఆనాటి నిజాం ప్రభువులు అనేక కట్టడాలు, చెరువులు, దేశంలోనే ప్రధాన నగరాలకు ధీటుగా హైదరాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈ నగరంపై రాయలసీమ, ఆంధ్ర ప్రాంతంవారి దృష్టిపడింది. ఆ అభివృద్ధిని సొమ్ము చేసుకోవాలని, హైదరాబాద్‌ను అడ్డాగా చేసుకొని మిగతా తెలంగాణ ప్రాంతాన్ని తమ అవసరాలకు గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలనే కుట్రలో భాగమే ఆనాటి మౌనానికి కారణం కావచ్చు. రాయలసీమ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఉమ్మడి నిధులతో 'తెలుగుగంగ' పథకాన్ని కోట్లాది రూపాయల ఖర్చుతో పూర్తి చేసిన సందర్భంగా తెలంగాణ నాయకులు అభిమానంతో ఆప్యాయతతో సోదరభావంతో తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలనే ఉద్దేశ్యంతో

దశకంలోనే దిగ్విజయసింగ్ ప్రభుత్వం మధ్యప్రదేశ్‌లో మొదట చేపట్టింది. ఒక దశాబ్దం తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయడం వలన బలాలు, బలహీనతలు, అవకాశాలు, ముప్పులను గురించి ప్రభుత్వాలకు ఒక అవగాహన వచ్చింది. ఆంధ్రప్రదేశ్ భౌగోళికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మూడు విభిన్న ప్రాంతాలుగా ఉంది. ఈ మూడింటిని ఒక తాటిమీదకు తీసుకొని రావాలంటే సాగునీరు, విద్య, అభివృద్ధి కీలకమైన సాధనాలు. అన్ని సూచికలలో ఆంధ్రప్రదేశ్, దేశం స్థాయిలో ఇప్పటికీ అట్టడుగునే ఉన్నదని నివేదిక గట్టిగా చెప్పింది. గ్రామాలే పట్టణీకరణ దిశగా మారాలని కోరింది. బాలికలకు తప్పనిసరి విద్య, మహిళా సాధికారత, ఉపాధులు మహిళలకు సమాన వాట, ఆస్తి హక్కు, స్వేచ్ఛ ఇంకా విస్తృత పరచవలసిన నైతిక బాధ్యత ప్రభుత్వాలకు, స్వచ్ఛంద సంస్థలకు, పౌరులకు ఉన్నదని ఈ నివేదిక చెపుతోంది. ఏది ఏమైనా రాష్ట్రంలో రాయలసీమ జిల్లాల జీవన వైవిధ్యంలో చివరి దశలోనే ఉండడం దురదృష్టకరం.

(మానవాభివృద్ధి నివేదిక ఆంధ్రప్రదేశ్ 2007, ఆర్థిక, సామాజిక - అధ్యయన కేంద్రం, హైదరాబాద్ వారి సౌజన్యంతో.) వీ

సహకరించారు. కాని తెలంగాణ నాయకులు స్వార్థపూరితంగా ఆలోచించి ఉంటే ఆనాడే తెలుగుగంగకు అడ్డుకట్ట వేసి రాజకీయం చేసేవారు.

నీలం సంజీవరెడ్డి, నారా చంద్రబాబునాయుడు, వై.ఎస్. రాజశేఖరరెడ్డి మొదలైనవారు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కీలక స్థానాల్లో ఉండి చాలా సంవత్సరాలు రాష్ట్రానికి తమ పరిపాలనను అందించారు, అందిస్తున్నారు కూడా. వీరందరు కూడా రాయలసీమ ప్రాంతం వారే. వీరి పాలనకు తెలంగాణ ప్రజలు ప్రాంత భేదాల్ని మరిచిపోయి సంపూర్ణ మద్దతును ఇచ్చారు. ఈ విషయాన్ని రాయలసీమ నాయకులు కాదని చెప్పగలరా? వీరందరు కీలక పదవుల్లో ఉండగా రాయలసీమ ప్రగతికి వీరు మాత్రం సహకరించలేదని రాయలసీమ నాయుకులు చెప్పగలరా? ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి రాయలసీమ ప్రాంతానికి చెందినవారే అయినా తెలంగాణ ప్రజలు వై.ఎస్. రాజశేఖరరెడ్డికి నీరాజనాలు పట్టలేదని రాయలసీమ నాయకులు బాహాటంగా చెప్పగలరా?

తెలంగాణ ప్రాంతం నుండి రాజకీయ రంగంలో ఉన్నత శిఖలకు ఎదిగిన ఏకైక వ్యక్తి పి.వి. నర్సింహారావు. ఈయన ప్రధాని అయిన తరువాత తెలంగాణ ప్రాంతంలోని తను పుట్టిన గడ్డ అయిన కరీంనగర్ జిల్లాను మరిచిపోయి రాయలసీమ ప్రాంతంలోని నంద్యాల నుండి పోటీ చేసిన విషయం వాస్తవం కాదా? మీ ప్రతినిధిగా నంద్యాల నుండి ఎన్నికై సీమ సందులన్నీ సుందరంగా మార్చిన సందర్భాన్ని రాయలసీమ నాయకులు కాదనగలరా?

రాయలసీమ ప్రాంతం నుండి పుట్టుకొచ్చిన నాయకుడు నారా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి తొమ్మిది సంవత్సరాల పాలన అందించారు. వియ్యాలు, కయ్యాలతో దగ్గరి సంబంధాలు కలిగి ఉన్న రాయలసీమ, కోస్తా ప్రాంత రాజకీయ నాయకులు తెలంగాణ ప్రాంతం వేరు పడితే మేము వేరు పడతామని ప్రకటించటం కేవలం దురుద్దేశ పూర్వకమైనదిగా తేటతెల్లమవుతోంది.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఏనాడు కూడా రాయలసీమ పదం ఉచ్చరించలేదు. ఆంధ్ర వలసవాదుల దోపిడీతో తెలంగాణ తల్లడిల్లి పోతోందని మాత్రమే తెలంగాణ ప్రజలు నినదించారు. ఇప్పటికీ అదే నినాదానికి కట్టుబడి ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ వాదన నిజం కాదు అని కోస్తా ప్రాంతం వారు ముందుకు రాగలుగుతారా? ఒకవేళ అదే నిజమైతే మనం వేరుగా ఉందామన్న వాదన, కోస్తా ప్రాంతం వారి నుండి రావాలి? ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వాదన ఆంధ్ర ప్రాంత ప్రజలకు కోపం తెప్పించడం లేదు. కాని రాయలసీమ నాయకులకు చిరాకు కలుగుతోంది.

రాయలసీమలో ఉన్నవి నాలుగు జిల్లాలు మాత్రమే. కోస్తాలో ఉన్నవి తొమ్మిది జిల్లాలు మాత్రమే. కాని తెలంగాణలో ఉన్నవి పది జిల్లాలు. ఈ పది జిల్లాలకు ప్రత్యేక రాష్ట్రం కోరితే చిన్న రాష్ట్రాలు దేశానికి అనారోగ్యం అని వాదించిన రాయలసీమ నాయకులు కేవలం నాలుగుజిల్లాల కోసం ప్రత్యేక రాష్ట్రం కోరడం ఎంతవరకు సమంజసంగా ఉందో వారే వివరించాలి? తెలంగాణ ప్రాంత ప్రత్యేకవాదంతో నాయకులు ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల అభిప్రాయాన్ని అడిగారు. ఎన్నికల్లో ప్రత్యేక తెలంగాణ వాదానికి ప్రజలు నీరాజనాలు పలికారు. కాని రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర వాదంతో ఎప్పుడయినా రాయలసీమ నాయకులు ఎన్నికల్లో పోటీ చేశారా? ప్రజల తీర్పును కోరారా?

ప్రగతిపరంగా చూస్తే రాయలసీమలో నాలుగు జిల్లాలకే ఐదు విశ్వవిద్యాలయాలున్నాయి. 1) శ్రీ వెంకటేశ్వర, 2) శ్రీ కృష్ణదేవరాయ, 3) ద్రవిడ, 4) యోగివేమన, 5) పద్మావతి మహిళా మొదలైన విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. కాని పది జిల్లాలు గల తెలంగాణకు మాత్రం ఆరు విశ్వవిద్యాలయాలే ఉన్నాయి. 1) ఉస్మానియా, 2) కాకతీయ, 3) తెలంగాణ, 4) పాలమూరు, 5) శాతవాహన, 6) నల్లగొండ. అందులో ఒక విశ్వవిద్యాలయం రాష్ట్ర రాజధానిలో ఉండి అన్ని ప్రాంతాల విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నది. తెలంగాణ, పాలమూరు, శాతవాహన, నల్లగొండ మొదలైన విశ్వవిద్యాలయాలు తెలంగాణ ఉద్యమ ఫలితంగా ఏర్పడినవి. ఇటీవలనే ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయాలకు కేటాయించిన నిధులలో కూడా వివక్ష కండ్లకు కట్టినట్టు కనిపిస్తోంది.

నాటి నీలం సంజీవరెడ్డి మొదలుకొని నేటి వై.ఎస్. రాజశేఖర రెడ్డి వరకు ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించినది రాయలసీమ ప్రాంత నాయకులే కదా? వారి ప్రాంత ప్రగతిని మరిచిపోయినందుకు నాయకులను నిలదీయవలసిన అవసరం రాయలసీమ ప్రాంత ప్రజలకు ఉంది. కాని ఇదంతా మరిచిపోయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఎందుకు కాలు అడ్డు పెడుతున్నారో వారికే అర్థం కావాలి. రాయలసీమ ప్రాంతం రాళ్లతో నిండిపోయి, కరువుతో ఎండిపోయి ఉందన్న వాస్తవాన్ని అందరు గుర్తిస్తారు. కాని ఆ రాళ్లనే దేవుళ్లుగా మలచుకొని, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి భక్తులను ఆకర్షిస్తూ, ధనం సంపాదిస్తున్న శ్రీశైలం, తిరుపతి, శ్రీకాళహస్తి, మంత్రాలయం, పుట్టపర్తి, హార్స్‌లీహిల్స్, బ్రహ్మంగారి మఠం, అవుకు, అహోబిలం, కాణిపాకం, లేపాక్షి మొదలైన వాటిలోనుండి ఎవరికి ఎంత ఖర్చు పెడుతున్నారో రాయలసీమ నాయకులకు, పాలకులకు మాత్రమే తెలుసు. ఏనాడు కూడా వాటా అడిగే పాపానికి తెలంగాణ ప్రజలు దిగజారలేదు. దేవాలయాల పేరుతో కోట్లాది రూపాయలను సమీకరించి రాయలసీమ ప్రాంతం వారు మాత్రమే ఉపాధి సౌకర్యాలను పొందుతున్నారని తెలంగాణ ప్రజలు ఏనాడు బాధపడలేదు.

తెలంగాణలోని బాసరలో గల సరస్వతి దేవాలయం దేశంలోనే రెండవది, ప్రధానమైనది. ఇక్కడ ఐఐటి స్థాపిస్తే తిరుపతిని మించి పోతుందనే దురుద్దేశంతో, తెలంగాణ ప్రజలు ఉపాధిని, ఆదాయాన్ని పొందుతారనే స్వార్థంతో రాయలసీమ ప్రాంత నాయకులకు అనుకూలంగా ఉండే మెదక్ జిల్లాలో పెట్టడానికి ప్రణాళిక వేశారు. మరోవైపు తెలంగాణ ప్రజలను విభజించి పాలించడానికి కుట్రపన్నారు.

రాయలసీమ, తెలంగాణ రెండు ప్రాంతాలూ అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలే. ఈ రెండు ప్రాంతాలవారు గొడవ పడితే మధ్యలో కోస్తా ఆంధ్ర ప్రాంతం వారు బాగుపడతారు. ఈ వైరాన్ని ఇలాగే కొనసాగేలా ఆంధ్ర ప్రాంత నాయకులు తమ వ్యూహాన్ని రచిస్తారు. కాబట్టి తెలంగాణ, రాయలసీమ ప్రాంత నాయకులు ఒకరి ఉద్యమానికి మరొకరు అడ్డు రాకుండా ఉద్యమాన్ని కొనసాగించినట్లయితే ఇరువర్గాలకు మంచి జరుగుతుంది. వీ

బడ్జెట్ అమలులో రాసుకున్న వాటికి, అమలు చేసిన వాటికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ, గత, ప్రస్తుత ప్రభుత్వాల విధానాలు ఒకటేనని విశ్లేషిస్తున్నారు **వి. హనుమంతరావు**

ఆదాయ వ్యయాలు సరిగా చూపలేని ప్రభుత్వాలు

పచ్చ కామెర్లున్న వాడికి అంతా పచ్చగా కనపడుతుందన్నట్లు తెలుగుదేశం పార్టీకి వై.ఎస్. పాలన అంతా వైఫల్యాల పుట్టగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. నాకూ పచ్చ కామెర్లున్నాయి. నేను అంకెలు, గణాంకాల మనిషిని కాబట్టి నేనూ అంకెల కళ్లద్దాలతో దేనినైనా చూస్తా. ఈ అంకెలన్నీ తప్పుడుతడకలు. అలాంటి అంకెలతో ఒక పరిణామాన్నిగాని, ఒక ప్రభుత్వాన్ని గాని విశ్లేషిస్తే వచ్చే ఫలితం అంతే తప్పుల తడకలా ఉంటుందని నన్ను కొంతమంది మిత్రులు ఎద్దేవా చేస్తుంటారు. ఏం చెయ్యాలి? గణాంకాలకు ప్రభుత్వం తప్ప మరో మార్గం లేదు. అయితే ప్రభుత్వ పథకాలను భూతద్దంలో చూసి మంచి చెడ్డా చెప్పే సంస్థలు, సర్వేలున్నాయి. వాటిల్లో కొన్ని ప్రభుత్వ కళ్లద్దాల్లో నుంచి చూసేవి ఉన్నాయి. ఏదైనా పరిణామమో, సంఘటనో జరిగినపుడు దాని గురించి ప్రజల స్పందన ఏమిటి అని ప్రతిరోజూ పాఠకులకు మెదడుకు మేతవేసి ఇదిగో ఇంత శాతం మంది అనుకూలం, లేదా ప్రతికూలం అని ప్రకటన చేస్తుంటాయి. అలా స్పందించిన వారు మొత్తం ఎంత మందో ఆ పత్రికలు చెప్పే కేవలం నలుగురే జవాబిచ్చినా ముగ్గురు అనుకూలంగా ఒకరు వ్యతిరేకంగా స్పందిస్తే 75 శాతం అనుకూలం 25 శాతం ప్రతికూలం అని ఫలితాన్ని ప్రకటించి అదే ప్రజాభిప్రాయం అన్న భావాన్ని కలిగిస్తాయి పత్రికలు. అందులోనూ పత్రికలన్నీ ఏదో పార్టీ కొమ్ముకాస్తున్న ఈ రోజుల్లో ఈ స్పందనలను నమ్మడానికి వీల్లేదు. మరేం చెయ్యాలి? ప్రభుత్వ లెక్కలను కాసి, వడపోసి ఇది తప్పు, ఇది రైటు అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పే కాగ్ నివేదికలే ఉన్నంతలో ఆధారపడదగినవని నేను భావిస్తా. ఆ నివేదికల్లో రెండు రకాల సమాచారం ఉంటుంది. ఆదాయ వ్యయాల తీరుతెన్నులు, లోటుపాట్లు ఒకటి, ఆ ఖర్చుల్లో అవకతవకలు రెండవది. రెండూ ప్రభుత్వాన్ని ఎండగడతాయి. ఇటీవల శాసనసభ సమావేశం చివరి రోజున సభ్యులకు అందచేసిన కాగ్ నివేదికలో రెండవ రకం సమాచారం గురించి పత్రికలు పతాక శీర్షికలతో ప్రకటించాయి కాబట్టి దాని జోలికి పోకుండా వై.ఎస్. నాలుగు సంవత్సరాల పాలనలో (2005-2008) ఆదాయ వ్యయ ధోరణులెలా ఉన్నాయి, ఆయన నిర్వహణ అధ్వాన్నంగా ఉందని తెలుగు దేశం పార్టీ ప్రధాన విమర్శ కాబట్టి ఆ పార్టీ ప్రభుత్వంలో నాలుగేళ్ల ఈ నిర్వహణ ఎలా ఉంటూ వచ్చింది అనే విషయానికి పరిమితమై విశ్లేషించాలి.

2004 శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాగా ఆ సంవత్సరంలో సగంకాలం తెలుగుదేశం, రెండవ సగం కాలంలో కాంగ్రెస్ పాలించాయి కాబట్టి, ఆ సంవత్సరానికి ముందు మూడేళ్లు (2001-02 నుంచి 2003-04 వరకు), తర్వాత మూడేళ్లు (2005-06 నుంచి 2007-08 వరకు) పోల్చి చూస్తే ఎవరు ఎంత మేరకు సమర్థవంతంగా లేదా అసమర్థవంతంగా ద్రవ్య పరిస్థితిని మేనేజ్ చేసారో అర్థమవుతుంది. త్వరలో రాబోయే సాధారణ ఎన్నికల్లో రెండు పార్టీలు ఢీ అంటే ఢీ అని తలపడుతున్నాయి. కాబట్టి ఓటర్లు ఎవరికి ఓటు చేయాలి అనే ఒక నిర్ణయానికి రావడానికి ఈ విశ్లేషణ తోడ్పడుతుంది.

రాష్ట్ర రెవెన్యూ ఆదాయం మొదటి మూడేళ్లలో రు. 5024 కోట్ల మేరకు పెరిగితే, రెండవ త్రైమాసికంలో రు. 19292 కోట్ల మేరకు పెరిగింది. అంటే మొదటి త్రైమాసికంలో సంవత్సరానికి సగటున రాష్ట్ర రెవెన్యూ ఆదాయం రు. 1675 కోట్లు పెరగగా, రెండవ త్రైమాసికంలో రు. 6431 కోట్లు పెరిగింది. రెవెన్యూ ఆదాయంలో పన్నుల ఆదాయం ప్రధానం కాబట్టి ఆ రాబడులు చూస్తే మొదటి కాలంలో రు. 9296 కోట్ల మేరకు పెరగగా, రెండవ కాలంలో రు.17243 కోట్ల మేరకు పెరిగింది. అంటే కాంగ్రెస్ పాలనలో హాట్ హాట్‌గా వృద్ధి జరిగిందన్నమాట. మరీ హాట్‌గా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, స్టేట్ ఎక్సైజ్ పన్నులను ప్రజలు చెల్లించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగటం వల్ల మొదటి పన్ను. తాగుడు పెంచడం వల్ల, బెల్ట్ షాపుల వల్ల రెండోది పెరిగి, పేదవాడి పొట్ట కొట్టింది. సరే, అమ్మకం పన్ను నిర్విరామంగా, ఇటీవల వ్యాట్ వల్ల పెరిగింది. ఈ హెచ్చుతగ్గులకు ప్రకృతి ఒక కారణం. దేశం పాలన చివరి సంవత్సరాల్లో వర్షాభావం వల్ల వికటిస్తే, పుష్కలంగా వర్షాలు పడడం వల్ల కాంగ్రెస్ లాభపడింది. కాగా, పన్ను ఆదాయం మందగమనానికి తెలుగుదేశాన్ని బోనులో నిలబెట్టలేం.

రాజ్యాంగం ప్రకారం కేంద్రం వసూలు చేసే పన్నులు, సుంకాల్లో అన్ని రాష్ట్రాలకు ఫైనాన్స్ కమిషన్ సిఫార్సు మేరకు వాటా ఉంటుంది. ఈ వాటా మొదటి కాలంలో రు. 1008 కోట్లు పెరిగితే, రెండవ కాలంలో రు. 4233 కోట్లు పెరిగింది. ఇలా పెరగడంలో రాష్ట్రాల మెహర్బానీ ఏమీలేదు. రెండవ కాలంలో ఆర్థికాభివృద్ధి అనూహ్యంగా పెరగడంతో దానిలో నిర్ణీత శాతంగా రాష్ట్రం వాటా పెరిగింది. అయితే

ఎన్.టి. రామారావు అన్నట్లు కేంద్రం అనేది మిథ్య. కేంద్ర పన్నులన్నీ రాష్ట్రాల్లో వసూలు చేసేవే. అందుచేతనే తమకు కేంద్రం పన్ను ఆదాయంలో రాష్ట్రాలకు యాభై శాతం ఇవ్వాలని పార్టీలకు సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. కాని ఫైనాన్స్ కమిషన్లు ఒక శాతం లేక రెండుశాతం మాత్రమే పెంచుతూ వచ్చాయి. ప్రస్తుతం పదకొండవ ఫైనాన్స్ కమిషన్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాల గురించి రెండు కమిషన్లు పని చేస్తున్నాయి. వాటి సిఫార్సులు, వాటిపై ప్రభుత్వ నిర్ణయాల కోసం ఎదురు చూడడం తప్ప చేసేదేమీలేదు.

కేంద్రం రాష్ట్రాలకిచ్చే గ్రాంట్ విషయంలో కేంద్రంతో బేరాలాడడానికి రాష్ట్రాలకు అవకాశముంది. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సుల మేరకు గ్రాంట్లు ఇస్తూనే, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందో, ఆ పార్టీ పరిపాలించే రాష్ట్రాల ప్రభుత్వాలు తమ పలుకుబడినుపయోగించే ఎక్కువ మోతాదులో గ్రాంట్లు గుంజుకోవచ్చు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం మీద, ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో యుపిఏ ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి నెగ్గుకు వచ్చే అవకాశముంది. అయినా దేశం మొదటి కాలంలో రు. 1074 కోట్లు మాత్రం రాబట్టుకోగలిగితే, కాంగ్రెస్ ప్రభుత్వం రు. 3099 కోట్లు సంపాదించుకోగలిగింది.

తెలుగుదేశం ప్రభుత్వం ఆఖరు సంవత్సరం 2003-04లో రు. 10,627 కోట్లు అప్పు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం 2007-08లో రు. 11,132 కోట్లు అప్పు తెచ్చింది. భూమి పన్ను వసూళ్ల విషయంలో ఇద్దరూ దొందూదొందే. ఏ సంవత్సరంలోనూ రు. 150 కోట్లు మించలేదు. ఒక సంవత్సరంలో అయితే (2001-02) వసూలు చేసింది రు. 22 కోట్లు మాత్రమే. మనది ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రం. భూమి పన్ను తీసేసి నీటి తీరువాయే చెల్లించమన్నారు. లక్షల ఎకరాల మీద పన్ను వసూళ్లు ఇంతేనా?

తెలుగుదేశం పాలన మూడేళ్లలో రెవెన్యూ ఖర్చు రు. 25,488 కోట్ల నుంచి రు. 30,640 కోట్లకు, అంటే రు.5,152 కోట్ల మేరకు పెరిగితే, కాంగ్రెస్ పాలనలో రు. 35,327 కోట్ల నుంచి రు. 53,984 కోట్లకు, అంటే రు. 18,747 కోట్ల మేరకు పెరిగింది. రెవెన్యూ ఆదాయం, వ్యయం ఆయా సంవత్సరాల్లో ఎలా పెరుగుతూ వచ్చిందో పట్టిక తెలియచేస్తుంది.

సంవత్సరం	రెవెన్యూ ఆదాయం (రు. కోట్లలో)	రెవెన్యూ ఖర్చు (రు. కోట్లలో)
తెలుగుదేశం పాలన		
2001-02	21845	25488
2002-03	23003	26925
2003-04	26869	30640
కాంగ్రెస్ పాలన		
2005-06	34851	35237
2006-07	44245	41438
2007-08	54143	53984

ఈ పట్టిక తెలియచేస్తున్నదేమంటే తెలుగుదేశం హయాంలో మూడేళ్లలో రెవెన్యూ ఆదాయం అయిదు వేల కోట్లు పెరిగితే, కాంగ్రెస్ పాలనలో ప్రతి సంవత్సరం పది వేల కోట్ల మేరకు పెరిగి, మొత్తం ఇరవై వేల కోట్లు పెరిగింది. ఖర్చు విషయంలో తెలుగుదేశం ప్రభుత్వంలో అదే కాలంలో అయిదు వేల కోట్లు పెరగగా, కాంగ్రెస్ పాలనలో 18 వేల కోట్ల మేరకు పెరిగింది. ముఖ్యమైన మార్పు ఏమిటంటే కాంగ్రెస్ పాలన చివరి రెండేళ్లలో దశాబ్ద కాలం తర్వాత రెవెన్యూపద్దు కింద మిగులు చూపించింది.

మరో విశేషమేమిటంటే 2007-08లో పెట్టుబడి ఖర్చు, అంతకు ముందు సంవత్సరం కన్నా 29 శాతం పెరగడం. పెట్టుబడి ఖర్చు పెరగడం అంటే ప్రభుత్వ ఆస్తులు పెరగడం అని అర్థం. అయితే ఈ పెట్టుబడి ఖర్చు పెరగడానికి ప్రధాన కారణం నీటి పారుదల మీద ఎక్కువ పెట్టుబడులు పెట్టడం. మామూలుగా అయితే ఆహ్వానించదగిందే కాని నీటి పారుదల పథకాల మీద ఖర్చు పెరిగినా, నీరు పొలాల్లో పారిందా అనేదే ప్రశ్న.

కాగ్ నివేదిక చెపుతున్నదేమంటే 2007-08లో బడ్జెట్‌లో చేసిన కేటాయింపు రు. 88,450 కోట్లయితే ఖర్చు చేసింది రు. 75,341 కోట్లు. ఇదేమిటి ఒక పక్క నిధుల కొరత అంటారు, రెండోపక్క కేటాయించిన డబ్బే పూర్తిగా ఖర్చు చేయలేకపోవడమేమిటి? ఇన్నాళ్లు లోటు బడ్జెట్లే, అంటే ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ. ఖర్చులెక్కువ కావడానికి ఒకే కారణం; బొక్కసంలో డబ్బులేక పోడమే. 2007-08లో ఏయే పద్దుల కింద ఖర్చు చేయకుండా ఆదా చేసారో చూడబోతే పాఠశాల విద్య పద్దు కింద రు. 1396 కోట్లు, గృహనిర్మాణ పద్దు కింద రు. 2276 కోట్లు, పంచాయతీరాజ్ పద్దు కింద రు. 670 కోట్లు, భారీ మధ్యతరగతి నీటి ప్రాజెక్టుల పద్దు కింద రు. 793కోట్లు ఖర్చు కాకుండా మురిగిపోయాయి. ఈ మంత్రిత్వ శాఖలు నిధుల కొరతతో సతమతమవుతుండగా, ఆదా చేయడమా? వీటికన్నా దారుణమైన విషయమేమిటంటే ఏ శాఖలయితే మొత్తం ప్రభుత్వ పగ్గాలు చేతిలో ఉంటాయో, ఆ ఆర్థిక ప్రణాళిక శాఖలలోనే రు. 3949 కోట్లు ఖర్చు కాక పోవడం. 2004-05లో సరిగ్గా ఇదే పద్దు కింద ఖర్చు కాకపోవడం జరిగింది. ఇదేనా సుపరిపాలన అంటే? 2007-08లో నీటి పారుదల పద్దు కింద సుమారు రు.800 కోట్లు ఎందుకు ఆదా అయ్యాయి అంటే ఆ మొత్తాన్ని జలయజ్ఞం కోసం అడ్వర్టయిజ్‌మెంట్లకు ఖర్చయిందని జవాబు. దాని మీద వేరే వ్యాఖ్య అనవసరమనుకొంటా.

ఇది గుడ్ గవర్నెన్స్ కాదు బాడ్ గవర్నెన్స్ అని ఏ సంవత్సరం కాగ్ నివేదిక చూసినా క్రమం తప్పకుండా దర్శనమిస్తాయి. ప్రధాన ప్రతిపక్షం నోరు విప్పితే ప్రభుత్వ వైఫల్యం అనే మాట విధిగా వినబడుతుంది. ఈ విషయంలో మాత్రం ఇద్దరిలో ఎవరూ ఎవరికీ తీసిపోరు. ప్రతి కాగ్ నివేదికలో విధిగా కనిపించే హెడ్డింగులు చూడండి. కేటాయింపు కన్నా ఎక్కువ ఖర్చు (1997-98 నుంచి 2006-07 మధ్య కాలంలో బడ్జెట్‌లో చేసిన కేటాయింపు కన్నా రు.13,053 కోట్లు ఎక్కువ ఖర్చును రెగ్యులరైజ్ చేయలేదు.) అవసరం లేకున్నా సప్లిమెంటరీ గ్రాంట్స్, ఒకే పద్దు కింద ఉప పద్దుల కోసం కేటాయించిన మొత్తాన్ని మరో ఉపపద్దుకు బదలాయించడం, అసలు బడ్జెట్‌లో కేటాయింపు లేకపోయినా ఖర్చు చేయడం, ఆర్థిక సంవత్సరం ఆఖరున ఖర్చు కాకుండా

ఉన్న మిగుళ్లను ఆయా శాఖలు ప్రభుత్వానికి వాపస్ ఇవ్వకపోవడం లేదా సంవత్సరం ఆఖరు రోజున వాపస్ చేయడం (ఇందువల్ల నిధులు అవసరమైన ఇతర శాఖలకు బదలాయించ లేకపోవడంతో మురిగిపోవడం, ఆదా చేసిన సొమ్ము కన్నా తక్కువ సొమ్మును ప్రభుత్వానికి సరెండర్ చేయడం, ఖాళీ అని ప్రకటించిన పోస్టులకు కూడ జీతాల కోసం బిల్లులు పంపడం, అనుకోని అవసరం ఏర్పడినప్పుడు ఖర్చు చేయడానికి ఉన్న నిధి నుంచి ఏదో ఖర్చు చేయాల్సి వస్తుందని ముందే ఆ నిధి నుంచి డబ్బు తీసుకోవడం - ఈ లిస్టు చాంతాడంతా పొడవుంది), ఆఖరుగా శాసనసభ బడ్జెట్‌ను ఆమోదిస్తూంది; ఆ కేటాయింపులకు లోబడి ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. చేసిన ఖర్చులకు ఎకౌంటు రాయాలి. అదే సమయంలో ప్రభుత్వ ఖర్చుల వివరాలు ఎకౌంటెంట్ జనరల్‌కు చేరుతాయి. ఈ రెండు ఎకౌంట్లను తరచి సరిచూసుకోవాలి. అలా సరిచూసుకోక పోవడం వల్ల రు. 55,160 కోట్లు రీకన్సైల్ కాకుండా ఉండిపోయింది. (మొత్తం బడ్జెట్ రు. 88,451 వేల కోట్లు.) అంటే 62.36 శాతం. ఈ శాతం 2004-05లో 32.46. పరిపాలన యంత్రాంగం మీద మంత్రివర్గం పట్టు తప్పుతుందా? పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చూసుకుంటుందని సమర్థించుకొంటారా?

అప్పు చేయనిదే అభివృద్ధి సాధ్యం కాదంటూ వచ్చారు చంద్రబాబు. అభివృద్ధి మాట అలా ఉంచండి. వేల కోట్లు ప్రతి సంవత్సరం అపుడు తెలుగుదేశం, ఇపుడు కాంగ్రెస్ రుణం తెస్తూ

ద్రవ్య ఆరోగ్య సూచికలు (శాతంలో)

ద్రవ్య సూచికలు	2002-03	2003-04	2004-05	2005-06	2006-07	2007-08
1. వనరుల సమీకరణ						
స్థూల రాష్ట్రాదాయంలో రెవెన్యూ ఆదాయం వాటా	13.7	14.1	13.7	14.8	16.4	17.4
రెవెన్యూ వృద్ధి	0.758	1.243	0.683	1.727	1.924	1.414
స్థూల రాష్ట్రాదాయంలో సొంత పన్నుల ఆదాయం	7.5	7.2	7.7	8.1	8.9	9.2
సొంత పన్నుల వృద్ధి	1.320	0.697	1.730	1.493	1.751	1.286
2. వ్యయ నిర్వహణ						
స్థూల రాష్ట్రాదాయంలో మొత్తం వ్యయం	18.5	18.6	18.2	18.3	19.4	22.4
రెవెన్యూ ఆదాయం / మొత్తం వ్యయం నిష్పత్తి	74.0	75.5	75.0	80.43	84.7	77.7
రెవెన్యూ వ్యయం / మొత్తం వ్యయం నిష్పత్తి	86.6	86.1	84.0	81.32	79.3	77.4
ప్రణాళికా వ్యయం / మొత్తం వ్యయం నిష్పత్తి	27.7	30.3	30.9	32.73	37.2	38.4
మూలధన వ్యయం / మొత్తం వ్యయం నిష్పత్తి	9.4	9.7	12.0	16.94	19.0	18.3
అభివృద్ధి వ్యయం / మొత్తం వ్యయం నిష్పత్తి	59.5	60.7	60.7	66.54	67.8	69.3
మొత్తం వ్యయం - రెవెన్యూ ఆదాయం వృద్ధి	1.01	0.86	1.10	.0642	0.763	1.49
రెవెన్యూ వ్యయం - రెవెన్యూ ఆదాయం వృద్ధి	1.064	0.821	0.700	0.454	0.653	1.35
3. ద్రవ్య అసమతౌల్యపు నిర్వహణ						
రెవెన్యూ లోటు (రు. కోట్లలో)	3922	3711	3387	386	--	--
ద్రవ్య లోటు (రు. కోట్లలో)	7625	7450	8192	8300	5644	8786
ప్రాథమిక లోటు (రు. కోట్లలో)	1494	594	1101	1292	--	1197
రెవెన్యూ లోటు / ద్రవ్య లోటు నిష్పత్తి	51.4	50.6	41.3	4.65	--	--
4. ద్రవ్య బకాయిల నిర్వహణ						
స్థూల రాష్ట్రాదాయంలో ద్రవ్య బకాయిలు	32.6	33.8	35.7	34.2	33.2	31.2
ద్రవ్య బకాయిలు / రెవెన్యూ ఆదాయం నిష్పత్తి	238.4	240.2	258.4	228.25	195.8	179.8
ద్రవ్య బకాయిలు - రెవెన్యూ ఆదాయం వృద్ధి	2.939	1.054	2.156	0.615	0.330	0.554
ద్రవ్య బకాయిలు - సొంత పన్నులు వృద్ధి	1.344	2.263	1.011	0.364	0.326	0.693
వడ్డీ వ్యాప్తి	(-)5.0	2.0	(-)1.1	2.5	3.4	7.6
నికర లభ్య నిధులు	4.8	8.5	22.2	--	--	12.44
5 ఇతర ద్రవ్య ఆరోగ్య సూచికలు						
పెట్టుబడిపై ప్రతిఫలం	0.03	0.93	0.80	0.80	0.82	0.20
ఈ సంవత్సరం ఆదాయంలో మిగులు (రు. కోట్లలో)	(-)22	230	1694	3600	8330	8503
ఆర్థిక ఆస్తులు / బకాయిలు	0.62	0.62	0.68	0.65	0.73	0.83

వచ్చాయి. ఆ అప్పును వడ్డీ తో సహా తిరిగి చెల్లించాలి కదా. రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లింపు వాయిదా వేసే ప్రసక్తే లేదు. అప్పు ఇచ్చినప్పుడే అప్పు వాయిదా, వడ్డీ మినహాయించుకొని మిగతాదే మన ఖజానాకు చేరుతుంది. అప్పులో నికరంగా మనకు చేరింది 2002-03లో 4.8 శాతం, 2003-04లో 8.5 శాతం, 2005-06, 2006-07లో ఒక్క పైసా కూడా చేతికిరాలేదు, 2007-08లో 12.44 శాతం మాత్రమే. అంటే నూరు రూపాయలు అప్పు తెస్తే చేతికొచ్చింది పన్నెండు రూపాయలే. ఆ పన్నెండు రూపాయలతో ఏం అభివృద్ధి సాధించాలో పాలకులే చెప్పాలి. 2005-06, 2006-07 సంవత్సరాల్లో అయితే, తెచ్చిన అప్పంతా తిరిగి చెల్లించగా మన బొక్కసంలోంచి రెండువేల కోట్లు అదనంగా చెల్లించాల్సి వచ్చింది. ఆర్థిక మంత్రిగారూ దానికేమంటారు? లేక ఇది కూడా పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీకి పంపిస్తారా? ఈ రెండేళ్లలో రెవెన్యూ పద్దు కింద మిగులు చూపినందుకు సంతోషిద్దామనుకుంటే అది కాస్త ఇదిగో ఇలా ఆవిరయిపోయింది.

రెండు ప్రభుత్వాల మూడేసి సంవత్సరాల పాలనలో ఆర్థిక పరిస్థితి ఆరోగ్యం ఎలా ఉందో ఈ పట్టికను కాగ్ నివేదికల ఆధారంగా తయారు చేయడం జరిగింది.

పట్టిక తెలియచేస్తున్నదేమంటే:

1. స్థూల రాష్ట్రోదాయంలో రెవెన్యూ ఆదాయం మొదటి కాలంలో 14 శాతం చుట్టూ తచ్చాడుతుంటే, రెండవ కాలంలో 17.4 శాతానికి పెరిగింది.
2. స్థూల రాష్ట్రోదాయంలో రాష్ట్ర సొంత పన్ను 7.6 శాతం నుండి 7.2 శాతానికి పడిపోతే రెండవ కాలంలో 9.2 శాతానికి చేరింది.
3. స్థూల రాష్ట్రోదాయంలో మొత్తం ఖర్చు 19.5 శాతం నుండి 18.6 శాతానికి తగ్గితే రెండవ కాలంలో 22.4 శాతానికి పెరిగింది.
4. మొత్తం ఖర్చులో రెవెన్యూ ఆదాయం 74 శాతం నుంచి 75.5 శాతానికి పెరిగితే, రెండవకాలంలో 2006-07లో 84.7 శాతానికి పెరిగి 2007-08లో 77.7 శాతానికి తగ్గింది.
5. మొత్తం ఖర్చులో రెవెన్యూ ఖర్చు 86.4 శాతం నుంచి 86.1 శాతానికి మార్జినల్‌గా తగ్గితే, రెండవ కాలంలో 81.32 నుంచి 77.4కు తగ్గింది.
6. ప్రణాళికా ఖర్చు మొత్తం ఖర్చులో మొదటి కాలంలో 27.9 శాతం నుంచి. 30.3 శాతానికి పెరగగా రెండవ కాలంలో 38.4 శాతానికి చేరింది.
7. పెట్టుబడి ఖర్చు మొత్తం ఖర్చులో 7.9 శాతం నుంచి 9.7శాతానికి, రెండవ కాలంలో 16.94 శాతం నుంచి 18.3 శాతానికి పెరిగింది.
8. అభివృద్ధి ఖర్చు 33.7 నుంచి 60.7 శాతానికి, 66.54 నుండి 69.3 శాతానికి పెరిగింది.
9. రెవెన్యూ పద్దు కింద లోటు రు. 3643 కోట్ల నుంచి రు. 3887 కోట్లకు చేరుకోగా, రెండవ కాలంలో 2005-06 లోనే కేవలం రు. 386 కోట్లకు తగ్గి, తర్వాతి రెండేళ్లలో రెవెన్యూ లోటు మిగులుగా మారింది.

అభివృద్ధి పేరుతో జరిగే కార్యక్రమాలన్నిటికి ప్రణాళిక పద్దు కింద ఖర్చు కేటాయింపు జరుగుతుంది. ఈ ఖర్చు వివరాలను చూస్తే మొదటి కాలంలో రెవెన్యూ ఖర్చు, పెట్టుబడి ఖర్చు కలిపి 2001-02, 2003-04 మధ్య రు. 8227 కోట్ల నుంచి రు. 10,762 కోట్ల ఖర్చు అయితే, రెండవ కాలంలో రు. 11,827 కోట్ల నుంచి రు. 26,767 కోట్లకు పెరిగింది. సామాజిక సేవలపై ఖర్చు మొదటి కాలంలో రు. 8707 కోట్ల నుంచి రు. 10,859 కోట్లకు పెరగగా, రెండవ కాలంలో రు. 12,314 కోట్ల నుంచి రు. 18902 కోట్లకు పెరిగింది. అంటే మొదటి మూడేళ్లలో ఖర్చు రు. 2152 కోట్ల మేరకు పెరగగా రెండు మూడేళ్లలో రు. 6588 కోట్ల మేరకు పెరిగింది.

బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా జిల్లాలకు విడుదల చేస్తుంది. విడుదల చేసినా ఖర్చు కాకుండా మిగిలిపోయిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి అందచేయాలి.

ప్రతి నివేదికలోనూ కనపడేది సంవత్సరం అంతా మీనమేషాలు లెక్క వేస్తూ మార్చ్ నెలలో ఆదరాబాదరా ఖర్చు చేయటమో లేక ఖర్చు చేయకుండా ట్రెజరీకి తిప్పి పంపడమో, లేక పంపకపోవడమో ఏ పార్టీ అధికారంలో ఉన్నా వస్తున్న ఆనవాయితీ. ఆఖరు మాసం మార్చ్‌లో ఖర్చు చేయడమంటే క్వాలిటీ లేని పనులు, ఖర్చు చేయకుండా మిగిల్చి ట్రెజరీకి తిప్పి పంపడమంటే నిధులు అవసరమైన ఇతర విభాగాలకు తరలించే అవకాశం ప్రభుత్వానికి ఇవ్వకపోవడమే అవుతుంది. కొన్ని సందర్భాల్లో కేటాయింపులున్నా, ఖర్చు చేయడానికి అవసరమైన జి.ఒ.లు విడుదల చేయకపోవడం జరుగుతుంది. ఇది నూటికి నూరు పాళ్లు అధికారగణం వైఫల్యం. ఉదాహరణకు 2004-05లో ఆఖరు త్రైమాసంలో 40 శాతం నిధులు, 2007-08లో 45 శాతం నిధులు ఖర్చు చేయటం జరిగింది.

పైనే పేర్కొన్నట్లు తాజా కాగ్ రిపోర్ట్ గురించి విమర్శలు గుప్పించిన ప్రతిపక్షాలకు ఆర్థికమంత్రి జవాబిస్తూ కాగ్ నివేదికలో ఎత్తిచూపిన లోపాలను పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ పరిశీలించి తుది నివేదిక సమర్పిస్తుందని అధికార యంత్రాంగాన్ని వెనకేసుకొచ్చారు. కాని 2005, 2008 సంవత్సరాల కాగ్ నివేదికలు చూస్తే, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ, 1962-63 లో చేసిన సిఫార్సుల మీద ఇంకా చర్యలు తీసుకోనేలేదు. 2005 నివేదిక ప్రకారం ఇంకా 900 సిఫార్సుల మీద చర్య తీసుకోనే లేదు. అలాగే ఆగస్ట్ 2008 నాటికి 433 సిఫార్సుల మీద కూడా చర్య తీసుకోనేలేదు. ప్రధాన ఎకౌంటెంట్ జనరల్ వివిధ ప్రభుత్వ శాఖల ఎకౌంట్లను ఆడిట్ చేసి ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ పంపిస్తుంది. ఆయా శాఖలు వాటిపై అవసరమైన చర్యలు తీసుకోవాలి. కాని, జూన్ 2004 నాటికి 18,317 రిపోర్ట్‌ల మీద, జూన్ 2008 నాటికి 13,669 రిపోర్ట్‌ల మీద ఏమి చర్య తీసుకొన్నారో తెలియదు.

ఇంకా ఎన్నో విమర్శలు అపుడూ ఇపుడూ కాగ్ నివేదికల్లో చోటు చేసుకొన్నాయి. అవే లోటుపాట్లు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సంవత్సరం తర్వాత సంవత్సరం కాగ్ రిపోర్ట్‌లు ఎత్తిచూపుతూనే ఉన్నాయి. నిత్యం చచ్చేవాడికి ఏడ్చేవాడెవడన్నట్లు, ఈ విమర్శలు ఎంత మామూలై పోయాయంటే, అధికారుల, మంత్రుల చర్మం అంత దళసరి ఎక్కిందన్నమాట. రేపు ఎన్నికల తర్వాత ఎవరు అధికారంలోకి వచ్చినా ఇవి కొనసాగుతూనే ఉంటాయి. ప్రభుత్వాజ్ఞలను ప్రభుత్వాధికారులే అటకెక్కించేస్తుంటే, స్వతంత్రం మనకు కాదు, అధికారులకే, మంత్రులకే వచ్చిందన్నమాట. ⓘ

నేతమిల్లులు మూతపడి పనిలేక, వేరే పనిచేయలేక, ఆర్థిక పరిస్థితి క్షీణించి, ఆకలి చావుల పాలవుతున్న అంతర్గామ కాందిశీకుల జీవనస్థితిని తెలియజేస్తున్నారు **పిట్టల రవీందర్**

ఆకలి చావుల చిరునామా - అంతర్గామ

చుట్టపుచూపుగా వచ్చిన వాళ్లెవ్వరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే మనం ఎంతో ఆందోళన చెందుతాం. విలవిల్లాడిపోతాం. ఆరోగ్యం కుదుటపడేదాకా అంటిపెట్టుకుని అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాం. ఇంటినివదిలి వెళ్లిన తర్వాతకూడా క్షేమసమాచారాలను పదేపదే అడిగి తెలుసుకుంటుంటాం. అంతటి ఆత్మీయత మనది. అట్లాంటిది ... దేశంకాని దేశం వెళ్లగొట్టితే ... ఆదుకుంటామని చేరదీసి, అక్కున చేర్చుకుంటామని హామీ ఇచ్చి, బాధ్యత వహిస్తామని భరోసా ఇచ్చిన ప్రభుత్వాలు బుద్ధిపూర్వకంగానే నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఇక ఆ శరణార్థులకు దిక్కెవ్వరు !? కరీంనగర్ జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అంతర్గామ కాందిశీకుల కాలనీలోని నిర్వాసితులు ఇప్పుడు సరిగ్గా ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నారు. దిక్కుతోచని స్థితిలో ఆకలితో అలమటిస్తున్నారు. సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన రీతిలో ఆకలిచావులకు బలైపోతున్నారు. ఇది నిన్ననో, ఇవ్వాళ్లనో వెలుగుచూసిన ఉదంతం కాదు. ఒక్కరో, ఇద్దరో మాత్రమే ఆకలిచావులకు బలైపోయిన సంఘటనకూడా కాదు. అంతర్గామ ఆకలిచావుల వయస్సు సరిగ్గా ఇరవైఐదేళ్లు. ఇన్నేళ్లుగా ఆకలి మోగిస్తున్న మరణమృదంగానికి బలైపోయిన వారి సంఖ్య నూటికిపైచిలుకే.

17 ఆగస్టు 1985 న వెలగాల మహాలక్ష్మి అనే నేతమిల్లు కార్మికురాలితో మొదలైన ఆకలిచావుల పరంపర కేవలం మూడు నెలల వ్యవధిలోనే నలుగురు కాందిశీకులు ఆకలిచావులకు బలైపోయిన విషయాన్ని కరీంనగర్ జిల్లా కేంద్రం నుండి బి. విజయకుమార్ సంపాదకత్వంలో వెలువడిన 'జీవగడ్డ' సాయంకాల దినపత్రిక వెలుగులోకి తెచ్చేదాకా బయటిప్రపంచానికి తెలియదు. 'జీవగడ్డ'లో వచ్చిన వార్తాకథనాలనే రిట్‌పిటిషన్‌గా స్వీకరించి, ఆకలిచావులను నిలువరించేందుకు చర్యలుతీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమకు అలవాటైన పద్ధతుల్లోనే ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కదిలివెళ్లి అంతర్గామలో హంగామా సృష్టించింది. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసారు. నిత్యావసర సరుకులను పంపిణీ చేసారు. తక్షణ ఆర్థిక సహాయం అందజేసారు. పనిలోపనిగా పోలీస్‌పికెట్‌కూడా ఏర్పాటయ్యింది. ఆ వెంటనే రాజకీయ నాయకులకు మారుమూల అంతర్గామ దర్శనీయస్థలంగా మారింది. ఆ తర్వాత నుండి ఇప్పటి వరకూ జరిగిన, జరుగుతున్న అన్ని రకాల ఎన్నికల్లోనూ 'అంతర్గామ ఆకలిచావు' శాశ్వతహామీగా మిగిలిపోయింది. సహజంగానే కాలక్రమంలో అంతర్గామ ఆకలిచావులు పత్రికల సింగిల్ కాలమ్ వార్తలుగా మారిపోయాయి. పత్రికల ప్రత్యేక సంచికలకు ప్రత్యేక మానవీయ వార్తా కథనంగా పనికివస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగానికి పట్టింపులేని విషయమైపోయింది. 'అంతర్గామ కాందిశీకులను అన్నిరకాలుగా ఆదుకుంటాం' అంటూ రాజకీయపార్టీల హామీల జాబితాలో ఏకవాక్య తీర్మానమయ్యింది.

భారత్, పాకిస్థాన్ యుద్ధం తర్వాత కుదిరిన ఒప్పందాల్లో భాగంగా బర్మా, శ్రీలంక దేశాలనుండి మనదేశానికి తిరిగివచ్చిన శరణార్థులకు, కాందిశీకులకు పునరావాసం కల్పించేందుకు మన ప్రభుత్వం హామీ ఇచ్చింది. మన రాష్ట్రంలో సుమారు ఏడువేలమంది కాందిశీకులకు వివిధ ప్రాంతాలలో పునరావాసం కోసం శిబిరాలను ఏర్పాటు చేసారు. వీరికి శాశ్వతంగా పునరావాసం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించాయి. ఇందులోభాగంగా మన రాష్ట్రంలోని అంతర్గామ, నెల్లూరు, అనంతపురం, రాజమండ్రి, చీరాల, సత్తెనపల్లిలలో నేత, నూలు మిల్లులను నిర్మించారు. అంతర్గామలో ఏర్పాటు చేసిన నేతమిల్లుకు కేంద్ర ప్రభుత్వం కోటీ ఐదులక్షల నిధులను సమకూర్చగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 95లక్షలను సమకూర్చింది. నేతమిల్లుకు ముడిసరుకుగా అవసరమైన నూలు తయారుచేసేందుకుగానూ మరో స్పిన్నింగ్ మిల్లును అంతర్గామలో ఏర్పాటు చేసారు. నేతమిల్లులో బట్టల తయారీకి అవసరమైన నూలు తయారు చేసేందుకుగాను దీనికి అనుబంధంగా స్పిన్నింగ్ మిల్లును ఏర్పాటు చేసారు. స్పిన్నింగ్‌మిల్లుకు అవసరమైన మేలురకం పత్తిని స్థానికంగానే పండించేందుకు రైతులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ రెండు మిల్లులకు అవసరమైన 532 ఎకరాల భూమిని గోయల్‌వాడ, రాయదండి గ్రామాలనుండి సేకరించారు. వేయిమంది బర్మా, శ్రీలంక కాందిశీకులకు శాశ్వత ఉపాధి కల్పించాలనేది ఈ రెండు మిల్లుల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం అప్పట్లో ప్రకటించింది. పి.వి. నర్సింహారావు పునాదివేసిన నేతమిల్లును 7 జూలై 1971న అప్పటి ఉపముఖ్యమంత్రి జె.వి. నర్సింగరావు ప్రారంభోత్సవం చేసారు. ఆ తర్వాత దీనికి అనుబంధంగానే స్పిన్నింగ్ మిల్లును ప్రారంభించారు. ఈ మిల్లుల నిర్వహణా బాధ్యతలను చూసేందుకు మేనేజింగ్ డైరెక్టర్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. కాంట్రాక్టు పద్ధతిలో మూడుసంవత్సరాల కాలపరిమితికి పనిచేసిన మేనేజింగ్ డైరెక్టర్లు అవినీతి, అక్రమాలపట్ల చూపిన మక్కువను, మిల్లుల స్థాపన వెనక ఉన్న ఉద్దేశ్యాలను నెరవేర్చడం లో చూపలేదు. మిల్లులకు చైర్మెన్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్లు

వారికున్న ఇతరత్రా బాధ్యతల కారణంగా పాలనాసంబంధమైన వ్యవహారాలపై చూపలేకపోయారు. దీనికితోడు తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ నాయకులను ఈ మిల్లులకు చైర్మెన్‌లుగా నియమించారు. బాధ్యతలేని కాంట్రాక్టు అధికారులకుతోడు, అధికార రాజకీయాలతో తెల్ల ఏనుగులుగా మారిన చైర్మెన్‌ల అవినీతి, అక్రమాల ఫలితంగా మిల్లులు ప్రారంభించిన ఐదు సంవత్సరాలలోనే అంటే 1977 నుండి నష్టాలు, కష్టాలు మొదలయ్యాయి.

పర్యవసానంగా నష్టాలపేరుతో 1985 జూన్ 6న అంతర్గామ నేతమిల్లుకు 'లాకౌట్' ప్రకటించారు. ప్రారంభం రోజున 509 మంది ఉద్యోగులతో ప్రారంభమైన నేతమిల్లులో మూసివేతనాటికి 197 మంది కాందిశీకులు మాత్రమే మిగిలారు. మిగిలిన వారిలో అనేకమందిని ప్రభుత్వం ఉద్యోగాలనుండి తొలగించివేయగా, కొంతమంది పదవీ విరమణ పొందారు. మరికొంతమంది అనారోగ్యంతో మరణించారు. వీవింగ్, స్పిన్నింగ్ మిల్లులలో పనిచేసే కార్మికులకు పత్తినుండి వెలువడే కాలుష్యం, వ్యర్థపదార్థాలు, రసాయనాల కారణంగా క్షయ, అస్తమా, క్యాన్సర్, కిడ్నీసంబంధమైన వ్యాధుల బారినపడి తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యారు. ఫలితంగా ఇక్కడి కాందిశీకుల్లో మద్యపానానికి బానిసలైన వారి సంఖ్యకూడా గణనీయంగానే ఉన్నది. నేతమిల్లు లాకౌట్ ప్రకటించేనాటికే అందులో పనిచేస్తున్న కార్మికులకు అనేక మాసాల వేతనాలు చెల్లించలేదు.

వెయ్యిమంది బర్మా, శ్రీలంక కాందిశీకులకు పునరావాసం ఏర్పాటు లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంతర్గాం నేతమిల్లును కార్మిక దినోత్సవమైన 'మేడే' రోజున (1మే1997) అర్ధరాత్రి అత్యంత రహస్యమైన పద్ధతిలో మూసివేసారు. చట్టప్రకారం, అధికారికంగా ప్రపంచవ్యాపితంగా సెలవుదినంగా పాటించే 'మేడే' రోజునే, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతినిధిగా వ్యవహరించవలసిన రాష్ట్ర గవర్నర్ అంతర్గామ నేతమిల్లు మూసివేత ఫైలు (జీవోఎంఎస్ నెంబర్ 192, తేది 1.5.1997)పై స్వయంగా సంతకం చేయడం గమనించ దగినది. నేతమిల్లు లాకౌట్ రోజునుండి మూసివేత రోజువరకూ కార్మికులకు చెల్లించవలసిన వేతన బకాయిలు కూడా ప్రభుత్వం ఇంతవరకూ చెల్లించలేదు. మిల్లులనుండి కార్మికులకు చెల్లించవలసిన 81లక్షల వాటాధనాన్ని కూడా ఇంతవరకూ అందించలేదు.

దాదాపు రెండు సంవత్సరాలపాటు వేతనాలు లేకపోవడం, కాందిశీక కార్మికులకు వేరే పనిలో నైపుణ్యం లేకపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి పూర్తిగా క్షీణించిపోయింది. ఫలితంగా అంతర్గామలో ఆకలికేకలు మొదలయ్యాయి. వేరే ప్రాంతాలనుండి కాందిశీకులుగా వచ్చి స్థానికంగా ఉపాధి పొందడం, ఈ మిల్లులకోసం స్థానికులు తమ భూములను కోల్పోవడం, వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి రాకపోవడంలాంటి అనేక కారణాల రీత్యా స్థానిక ప్రజల్లో సహజంగా ఉండవలసిన సానుభూతి కాందిశీకులపట్ల కరువయ్యింది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కాందిశీకుల కుటుంబాలను ఈ పరిస్థితి మరింతగా కుంగదీసింది. అయితే స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులు తమ తోటివారిని కొంతకాలం పాటు, కొంతమేరకు ఆదుకున్నప్పటికీ 1991లో ఈ మిల్లును కూడా ప్రభుత్వం మూసివేసింది. దీనితో ఈ రెండు మిల్లులకు చెందిన కార్మిక కుటుంబాలు పూర్తిగా వీధినపడ్డాయి. కాందిశీకులు తమ పిల్లలను చదువులు మాన్పించారు. మహిళలు పనిమనుషు లయ్యారు. వృద్ధులు భిక్షాటనకు బయలుదేరారు. అనేకమంది కార్మికులు తిండిలేక అనారోగ్యం పాలయ్యారు. క్షయ, క్యాన్సర్‌లాంటి వ్యాధులు ఆవహించాయి. మిల్లులు మూతపడటంతో ఇ.ఎస్.ఐ ఆసుపత్రి సౌకర్యం కూడా దూరమయ్యింది. ఈ ప్రాంతంలోని బార్లలోనూ, హోటళ్లలోనూ, దాబాలలోనూ కాందిశీకులు సప్లయర్లుగా, హెల్పర్లుగా అరకొరజీతాలకు, బట్టపొట్టకు పనిచేస్తున్నారు.

నేత, నూలు మిల్లుల్లో వేతనాలు అరకొరగానే ఉంటాయని, ఈ వేతనాలతో కాందిశీకులు తమ కుటుంబాలను పోషించుకోలేరనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కార్మికులకు కేటాయించిన నివాసగృహాల నిర్మాణంలో ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరించింది. ప్రతి క్వార్టర్‌ను ఆనుకుని మొత్తం పదిగుంటలభూమిని కేటాయించింది. ఇంటిచుట్టూ అందుబాటులో ఉన్న భూమిలో కార్మికుల కుటుంబ సభ్యులు ఉమ్మడిగా కూరగాయల పెంపకం, పాడిబర్ల పెంపకం లాంటి పనులవల్ల ఆర్థికంగా కుటుంబానికి కొంత ఆసరాగా ఉంటారని భావించారు. భారత పునరావాస పథకం కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 41 లక్షల రూపాయల వ్యయంతోనే ఈ కాందిశీకుల కాలనీలను నిర్మించారు. ప్రతి కార్మికునికి 11వేల రూపాయల రుణం మంజూరు చేసారు. ఇందులో నివాస గృహం కోసం, మిగిలిన మొత్తం వాటాధనంగా జమకట్టుకున్నారు. ఆ తర్వాత ప్రతి కార్మికుని వేతనం నుండి ఈ రుణానికి సంబంధించిన బకాయిలను ప్రతినెలా రాబట్టుకున్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ రుణాలన్నింటినీ మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ మిల్లుల మూసివేతతో వీధినపడిన కాందిశీకులపట్ల పాలకులు మరింత కఠినంగా వ్యవహరిస్తూ, కార్మికులకు ఇచ్చిన భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ప్రస్తుతం తలమునకలై ఉన్నారు. ఆకలిచావులపై కోర్టు జోక్యం చేసుకున్న సందర్భంలో కార్మికులకు కేటాయించిన క్వార్టర్లను, దానిని ఆనుకుని ఉన్న భూమిపై కాందిశీకులకే పూర్తి యాజమాన్యహక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, కేంద్రప్రభుత్వం నుండి ఇందుకు అనుకూలంగా నిబంధనలు ఉన్నప్పటికీ ఇప్పటి ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తున్న అధికారులు మాత్రం అంతర్గామ భూములను 'రియల్ ఎస్టేట్' దందాగానే పరిగణిస్తున్నట్లు కనిపిస్తున్నది.

తమ గోడును ప్రపంచానికి వినిపించడానికి 130 రోజులపాటు సుదీర్ఘ నిరాహారదీక్షలను కాందిశీకులు నిర్వహించారు. మండల రెవెన్యూ అధికారి మొదలుకొని రాష్ట్రపతి వరకూ అన్ని స్థాయిల్లోనూ విన్నపాలను అందజేసారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించే ప్రతి అధికారిని, మంత్రులను, ప్రజాప్రతినిధులను ప్రతి సందర్భంలోనూ కలుసుకుని ఇరవైఐదు సంవత్సరాలుగా హామీలు పొందుతున్నారు. సందర్భంతో నిమిత్తం లేకుండా ఏ పార్టీ ఎక్కడ బహిరంగ సభలు నిర్వహించినా అంతర్గామ కాందిశీకులు తరలిపోతున్నారు. దుఃఖాన్ని దిగమింగుకుంటున్నారు. కోపాన్ని అదిమిపట్టుకుంటున్నారు. ఎందుకంటే, శతాధిక ఆకలిచావులను చూసిన అనుభవం వాళ్లది. ■

వలసవాద చరిత్ర రచనకు ప్రతిగా వచ్చిన జాతీయ చరిత్రకారులు జాతీయోద్యమాన్ని బలోపేతం చేసేందుకు భారతదేశ గతాన్ని అవసరానికి మించి కీర్తించారని, ఈ చరిత్ర రచనలోను మతప్రభావం ఉందని విశ్లేషిస్తున్నారు వకుళాభరణం రామకృష్ణ

మతతత్వం - చారిత్రక మూలాలు

మతతత్వం ఒక ఆలోచనా ధోరణి - భావజాలం. భారత దేశ చరిత్ర ఆధునిక యుగంలో తలెత్తిన దృక్పథం. ఇటీవల దేశంలో జరిగిన అనేక హింసాత్మక సంఘటనలతో పాటు, అంతకు ముందు చోటు చేసుకున్న మత కలహాలు, ఘర్షణలు, బాబ్రీ మసీదు విధ్వంసం, పార్లమెంట్, అక్షరధామ్‌లపై దాడులు మతోన్మాదంతో జరిగినవే. మతతత్వ ధోరణులు విపరీత స్థాయికి చేరినపుడు కలహాలు, ఘర్షణలు జరుగుతున్నాయి. 19వ శతాబ్దంలో మొదలై 20వ శతాబ్దిలో 1947 దాకా వలస పాలనా కాలంలో మతతత్వ భావజాలం పెంపొందుతూ వచ్చింది. జాతీయోద్యమకాలంలో అనేక మతఘర్షణలు జరిగాయి. 1980 దశకంలో కాన్పూర్ మతకలహాలు మొత్తం జాతి దృష్టినాకట్టుకొన్నాయి. స్వాతంత్ర్య ప్రకటన సందర్భంగా ప్రారంభమై, దేశ విభజనతో తారాస్థాయికి చేరుకొన్నాయి.

దేశ విభజనానంతరం గూడ ఇదొక రావణకాష్టంలా రగులుతూనే ఉంది. వేల, లక్షల సంఖ్యలో స్త్రీలు, పురుషులు, అభం శుభం తెలియని చిన్న పిల్లలు మతోన్మాదానికి బలవుతున్నారు. మతతత్వాన్ని పావుగా వినియోగించుకొని కొన్ని రాజకీయ పక్షాలు కక్షలను, కార్పణ్యాలను పెంచి రాజకీయ లబ్ధిని పొందుతున్నాయి. రాజకీయాలు ఎప్పుడైతే మతంతో మిలాఖత్ అయ్యాయో, అప్పుడే లౌకికవాదం తీవ్ర ప్రమాదంలో పడింది. మతమూ, రాజకీయం - రెంటి కలయిక అపవిత్రంగా భావించి, రెంటినీ విడదీసి, దూరంగా ఉంచిన ఆధునిక భావజాలం ఐరోపా ఖండంలో, 15వ శతాబ్దంలో పునరుజ్జీవన ప్రక్రియతో ప్రారంభమైంది. మతం స్థానంలో మానవత్వం, దైవం స్థానంలో మానవుడు ముందు కొచ్చాయి. పరం కంటె యిహం ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది. దైవచింతన ఎప్పటిలాగే కొనసాగినా, సామాజిక ప్రాధాన్యతల్లో మతం వెనుక సీట్లో కూర్చుంది. సమస్త ప్రకృతి శక్తులను జయింపబూని, ఆ దిశలో ఎంతో పురోగతి సాధించిన మానవుడు సృష్టిలో మకుటధారిగా రూపొందాడు. శాస్త్రం, కళలు, యావత్ విజ్ఞాన సంపద మానవ మనుగడకు, పురోగతికి, సుఖసౌఖ్యాలకు వినియోగించాలన్న ఆకాంక్ష మొదలైంది. మతపూరిత సాహిత్య స్థానే లౌకిక సారస్వతం - మనిషి అస్తిత్వాన్ని నియంత్రించే మంచి చెడుల కలయికగా, కష్ట సుఖాల జమిలిగా, ఆశ నిరాశల పల్లవిగా, కామ, క్రోధ, మద మాత్సర్యాలను వర్ణిస్తూ - వెలువడింది. సృజనాత్మక రచనలతో పాటు, శతాబ్దాలుగా పాతుకుపోయి కాలం చెల్లిన అజ్ఞానపు ఆలోచనలు, శాస్త్ర సంప్రదాయాల పేరిట చలామణీ అవుతున్న మూఢనమ్మకాలు పటాపంచలయ్యాయి. మతయుగం అంతరించి, హేతుబద్ధ, శాస్త్రీయ, జ్ఞానపూరిత మానవత్వం పరిమళించే యుగం అవతరించింది. రాజ్యం, రాజ్య సంబంధిత సిద్ధాంతాలు, పరిపాలనాంశాలు యీ మార్పులకు మినహాయింపు కాదు. ముప్పై సంవత్సరాల యుద్ధం (1618 – 48) తర్వాత ఐరోపా ఖండంలో మతయుద్ధాలు జరగలేదు. ఇప్పుడిప్పుడే గత శతాబ్ది కాలంగా ప్రపంచం తిరిగి మధ్య యుగాల, మతయుద్ధాల (క్రూసేడ్స్) దశకు పోతుందేమోనన్న భయం ప్రపంచాన్ని ఆవరిస్తున్నది. ఇది మతపరమైన నాగరికతల మధ్య యుద్ధంగా - ఇస్లాం, క్రైస్తవ నాగరికతలు- వర్ణించడం ప్రపంచానికి రానున్న పెనుమార్పును సూచిస్తున్నది.

భారతదేశంలో 'ఆధునిక' ప్రక్రియ ఆలస్యంగా రావడంతో, ఆధునిక యుగారంభం దాదాపు 19వ శతాబ్ది దాకా కాలేదు. లౌకిక భావనలు, నిర్దుష్టరూపం సంతరించుకొనారంభించింది 19వ శతాబ్దిలోనే. మధ్య యుగాల్లో మత నిరసన ఉద్యమాలు దేశమంతటా వచ్చాయి. ఇస్లాం నుండి సుఫీ, హిందు మతం నుండి భక్తి భావాలు - ఈ రెంటి పరస్పర సంపర్కం వల్ల అనేక అసాంప్రదాయిక మతశాఖలు వెలిశాయి. హిందూ, ఇస్లాం మతాల్లోని సంప్రదాయాలను ఇవి పాటించలేదు. దైవం స్థానే మత గురువు ఈ శాఖలకు స్ఫూర్తిదాయకుడైనాడు. ప్రజా విధానాన్ని సరళం చేసి, కింది కులాలనబడే వారిని ఈ శాఖల్లో చేర్చుకొన్నారు. ఈ శాఖల బోధలు, రచనలు (ప్రధానంగా తత్వాలు, కీర్తనలు, ఏలలు మొదలగునవి) ప్రాంతీయ భాషల్లో ప్రజల కర్థమయే రీతిలో సాగాయి. ఆంధ్రదేశంలో శైవకవులు, వేమన, వీరబ్రహ్మం, యడ్లరామదాసు ఈ కోవకు చెందినవారే! అప్పటి సమాజంలో ఉత్పత్తిశక్తులు కొత్త భావాల కనుగుణంగా అభివృద్ధి చెందకపోవడం, హిందూ మతపట్టు సమాజంపై బలీయంగా ఉండడం చేత ఈ ఉద్యమాలు అర్ధాంతరంగా ముగిశాయి. వాటి ప్రభావం, అవి మిగిల్చిన భావజాల వారసత్వం, ఆధునిక యుగంలో తలెత్తిన మత, సంస్కరణోద్యమాలకు నేపథ్యంగా నిలిచింది.

మధ్యయుగానంతర ఆధునిక చరిత్రలో తలెత్తిన మతతత్వ భావాలకు చారిత్రక మూలాలు ఎక్కడున్నాయి? మతతత్వ మొక తప్పుడు చైతన్యం (ఫాల్స్ కాన్షియెస్‌నెస్). ఒక మతానికి చెందిన వారందరి

ప్రయోజనాలు, రాజకీయ, ఆర్థిక సమస్యలన్నీ ఒకే విధంగా ఉంటాయన్నది మతతత్వ భావజాలంలోని ప్రధాన సూత్రం. ఇది సరైన అవగాహన కాదు. ఒకే మతంలోని వారయినప్పటికీ, వారి మధ్య ఎన్నో వైరుధ్యాలుంటాయి. కానీ భిన్న మతస్థుల మధ్య ప్రయోజనాలు ఘర్షిస్తాయని, వాటి మధ్య సామరస్యం కుదరదనీ మతతత్వవాదులు వారి అనుయాయుల్లో నూరిపోస్తారు. ఆయా మతస్థులెదుర్కొంటున్న సమస్యలన్నిటికీ ఇతర మతస్థులే కారణమన్న తప్పు అభిప్రాయాన్ని మతతత్వవాదులు ప్రచారం చేస్తారు.

జేమ్స్ మిల్ భారతదేశ చరిత్రను మత దృష్టితో చూశాడు. దేశ చరిత్రను మూడుభాగాలుగా విభజించాడు. మొదటి రెంటికీ మతపరంగా, 'హిందూ', 'మహ్మదీయ' యుగాలుగా పేర్కొని మూడవ యుగాన్ని బ్రిటిష్ యుగంగా వర్ణించాడు. ఈ విభజన హేతుబద్ధమైనది కాదు. 'హిందూ' యుగంలో అనేక హిందూయేతర రాజ్యాలు, మహ్మదీయ యుగంలో ఇతర కులాలకు చెందిన రాజ్యాలుండడం గమనించదగింది. పైగా వలసపాలన కాలానికి క్రైస్తవ యుగమని పేరు పెట్టకుండా బ్రిటిష్ యుగంగా రాశాడు. జేమ్స్‌మిల్ ఇలా ఎందుకు విభజించాడు? దీనికి వలసపాలన ప్రయోజనాలున్నాయని తేటతెల్లమవుతోంది. భారతీయుల్ని రెండు మతవర్గాలుగా విభజించడం మొదటి ప్రయోజనం. రెండవది, తద్వారా భారతీయుల్ని రెండు భిన్నమైన సమాజాలుగా చిత్రించాడు. సరిగ్గా ఈ విభజనే భారతీయుల్ని రెండుగా విభజించి పాలించిన వైనానికి దారితీసిందన్నది మనకు తెలుసు. మరో ముఖ్యాంశం ఈ విభజనలో దాగి ఉంది. వలసపాలనకు ముందున్న 'ముస్లిం' పాలనను పరమ నిరంకుశమైనదిగా చిత్రించాడు. ఇలా ఎందుకు చేశాడు? అలా చేయడం ద్వారా బ్రిటిష్ పాలన రెంటినీ పోల్చి చూసినపుడు, నాగరికమైందనీ, ప్రజాస్వామిక భావాలతో ప్రభావిత మయిందని చెప్పడం మిల్ ఉద్దేశం. చరిత్ర ద్వారా వలస పాలకుల సిద్ధాంతవేత్తలు చొప్పించదల్చుకొన్న మత భావజాలం పరిపాలనకు పరోక్షంగా ప్రజల మద్దతును పొందుతుందని వారు గట్టిగా నమ్మారు. వలసవాదులపై ఆధిపత్యాన్ని నెలకొల్పడంలో భావజాల పాత్రను తక్కువ అంచనా వేయలేం. బ్రిటిష్ పరిపాలన దేశంలో శాంతి భద్రతలను నెలకొల్పిందనీ, నాగరికత సంస్కృతులను ప్రవేశపెట్టిందనీ, భారత దేశాన్ని పాలించడమొక స్పష్టమైన విధిగా (మానిఫెస్ట్ డెస్టినీ) భావించి, వాటిని ప్రజలచే నమ్మబలికేట్లు చేశారు. అందుకే భారతీయుల మస్తిష్కంపై గట్టి పట్టు సాధించిన యీ భావజాలాన్ని ముందుగా తుడిచి వేయాలని జాతీయోద్యమ నాయకులు ప్రతినబూనారు.

వలసవాద చరిత్ర రచనకు ప్రతిగా వచ్చిన జాతీయ చరిత్రకారులు జాతీయోద్యమాన్ని బలోపేతం చేసేందుకు, భారతదేశ గతాన్ని మోతాదుకు మించి కీర్తించారు. అప్పటి చారిత్రక దశలో ఇది అవసరమనిపించినా, వీరు గత సంస్కృతిని హిందూ సంస్కృతిగానే భావించి, మధ్యయుగాల్లో పరిఢవిల్లిన కళలు, సంగీతం, శిల్పం, భవన నిర్మాణం, సారస్వతం మొదలైన సాంస్కృతికాంశాలను విస్మరించారు. అందువల్ల మతవాదం ముసుగులో వీరి రచనలు ఆ తర్వాత కాలంలో రూపొందాయి. వాస్తవంలో ముస్లిం పాలనకు ముందుగానే (క్రీ.శ. 1000) దేశంలో పలు ప్రాంతాల్లో ఆర్యులు మధ్యాసియా నుండి వలస వచ్చి నివాసాలు ఏర్పరుచుకొన్నారు. విదేశీ వాణిజ్యానికి వీరెంతగానో దోహదం చేశారు. భారతీయుల శాస్త్ర విజ్ఞానాన్ని అరబ్బు దేశాలకు అందించారు. అక్కడ నుండి ఈ విజ్ఞానం ఐరోపా ఖండానికి అందింది. అరబ్బులు శాస్త్ర, కళా విజ్ఞాన వాహికలుగా పనిచేశారు. ముస్లిం పాలకుల కాలంలో చోటు చేసుకొన్న భిన్న సంస్కృతుల సమ్మేళనం దేశం గర్వించదగ్గ బహుళ, మిశ్రమ సంస్కృతులకు దారితీసిందన్న అంశం విస్మరించడం జరిగింది. భారతీయ సంస్కృతి ఒక అఖండ పదార్థం కాదు. దాన్ని హిందూ సంస్కృతిగా పేర్కొనడం చరిత్రను వక్రీకరించడమే! మతాన్ని, జాతీయ భావాన్ని ఒకటిగా జమకట్టి దానికి హిందూ జాతీయవాదం గానో లేక సాంస్కృతిక జాతీయ తత్వంగానో హిందూ మతవాదులు పేర్కొనడం సరికాదు. అధర్వణవేదం భారతీయ సంస్కృతిని ఎలా నిర్వచించిందో ఈ సందర్భంలో తెలుసుకోవడం అవసరం. 'వివిధ భాషలు మాట్లాడుతూ, వివిధ మతాచారాలు పాటిస్తూ, దేశ కాల పాత్రయైన జీవితాలు గడుపుతున్న మనుషుల్ని భరిస్తున్న భూమాతా – పాడి ఆవు నింతర క్షీరప్రవాహంలో తుష్టి చేకూర్చిన విధంగా సహస్ర ముఖాలుగా మమ్మల్ని సంపదలతో సంతుష్టిల్ని చేతువు గాక' (వేదాల పిలుపు; ఎ.సి. బోస్, భారతీయ విద్యాభవన్). మతవాద చరిత్రకారులు సృష్టించిన భావజాలం భారతీయ సమాజాన్ని రెండు పరస్పర, భిన్న వైరుధ్య సమాజాలుగా వర్ణించింది. ఈ విభజన వాస్తవ విరుద్ధమనీ, అచారిత్రకమనీ, రొమిలా థాపర్ వీటిని 'ఊహజనిత సమాజాలుగా' పేర్కొన్నది.

స్వాతంత్ర్యానంతరం మతతత్వవాదులు ముఖ్యంగా మెజారిటీ మతతత్వవాదులు భారతదేశ చరిత్రను వక్రీకరిస్తున్నారు. ఈ వక్రీకరణ మీదే మతతత్వం ఆధారపడి బలపడింది. చరిత్ర వక్రీకరణ ఎంతగా వేళ్లూనుకొందో గమనిస్తే, లౌకిక, జాతీయవాదులు కూడ ఈ వక్రీకరణను నమ్మే స్థితిలోకి వచ్చారు. మతతత్వానికి నిజమైన విరుగుడు వక్రీకరించిన చరిత్రను సరిదిద్దాలి. పాఠశాల స్థాయినుండే సరైన చరిత్రను బోధించాలి. మత యుద్ధాలుగా పరిగణిస్తున్న ఘటనలు రాజకీయ కారణాల వల్లే ప్రధానంగా జరిగాయనీ, ఆ యుద్ధాలు రెండు భిన్న మూలాల మధ్యే గాక ఒకే మతానికి చెందినవారి మధ్య కూడ జరిగాయనీ, దేవాలయాల, మసీదుల విధ్వంసం ఇరు మతాలవారూ చేశారనీ, దేవాలయాల నిర్మాణానికి, పోషణకు ఇస్లాం మత రాజులు, భూరి విరాళాలు ఇచ్చారనీ సాక్ష్యాధారాలతో చరిత్రకారులు వివరించారు. ముస్లిం రాజుల సైనిక బలగాల్లో అత్యధికులుగా హిందువులుండడంగాక, అనేక సందర్భాల్లో సైనికాధిపతులు హిందువులేనన్న సత్యాన్ని మరుగుపర్చలేము. వలస పాలకులు మతతత్వాన్ని పెంపొందించడానికి మత విభేదాలను తెలివిగా ఉపయోగించుకొన్నారు. హిందూ, ముస్లిం మతస్తులు కలిసి శాంతియుతంగా, సోదర భావంతో మెలగడం యీ రెండు మతాల్లో ఎక్కడా కనిపించదు. దేశ ప్రజలను సమైక్యపరిచే జీవిత, సాంస్కృతి కాంశాలు ఎన్నో ఉన్నాయి. మతతత్వాన్ని నివారించడానికి అవలంబించే చర్యలు ఉమ్మడి సంస్కృతిని, విద్యను, ఉమ్మడి రాజకీయ, సామాజిక జీవనాన్ని అందరూ కలిసి జీవించే దిశగా ఉండాలి. వీ

సంఘపరివార్‌ని ఎదుర్కోవడం అంటే కేవలం భావజాల రంగంలో పనిచేయడం మాత్రమే కాదని, ఆ శక్తుల భౌతిక దాడుల నుండి మనని మనం కాపాడుకోవడం కూడా అని అంటున్నారు **సి.ఎస్.ఆర్. ప్రసాద్**

ఆచరణలో ఎదుర్కోవలసిన మతోన్మాదం

గత సంవత్సరం నవంబర్‌లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో మతతత్వం, ఫాసిజం, ప్రజాస్వామ్యం అనే అంశంపై సెమినార్ జరిగింది. విద్యావేత్త, అధ్యాపకుడైన జిలాని ఆ సదస్సుకు అతిథి. ఆయన వేదికమీద కూర్చొని ఉండగానే వినయ్‌సింగ్ అనే పేరుగల శ్రీరామసేన కార్యకర్త అందరూ చూస్తుండగానే ముఖాన్న ఉమ్మివేశాడు. అందుకు అతడు ఏమాత్రం సిగ్గుపడలేదు సరికదా జిలాని వంటి వ్యక్తుల పట్ల నిరసన తెలియజేయటానికి ఈ సృజనాత్మక పద్ధతిని ఎంచుకున్నానని ప్రకటించాడు.

డిసెంబర్ నెలలో బెంగళూరు నగరంలో ఒక కళాశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు కళాశాల బస్సులో విహారయాత్రకు బయలుదేరారు. బస్సు నగరం పొలిమేరలు దాటకుండానే భజరంగదళ్ కార్యకర్తలు బస్సుమీద దాడి చేసి విద్యార్థులను బెదిరించారు. ఈ సంఘటనలో పాల్గొన్న బెంగళూర్ నగర భజరంగదళ్ అధ్యక్షుడు పత్రికా ప్రకటన చేస్తూ ఆ బస్సులో హిందూ విద్యార్థినిలతోపాటు హిందూయేతర ముస్లిం, క్రైస్తవ విద్యార్థులు కూడా కలిసి ప్రయాణం చేస్తున్నందుకు నిరసనగా ఆ బస్సును ధ్వంసం చేశామనీ, ఇది యాజమాన్యాలకు హెచ్చరిక వంటిదని పేర్కొన్నారు.

తమ సంఘ కార్యకర్తలు స్వయం పోలీసు బృందాలుగా ఏర్పడ్డారనీ, డిసెంబర్ 31 రాత్రి బహిరంగ ప్రదేశాలలో 'దేశ సంస్కృతికి భిన్నంగా' జరిగే ప్రదర్శనల మీద దాడులు చేస్తామనీ పరివార్ నాయకుడు హెచ్చరిక చేశాడు.

ఇవన్నీ సంఘ్‌పరివార్ ఫాసిస్ట్ పోకడలను తెలియపరిచే కొత్త హింసా రూపాలు. బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రధానంగాను, దేశవ్యాప్తంగాను సంఘ్‌పరివార్ క్రమక్రమంగా ఫాసిస్ట్ పంచమాంగ దళ రూపాన్ని సంతరించుకొంది. ఈ దేశంలో ఫాసిజం మెజారిటీ మతోన్మాద రూపంలో తలెత్తడం ఆకస్మికం కాదు, అనూహ్యం కాదు. బాబ్రీమసీద్ విధ్వంసం నాటికి బలమైన బీజాలు పడిన పరివార్ ఫాసిజం గుజరాత్‌లో శక్తిమంతమైన భాజపా రాజ్యాధికారం అండగా చేసుకొని తన మర్రి ఊడలను దేశం నలుమూలలా దించింది. ఒరిస్సాలో క్రైస్తవ, ఆదివాసులపై దాడులు, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, ఆదిలాబాద్ లలో హిందూయేతరులపై దాడులను, ఇవన్నీ ఒక దీర్ఘకాలిక దుష్ట పథకంలో అంతర్భాగంగా జరుగుతున్నాయి. కేవలం భారతీయ జనతా పార్టీని కేంద్రంలో అధికార పీఠంలోకి తిరిగి తీసుకురావడానికి మాత్రమే దీని లక్ష్యంగా లేదు. సాంస్కృతి జాతీయవాదం పేరుతో దేశంలోని వైవిధ్యాన్నంతటిని అంతం చేసి ఏకశిలా సంస్కృతిని దౌర్జన్యంగానైనా, ప్రజల మీద రుద్దడం సంఘ్‌పరివార్ వాణిజ్య నీతికి అంతిమ లక్ష్యం. ఆ దిశగా ఈ శక్తులు చాకచక్యంగాను, వడివడిగాను విజయోత్సాహంతో తమ పావులు కదుపుతున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా వివిధ వర్గాలలో నెలకొన్న అభద్రతా భావం ఆధ్యాత్మికతకు ఊపిరులు పోస్తున్నది. కట్టతెగిన వరద నీటిలాగా సమాజాన్ని ముంచెత్తుతున్న సామ్రాజ్యవాద సంస్కృతిలోని విశృంఖల పార్శ్వం ఆలోచనపరులను అల్లకల్లోలం చేసి గతం ఎంతో ఘనం అనే రీతిలో భూస్వామ్య సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆదరాభిమానాలు పెరగడానికి అవసరమైన భూమికను సిద్ధం చేసింది. మొన్నమొన్నటి వరకు పుస్తకాల ప్రదర్శనలలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, సాహిత్య సంబంధమైన పుస్తకాలు ఎక్కువగా అమ్ముడుపోయేవి. ఒక దశాబ్దంగా ఈ స్థితిలో మార్పులు వచ్చి కంప్యూటర్, మేనేజ్‌మెంట్ టెక్నికల్‌కు సంబంధించిన పుస్తకాల ఒరవడి పెరిగింది. ఇపుడైతే ఆధ్యాత్మిక సంబంధమైన పుస్తకాలు వీటన్నింటిని వెనక్కి నెట్టేసి అమ్మకాలలో అగ్రస్థానాన్ని అలంకరించాయి.

మార్కెట్ శక్తుల ప్రాబల్యంలో చిక్కుకుపోయిన 'ప్రగతిశీల' పుస్తకాలయాలు కూడా షాపులోకి ప్రవేశించగానే అందరి దృష్టిని ఆకట్టుకునే రీతిలో ఆధ్యాత్మిక పుస్తకాలను ప్రదర్శిస్తున్నాయి. పండుగల కోలాహలం పెరిగింది. దేవాలయాలలో తొక్కిసలాటలు జరుగుతున్నాయి. నుదుట బొట్టు పెట్టుకొనే మగవాళ్ల సంఖ్య బాగా ఎక్కువైంది. అయ్యప్పలకు పోటీగా దుర్గాభవానీలు లక్షల సంఖ్యలోకి చేరుకొన్నారు. ఈ మూఢత్వం అంతటికి సమాజంలో ఒక మేరకు విశ్వసనీయత గౌరవం పెరిగాయి. ఇదంతా మతోన్మాద విషక్రిములు పెరగటానికి కావలసిన అనారోగ్యకర భూమికను సిద్ధం చేసాయి.

ఇలాంటి స్థితిలో ఒకవైపు సామ్రాజ్యవాదంతో రాజీ పడుతూ అది చేపట్టిన ప్రపంచీకరణ లాభాలన్నింటి వాటాలు సంపాదించుకుంటూ మరోవైపు సాంస్కృతిక హిందూ జాతీయవాదానికి పట్టం కట్టాలనే ఆలోచన అన్ని వర్గాలలోను ప్రబలింది. అంబానీల వంటి అపర కుబేరులు ఈ దేశానికి నరేంద్రమోడి ప్రధానమంత్రవ్వాలని బహిరంగంగా కోరడం, మోడి నమూనాలను దేశవ్యాప్తంగా అమలు పరుస్తామని భాజపా ప్రకటించడం మతతత్వానికి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తులకు మధ్య కుదిరిన అపవిత్ర సంధిగా అర్థం చేసుకోవాలి. భాజపా

లాంటి మతోన్మాద సాంస్కృతిక భావజాలం కలిగిన రాజకీయ పార్టీ అధికారం లోకి రావడం కేవలం ఒక బూర్జువా పార్టీ స్థానంలో, మరో బూర్జువా పార్టీ అధికారంలోకి రావడం అంత చిన్న విషయం కాదు. నయానో, భయానో అధికారంలోకి వచ్చిన పాలకవర్గం తమ పాలనను, దోపిడీని, అణిచివేతను శాశ్వతం చేయడానికి భావజాల, సాహిత్య సాంస్కృతిక రంగాలను పావుగా ఉపయోగించుకుంటాయన్నది చారిత్రక సత్యం. ఆర్థిక విధానాలు మనిషి భౌతిక బాహ్య జీవితాన్ని ప్రభావితం చేస్తే, భావజాలం, సాహిత్యం, సాంస్కృతిక తదితర అంశాలు మనుషుల ఆలోచనలను నియంత్రిస్తాయి. మెదళ్లకు పురుగు పట్టడం అంటే అది వేరు పురుగుతో సమానం. మనిషిలోని జీవశక్తిని తినివేసే క్యాన్సర్ క్రిమిలాంటి ఆ మతోన్మాద సంస్కృతిని మెల్లమెల్లగా ప్రజల మెదళ్లకు ఎక్కించి తమ రాజకీయ, సాహిత్య ఆధిపత్యానికి ఊడిగం చేస్తున్న సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి దేశపు శాశ్వతమైన అవకాశాలని కల్పించే సంఘ్‌పరివార్ ఫాసిస్ట్ కుట్రలో భాగంగానే పై అంశాలన్నిటిని అర్థం చేసుకోవడం అవసరం.

ఈ విషయంలో వర్తమానంలో ఏమి జరుగుతుందో తెలుసు కోవడం కంటే, తెలుసుకుని గుండె బాదుకోవడం కంటే ఈ సునామిని పసిగట్టడంలో, ఎదుర్కోవడంలో 'మనం' ఎక్కడ, ఎలా విఫలమయ్యామో పరిశీలన చేసుకోవడం అవసరం. ఇక్కడ మనం అంటే లౌకిక ప్రజాస్వామిక విలువలు కోరుకునే వాళ్లం. సమాజం వైవిధ్యభరితంగా ఉండాలని ఆశించే వాళ్లం. చరిత్ర, సంస్కృతి నాగరికతలను చారిత్రక గతితార్కిక దృష్టితో అర్థం చేసుకొనేవాళ్లం. మౌఢ్యం మీద కాక శాస్త్రీయత మీద ఆధారపడ్డ విలువలతో కూడిన సమాజాన్ని కోరుకుంటున్న వాళ్లం. అసమ సామాజిక వ్యవస్థ స్థానంలో ప్రజాస్వామిక సంబంధాలతో కూడిన సమసమాజాన్ని స్థాపించాలని కలలు కంటున్న వాళ్లం.

సాంస్కృతిక జాతీయవాదం, దేశభక్తి అనే గౌరవనీయమైన ముసుగులో పనిచేస్తున్న పరివార్ పంచమాంగ దళానికి ఇంతటి ఆదరణ, బల, సంపన్నత లభించడానికి మన బలహీనత కారణం కాదా, ఇది మనం వేసుకోవలసిన మొదటి ప్రశ్న. రాజకీయ భావజాలానికి, సాంస్కృతిక భావజాలానికి, సాహిత్య కళారంగాలకు మధ్య ఉండిన, ఉండవలసిన అంతస్సంబంధాన్ని, పంచమాంగ దళం గుర్తించిన రీతిలో మనం గుర్తించి ఉంటే, దాని కనుగుణమైన పథకాన్ని రూపొందించుకొని అమలుపరిచి ఉంటే ప్రజానుకూల సాహిత్య సాంస్కృతిక కళా విలువలు ఈ రోజున ఇలా మిణుకు మిణుకు మంటూ ఉండవలసిన స్థితి తప్పేది కాదా. ప్రజాజీవనంలోకి అభ్యుదయ సాంస్కృతిక అంశాల, భావజాల అంశాల వారసులంగా చెప్పుకుంటున్న మనం సకాలంలో ఆ అంశాలను గుర్తించి, ప్రోదిచేసి, సమాజానికి అందించి ఉండి ఉంటే ఈనాడు ఆధ్యాత్మిక పలాయనవాద మత సంస్కృతి కచ్చితంగా ఆమోదయోగ్యమైన స్థితిలో ఉండేదికాదు. సామ్రాజ్యవాద సంస్కృతికి ప్రత్యామ్నాయం మత సంబంధమైన జాతీయ దురహంకార సంస్కృతి కాదని అట్టడుగు ప్రజల జీవితాలనుండి రూపొందిన ప్రజా సంస్కృతి నిజమైన ప్రత్యామ్నాయమని మనం వెలుగెత్తి చాటి ఉండి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదు.

తాము హిందువులందరి ఆలోచనలని, ఆవేశాలను, ప్రతిబింబిస్తున్నామని పరివార్ పంచమాంగ దళం బహిరంగంగా ప్రకటించుకోవడానికి అవసరమైన దన్ను ఎపుడు, ఎలా లభించిందో కూడా మనం గమనించాలి. ఈ దేశంలోని హిందువులందరి 'సమ్మతిని' అది తనకు అనుకూలంగా సృష్టించుకోగలిగింది అంటే ఆ సామాజిక బృందానికి చెందిన ఆలోచనాపరుల జీవిత అవగాహనలో, ఆచరణలో ఎక్కడో ఏదో లోపమున్నమాటే. 'నేను యూదును అంటే ఇజ్రాయిల్ చేస్తున్న దుష్కృత్యాలన్నింటినీ సమర్థించాలని కాదు' అని అంటున్న యూదు ప్రజాస్వామికవాదులను ఈ ఆలోచనాపరులు మార్గదర్శకంగా తీసుకోవాలి. పుట్టుకతో మేము హిందువులమయినా ఇపుడైతే పరివార్ పంచమాంగ దళ్ చేస్తున్న అర్థంలో మేము ఎంత మాత్రం హిందువులం కాము అని బహిరంగంగా, సామూహికంగా ఈ ఆలోచనాపరులు ప్రకటించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. హిందూ మతం పేరుతో వాళ్లు చేస్తున్న దురాగతాలకు తమ అంగీకారం లేదు సరిగదా, వాటిని తాము బహిరంగంగా ఎదుర్కొంటామని ఈ ఆలోచనాపరులు ప్రకటించి ప్రజాస్వామిక లౌకిక భావజాలాన్ని ప్రచారం చేయడం తప్పని సరియైన స్థితి ఇపుడు ఉన్నది. ఆ విధంగా సంఘ్‌పరివార్ అంటే ఉన్న గౌరవనీయతను ప్రశ్నించి, పోగొట్టి అది కేవలం ఒక ఫాసిస్ట్ పంచమాంగ దళం మాత్రమేనని సమాజం చేత గుర్తింపు చేయాల్సిన బాధ్యత మన అందరి మీద ఉంది.

ఈ పంచమాంగ దళ్ శక్తులు ప్రజాస్వామిక లౌకిక శక్తులతో భావజాలపరమైన సంఘర్షణకు సిద్ధంగా లేవు. భావాన్ని భావంతోనే ఎదుర్కోవడం అనే పద్ధతికి ఫాసిజం బద్ధ వ్యతిరేకి. అందుకే అవి తమ భావజాలాన్ని వ్యతిరేకించే వ్యక్తులపైన, సంస్థలపైన భౌతికదాడులు చేసి బలహీనం చేసే ప్రయత్నాలు చేస్తాయి. ప్రస్తుతం పరివార్ పంచమాంగ దళ్ చేస్తున్నది కూడా అదే. తాము నమ్ముతున్నట్టు చెప్తున్న 'రాజ్యాంగ బద్ధతను' అవి ఎప్పుడో గాలికి వదిలి పెట్టాయి. సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులమీద, బృందాలమీద, సమూహాల మీద అది నిస్సిగ్గుగా భౌతికదాడులు చేస్తున్నది. ఢిల్లీలో జంతర్‌మంతర్ దగ్గరనో, హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ దగ్గరనో నిరసనలు తెలియజేస్తే ఫలితం ఉండదని అందుచేతనే తాము సాంస్కృతిక పోలీస్‌పాత్ర వహిస్తున్నామని ఆ శక్తులు బహిరంగంగా చెపుకుంటున్నాయి. రాజ్యం జోక్యం చేసుకొని దాన్ని అరికట్టాలని, వాళ్ల బారినుండి ప్రజాసామ్యాన్నీ లౌకికవాదాన్నీ కాపాడాలని 'మనం' విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాం. నిరసనలు తెలియజేస్తూనే ఉన్నాం. దిష్టిబొమ్మలు తగలబెడుతూనే ఉన్నాం. అయినా ఏ ఒక్క సందర్భంలోనూ మానవీయ విలువలను కాపాడే ప్రయత్నాన్ని రాజ్యం చేయలేదు. అలా చేయకపోవడం దాని నిజనైజం. అందుకు భిన్నంగా రాజ్యం ప్రవర్తించాలనుకోవడం, రాజ్యపహారాలో ప్రజాస్వామిక మానవీయ విలువలు మొగ్గతొడిగి మారాకు వేయాలని కోరుకోవడం 'మన' చారిత్రక అజ్ఞానం, అవకాశవాదం, ఆచరణ నుండి పలాయనవాదం.

సంఘ పరివార్ పంచమాంగ దళాన్ని ఎదుర్కోవడం అంటే కేవలం భావజాల రంగంలో పనిచేయడం మాత్రమే కాదు, ఆ శక్తుల భౌతిక దాడుల నుండి మనల్ని మనం కాపాడుకోవడం కూడా. మన విలువల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుంది. ఇందుకు అవసరమైన ఆచరణాత్మక శిక్షణని మనం పొందాలి.

బడాపెట్టుబడిదారులకు, సంపన్నులైన మధ్యతరగతికి అణగారిన ప్రజల ఆకాంక్షలను అణిచివేయడానికి మోడీ రాజకీయాలు, ఆర్ఎస్ఎస్ భావజాలం, జర్మన్ జాతీయవాదం ఉపయోగపడతాయంటున్నారు **రాం పునియానీ**

భారతదేశపు హిట్లర్ ఆవాహన

డిసెంబర్ 2008లో జరిగిన 'గుజరాత్ అంతర్జాతీయ పెట్టుబడిదారుల శిఖరాగ్ర సమావేశం' (వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్) లో కొందరు బడా పరిశ్రమాధిపతులు భారతదేశానికి రానున్న ప్రధానిగా నరేంద్ర భాయ్ పేరును ప్రతిపాదిస్తే సహ పరిశ్రమాధిపతులందరు కరతాళధ్వనులతో తమ ఆమోదం తెలిపారు. ఈ సమావేశం ఫలితంగా గుజరాత్‌లోకి పన్నెండు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ప్రవహిస్తాయని నిర్వాహకులు ఆడంబరంగా ప్రకటించారు. ఈ అంకెలన్ని కట్టుకథలనీ, గారడి అనీ విశ్లేషకులు అంటున్నారు. సమాచార హక్కు చట్టం కింద దాఖలైన ఒక అభ్యర్థనకు జవాబుగా గుజరాత్‌లో గత సంవత్సరం జరిగిన ఇటువంటి సమావేశంలోనే ప్రకటించిన పెట్టుబడుల లో 23 శాతం మాత్రమే నిజమయ్యాయని తేలింది. అలాగే ప్రస్తుతం ప్రకటిస్తున్న అంకెలను కూడా ఎక్కువచేసి చూపడానికి ఇప్పటికే నడుస్తున్న పరిశ్రమలు కొన్నిటిని, కేంద్ర ప్రభుత్వ ఖాతాలో పడే పరిశ్రమలు కొన్నిటిని కూడా కలిపారని తెలుస్తోంది. ఈ మొత్తం పెట్టుబడులలో కొంత ఇప్పటికే వచ్చింది, కొంత ప్రతిపాదించింది కాగా, అంకెలను ఎక్కువ చేసి చూపడం ఉద్దేశపూర్వకంగానే గుజరాత్‌ను భారతదేశంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రంగా చూపడానికి మాత్రమే జరుగుతోంది. ఇదంతా నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి మాత్రమే.

ఈ రకంగా పారిశ్రామికవేత్తలు మోడీ గురించి అతిశయోక్తులు ఎందుకు చెపుతున్నారో లోతుగా అర్థం చేసుకోవలసి ఉంది. ఎందుకంటే ఈ పారిశ్రామికవేత్తల ప్రశంసలలో దేశం మొత్తానికి వర్తించగల ప్రమాద సూచనలున్నాయి. గుజరాత్ రాష్ట్రాన్ని భారతీయ జనతా పార్టీ ఒక దశాబ్దానికి పైగా పాలిస్తోంది. ఆ రాష్ట్రం భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికన్న ముందే, మోడీ ముఖ్యమంత్రి కావడానికన్న ముందే దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో ఒకటిగా ఉండింది. మరి ఈ పది సంవత్సరాలలో ఆ రాష్ట్రానికి ఏం జరిగింది?

రెండు ముఖ్యమైన పరిణామాలను స్పష్టంగా గుర్తించవచ్చు. ఒకటి, ఆ రాష్ట్రంలోని మానవహక్కుల అంశానికి సంబంధించినది. రెండవది, ఆ రాష్ట్రపు సామాజిక, ఆర్థిక ప్రగతి సూచికలకు సంబంధించింది. గుజరాత్ మానవహక్కుల చరిత్ర గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అది దారుణమైంది. సిగ్గుపడవలసింది. స్వయంగా ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బహిరంగంగా మతహింసాకాండలో పాలుపంచుకున్నది. ఈ శతాబ్దంలో మానవజాతి చరిత్రలో జరిగిన అత్యాచారాలన్నిటిలోకి గుజరాత్ మారణకాండ అత్యంత హీనమైనది. గోధ్రాలో రైలు దహనం సంఘటన గురించిన సమాచారం ఇంకా పూర్తిగా బయటికి రాక మునుపే ముస్లింలను ఊచకోత కోసే కార్యక్రమాలకు మోడీ నాంది పలికాడు. సంఘ్ పరివార్ సంస్థలు గుజరాత్‌లోని నిరుపేద ప్రజలను రెచ్చగొట్టి వారిచేత ముస్లిం మైనారిటీ ప్రజలను సామూహికంగా హత్య చేయించాయి. ఆ హత్యాకాండ క్రైస్తవుల మీద దాడులలో కూడా కొనసాగింది. రాష్ట్రంలో అత్యల్ప సంఖ్యాకులైన క్రైస్తవులు, ప్రత్యేకించి డాంగ్స్ జిల్లాలో క్రిస్మస్ పండుగ వేడుకల సందర్భంలో ఎన్నడు కనివినీ ఎరగని దాడులకు గురయ్యారు.

గుజరాత్ హత్యాకాండలో బాధితులు ఇవాళ్టికీ నిరాశ్రయులుగా తిరుగుతున్నారు. ఆ హత్యాకాండలో తమ ఇళ్లూ, ఆస్తులూ పోగొట్టుకున్న

సంఘపరివార్ ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి, ఓడించడానికి మనం నిర్వర్తించాల్సిన బాధ్యతలు :

1. ప్రత్యామ్నాయ, ప్రజాస్వామిక, లౌకిక, మానవీయ విలువల్ని సృజనాత్మకంగా, నిబద్ధతతో ప్రచారం చేయాలి.
2. ప్రచారం చేసిన విలువల్ని మనం జీవితాచరణలో భాగం చేసుకోవాలి.
3. రాజకీయ కార్యక్షేత్రం ఎంత ప్రధానమో సాంస్కృతిక, సాహిత్య కార్యక్షేత్రం కూడ అంత ప్రధానమని గుర్తించాలి, గుర్తింపచేయాలి.
4. సంఘపరివార్ శక్తుల నిజస్వరూపాన్ని, బట్టబయలు చేయాలి. అది వేసుకున్న మర్యాద ముసుగుని తొలిగించి చూపాలి.
5. సంఘపరివార్ భావజాలం ఈ దేశం మెజారిటీ ప్రజల భావజాలం కాదని బహిరంగంగా ప్రకటించాలి.
6. పంచమాంగ దళం భౌతికదాడుల్ని తిప్పి కొట్టడానికి అవసరమైన క్రియాశీలక శిక్షణ పొందాలి.

మనం నమ్ముతున్న విశ్వాసాలని మనం ప్రచారం చేసుకుందాం. ప్రచారం చేసిన విలువలను మనం జీవితావసరాలలో భాగం చేసుకుందాం. తద్వారా అన్ని సామాజిక బృందాలలోను మనం ప్రవేశిద్దాం. అధ్యయనం, చైతన్యం, మిలిటెంట్ కార్యాచరణతో కూడిన పోరాటం, మిలిటెంట్ ఆత్మసంరక్షణ పోరాటాలను నినాదంగా తీసుకొని రాబోవుతరాలకు సమరశీల వారసత్వాన్ని అందిద్దాం. వీ

ఐదు లక్షలమంది ముస్లింలు ఇవాళ్టికి కూడా సరైన పునరావాసం అందక, సౌకర్యాలు లేక దారుణమైన బతుకు ఈడుస్తున్నారని అనేక అధ్యయనాలు చూపుతున్నాయి. మరొక స్థాయిలో సమాజంలోని బలహీనవర్గాల జీవన స్థితిగతుల విషయంలో ఆ రాష్ట్రంలో ప్రమాణాలు నానాటికి దిగజారుతున్నాయి. 2008 వార్షిక విద్యా స్థితిగతుల నివేదిక ప్రకారం చిన్నారి పిల్లల విద్య విషయంలో గుజరాత్ ఒరిస్సా కన్నా, బీహార్ కన్నా వెనుకబడి ఉంది. అలాగే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక 2006 ప్రకారం ఆకలి సూచికలో గుజరాత్ ప్రపంచంలోకెల్లా ప్రమాదకరమైన ప్రాంతాలలో ఒకటిగా ఉంది. గర్భం దాల్చగల వయస్సు ఉన్న స్త్రీల రక్తహీనత సూచిక ప్రకారం గుజరాత్ అట్టడుగు స్థానంలో ఉంది. ఆ రకంగా ఏ సూచికను చూసినా గుజరాత్ సమాజంలోని అత్యధిక శాతం ప్రజలు ఆరోగ్యవంతమైన స్థితిలో లేరు.

అలాగే గుజరాత్‌లో రైతుల ఆత్మహత్యల గురించి, దళితులపై పెరుగుతున్న అత్యాచారాల గురించి దినపత్రికలలో తరచుగా వార్తలు వస్తూ ఉన్నాయి. స్త్రీల హోదా విషయానికి వస్తే గత పదిహేను సంవత్సరాలలో గుజరాత్‌లో స్త్రీల నిష్పత్తి అసాధారణంగా పడిపోయి, తక్కువ స్త్రీలు ఉన్న హర్యానా, పంజాబ్ వంటి స్త్రీ వ్యతిరేక రాష్ట్రాల జాబితాలోకి గుజరాత్ చేరిపోయింది. ఇటీవలనే పటన్‌లో బయటపడిన సామూహిక అత్యాచారం ఉదంతంలాగ రాష్ట్రవ్యాప్తంగా స్త్రీల మీద అత్యాచారాలు, హింస పెరిగిపోతూ ఉన్నాయి. ఇటువంటి రాష్ట్రాన్ని దేశంలోకల్లా అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రంగా మన పారిశ్రామివేత్తలు ప్రకటిస్తున్నారు!

పారిశ్రామికంగా చూసినా గుజరాత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గతంలో విస్తృతంగా ఉండిన వస్త్రపరిశ్రమ ఇప్పుడు మాయమైపోయింది. దాని తరువాత స్థానం ఆక్రమించే వజ్రాల పరిశ్రమ నానాటికీ దిగజారుతోంది. వేలాది చిన్న తరహా పరిశ్రమలు మూతపడిపోతున్నాయి. ఉద్యోగ కల్పన పడిపోతోంది. అతి సులభంగా చెప్పగలిగిందేమంటే గుజరాత్ ప్రజానీకంలో అత్యధిక భాగం ఇబ్బందుల పాలవుతుండగా అతి చిన్నభాగం మాత్రం 'వెలిగిపోతున్న భారతదేశం'లో భాగమై ప్రగతి సాధిస్తోంది.

గుజరాత్‌లో 'నానో' కార్ల కర్మాగారం ఉదాహరణ ఈ విషయాలన్నిటిని మరింత స్పష్టం చేస్తోంది. ఈ కర్మాగారం కోసం అపారమైన ప్రజాధనాన్ని తరలించడం జరుగుతోంది. పన్ను చెల్లింపుదార్ల ధనంలో నుంచి రుణంగా ఇస్తున్న ఆ భారీ మొత్తానికి ప్రభుత్వం వసూలు చేస్తున్న వడ్డీ 0.01 శాతం మాత్రమే. ఆ కర్మాగారం కోసం ఉచితంగా, నిరంతరాయంగా మంచినీరు సరఫరా చేస్తానని ప్రభుత్వం ప్రకటించింది. పదకొండు వందల ఎకరాల విశాలమైన భూక్షేత్రాన్ని ప్రభుత్వం ఈ పరిశ్రమకు అప్పగించింది. దానికి స్టాంప్ డ్యూటీ లేదు, రిజిస్ట్రేషన్ పన్నులు లేవు. ఇలా నానో కర్మాగారానికి అందిన రాయితీలన్నిటిని లెక్కగట్టి విశ్లేషకులు చెపుతున్నదేమంటే టాటా కర్మాగారంలో నుంచి బయటికి వచ్చే ప్రతి ఒక్క కారుకి ప్రభుత్వం అరవై వేల రూపాయల సబ్సిడీ అందజేస్తోంది. బడా పెట్టుబడిదారులతో ఇటువంటి ఒప్పంద పత్రాల మీద సంతకం చేస్తున్నందువల్లనే మోడీ అంటే వారికి చాలా ప్రేమ కలుగుతోంది. ఆయన వాళ్ల ఏజెంట్‌గా పనిచేస్తూ, ప్రజాధనాన్ని వాళ్ల ఖజానాలకు తరలిస్తున్నాడు. ఈ తరలింపు కార్యక్రమానికి అభివృద్ధి అని పేరు పెడుతున్నాడు. పాతకాలపు కథలో రాబిన్‌హుడ్ ధనవంతులను దోచుకొని పేదలకు పంపిణీ చేసేవాడు. మన కొత్త నాయకుడు సగటు పన్ను చెల్లింపుదారును దోచుకొని ధనికులకు తినబెడుతున్నాడు.

మోడీ నాయకత్వం కింద రాష్ట్రం ఇట్లా దిగజారిపోతున్నదనే వాస్తవాన్ని పారిశ్రామికవేత్తలు గమనించడం లేదా? గుజరాత్ గురించి అందరికీ ఎంత తెలుసో, వాళ్లకూ అంతే తెలుసు. కాని దిగజారిపోతున్న పాఠశాల విద్య గురించి, స్త్రీలమీద, దళితుల మీద సాగుతున్న హింస గురించి, అటువంటి అనేక విషయాల గురించి వాళ్లకేమి పట్టింపు లేదు. పెట్టుబడిదారులకు టాటాలకు, అంబానీలకు, మిట్టల్‌లకు ప్రపంచం అంటూ ఉన్నదే తమకు లాభాలు సంపాదించి పెట్టడానికి. ప్రపంచం అంటూ ఉన్నదే తాము విలాసవంతమైన, ఆడంబరమైన జీవితం గడపడం కొరకు. ఆ క్రమంలో తమ చుట్టూ ఉండే ఒక చిన్న బృందం కూడా విలాసాలు పొందితే వాళ్లకంతే చాలు. గత సాధారణ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఇచ్చిన నినాదం 'వెలిగిపోతున్న భారతదేశం'. నిజంగానే వాళ్లొక చిన్న వెలిగిపోతున్న ద్వీపాన్ని సృష్టించదలచుకున్నారు. చుట్టూ దారిద్ర్యం, అన్యాయం నిండిన మహా సముద్రాలు ఉన్నప్పటికీ ఈ వెలిగిపోయే ద్వీపం పారిశ్రామికవేత్తల వారి దళారీల ప్రయోజనాలు కాపాడితే చాలు. ఈ క్రమంలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతున్న కొద్దీ మానవహక్కులను ఇంకా ఇంకా ఎక్కువగా అణచివేయవలసి వస్తోంది. సమాజంలోని బలహీన వర్గాల పట్ల మరింత ఎక్కువ నిర్దాక్షిణ్యంగా ఉండవలసి వస్తోంది. అప్పుడు మాత్రమే వారు చెప్పుకుంటున్న 'అభివృద్ధి' సాధ్యమవుతుంది. గత శతాబ్దంలో ఇటువంటి సందర్భంలోనే యూదులను నిర్మూలించాలని హిట్లర్ ఇచ్చిన పిలుపు ప్రస్తుతం సంఘపరివారానికి ఒక అవలంబించ వలసిన సందేశంగా కనిపించింది. బయటి వాళ్లకోసం మీరు నిర్దాక్షిణ్యంగా ఉండాలంటే లోపలి వాళ్లను అణచివేయక తప్పదు. అంటే కార్మికులను, దళితులను, ఇతర అణగారిన వర్గాలన్నిటిని అణచివేయక తప్పదు.

మైనారిటీలకు వ్యతిరేకంగా మోడీ సాగించిన భయోత్పాతం పారిశ్రామికవేత్తలకు ఒక సూచననందించింది. ఇదిగో ఇక్కడ మన మనిషి ఉన్నాడు. బలహీనులను ఊచకోత కోస్తూ, నరికివేస్తూ గర్వంగా భుజం చరచుకోగల మనిషి ఉన్నాడు. ఇదిగో ఈ మనిషికి 'స్పష్టమైన రాజకీయాలు'న్నాయి. అంటే ధనికులుకు సేవ చేసే రాజకీయాలున్నాయి. లోలోపల దిగజారిపోతున్న సమాజానికి అభివృద్ధి అని చీటీ అంటించగల నేర్పరి ఉన్నాడు. మానవ హక్కులను అతి క్రూరంగా తొక్కివేయగల నాయకుడు ఉన్నాడు. సరిగ్గా పారిశ్రామివేత్తలకు కావలసిందదే. అందువల్లనే వాళ్లు మోడీగురించి కరతాళ ధ్వనులు సాగిస్తున్నారు. ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త ఆశిష్ నంది కొంతకాలం కింద నరేంద్ర మోడీని కలిసి వచ్చి తాను ఒక ప్రామాణిక ఫాసిస్ట్‌ను చూసివచ్చానని ప్రకటించాడు. గుజరాత్ మారణకాండతో ఆ మాట ప్రతి ఒక్కరికి తెలిసివచ్చింది. ఇప్పుడిక పారిశ్రామివేత్తలకు మోడీ సుగమం చేస్తున్న మార్గంతో ఆ సందేశం మరింత స్పష్టమౌతోంది. ఈ మనిషి ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కగలడు. పెట్టుబడిదారుల ప్రయోజనాలను

మతం పేరు మీద ఇటీవల జరుగుతున్న హింస వెనుక ఉన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక కోణాల్ని అర్థం చేసుకోవాలంటున్నారు **ఎన్. వేణుగోపాల్**

'మతతత్వ' హింస - ఇటీవలి పోకడలు

భారత ఉపఖండంలో విభిన్న మతాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణలకు ఎన్నో శతాబ్దాల చరిత్ర ఉన్నప్పటికీ బ్రిటిష్ పాలన మొదలైన తరువాత ఆ మత ఘర్షణల మౌలిక స్వభావం మారింది. 19వ శతాబ్దం తొలి రోజుల నుంచి హిందువులకు, ముస్లింలకు మధ్య, 1947 తరువాత హిందువులకు, అన్ని మైనారిటీ మతాల ప్రజలకు మధ్య జరుగుతున్న ఘర్షణలు ప్రత్యేకంగా చూడవలసినవి. ప్రాచీన కాలం నుంచి బ్రిటిష్ రాకవరకు వైదిక మతస్తులకు బౌద్ధులతో, జైనులతో, ఆదిమ మత విశ్వాసాల తెగలతో జరిగిన ఘర్షణలుగాని, హిందువుల మధ్యనే శైవులకూ, వైష్ణవులకూ మధ్య జరిగిన ఘర్షణలు గాని ప్రధానంగా మతాచారాల కారణాలపై, మత ఆవేశాలతో జరిగినవి. కాని, బ్రిటిష్ పాలనా కాలం తరువాత ఘర్షణలలో పాల్గొన్న వాళ్లు విభిన్న మతాలకు చెందిన వాళ్లయిన్నప్పటికీ, వాళ్లను సమీకరించడంలో మత భావాల ప్రమేయం కొద్దో గొప్పో ఉన్నప్పటికీ అవి ప్రధానంగా 'మతఘర్షణ'లు కావు. 'హిందువులు ఆ దేశం మూలవాసులు. మహమ్మదీయులు ఆ దేశంలో చొరబడిన వారు. వారికి ఒకరిమీద ఒకరికి విపరీతమైన ద్వేషభావం, వ్యతిరేకత ఉంది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ వ్యతిరేకతను, ద్వేషభావాన్ని వినియోగించుకొని తనకు వ్యతిరేకంగా వారు ఐక్యం కావడాన్ని నిరోధిస్తుంది' అని 1820లో ఫారింగ్టన్ 'భిన్న మతాల జాతుల మధ్య ఉన్న విభేదాలను (అది మన అదృష్టం) సంపూర్ణంగా పెంచి పోషించడానికి మనం కృషి చేయాలి. వారిని కలిపి ఉంచడం లక్ష్యం కాకూడదు. విభజించి పాలించడం భారత ప్రభుత్వ లక్ష్యం అయి ఉండాలి' అని 1858లో లెఫ్టినెంట్ జాన్ కోక్ అన్న మాటలు 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలకులు ఉద్దేశ్యపూర్వకంగా ప్రారంభించిన హిందూ, ముస్లిం ఘర్షణల సారాంశానికి అద్దం పడతాయి.

ఇలా ఆర్థిక, రాజకీయ కారణాలే ప్రధానంగా భారత ఉపఖండం లోని రెండు ప్రధాన సామాజిక వర్గాల మధ్య (ఆ రెండు సామాజిక వర్గాలు రెండు భిన్న మతాచారాలను కలిగి ఉండడమనేది యాదృచ్ఛికమే తప్ప అది పూడ్చడానికి వీలులేని విభజన రేఖేమీ కాదు) బ్రిటిష్ పాలకులు సృష్టించిన విభేదం క్రమక్రమంగా శత్రుత్వంగా, విద్వేషంగా మారి ఘర్షణల రూపం తీసుకోవడం మొదలైంది. ఇప్పటివరకు వాటిని మతఘర్షణలుగా, మతోన్మాదంగా చూసే అలవాటు ఎక్కువగా ఉన్నందువల్ల, వాటి అసలు స్వభావం రావలసినంత బలంగా బయటికి రావడంలేదు. వాటిలో అత్యధిక భాగం రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కారణాల వల్ల మొదలై, కొనసాగి, మత ఉద్రేకాల రూపం

అతి ఎక్కువగా కాపాడగలడు.

ముఖ్యమంత్రిగా మారిన ఈ ఆర్ఎస్ఎస్ ప్రచారకున్ని సమకాలీన మానవ చరిత్రలోని అతి ఘోరమైన నియంతతో పోల్చడం కొంచెం అతిశయోక్తి అని ఎవరికైనా అనిపించవచ్చు. కాని వారిద్దరి మధ్యా పోలికలు మన ముక్కు గుద్ది చెపుతున్నాయి. యూదులను, కార్మిక సంఘ నాయకులను, కమ్యూనిస్టులను, కార్మికులను అణచివేయడానికి హిట్లర్ జర్మన్ జాతీయవాద భావజాలాన్ని పుక్కిటపట్టాడు. ఆ క్రమంలో ఆయన ప్రజాస్వామ్యాన్ని రద్దుచేసాడు. సైనికవాదాన్ని సంపూర్ణంగా అవలంబించాడు. కాలక్రమంలో జర్మన్ రాజ్యాంగ యంత్రాన్నే ధ్వంసం చేసేశాడు. సరిగ్గా అలాగే మోడీ కూడా సంఘ్‌పరివారపు విద్వేష భావజాలంతో నిలువెల్లా తనను తాను తీర్చిదిద్దుకున్నాడు. హిందూ రాష్ట్ర భావన ఔదలదాల్చాడు. పొరుగువారి పట్ల సైనికపూరితమైన దురహంకార పూరితమైన వైఖరులు చేపడుతున్నాడు. మనం నేర్చుకోదలచుకుంటే చరిత్రను మించిన ఉపాధ్యాయులు లేరు.

బడా పెట్టుబడిదారులకు, సంపన్నులైన మధ్యతరగతిలోని ఒక బృందానికి సుదీర్ఘకాలపు పరిష్కారాలుగా ఒక హిట్లరో, ఒక మోడీయో, ఒక జర్మన్ జాతీయవాదమో, ఆర్ఎస్ఎస్ భావజాలమో కనిపించవచ్చు. కాని, భారతదేశమంటే ఈ పిడికెడు మంది సంపన్నులు మాత్రమే కాదు. పొరుగు దేశాలపట్ల, పొరుగు రాష్ట్రాలపట్ల దురహంకారపూరిత వైఖరి తీసుకోవడం మాత్రమే కాదు. ఈ వైఖరి సుదీర్ఘ కాలంలో విధ్వంసానికి రాజమార్గం అవుతుంది. ఒకవైపు మోడీకి భారతీయ జనతా పార్టీతోనూ, అద్వానీతోనూ, షెఖావత్‌తోనూ విభేదాలుండగానే అతి హీనమైన ఫాసిస్ట్ మనస్తత్వానికి తనను తాను సూచికగా చూపుకుంటున్నాడు గనుకనే అంబానీలు, మిత్తల్‌లు అటువంటి వాళ్లందరు మోడీని భావి ప్రధానిగా ప్రతిపాదించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇవాళ మన కర్తవ్యం ఏమంటే సకల శక్తులతోనూ జాతీయోద్యమ విలువలను, అన్ని మతవర్గాల మధ్య సమానత్వ విలువలను, ప్రజాస్వామిక మానవహక్కుల పోరాటానికి అవసరమైన ఉదారవాద క్షేత్రాన్ని పునరుద్ధరించడమే. పారిశ్రామికవేత్తలు కళ్లకు గంతలు కట్టుకొని లాభాలవైపు చూస్తారు. వారి దృష్టికి మొత్తంగా సమాజం అనేది ఆనదు. అందుకే వారిలో కొందరు జర్మనీలో హిట్లర్‌ను ప్రోత్సహించారు. వారిలో కొందరు ప్రస్తుతం భారతదేశపు హిట్లర్ నమూనా నరేంద్రమోడీని సమర్థిస్తున్నారు. వీ

తీసుకుంటున్నవే. కనుక ఈ ఘర్షణలను వాటి ఒకానొక రూపమైన మతఘర్షణలుగా చూడడం సరైన అవగాహన కాజాలదు. అదే సమయంలో ఈ ఘర్షణలలో పాల్గొంటున్న వ్యక్తులను మతావేశాలు రెచ్చగొట్టడం ద్వారానే సమీకరించడం జరుగుతున్నది గనుక, వీటిలో ఆ మేరకు మత ప్రమేయం ఉన్నదని కూడా అంగీకరించక తప్పదు.

బ్రిటిష్ పాలకులు ఉద్దేశ్యపూర్వకంగానే చరిత్రను వక్రీకరించి భారత ఉపఖండంలోని ప్రజలను విడదీసి పాలించే కుట్రలో భాగంగా ఇక్కడి రెండు ప్రధాన మత విశ్వాసాల ప్రజల మధ్య విభేదాన్ని, శత్రుత్వాన్ని సృష్టించారు. అందువల్లనే 19వ శతాబ్దం తొలి అర్ధభాగం నుంచి ఇటువంటి మత ఘర్షణల చరిత్ర కనబడుతున్నది. ఆ చరిత్ర దాదాపు ఒక శతాబ్దం సాగిన తరువాత 1931లో కాన్పూర్‌లో జరిగిన హింసాత్మకమైన మతకలహాల మీద భారత జాతీయ కాంగ్రెస్ భగవాన్ దాస్ అధ్యక్షుడుగా సుందర్‌లాల్ కార్యదర్శిగా ఒక విచారణ సంఘాన్ని నియమించింది. 1933లో ప్రచురించిన ఆ విచారణ సంఘం నివేదిక సుదీర్ఘంగా, సవివరంగా ఈ దేశంలోని మతతత్వపు సమస్యకు గల చరిత్రను, సామాజిక, రాజకీయ కోణాలను చర్చించింది.

ఇవాళ్టికీ అత్యవసరంగా చదవవలసిన ఆ నివేదికలో 'ప్రస్తుతం కనిపిస్తున్న హిందూ, ముస్లిం సమస్య దీర్ఘకాలికమైందనీ, ఈ రెండు మతవర్గాల వారిలోను, ఆ మతాలలోను, వారి సంస్కృతులలోను పరస్పర వ్యతిరేకత నిరంతరం కొనసాగుతోందనీ, చెరిపివేయడానికి వీలుకానంత వ్యతిరేకత ఉందనీ, దీనివల్లే ఈ వర్గాల మధ్య సంబంధాలు బెడిసి పోయాయనీ, ఒకరిమీద ఒకరు విశ్వాసం కోల్పోయారనీ, మొదటి నుంచీ ఈ ప్రతికూలభావం ఉందనీ ఇప్పుడు సాధారణంగా కనిపించే అభిప్రాయం. ఇది చాలా భయంకరమైన అభిప్రాయం. ఈ విద్వేషం వల్ల ప్రయోజనం పొందాలనుకునేవారు ఉద్దేశ్యపూర్వకంగా కొనసాగించిన వక్రీకరణల ఫలితమే ఇది' అనీ, 'బ్రిటిష్ వారి పాలనలో ఉన్న ప్రాంతాల్లోను, భారతీయ పాలకుల ఏలుబడి ఉన్నచోట్ల కూడా ఇలాంటి సంఘటనలు అనేక చోట్ల జరుగుతూనే ఉన్నాయి. పరిస్థితి ఎంత తీవ్రంగా మారిందంటే, వీటినుంచి ప్రయోజనం పొందాలనుకునే స్వార్థపరులు తమకు తోచినప్పుడల్లా, ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ ఘర్షణలను రెచ్చగొట్టగలుగుతున్నారు' అనీ రాశారు. ఏడుదశాబ్దాలు గడిచిన తరువాత కూడా ఆమాటలు అక్షర సత్యంగా ఉన్నాయి.

ఇక్కడ, మరీ ముఖ్యంగా, ఆ నివేదిక ఏ ఒక్క మతస్తులనో ఘర్షణలకు కారణంగా చూపకుండా, ప్రత్యేకించి 'ప్రయోజనం పొందాలనుకునే స్వార్థపరులు' అనే మాట వాడిందనేది గమనంలోకి తీసుకోవాలి. 1947 తరువాత భారతదేశంలో మతకల్లోలాల పేరు మీద జరిగిన హింసాత్మక ఘర్షణలన్నిటినీ కూడా ఈ మాట సహాయంతోనే అర్థం చేసుకోవచ్చు. అత్యధిక సందర్భాలలో ఆ ఘర్షణలలో పాల్గొన్నవారు మెజారిటీ మతానికి చెందిన వారు కావచ్చు. కొన్ని సందర్భాలలో మైనారిటీ మతస్తులు కూడా హింసకు పాల్పడి ఉండవచ్చు. కాని, ఏ సందర్భంలోనైనా మతవిశ్వాసం కేవలం సాకు మాత్రమే. ప్రతి ఒక్క సందర్భంలోనూ ఆ కల్లోలాల వెనుక స్పష్టంగా గుర్తించదగిన ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాలు ఉన్నాయి. పాల్గొన్న వారు ఎవరైనప్పటికీ నాయకత్వం వహించిన వారికి కల్లోలాలు సృష్టించిన వారికి నిర్దిష్టమైన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయి.

దేశ విభజన సమయంలో, ఒక సంక్లిష్ట వాతావరణంలో దేశపు ఇటు కొసన పంజాబ్ నుంచి అటు కొనస బెంగాల్ దాకా ఉత్తరాది అంతా జరిగిన కల్లోలాలలో హిందువులు, ముస్లింలు లక్షలాదిగా బలి అయిపోయి, భారత ఉపఖండంలో 'మతఘర్షణ'ల చరిత్రకు భయానకమైన రంగులు అద్దారు. ఆ ఘర్షణల వెనుక బ్రిటిష్ పాలకుల కుటిల నీతి, కాంగ్రెస్ – ముస్లిం లీగ్ ల అపసవ్య రాజకీయాలు, అప్పుడప్పుడే బలపడుతున్న సంఘ్‌పరివార్ దురాలోచనలు అన్నీ కలగలిశాయి. అంటే, సారాశంలోకి వెళ్లి చూస్తే 1946–48 మత కల్లోలాలు కూడా నిజంగా మతకల్లోలాలు కావు. అవి ప్రధానంగా రాజకీయ ఘర్షణలు.

దేశ విభజన, విభజన సమయపు కల్లోలాలు, రెండు వైపులా లక్షలాది మంది హతుల, నిర్వాసితుల విషాద జ్ఞాపకాలు, ఆ తర్వాత నాలుగు దశాబ్దాల పాటు సాగిన ప్రతి ఘర్షణకు నేపథ్యాన్ని కల్పించాయి. కాన్పూర్, మీరట్ వంటి చోట్ల పారిశ్రామిక వివాదాలుగా, అలీఘర్, ఆగ్రా వంటి చోట్ల సామాజిక ఘర్షణలుగా, హైదరాబాద్, అహ్మదాబాద్ వంటి చోట్ల రాజకీయ వివాదాలుగా, ప్రభుత్వ విధానాలపై నిరసనగా ప్రారంభమైన ఘర్షణలు కూడా మత ఘర్షణల రంగు పులుముకుని వేలాది మంది ముస్లింలను, హిందువులను బలిగొన్నాయి. ఆ హత్యలతో, ప్రతి హత్యలతో విద్వేషాలు పెరిగిపోయి, ఆ తర్వాత ఎటువంటి సందర్భం వచ్చినా రెండు మత వర్గాల మధ్య ప్రతీకార వాంఛ రగలడం, హింసకు దారితీయడం మొదలైంది. ఊరు కాలిపోతుంటే పేలాలు వేయించుకు తినడానికి, శవ రాజకీయాలు నడపడానికి సిద్ధంగా ఉండే పాలకవర్గ ముఠాలన్నిటికీ ఈ ఘర్షణలు మంచి అవకాశాన్ని కల్పించాయి. విద్వేష విష ప్రచారం ద్వారానే ప్రజలను తన అదుపులోకి తీసుకోదలచుకున్న సంఘ్‌పరివారం ఈ అన్ని ఘర్షణలలోనూ ప్రధాన, హింసాత్మక పాత్ర వహించింది. అందుకు ప్రతిఘటనగా, ఆత్మరక్షణా చర్యగా ప్రారంభమైన ముస్లిం మతతత్వం తక్కువ సమయంలోనే హింసాత్మకంగా మారిపోయింది. ఇక ఆ రెండు మత సమూహాల ప్రజలను రెచ్చగొట్టి, హింసా చర్యలలోకి దించి, అవతలి మతస్తుల మీద దాడి చేయించి, నిరంతరం అభద్రతా భావంలో ఉంచి, తామే రక్షకులుగా నటించి అందరినీ తమ వైపు సమీకరించుకోవడానికి రెండు మతాలలోని స్వార్థ ప్రయోజన శక్తులకు అవకాశం చిక్కింది.

ఈ రెండు మతాల స్వార్థ ప్రయోజన శక్తుల హింసా క్రీడకు హెచ్చు అవకాశాలు కల్పించినది 1990ల తరువాత దేశవ్యాప్తంగా ఏర్పడిన వాతావరణం. ఆ వాతావరణంలో సాగుతున్న 'మతఘర్షణ'లకు విస్మరించరాని నేపథ్యం మూడు రంగాలలోని మూడు ముఖ్యమైన పరిణామాలలో ఉంది.

మొదటిది, ఆర్థికరంగంలో నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ పరిణామాలు మతఘర్షణలకు అవసరమైన పునాదిని కల్పించాయి.

రెండవది, రాజకీయ రంగంలో కేంద్రంలోను, రాష్ట్రాలలోను అనిశ్చిత స్థితి అంతకంతకూ పెరిగిపోతూ ఐక్య సంఘటన, మిశ్రమ ప్రభుత్వాల ఏర్పాటు అనివార్యమైన స్థితిలో ప్రతి రాజకీయ పక్షం తనదైన బలమైన సామాజిక బృందాన్ని తనతో ఉంచుకోవడం కొరకు మతాన్ని

ఒక సాధనంగా వాడుకుంటూ 'మతఘర్షణ'లకు నాయకత్వం వహిస్తోంది, 'మతఘర్షణ'లను సృష్టిస్తోంది, ఇతరేతర వివాదాలన్నిటికీ మతం రంగు పులుముతోంది.

మూడవది, దళితులలోనూ, వెనుకబడిన కులాలలోనూ చైతన్యం, ఆత్మగౌరవ స్పృహ పెరుగుతూ వచ్చిన 1990 దశకం తరువాత మనుధర్మానికి వ్యతిరేకత పెరిగిన కొద్దీ ఆయా సామాజిక వర్గాలను మళ్లీ మనుధర్మపు 'నాల్గుపడగల హైందవ నాగరాజు' నీడలోకి తీసుకు వచ్చేందుకు మతఐక్యతను నొక్కిచెప్పడం జరుగుతోంది.

సరిగ్గా నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన 1992లోనే బాబ్రీ మసీదు విధ్వంసం కూడా జరిగిందనీ, అంతకు ఒకటి రెండు సంవత్సరాల ముందే మండల్ కమిషన్ నివేదిక అమలుపై దేశవ్యాప్తంగా వెనుకబడిన కులాల చైతన్యం పెరిగిందనీ గుర్తించవలసి ఉంది.

బాబ్రీ మసీదు విధ్వంసం నేపథ్యంలో ముస్లింల మీద హింసాత్మక దాడులు పెరిగిపోవడంతో ముస్లింలలో కూడా అంతకు ముందుకన్న ఎక్కువ మతఐక్యత, ప్రతిఘటన ప్రారంభమై, అతిత్వరలోనే హింసా రూపం తీసుకున్నాయి. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ముస్లిం యువతరం సంఘటిత బృందాలుగా ఏర్పడడం, వీలైన చోట్ల ప్రతిచర్యలకు పాల్పడడం కూడా మొదలైంది. పాకిస్తాన్ ప్రేరణతోనో, ప్రేరణ లేకుండానో, తాము రెండో తరగతి పౌరులుగా చూడబడుతున్నామనే అసంతృప్తితోనో, తమ మీద జరిగిన హింసాకాండకు పరిష్కారం దొరకలేదనే అసహనంతోనో, ముస్లిం ప్రజానీకంలో సాధారణంగానే ఉన్న అవిద్య, నిరుద్యోగం, దారిద్ర్యం కారణంగానో, గల్ఫ్ దేశాల నుంచి అందుతున్న నిధుల వల్లనో ముస్లిం యువకులు 'తీవ్రవాద' సంస్థలలో భాగస్వాములవుతున్నారు. హింసాకాండకు పాల్పడుతున్నారు.

మరొకవైపు 1925లో ఏర్పడిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ముస్లింలపై హింసకు లిఖితపూర్వకమైన, భావజాలపరమైన సమర్థనను ప్రకటిస్తూ వచ్చింది. దేశవ్యాప్తంగా పాఠశాలల్లో శాఖలు ఏర్పరిచి, చిన్నారి పిల్లల మనసులలో విషబీజాలు నాటి, వారికి ఆయుధ శిక్షణ ఇచ్చి హింసాత్మక కార్యకలాపాలకు రంగం సిద్ధం చేసి పెట్టింది. కొన్ని వందల కల్లోలాలలో ముస్లింలపై దాడులు చేయించింది. అలా ముస్లింలపై ఎన్నో దశాబ్దాల ముందునుంచే ఎన్నో రెట్ల ఎక్కువ హింసను సాగిస్తూ వచ్చిన సంఘ్ పరివార్ శక్తులు ఇటీవల ఆయుధ సేకరణ, విస్ఫోటక పదార్థాల సేకరణ, విష ప్రచారం సాగించడంలో కొత్త పోకడలు కూడా పోతున్నారని మాలేగావ్ విచారణలో బయటపడింది.

ఈ 'మతఘర్షణ'ల్లో పాల్గొనే హిందువులైనా, ముస్లింలైనా మొత్తంగా ఆ మతవిశ్వాసాలు పాటించే వారందరికీ ప్రతినిధులు కారని, కోట్లాది మంది సాధారణ ప్రజలలో కొన్ని వందల మందో, వేల మందో మాత్రమే ఇటువంటి హింసాధోరణులకు పాల్పడుతున్నారని అర్థం చేసుకోవలసి ఉంది. అయినా ఆ కొద్దిమందినైనా ఆకర్షిస్తున్న మతఘర్షణల రాజకీయాల పునాదిని విశ్లేషించుకోవలసి ఉంటుంది.

సాధారణ ప్రజలు తమ దైనందిన కార్యకలాపాలు జరుపుకునే బహిరంగ ప్రదేశాలలో బాంబుదాడులు, పేలుళ్లు, కాల్పులు జరిపి, ఏ సంబంధమూ లేని అమాయకులను బలిగొనడం, స్పష్టమైన నేరపూరిత హింసాత్మక ఉద్దేశ్యాలతో ప్రచారాలు సాగించడం, ఆయుధాలను, మందుగుండు సామగ్రిని, ఆర్డిఎక్స్‌ను పోగుచేయడం, విశ్వ హిందూ పరిషత్ వంటి సంస్థలు బహిరంగంగానే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది రూపాయలు ఇటువంటి కార్యక్రమాల కొరకే సేకరించడం, తమను తాము సన్యాసులమనీ, సాధువులమనీ, సాధ్వీమణులమనీ పిలుచుకునే వారు 'ఒకరికి పదిమందిని చంపండి' అని రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేయడం, లౌకికమయినదని చెప్పుకునే భారత ప్రభుత్వంలోనూ, సైన్యంలోనూ పనిచేసిన వారు, పనిచేస్తున్న వారు విభిన్న మతవర్గాల మధ్య నిష్పాక్షికతను పాటించకుండా ఒక వర్గపు కార్యక్రమాలలో పాలుపంచుకోవడం, వారికి ఆయుధాలందించడం, ఆయుధ శిక్షణ ఇవ్వడం, వేలాదిమంది ఊచకోతకు ప్రోత్సాహకుడనీ, కారకుడనీ ప్రపంచానికంతా తెలిసిన వ్యక్తిని భావిభారత ప్రధానిగా కీర్తించడం – ఇవీ ఇవాళ్టి మత రాజకీయాల కొత్త రంగులు, కొత్త సాధనాలు. ఈ చర్యలకు పాల్పడుతున్న వారిలో పురోహిత్ వంటి సైనికాధికారులూ ఉన్నారు, సాధ్వి ప్రజ్ఞ వంటి మతాచార్యులూ ఉన్నారు, నరేంద్ర మోడీ వంటి రాజకీయ నాయకులూ ఉన్నారు, విశ్వహిందూ పరిషత్ వంటి చట్టబద్ధ సంస్థలూ ఉన్నాయి, లష్కర్ ఎ తొయిబా, ముజాహిదీన్ వంటి చట్టవ్యతిరేక సంస్థలూ ఉన్నాయి. వీరిలో ఎవరు ఎక్కువ హింసకు పాల్పడుతున్నారు, ఎవరు మొదట హింసను ప్రారంభించారు, ఎవరు ఎక్కువమంది అమాయకులను బలిగొంటున్నారు అనే తేడాలుండవచ్చు నేమో గానీ, దాదాపు అందరి లక్ష్యాలూ, ప్రయోజనాలూ ఒక్కటే.

ఈ కొత్త రంగులను, హింసారూపాలను అర్థం చేసుకోవడానికి కూడా మళ్లీ ఆర్థిక, రాజకీయ, సామాజిక పునాదిలోనే వెతకవలసి ఉంది.

దేశ ఆర్థికవ్యవస్థలో విభిన్నవర్గాల మధ్య విభజన రేఖ గత రెండు దశాబ్దాలలో మరింత స్పష్టంగా మారింది. ఒక అత్యల్ప సంఖ్యాక వర్గం ప్రపంచీకరణ క్రమంలో అదనపు వనరులను, ఫలితాలను, సౌభాగ్యాన్ని పొందగా, అత్యధిక ప్రజానీకం ఉన్న ఉద్యోగాలను పోగొట్టుకోవలసి వచ్చింది. ఉపాధి కోల్పోవలసి వచ్చింది. చిరుద్యోగాలలో, స్వయం ఉపాధిలో సంతృప్తి పడవలసి వచ్చింది. రైతాంగం భూములను కోల్పోయి, కూలీలు కావలసి వచ్చింది. కూలీల మధ్య పోటీ పెరిగి మిగులు కూలీలు పట్టణాలకు వలస రావలసి వచ్చింది. జీవన స్థితిగతులు ఏ వర్గానికైనా అతి దుర్భరంగా మారిపోయాయి. ఈ మారుతున్న దుస్థితికి మూలకారణమేమిటో, ఆ దుస్థితికి గురవుతున్న వారు కనిపెట్టకుండా ఉండాలంటే, నిజమైన శత్రువును తెలుసుకోకుండా ఉండాలంటే ఒక దిష్టిబొమ్మను సృష్టించాలి. వంద సంవత్సరాలుగా సాగుతున్న చరిత్రవల్ల ఈ దేశపు పాలనా వ్యవస్థకు అతి సులభంగా దొరికిన దిష్టిబొమ్మ మైనారిటీలు. సమస్యలలో ఉన్నవారు తమ సమస్యలకు మూలకారణాలు వెతికి, కనిపెట్టి వాటిని పరిష్కరించే సుదీర్ఘ క్రమంలో పాల్గొనడం కన్న అతి సులభంగా, ఎవరో చూపించిన వేలువైపు చూసి వారే శత్రువులుగా భావించి వారిమీద విరుచుకుపడడం సాధారణంగా జరుగుతుంది. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయి, సంక్షోభంలో పడిన జర్మన్ ఆర్థిక వ్యవస్థ దుష్ఫలితాలకు కారణంగా యూదులను, కమ్యూనిస్టులను, కార్మికవర్గాన్ని చూపిన హిట్లర్ జర్మన్ ప్రజానీకంలో తనకు మద్దతునూ, వారిపట్ల వ్యతిరేకతనూ కూడగట్టింది ఈ విధంగానే.

భారత పాలకవర్గాలలోని అన్ని ముఠాలు ఇటువంటి వక్రీకరణ

క్రీడలో అందెవేసిన చేతులే గాని, సింహభాగాన్ని ఆక్రమించేది మాత్రం సంఘ్‌పరివార్. వారి ప్రామాణిక గ్రంథాలన్నిటిలోను హిట్లర్ పట్ల ప్రశంసలు, హిట్లర్ ప్రబోధించిన ఆర్య జాతి ఆధిక్యత వంటి భావననే హిందూ జాతి ఆధిక్యతకు వినియోగించడం, హిట్లర్ లాగానే కమ్యూనిస్టు వ్యతిరేకతను, భిన్నాభిప్రాయాల పట్ల అసహనాన్ని, మైనారిటీల పట్ల హింసాపూరిత వైఖరిని ప్రదర్శించడం కనబడతాయి.

ఈ వైఖరి వల్లనే దేశంలో కొనసాగుతున్న ఆకలికీ, పీడనకూ, నిరుద్యోగానికీ, దారిద్ర్యానికీ, మొత్తంగా అసంతృప్తికీ కారణం పొరుగుదేశం అనే భావన ప్రచారమవుతుంది. ఆ పొరుగుదేశం ఒక మతాన్ని అనుసరిస్తుంది గనుక, ఆ మత విశ్వాసాలే ఉన్న ఈ దేశ ప్రజల మీద కసి తీర్చుకుంటే ఆ పొరుగు దేశం మీద కసి తీర్చుకున్నట్టే. తద్వారా మెజారిటీ ప్రజలను నిజమైన పరిష్కారాల నుంచి పక్కదారి పట్టించవచ్చు. ఇది పాలకవర్గాల సాధారణ నీతి. నిజానికి భారతదేశపు ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలు, వనరులు సుసంపన్నమైనవి. వాటిని పొరుగుదేశం తలుచుకున్నా విచ్ఛిన్నం చేయజాలదు. తాము నమ్మే దైవం, మరొక దేశం నమ్మే దైవం ఒక్కరే అయినంత మాత్రాన ఎవరు ఆ మరొక దేశాన్ని, ఆ దేశపు రాజకీయార్థిక విధానాలను సమర్థించాలని లేదు. కాని ఇటువంటి మామూలు ఆలోచనలు కూడా తట్టని ఒక ఉన్మాద స్థితిని రెచ్చగొట్టి, ఆ స్థితిలో నిజంగా రావలసిన కోపాన్ని, రావలసిన వ్యక్తులమీద కాక మరొకవైపు మళ్లించడమే పాలకవర్గాల ప్రయోజనం. 1933లో స్వయంగా భారత జాతీయ కాంగ్రెస్ విచారణ నివేదిక బ్రిటిష్ పాలకుల స్వార్థపూరిత ప్రయోజనాల గురించి ఏ వ్యాఖ్యానం చేసిందో, ఇప్పుడు భారత పాలకుల స్వార్థ పూరిత ప్రయోజనాల గురించి కూడా అదే వ్యాఖ్యానం చేయవలసి ఉంది.

బాబ్రీ మసీదు గేట్లు తెరిచి, శిలాన్యాస్ చేయడానికి అంగీకరించిన రాజీవ్ గాంధీ, బాబ్రీ మసీదు విధ్వంసాన్ని మౌనంగా అంగీకరించిన పి.వి. నరసింహారావు, బాబ్రీ మసీదు విధ్వంసంలో స్వయంగా పాల్గొన్న లాల్‌కృష్ణ అద్వానీ ఈ స్వార్థ ప్రయోజనాలు పాలకవర్గాల మూడు ముఖాలు. నిజానికి భారతపాలక వర్గాలకు హిందూత్వ ఎంత అనుసరణీయమైన భావజాలం అయిందంటే, ఈ మూడు ముఖాలకూ, వారి మతవిశ్వాసాలలో గానీ, ఆర్థిక రాజకీయ విశ్వాసాలలోగానీ గుర్తించ దగిన తేడాలున్నప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకోవడంలో ఏకసూత్రత ఉంది.

అయితే ఇక్కడ కేవలం పాలకుల ప్రయోజనాలు, ప్రచారం మాత్రమే కాదు. 1933 కాన్పూర్ కల్లోలాల నివేదిక చెప్పినట్టు సమాజంలోని సగటు మనిషికి చరిత్ర పట్ల ఉన్న అవగాహనలోనే ఇటువంటి వైఖరికి మూలాలు ఉన్నాయి. ముస్లింల పట్ల ఉన్న దురభిప్రాయాలు, చాలా ప్రాంతాలలో ముస్లింలు పాల్గొనే ఆర్థిక, వ్యాపార, వృత్తిరంగాలు కూడా వారి పట్ల అసంతృప్త హిందూ యువతరంలో కోపం రగలడానికి వీలు కల్పిస్తున్నాయి. ఏ ప్రాంతంలోనైనా అత్యల్ప సంఖ్యాకులుగా ఉండేవారు సంఘటితంగా ఉంటారు. అంతేగాక మత విశ్వాసం ప్రకారం రోజుకు ఐదుసార్లు నమాజు చేయవలసి ఉంటుంది గనుక ముస్లింలు ఇతర మతస్తుల కన్న ఎక్కువ సార్లు కలుసుకుంటారు, ఎక్కువ సంఘటితంగా ఉండే అవకాశం ఉంది. తరతరాలుగా సాగిన మతాంతరీకరణల్లో ప్రధానంగా దళితులు, వెనుకబడిన కులాలు, అణగారిన వర్గాలే ముస్లింలు గానో, క్రైస్తవులుగానో మారాయి గనుక మతం మారినప్పటికీ వారి వృత్తులుగానీ, దారిద్ర్యం గానీ మారిపోలేదు. అలాగే సాంప్రదాయికంగానే ముస్లింలు విద్యా, ఉద్యోగరంగాలకు దూరంగా ఉన్న పరిస్థితి ఉంది గనుక వారిలో చాలావరకు హేతుబద్ధమైన స్పందనలు లేకపోవడం కూడా కనబడుతుంది. ఈ కారణాలతో ముస్లిం మతస్తులు సంకుచితులనీ, కట్టుమీద ఉంటారనీ, హింసకూ, దౌర్జన్యానికీ పాల్పడగలిగిన అవకాశాలు వారికి ఎక్కువనీ ఒక అపోహ నెలకొని ఉంది. ఈ అపోహను వాడుకొని పాలకవర్గాలు, ప్రచార సాధనాలు ఎక్కడ ఏ హింసాత్మక సంఘటన జరిగినా మొట్టమొదటి చూపుడు వేలు ముస్లింల మీదనే ఎక్కుపెడుతున్నారు. ఈ ప్రచారానికి సాధారణ ప్రజానీకం లోనవుతున్నారు. దీనికి తోడు ఉన్నత విద్యా ఉద్యోగాలు లేనందువల్ల ముస్లిం యువతరం సాంప్రదాయికంగానే సమాజానికి అవసరమైన అనేక చిల్లర వృత్తులలో స్థిరపడి ఉండేది. బేకరీ ఉత్పత్తులు, సైకిల్, ఇతర ద్విచక్ర వాహనాల రిపేర్లు, తాళాల రిపేరు, గొడుగుల తయారీ, గాజుల తయారీ, దర్జీ వృత్తి వంటి రంగాలు అవి. ప్రపంచీకరణ క్రమంలో ఇటువంటి వృత్తులన్నిటికీ కాలం చెల్లింది. ప్రపంచీకరణ శక్తులు పెరిగినకొద్దీ, బహుళజాతి సంస్థల దుకాణాలు పెరిగిన కొద్దీ, కొత్త కొత్త సరుకులు సమాజ అనుభవంలోకి వచ్చిన కొద్దీ ముస్లిం యువతరంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ఎక్కడైనా ఒక హింసా ఘటన జరగగానే అది ముస్లింలే చేసి ఉంటారని నమ్మడానికి సిద్ధంగా ఉన్న సాధారణ ప్రజానీకం ఒకవైపు ఉండగా, నిరుద్యోగ ముస్లిం యువతరాన్ని ఆ నేరారోపణలపై నిర్బంధించి, వేధించడానికి సిద్ధంగా ఉన్న రాజ్యాంగయంత్రం మరొకవైపు ఉంది. అలా కేసులలో ఇరికించబడి, చేయని నేరాలు ఆరోపించబడిన నిందితులు జైళ్ల నుంచి బయటికి రాగానే వాళ్ల చేత నిజంగానే ఆ నేరాలు చేయించడానికి అనేక శక్తులు పొంచి కూర్చున్నాయి.

ప్రజల ఆర్థిక స్థితి వల్ల మాత్రమే కాక ప్రపంచీకరణ శక్తుల ఆర్థిక ప్రయోజనాల రీత్యా కూడా సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికీ మిలాఖత్తు కుదురుతుంది. ప్రపంచీకరణ ఇంకా ఎక్కువగా జరగాలనీ, దేశదేశాలలో తమ వ్యాపారాలు సాగాలనీ, తాము బహుళజాతి సంస్థలకు ఇంకా ఎక్కువ దళారీలుగా మారాలనీ కోరుకుంటున్న టాటాలు, అంబానీలు, మిత్తల్‌లు దేశంలో సంఘ్ పరివార్ ప్రభుత్వాధికారాన్ని చేపట్టాలని కోరుకుంటున్నారు. సంఘ్‌పరివార్‌లో కూడా మిగిలిన వారికన్న ఎక్కువ దౌర్జన్యపరుడైన నరేంద్ర మోడీ చేతికి అధికారం రావాలని కోరుకుంటున్నారు. నరేంద్ర మోడీకి ఆ స్థానం రావడానికి మూలం గుజరాత్‌లో జరిగిన కల్లోలాలలో గుజరాత్ సమాజాన్ని నిట్ట నిలువునా చీల్చి, వేలాది మందిని ఊచకోత కోయడమే. ఈ అర్థంలో చూసినప్పుడు మతం కేవలం ముసుగేనని, సాగుతున్న పరిణామాల అసలు రహస్యం ఆర్థిక ప్రయోజనాలేనని అర్థమవుతుంది.

ఈ ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి రాజకీయాధికారం ముఖ్యమని సంఘ్‌పరివార్ 1970ల నుంచి గుర్తిస్తూ వస్తోంది. దాని రాజకీయ పక్షమైన భారతీయ జన సంఘ్, దాని తరువాత రూపమైన భారతీయ జనతా పార్టీ 1977 నుంచి కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అడపాదడపా అధికారాన్ని వహిస్తూ వచ్చాయి. ఆ

ఇజ్రాయిల్ ప్రజాస్వామ్య దేశమా లేక టెర్రరిస్ట్ రాజ్యమా అని ప్రశ్నిస్తూ, పాలస్తీనా ప్రజల పట్ల జరుగుతున్న ఇజ్రాయిల్ దురాగతాలను వివరిస్తున్నారు సాజీగోపాల్

ఆత్మరక్షణా, రాజ్య ఉగ్రవాదమా?

మధ్యధరా సముద్ర తీరాన, ఈజిప్ట్, ఇజ్రాయిల్ దేశాల మధ్య ఉన్నదే గాజా. పాలస్తీనా అంతరాత్మకు ప్రతీక. ఇజ్రాయిలీ దురాక్రమణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న పాలస్తీనా ప్రతిఘటనా పోరాటానికి చిహ్నం – గాజా. ఇజ్రాయిల్ అణచివేతకు నలిగిపోతున్న పాలస్తీనీయులు గాజా ప్రాంతంలోని జబాలియా, రాఫా లాంటి రెఫ్యూజీ క్యాంపులలో బతుకులు వెళ్లదీస్తున్నారు. పాలస్తీనా పిల్లలు మఘాజీ, నుస్రియత్, ఖాన్ యూనిస్ మురికివాడల్లో యవ్వనాన్ని దాటుతున్నారు.

27 డిసెంబర్ 2008న పధ్నాలుగు లక్షల మంది నివసించే గాజా పైన వందలాది బాంబులతో ఇజ్రాయిల్ దాడులు చేసింది. అమెరికా సప్లై చేసిన ఎఫ్–16 బాంబరు విమానాలు, అపాచీ హెలికాప్టర్లతో ఇల్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలపైన బాంబుల వర్షం కురిపించింది. 430 మంది అమాయక పౌరులు, పిల్లలను చంపి మారణహోమానికి పాల్పడింది. జబాలియా రెఫ్యూజీ క్యాంపులో ఐదుగురు అక్కా చెల్లెలు నిద్రపోతున్న ఇంటి పైన ఇజ్రాయిల్ యుద్ధవిమానాలు బాంబులు వేసాయి. ఆ దాడిలో తాహిర్ (17), ఇక్రామ్ (15), సమర్ (12), దీనా (8), జవహర్ (4) అనే ఐదుగురు ఆడపిల్లలు ఇజ్రాయిల్ దుర్మార్గానికి బలైపోయారు. ఆ పిల్లల తండ్రి అన్వర్ బలూషా 'రాత్రనక పగలనక కష్టపడి పెంచిన పిల్లలను క్షణంలో కోల్పోయానని' ఏడ్చాడు. గాజాలో పాలస్తీనీయులపైన ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దురాగతాలను చూస్తుంటే, ఒక మౌలికమైన ప్రశ్న ఉదయిస్తుంది. నిజానికి ఇజ్రాయిల్ ఒక ప్రజాస్వామిక దేశమా లేక టెర్రరిస్టు రాజ్యమా?

గత ఆరు నెలలుగా హమాస్ వేసిన ఖాసం రాకెట్ల దాడిలో మరణించిన ఇజ్రాయిలీల సంఖ్య సున్నా. గత ఎనిమిది సంవత్సరాలలో ఈ రాకెట్ల దాడులలో పదహారు మంది ఇజ్రాయిలీలు మరణించారు. ఇళ్లలో తయారు చేసిన 'ఖాసం' పిల్ల రాకెట్లకు శక్తిలేదు. గైడెన్స్ లేదు.'ఖాసం రాకెట్లు జనాన్ని చంపటానికి పనికిరావు కాని మానసిక ఒత్తిడి కలిగిస్తాయని' ఇజ్రాయిలీ మిలటరీ నిర్ధారించింది. రాకెట్ల సాకుతో ఇజ్రాయిల్ కొన్ని వేలమంది పాలస్తీనీయులను చంపివేసింది. 'ఆత్మరక్షణ కోసం' అనే ఇజ్రాయిలీ వాదనలో ఏమాత్రం విశ్వసనీయత లేదు. ఇజ్రాయిల్ గాజాపైన ఆర్థికపరమైన ఆంక్షలు పెట్టింది. నీరు, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకొని పూర్తిగా గాజాను దిగ్బంధించింది. తినడానికి ఆహారం లేక, ఆసుపత్రులలో మందులు లేక, రవాణాకు పెట్రోల్ కరువై పాలస్తీనీయులు విలవిలలాడుతున్నారు.

ఎప్పటిలాగే అమెరికన్ మీడియా గుడ్డిగా ఇజ్రాయిలీ దుర్మార్గాలను కప్పిపుచ్చుతూ, 'ఇజ్రాయిల్ ఆత్మరక్షణ కోసం హమాస్ పైన దాడులు' చేస్తుందనే కట్టుకథలు ప్రచారం చేస్తోంది. న్యూయార్క్ టైమ్స్ జెరూసలెం బ్యూరో సంపాదకుడు 'హమాస్ రాకెట్ దాడులు ఆపడానికి, హిజ్బుల్లా గెరిల్లాల చేతిలో చవిచూసిన ఓటమి చెరిపేసి తన మిలటరీ

అధికారం సహాయంతో తమకవసరమైన ఏయే పనులు చేసుకోవచ్చునో, సమాజాన్ని ఎట్లా చీల్చవచ్చునో ప్రాథమిక పాఠశాలల పాఠ్య పుస్తకాలలో విష ప్రచారాన్ని ప్రారంభించడం నుంచి, బహుళజాతి సంస్థలకు దేశ వనరులను అమ్మివేయడం దాకా రాజకీయ అధికారంతో ఏమేమి చేయవచ్చునో సంఘ్ పరివార్ గుర్తించింది. లోక్‌సభలో రెండు స్థానాలతో ఉన్న పార్టీ క్రమంగా అధికారం వహించడానికీ, తన నేతృత్వంలో ఐక్య సంఘటన ప్రభుత్వాన్ని ఏర్పర్చడానికీ ఒక మార్గంగా మత విద్వేషాల వ్యాప్తిని చూసింది. ఆ అధికారం చేయిజారిన తరువాత, ఆ అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలంటే విద్వేషాలను మరింత పెద్ద ఎత్తున, నిరంతరంగా సాగించాలని అర్థం చేసుకుంది. మాలేగావ్ ఘర్షణలలో బయటపడిన పథకాల స్వరూపం చూస్తే ఈ కార్యక్రమానికి ఎంత సుదూరాలోచన ఉన్నదో అర్థమవుతుంది.

అయితే ఎంత చెప్పుకున్నా భారత సమాజ వాస్తవికతలో మతం కన్నా ప్రధానమైనది కులం. హిందూ మతాన్నీ, మనుస్మృతినీ నమ్మినా, ప్రచారం చేసినా కుల విభేదాన్ని పాటించాలి. కులవివక్షను పాటించాలి. అస్పృశ్యతను పాటించాలి. అంటే, తాము కోరుకున్న రాజకీయ ఐక్యతను సాధించడం కుదరదు. అందువల్ల కుల ప్రస్తావన లేని మతం అనే ఏకశిలా సదృశ, కృత్రిమ ఐక్యతను సాధించడానికి సంఘ్ పరివారం ప్రయత్నిస్తోంది. అందువల్లనే బాబ్రీ మసీదు విధ్వంసంలో అందరి కన్నా ముందర దళితులను పెట్టడం, గుజరాత్ మారణకాండలో ఆదివాసుల చేతికీ, దళితుల చేతికీ, వెనుకబడిన కులాల చేతికీ ఆయుధాలిచ్చి ముస్లింలను ఊచకోత కోయించడం, కందమాల్‌లో ఆదివాసులను రెచ్చగొట్టి దళిత క్రైస్తవుల మీద దాడులు చేయించడం – మొదలైన అన్ని పనులలోనూ తనకు కుల విభేదం లేదన్నట్టు నటిస్తోంది.

ఇటీవలి 'మతఘర్షణ'ల వెనుక ఉన్న ఈ ఆర్థిక, రాజకీయ, సామాజిక కోణాలనూ, ఆ క్రమంలో 'మతఘర్షణ'లు తీసుకుంటున్న కొత్త హింసా రూపాలనూ విశ్లేషించుకున్నప్పుడు మాత్రమే వాటిని సమగ్రంగా అర్థం చేసుకోగలం. దేన్నయినా ఓడించదలచుకున్నప్పు దాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడం మొదటి షరతు.

సత్తా చాటుకోవడానికే, ఇజ్రాయిల్ గాజా పైన దాడిచేసిందని' వక్రీకరిస్తున్నాడు. ఇజ్రాయిలీ ప్రాపగండ యంత్రం చాలా బలమైనది. అబద్ధాలను అద్భుతంగా వల్లెవేస్తది. ఊచకోతలు కోసి, హత్యలు చేసి అమాయకంగా నటిస్తది. దానికి అమెరికన్ మీడియా వంతపాడుతోంది. ఆఖరికి అమెరికన్ మీడియా కన్నా ఇజ్రాయిల్ మీడియా కొంత మెరుగు. ప్రముఖ ఇజ్రాయిలీ పత్రిక హెరాజ్ గాజా పైన ఇజ్రాయిలీ దాడి ఖండిస్తూ కథనాలు రాసింది. గాజాలో విదేశీ జర్నలిస్టులు వెళ్లడాన్ని ఇజ్రాయిల్ నిషేధించింది.

వియత్నాం యుద్ధకాండలో అమెరికా మే లాయ్ మారణకాండకు పాల్పడి ఐదు వందల మంది అమాయక పౌరులను చంపేసింది. లెబనాన్‌లోని సాబ్రా, షటిలా రెఫ్యూజీ క్యాంపులలో ఫాలాంగిస్టులతో కలిసి ఇజ్రాయిల్ మూడువేల మంది పాలస్తీనీయులను ఊచకోత కోసింది. మళ్లీ ఇప్పుడు ఇజ్రాయిల్ గాజాలో మరొక మారణహోమానికి పాల్పడుతోంది. మానవ హక్కులను ఉల్లంఘిస్తూ, నిరాయుధులైన పౌరులను ఊచకోత కోస్తోంది. ఆనాడు జర్మనీలో హిట్లరు యూదులను ఊచకోత కోసిన రీతిలో దుర్మార్గాలకు పాల్పడుతోంది. 'డిగ్నిటీ' అనే పడవలో డాక్టర్లు, మానవ హక్కుల కార్యకర్తలు వైద్యం కోసం తెచ్చిన మందులను ఇజ్రాయిల్ అడ్డుకొంది. అమానుషంగా దాడిచేసి పడవను పాక్షికంగా నాశనం చేసింది.

ఈజిప్టు అధ్యక్షుడు హోస్ని ముబారక్ అమెరికా అడుగులకు మడుగులు ఒత్తుతూ, ఇజ్రాయిల్‌తో లాలూచీ పడ్డాడు. ఒకవైపు నుండి గాజాను ఇజ్రాయిల్ దిగ్బంధం చేస్తే, మరొకవైపు నుండి రాఫా సరిహద్దును ఈజిప్టు ఉద్దేశపూర్వకంగా మూసివేసింది. దీనితో ఇజ్రాయిలీ దాడుల నుండి తప్పించుకునేందుకు ఈజిప్టులోకి వెళ్లడానికి, వైద్యం కోసం మందులు తెచ్చుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ ప్రవర్తన కూడా చాలా అనుమానస్పదంగా ఉన్నది. గాజాలో పాలస్తీనీయుల ఊచకోత జరుగుతుంటే మరొకవైపు అబ్బాస్ విదేశీ పర్యటనలో ఉన్నాడు. తప్పంతా 'హమాస్'దేనని ప్రకటనలు ఇచ్చాడు. సౌదీ నియంతలు ఎప్పటిలాగా అమెరికా కనుసైగలలో మౌనంగా ఉన్నారు.

త్వరలో ఇజ్రాయిల్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. లేబర్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది. ఆ పార్టీ నాయకుడు ఇజ్రాయిల్ డిఫెన్స్ మినిస్టర్ యహుద్ బరాక్ ఎన్నికల రేసులో చాలా వెనుకబడి ఉన్నాడు. ఇజ్రాయిల్ ప్రధాని యహుద్ ఒల్మరట్ అవినీతి ఊబిలోకి కూరుకు పోయాడు. కడిమా పార్టీ నాయకురాలు, విదేశాంగ మంత్రి టిజిపి లెవీనీ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విఫలమై ఎన్నికలకు పిలుపు నిచ్చింది. ప్రజావిశ్వాసం కోల్పోయిన రాజకీయనాయకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. యుద్ధానికి దిగి ప్రజల నుండి మద్దతు పొందాలని ప్రయత్నిస్తున్నారు. రక్తాన్ని పారించి, శవరాజకీయాలు నడిపి ఓట్లు రాబట్టుకోవాలని చూస్తున్నారు.

అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు బుష్ టెక్సాస్ విడిదిలో మజా చేస్తున్నాడు. కనీసం దాడులు ఆపమని కానీ, కాల్పుల విరమణ ప్రకటించమని అనడానికి నోరు రాలేదు. పైగా ఇజ్రాయిలీ దురాగతాలను సమర్థిస్తూ, హమాస్‌దే తప్పని ప్రకటనలు ఇస్తున్నాడు. కొత్త అధ్యక్షుడు బరాక్ ఒబామా 'మార్పు', 'ఆశ' అని అద్భుతమైన ఉపన్యాసాలు ఇచ్చాడు. చేతలకి వచ్చేసరికి ఎలాంటి స్పందనలేదు. అదేమంటే ఇంకా గద్దె ఎక్కలేదని కుంటిసాకులు చెబుతాడు. ఒబామా ఆర్థికరంగాన్ని, ఆటో కంపెనీలకు బిలియన్ల డాలర్లు ఇవ్వమని మాత్రం మాట్లాడతాడు. గాజాలో నాలుగు వందల మంది అమాయకులను ఇజ్రాయిల్ ఊచకోత కోస్తుంటే ఒబామా గారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డది. ఒబామా నిజస్వరూపం బయటపడుతున్నది.

ఇజ్రాయిల్ పాలకులు మానవహక్కులను కాలరాని యుద్ధనేరాలకు పాల్పడుతున్నారు. వీళ్లని గుడ్డిగా అమెరికా, బ్రిటన్ దేశాలు సమర్థిస్తున్నాయి. గాజాలోని పధ్నాలుగు మిలియన్ల పాలస్తీనీయులను ఇజ్రాయిల్ సామూహికంగా శిక్షిస్తోంది. నిరాయుధులైన అమాయక పౌరులను, పిల్లలను, స్త్రీలను చంపుతోంది. నిజమైన టెర్రరిస్టు ఎవరు? నాలుగు వందల ముప్పై మంది అమాయకులను చంపిన ఇజ్రాయిలా? లేదంటే నలుగురిని చంపిన హమాస్? ప్రజాస్వామిక వాదులుగా మనమంతా ఇజ్రాయిల్ యుద్ధనేరాలను, స్టేట్ టెర్రరిజాన్ని ఖండిద్దాం. పాలస్తీనా సోదరులకు సంఘీభావాన్ని తెలియజేద్దాం. సామ్రాజ్యవాద దురాక్రమణదారులను ఓడించడానికి ఉద్యమిద్దాం. వీ

అసహజ మరణాలు నమోదు చేద్దాం!

ఆగస్ట్ 2006 నుంచి వీక్షణంలో అసహజ మరణాల సూచి ప్రారంభించాం. మన చుట్టూ అసహజంగా చనిపోతున్న రైతులు, చేనేత కార్మికులు, వరకట్న మరణాలు, రకరకాల ప్రమాదాలలో చనిపోతున్నవారు, వైద్యం అందక, ప్రకృతి వైపరీత్యాలతో మరణిస్తున్నవారు, హత్యలు ఇలా అనేక సామాజిక రంగాలనుంచి మరణిస్తున్నవారి సంఖ్యను నమోదు చేయడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం. ఏయే సామాజిక, రాజకీయార్థిక కారణాలతో చనిపోతున్నారో పరిశోధన చేయాల్సి ఉంది. ఇప్పటికి 20 జిల్లాల నుంచి మాకు ఈ సమాచారం అందుతోంది. ఇంకా **కడప, పశ్చిమ గోదావరి, ప్రకాశం** జిల్లాల నుంచి అసహజంగా చనిపోతున్న వారి సమాచారం అందాల్సి ఉంది. మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరూ పాలుపంచుకోవచ్చు. దీనికి పారితోషికంగా వీక్షణం ప్రతిని మీకు పంపిస్తాం.

ఆసక్తి గలవారు వివరాలకై సంప్రదించండి : **వై. రామచంద్రం** (సర్క్యులేషన్ మేనేజర్) ఫోన్ నెం. 9949391028

– సంపాదకులు

గంగవరం పోర్ట్ నిర్మాణం వల్ల నిర్వాసితులైన మహిళల, వాకపల్లి బాధిత మహిళల ఆరాట పోరాటాలను వివరిస్తున్నారు **శివలక్ష్మి**

'అభివృద్ధి'ని ప్రశ్నిస్తున్న బాధితులు

అక్టోబర్ 18 ఉదయం విశాఖ సముద్రతీరం కింద ఉన్న రెండు గ్రామాలకు రచయిత్రుల బృందం వెళ్లాం. ముందుగా ఇందిరా గాంధీ హయాంలో వచ్చిన విశాఖ స్టీల్‌ప్లాంట్ వల్ల నిర్వాసితులైన గంగవరం అనే గ్రామానికి తరలించబడ్డ కుటుంబా లను కలిశాం. పోర్ట్ నిర్మాణం చేపట్టి ప్రభుత్వం మళ్లీ రెండోసారి సుమారు పదిహేనువేల మంది ప్రజల్ని (జాలారిపల్లిపాలెం, చిన్నపల్లి పాలెం, పెద్దపల్లిపాలెం, గంగవరంతో కలిపి) నిర్వాసితుల్ని చెయ్యడానికి పూనుకుంది. వాళ్లందరూ సముద్రాన్ని ఆనుకున్న కొండలు వాళ్ల జీవనాధారమని చెప్పారు. కొందరు మత్స్యకారులు చేపలు పట్టి జీవిస్తారు. మహిళలూ, యువకులూ కట్టెలు కొట్టుకొస్తారు. సముద్రపుటొడ్డు నున్న యేర్లూ, సంపదలూ పోయాయని ఆవేదన చెందారు.

మహిళలు చాలాసార్లు 'మా సముద్రం పోయింది' అని ఆందోళనగా చెప్పారు. మరిణమ్మ అనే మహిళ ప్రభుత్వం బలప్రయోగం తో నూకరాజుని చంపినప్పుడు అక్కడే ఉన్న తన శరీరానికి తగిలిన బాంబుదెబ్బల్ని చూపించింది. ఆదెమ్మ అనే మహిళ - మా ఉపాధిని మా నుంచి లాక్కునే హక్కు కేంద్ర ప్రభుత్వానికైనా, కోర్టులకైనా లేదుగాక లేదు అని కచ్చితంగా తెగేసి చెప్పింది. శాంతి అనే మహిళ నాయకత్వంలో మహిళలు ఇల్లిల్లూ తిరిగి మహిళలందర్నీ చైతన్యపరిచి 'వంటా-వార్పు' అనే పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకుని, నెత్తిన గంపలలో గిన్నెలు, పప్పూ, బియ్యం పెట్టుకొని, చేతి సంచిలో బట్టలు పెట్టుకుని పురుషుల కంటే ముందుగా పోర్ట్‌లోకి చొచ్చుకుపోయి మహిళా ప్రభంజనాన్ని సృష్టించారు. టెంట్లు పడిపోయినాసరే అక్కడే పదిహేను రోజులపాటు కాపురాలు పెట్టి, పోర్ట్ పని నిలిచిపోయేలా చేసి, పోలీసుల్ని హడలెత్తించిన కథనాల్ని విన్నాం. మహిళలు పోటెత్తిన సముద్రంలాగా రెండు వందల నుంచి మూడువందల మంది దాకా ఉన్న పోలీసుల్ని తోసుకొని పోర్ట్‌లోకి ప్రవేశించారని విని ఉత్తేజితులమైపోయాం. పేద ప్రజల్ని అక్కున చేర్చుకుంటామని ఉపన్యాసాలిచ్చే ప్రభుత్వం - మూడు సంవత్సరాల నుంచి ఏ రాజకీయ నేపథ్యం లేకుండా స్త్రీలూ, పురుషులూ, వృద్ధులూ కేవలం వాళ్ల ఉపాధి కోసం, నిర్మాణాల వల్ల పోగొట్టుకున్న జీవన వనరుల్ని మళ్లీ కల్పించాలనే డిమాండ్‌తో శాంతియుతంగా ఉద్యమిస్తున్న ప్రజల్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తోంది.

బాంబుదాడిలో చనిపోయిన నూకరాజు తమ్ముడు మాతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్యాకేజీ కింద కొందరికి చెక్కులూ, కొందరికి మూడువేల రూపాయల జీవన భృతి ఇస్తోందని చెప్పారు. మీ డిమాండ్లేమిటని ఆయన్ని ప్రశ్నించాం. 'మైనర్‌పోర్ట్ అని మాతో చెప్పి మేజర్ పోర్ట్ నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాన్ని వెంటనే ఆపాలి. పోర్ట్ సునామీ కంటే ప్రమాదకరమైనది' అని ఒకవైపు చెప్తూనే రెండోవైపు రాబోయే పోర్ట్‌లో ఉద్యోగాలివ్వమని (గ్రామంలో చదువుకున్న వారున్నారనీ, ఉన్నత సాంకేతిక పదవుల నుంచి లేబర్ వరకూ వారి అర్హతలనుబట్టి ఇంటికో ఉద్యోగం కావాలని) అడిగామన్నారు. మహిళలు ఎక్కడా రాజీపడకుండా మిలిటెంట్‌గా ఉద్యమాన్ని మలచుకుంటూ వస్తే ప్రభుత్వం ఉద్యోగాల పేరిట కుటుంబాల్లో కూడా చిచ్చుపెట్టడం చూసి నీరుగారిపోయాం.

ఇక స్త్రీల ఉద్యోగాలు ఊహకే అందవు. పురుషుల్లేని ఇళ్లలో బాగా చదువుకున్న ఒకరో ఇద్దరో స్త్రీలకు ఉద్యోగాలొచ్చినా వాళ్లకు ట్రేడ్‌యూనియన్లు సాధించి పెట్టిన ప్రత్యేక హక్కులు, ప్రసూతి సెలవు లాంటివేమీ ఉండవు. శ్రామిక కుటుంబాల్లో స్త్రీ - పురుషులిద్దరూ శ్రమిస్తారు గనుక కొంతమేరకు స్త్రీ - పురుష సమానస్థాయి ఉంటుంది. ఇంటికో ఉద్యోగంతో పితృస్వామ్యంలోకి కూరుకుపోవలసిందే.

'మా సముద్రం, మా సెలయేర్లు, మా భూమి, మా నీరు, మా నివాసాలు ఇక్కడ నుంచి కదిపే హక్కెవరికీ లేదు' అని నిలదీస్తున్న మహిళల్లో ఉన్న పోరాట పటిమ, ఉద్యోగాలొస్తాయన్న ఆశతో రాజీపడిపోతున్న పురుషుల్లో కనిపించలేదు.

కుటుంబంలో పురుషులు ఒక్కరికి ఉద్యోగం ఆశించడం ద్వారా పెత్తనాన్నీ, ఆధిక్యాన్నీ కోరుకుంటున్నారు. స్త్రీలు మాత్రం ఆరాటాలకు, ఆర్భాటాలకు స్పందించకుండా ఇంటిల్లిపాదీ శ్రమ చేయడానికి అనువైన పరిస్థితుల్నీ స్థిరత్వాన్నీ కోరుకుంటున్నారు.

తర్వాత దిబ్బపాలెంలో శిథిలమైన ఇళ్లు చూశాం. అక్కడక్కడా ప్యాకేజీలకు లొంగని ఇళ్ల వాళ్లున్నారు. సుమారు 150 కుటుంబాలున్న ఈ ప్రాంతంలో ఇళ్లను ధ్వంసం చేశారు. ఒకరోజున ఆ ఇళ్లు మనుషుల సందడితో ఎంత కళకళలాడాయో! వాటికి ఇంటివాళ్ల అభిరుచుల్ని బట్టి అందమైన రూపం ఉండేది. జీవంతో పిల్లాపాపలతో చెట్లూ, పూలతో మిసమిస లాడేవి. ఇప్పుడు అవి ఒట్టి ఇటుకల గుట్టలు. మనుషులు ఆ ఇళ్లలో ఏమేమి స్వప్నాలు కన్నారో అన్నీ నేలమట్టమైపోయి ఆనవాలు లేకుండా పోయాయి.

అక్టోబర్ 19న మా ప్రయాణం వాకపల్లికి సాగింది. ఆలస్యమైనా

వాకపల్లి మహిళల్ని కలుసుకోగలిగినందుకూ, వాళ్లకు జరిగిన అన్యాయాన్ని కాస్త పంచుకోగలిగినందుకు కొంచెం సంతృప్తి కలిగింది. మమ్మల్ని చూసి అందరూ వచ్చి పోవడమేగాని, దోషుల్ని శిక్షించడం లేదని మొదట బాధపడినా తర్వాత రిసీవ్ చేసుకున్నారు.

సిత్తాయి, చిలకమ్మ, శ్రీదేవి, లక్ష్మి మొదలైనవారు మాతో మాట్లాడారు. అందరి మాటా ఒకటే 'గుడ్డి ప్రభుత్వం. దానికి కళ్లూ, నీతి, నిజాయితీ, సిగ్గూ ఏమీ లేవు. మాకు చదువులేదు, సామిలేదు, తిండిలేదు, సరైన బట్టలేదు. అడవిదుంపలు, తేనే, జిగురు, చెట్ల బెరడులు, తునికి ఆకులు, చిరోంజి విత్తనాలు లాంటి అడవి సంపదలే మా జీవనాధారం. అడవి దాటి బయటికి రానివాళ్లం. ఎవరి జోలికీ వెళ్లనివాళ్లం. మా అడవిదాటి మా జిల్లా దాటి హైదరాబాద్ దాకా వచ్చి హోంమంత్రికి, ముఖ్యమంత్రికి మాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాం. మానంపోయింది. న్యాయం చెయ్యమన్నాం. ఎవరెవరో వస్తున్నారు. తెలుసుకుని పోతున్నారు. లోకం మమ్మల్ని నమ్మట్లేదు. పోలీసు లం...కొడుకుల్నే నమ్ముతుంది' అంటూ కన్నీళ్లతో అంతులేని వ్యథతో ఆక్రోశం వెలిబుచ్చారు.

'భూమి పల్కుతుంది – ఆకాశం ఎందుకు నమ్మకోదు?' అని ఆశువుగా చదువురాని సిత్తాయి విసిరిన సవాలుకి చదువుకున్న అందరూ అవాక్కైపోయారు. 'పోలీసులు చేసిన పని మా పురుషుల్లో ఎవరైనా చేస్తే వెంటనే మా గిరిజన సమాజంలో కుక్కల్ని కాల్చినట్టు కాల్చి చంపేస్తామ'ని చెప్పింది. మనం నివసించే నాగరిక సమాజం ఎంత తోడేళ్లమయంగా ఉందో అర్థమై అందరి తలలూ దిమ్మెక్కిపోయాయి. ఎ.ఎస్.పి. ఐదు లక్షలిస్తామని చెప్పి భర్తలకు తెలియకుండా ఖర్చు పెట్టకోమని చెప్పారని చెప్పారు. లక్షలాది రూపాయల్ని అడవిలో కుళ్లిన ఆకుల్ని తీసిపారేసినట్లు తీసేయగలిగిన ఆ యువతులు రకరకాల ప్రలోభాలకి లొంగిపోతున్న నేటి సభ్య సమాజానికి ఆదర్శమైన నిలువెత్తు వ్యక్తిత్వాలు. వాళ్లవైపు అబద్ధం లేకపోతే ఐదు లక్షలెందుకిస్తారని ప్రశ్నించారు. వాళ్ల దుఃఖానుభవాల్ని స్పష్టంగా వివరిస్తుంటే మేము కన్నీటి సముద్రాలమైపోయాం. శరీరాలు వేరుగాని మనందరి నాడుల్లో ప్రవహించే రక్తం ఒకటేనని మా మమేకత్వాన్ని సుస్పష్టంగా ప్రకటించగల భాషరాక మూగవేదనతో బెంబేలు పడిపోయాం. గుజరాత్ గాయాలు చూచిన వాళ్లకి ఆ స్త్రీల రోదనలు గుర్తొచ్చాయి. వాళ్లూ అంతే... మాకేం వద్దు దోషుల్ని శిక్షించాలన్నారు. న్యాయం కావాలన్నారు. ప్రపంచంలో ఏ ప్రాంతం నుంచైనా ప్రజల్ని తరిమేయదల్చుకున్నప్పుడు భయభ్రాంతుల్ని చేయడానికి రాజ్యం ప్రయోగించే కుట్రలో అత్యంత క్రూరమైనది స్త్రీల మీద అత్యాచారం.

స్త్రీ స్వాతంత్ర్యం గురించి ఒకవైపు బ్రహ్మాండమైన ఉపన్యాసాలిస్తూ – మరోవైపు గిరిజనులు ఆరాధించే భూమి నుంచి, అడవి సంపదల నుంచి వారిని తప్పించటానికి స్త్రీల మీద దాడులు చేయించడం ఎంత అమానుషం? మనుషత్వాన్ని గుర్తించమని ఆర్ద్రంగా మహిళలందరికీ సందేశమిస్తున్నారు ఆ యువతులు.

వాళ్లని దగ్గరగా చూసిన మాకు వాళ్లకి ప్రపంచంలో అబద్ధమాడే అవసరమే లేదనిపించింది. వాళ్ల నిర్భీతి, నిజాయితీల ముందు సభ్యసమాజం సంకటమవుతుందనిపించింది. రచయిత్రులందరూ అక్కడున్న కొన్ని గంటల్లో కొన్ని దశాబ్దాలకు సరిపోయే ఆలోచనలు చేశారు. ఆ యువతుల నుండి పొందిన స్ఫూర్తిని దశదిశలూ విరజిమ్మడానికి గట్టి ప్రతిజ్ఞలు చేశారు. మా హృదయాల నుండి వారి హృదయాలకు భరోసా ప్రవహించింది.

అక్టోబర్ 20న 'బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ' కన్వీనర్ కాకి దేముడమ్మ, ఆమె ఉద్యమ స్నేహితురాలు పార్వతి అనే ఇద్దరు సాహస వనితల్ని కలుసుకున్నాం. కాకి దేముడమ్మ మా ముందు అనర్గళంగా ప్రసంగించింది. ఎటువంటి శషభిషలూ లేకుండా నిర్భయంగా స్పష్టంగా – 'తనేమిటి? తన చుట్టూ ఉన్న ప్రజల బతుకులేమిటి? శత్రువులెవరు? దేనికోసం పోరాడాలి?' అనే విషయాల పట్ల మాట్లాడడం చూసిన అందరూ అబ్బురపడిపోయారు.

జిందాల్ కంపెనీతో బాక్సైట్ తవ్వకాల ద్వారా అల్యూమినియం తయారు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. భూములు కావాలని 2006లో ప్రభుత్వం నోటిసులు పంపించింది. ఎకరం ఇరవై లక్షల ధర పలుకుతుంటే జిందాల్ రెండు లక్షలకే కాజేస్తోంది. ఉద్యోగ హామీ, షేర్ హామీ, నివాస హామీ ఏమీ ఆధారాలు లేవు. ఒట్టి మాటలే. ఆదివాసులకు చదువులు లేనందువల్ల భూములివ్వమని చెప్పామని దేముడమ్మ చెప్పింది. 'అమ్మకం' మొదలుపెడితే మగవాళ్లు తాగి తాగి మరణానికి దగ్గరౌతారని చెప్పింది. 6 జూన్ 2007 న జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో జిందాల్ శుద్ధి కర్మాగారం కోసం భూములివ్వమని 96 శాతం ప్రజలు చెప్పారని చెప్పింది. జాయింట్ కలెక్టర్ ఫ్యాక్టరీ పెట్టేది లేదని చెప్పారు. తర్వాత 'ప్రభుత్వ అధికారులు భూమి మాది, స్వాధీనం చేసుకుంటా'మన్నారు. జిందాల్ యాజమాన్యాన్ని బాధిత ప్రజలు బంధించారు. 'మా ఇంట్లో దొంగ దూరి మా మీద కేసు పెట్టడేమిటి?' అని నిలదీస్తే యాజమాన్యం 'మీ భూముల్లోకి రామని అగ్రిమెంట్ రాసిచ్చింది. 'భూమికి భూమి, ఇంటికి ఇల్లు – మా గ్రామ పరిధిలో తవ్వకాలే వద్దు' అనేవి ప్రధానమైన డిమాండ్లు. బీడు భూముల్ని పంట భూములుగా చేస్తానన్న ప్రభుత్వం బొడ్డవరంలో పచ్చని పంట పొలాలు, అధిక దిగుబడినిచ్చే కొబ్బరి, అరటి, జీడితోటలను బీడు చెయ్యాలని చూస్తోంది.

జిందాల్ ఫ్యాక్టరీ వల్ల వేలాది ఎకరాల పంట భూములు, లక్షలాది ప్రజల తాగునీరు, పర్యావరణం, అటవీ సంపద స్వచ్ఛమైన గాలీ, వెలుతురూ అన్నీ ధ్వంసం కానున్నాయి. 'మనిషి భయపడితే భయపడుతూనే ఉంటాడు. చావో రేవో – ఎప్పుడైనా చావాల్సిందేగా' అనే తెగింపుతో గ్రామగ్రామానికి వెళ్లి యాజమాన్యానికి సంబంధించిన బిల్డింగ్‌ల గ్లాసుల్ని బద్దలు గొడుతూ, పైపులు నరికేస్తూ, టైర్ల గాలి తీస్తూ చెలరేగిపోయిందని దేముడమ్మని గురించి పార్వతి చెప్పింది. జిందాల్ యాజమాన్యం బ్యాంక్ బాలెన్స్, పిల్లలు, చదువులు, కావాల్సినంత డబ్బు – ఏదంటే అది ఇస్తామని కబురు చేసింది. 'నాకున్న భూమిలోనే చస్తానని' చెప్పినప్పుడు ఎవరితో చెప్పొద్దని బతిమిలాడారు. ఎందుకు తీసుకోలేదు? అని మాలో ఒకరు ప్రశ్నిస్తే, 'నేను డబ్బుకి అమ్ముడుపోతే నాతో ఉన్న అమాయక జనం ఏం కావాలి?' అని ఎదురు ప్రశ్నించింది. మా జోలికొస్తే బట్టలూడదీసి పోలీస్‌స్టేషన్‌కి తీసుకొస్తామని

సామాజిక రుగ్మతగా ఉన్న పడుపు వృత్తిని రూపుమాపడానికి పతి ఒక్కరూ నడుం బిగించి తమవంతు కృషి చేయాలంటున్నారు **ఎ. సుదయ్యా, మడికొండ రాజు**

పడుపు వృత్తి నివారణ - సామాజిక బాధ్యత

మానవ సమాజ ఆవిర్భావం నుండి స్త్రీ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది. ఆదిమ సమాజంలో గణాలకు ఆధిపత్యం వహించి ఆహార సేకరణలో క్రియాశీలమైన పాత్రను నేటికీ స్త్రీ పోషిస్తోంది. సామాజిక పరిణామంలో స్త్రీ పై పురుషాధిక్యత పెరుగుతూ, స్త్రీ కేవలం పురుషుడి ఆనందానికి, సంతోషానికి కేంద్ర బిందువుగా మారింది. స్త్రీ పురుషుడి సొత్తుగా, వస్తువుగా మారింది. అనాది నుండి కూడా సామాజిక వ్యవస్థలో పురుషుడి భోగలాలసతకు స్త్రీని వాడుకున్నాడు. ఇది క్రమేణా వేశ్య వృత్తి లేదా పడుపు వృత్తిగా రూపాంతరం చెందింది. మానవుడు నాగరికతను నేర్చుకుంటున్న కొద్ది ఈ వృత్తి అనేక రూపాలను సంతరించుకుంది.

సమాజంలో స్త్రీ, పురుషుడితో సమానంగా విద్య, వైద్య, శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో అడుగులు వేస్తున్న సందర్భం ఉన్నప్పటికీ, ఆకలి మంటలతో, ఏ ఆదరణ లేకుండా, కుటుంబాలను తానే పోషించాల్సిన పరిస్థితి దాపురిస్తున్న సందర్భంలో, తన శరీరాన్ని కుటుంబ అవసరాలకు ఫణంగాపెడుతూ, సమాజంలో అవమానకరమైన గుర్తింపును పొందుతోంది. ప్రకృతి మీద అజమాయిషీని చేయగలిగే సాంకేతిక నైపుణ్యాన్ని మానవుడు సాధించగలిగినా ఈ సమాజంలో స్త్రీని ఒక సుఖాల ఉత్పత్తి వనరుగా చూసే పరిస్థితి వచ్చింది. కాబట్టి పడుపు వృత్తిలోని వివిధ కోణాలను స్పష్టంగా చూడాలి. మానవుని శారీరక అవసరాల్లో లైంగిక అవసరం ఒకటి. ప్రపంచంలో మానవులు తమ లైంగిక అవసరాలు తీర్చుకోవడానికి కొన్ని సాంఘిక, సాంస్కృతిక నిబంధనలు ఏర్పర్చుకొన్నారు. కాని సమాజంలోని కొంతమంది వ్యక్తులు ఈ నిబంధనలను ఉల్లంఘించి అనైతిక లైంగిక సంబంధాలను ఏర్పరుచుకుంటున్నారు. వీటికి అడ్డుకట్టవేసే నేపథ్యంలో వివాహ వ్యవస్థ, దాని ద్వారా కుటుంబ వ్యవస్థలు పుట్టుకొచ్చాయి. ఫలితంగా కొన్ని నీతి నియమాలు, పద్ధతులు, సూత్రాలు ఏర్పడ్డాయి.

పడుపు వృత్తి చాలా ప్రాచీనమైంది. భారతదేశంలోని దేవదాసీలు, గణికలు, జపాన్ దేశంలోని గైషాలు, గ్రీకు దేశంలోని హెటీరియా పద్ధతులు అతి ప్రాచీనమైనవిగా చెప్పబడుతున్నవి. పడుపు వృత్తికి పాల్పడిన వేశ్యలపై సమాజం అనేక ఆంక్షలు విధిస్తోంది. మన దేశంలో చారిత్రక ఆధారాలను పరిశీలించినట్లయితే ప్రఖ్యాతి చెందిన 'సోమనాథ్' దేవాలయంలో ఐదు వందల మంది, తంజావూర్ దేవాలయంలో నాలుగు వందల మంది దేవదాసీలు ఉన్నట్లు రాజారావు (పల్లవరాజు) పేర్కొన్నాడు. క్రీ.శ. 1235 లో జాయప్ప నాయకుని (గణపతి సేనాని) శాసనం దేవదాసీల గురించి 'సానులు, సావిమున్నూరు వారు' గా పేర్కొనగా క్రీ.శ. 121 లో మచ్చాపూర్ శాసనంలోని 'భోగస్త్రీ' అని 'కులపతి' అని 'భోగమనిషి' అని పేర్కొన్నారు.

స్వలాభం కోసం అలవాటుగా గాని, లేక అప్పుడప్పుడు గాని వివాహేతరమైన లైంగిక సంబంధాలను కలిగి ఉండటం పడుపు వృత్తి అని 'జాఫ్రీం' నిర్వచించాడు. సొంత ప్రయోజనం, పరస్పర సంబంధం,

---

చెప్పానని చెప్పింది. ప్రభుత్వం పెట్టిన బోర్డ్‌లు తీసి కాల్చేసి 'మా భూములివ్వం' అని వీళ్లు బోర్డ్‌లు పెట్టారు. వీళ్లు డి.ఎస్.పి. దగ్గరికి పోతూ ప్రెస్‌ని కూడా వెంట తీసుకెళ్లి 'ఊరికేనైనా వదిలేస్తాంగాని మా భూమిని వదులుకోం' అని చెప్తే డి.ఎస్.పి. నోరు మెదపలేదట.

రెండు నెలల క్రితం ఇంటికొచ్చి బూతులు తిట్టి అరెస్ట్ చెయ్యడాని కొచ్చామన్నాడట. అరెస్ట్ చెయ్యమంటే చూడడానికి కొచ్చామన్నారట. రెండోసారి వచ్చినప్పుడు కాకి దేముడమ్మ ఇంట్లో లేకపోతే తిట్టుకుంటూ పోయారట. దేముడమ్మే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి తిట్టి 'దమ్ముంటే వచ్చి అరెస్ట్ చెయ్య'మన్నదట. పోలీసు అధికారి 'నేను నిన్ను తిట్టలేదు. ఎవరో గిట్టనివాళ్లు చెప్పా'రని బతిమిలాడాడట. భర్త సహకరించక పోయినా, తన బాబు పూర్తి మద్దతిస్తాడని సంతోషంగా చెప్పింది. మా పేద ప్రజల కష్టాల్ని ప్రపంచానికి వెల్లడి చెయ్యాలనీ, మద్దతివ్వాలనీ కోరింది.

బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ ఒక మీటింగ్‌కు కాకి దేముడమ్మను అధ్యక్షురాలిగా పెట్టుకుంటే భర్త బంధిస్తే, పార్వతి నడిపింది. 'ప్రభుత్వ భూమి అడ్డుకోవడానికి వీల్లేదు' అని జిందాల్ బోర్డ్ పెడితే, ఆ బోర్డ్‌ను తీసి కాల్చేసి పార్వతి, ఆమె భర్త కలిసి - 'హెచ్చరిక నోటిస్ - ఈ స్థలం ఊలం సింహాచలం, సన్ ఆఫ్ బంగారయ్యా, ఊలం మల్లేశ్వరరావు, సన్ ఆఫ్ సింహాచలంలది. సర్వే నెం. 6-14, విస్తీర్ణం ఒక ఎకరా, 24 సెంట్లు. ఆక్రమణదారులు శిక్షార్హులు. ఇట్లు ఊలం మల్లేశ్వరరావు, ఊలం పార్వతి' అని బోర్డ్ పెట్టారు. ఈ పోరాట స్ఫూర్తిని అందరూ అందుకోవాలి.

ఆదివాసులు, దళితులు, బహుజనులు, వృద్ధులు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని పరిరక్షించుకోవడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవాలి. అపరిమిత భూదాహానికి వ్యతిరేకంగా పోరాట కార్యక్రమాలు రూపొందించుకోవాలి. వీ

తన ఇష్టం అనే మూడు లక్షణాలు పడుపు వృత్తిలో కనిపిస్తాయి. పడుపు వృత్తికి పాల్పడే వారిని ముఖ్యంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

వీరిలో కొందరు వంశ పారంపర్యంగా ఈ వృత్తిని అవలంబిస్తూ వస్తున్నారు. వీరికి తమ వృత్తి పట్ల అగౌరవంగానీ, అసహ్యభావం గానీ ఉండదు. భారతదేశంలో ఈ తరగతికి చెందిన వారిని ఒక ప్రత్యేక కులంగా పరిగణించారు. ఉదాహరణకు – ఆంధ్రప్రదేశ్ లో వీరు కళావంతులు గానూ, భోగంవారిగానూ, వేశ్యలుగానూ పిలువ బడుతున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వీరిని నృత్యగత్తెలని పిలుస్తున్నారు.

వేశ్యా గృహాలలోకి కొంతమంది యువతులను తీసుకొని వచ్చి వారితో వ్యభిచార వృత్తిని కొనసాగిస్తూ ఉంటారు. ఉత్తర భారతదేశంలో వీరిని 'ఘర్‌వాలీ' లేదా 'చౌదరాని' అని, దక్షిణ భారతదేశంలో వీరిని 'నాయిక'లని పిలుస్తారు. వేశ్యాగృహాలు నిర్వహించేవారు కొత్త యువతులకు శిక్షణనిచ్చి, వారికి కావలసిన సదుపాయాలను కూడా ఆ గృహంలోనే సమకూరుస్తారు.

సమాజంలో నిరుద్యోగిత, అధిక ధరలు, పెరుగుతున్న జీవన వ్యయ ప్రమాణాలు మొదలైన వాటిని తట్టుకోలేక కొంతమంది స్త్రీలు ఈ పడుపు వృత్తికి పాల్పడుతున్నారు. కొంతమంది స్త్రీలు 'ఉంచుకునే' పద్ధతి ద్వారా ప్రతి నెలకు కొంత ధనాన్ని ప్రతిఫలంగా తీసుకుంటూ, కొంతకాలం కొందరు పురుషుల వద్ద ఉంపుడు గత్తెలుగా ఉంటున్నారు.

పడుపు వృత్తికి ప్రధానంగా సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులు, కుటుంబ ఆర్థిక స్థితిగతులు, స్త్రీలపై హింస ఇతరేతర కారణాలుగా చెప్పవచ్చును. పడుపు వృత్తికి ముఖ్యకారణం పేదరికం. కులపరంగా, మతపరంగా ఉన్న కొన్ని నిబంధనలున్నాయి. కొన్ని ఆదిమ సమూహ జాతులలో ఉన్న బహుభార్యత్వం, అగ్ర కులాలు కింది కులాల స్త్రీలను చిన్నచూపు చూడడం, విలాస వస్తువుగా మార్చడం, కొన్ని నెలలు, సంవత్సరాల తరబడి ఇంకొకరి ఆధీనంలో ఉండడం, ఇలాంటి అనేక కారణాలుగా చెప్పవచ్చును. ఏది ఏమైనప్పటికి ఎక్కువమంది స్త్రీలు ఆర్థికంగా వెనుకబడి, జీవనాన్ని కొనసాగించ లేని పరిస్థితుల్లో ఈ వృత్తిలోకి వెళ్తున్నారనేది స్పష్టమైన అంశం.

పడుపు వృత్తి వల్ల గనేరియా, సిఫిలిస్ వంటి అతి భయంకర సుఖవ్యాధులు సంక్రమిస్తాయి. పురుషుల ద్వారా వారి భార్యలకు, సంతానానికి కూడా సంక్రమిస్తాయి. సమాజం లోని కొంతమంది యువతులు విలాస, ఆడంబర జీవితాలకై మోజు ఉండడంవల్ల అధికధనార్జన చేయవలసి రావడంతో ఈ వృత్తికి పాల్పడుతున్నారు. వీరికి లైంగిక జీవితంపట్ల సరైనా అవగాహన లేకపోవడం వల్లనూ, లైంగిక అనుభవం కోసం తొందరపాటు, వైవాహిక జీవితంలో అసంతృప్తి మొదలైనవి ఈ వృత్తికి ప్రోత్సాహమిస్తున్నాయి. ఇలాంటి వారి ప్రవర్తన సమాజంపై తీవ్ర చెడు పరిణామాలను కలగచేస్తుంది.

వేశ్యల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటానికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు ప్రభుత్వం చూపినట్లయితే చాలా వరకు ఈ వృత్తిని మానేసే అవకాశం ఉంటుంది. సమాజంలోని పేద వర్గానికి చెందిన స్త్రీలకు సహకార సంఘాల ద్వారా ఎక్కువగా ఉపాధి సౌకర్యాలను కల్పించాలి. ఈ అవకాశాలు నామమాత్రంగా కాకుండా వృత్తిలోని వేశ్యలకు కచ్చితంగా అందేటట్లు చూడాలి. అశ్లీలతను, అర్ధనగ్న చిత్రాలను, నీలి చిత్రాలను చౌకబారు సాహిత్యాన్ని పూర్తిగా నిషేధించాలి. గ్రామీణ, నగర ప్రాంతాల్లోని పేద యువతులకు స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి, స్వశక్తితో జీవనం కొనసాగించేటట్లు చూడాలి.

పాఠశాల స్థాయిలోనే సెక్స్ విజ్ఞానాన్ని పిల్లలకు అందచేసినట్లయితే సెక్స్‌పై గల అపోహలు తొలగిపోతాయి. అందుకు వయోజన విద్య వంటి కార్యక్రమాలను ముమ్మరంగా అమలు పరచాలి. విలాసవంతమైన వసతి గృహాలను, విశ్రాంతి గృహాలను పోలీసులు తరచుగా తనిఖీ చేసి అవసరమైతే వారి ఆస్తిని స్వాధీన పరచుకోవాలి. వృత్తిలోని మహిళల కోసం, పిల్లల, వృద్ధుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వారి అవసరాలను తీర్చి ఆసరగా నిలవాలి. ప్రతి కుటుంబంలో పురుషుడు తాగడం మూలంగా కుటుంబ పోషణ స్త్రీలకు భారం అవుతుంది. దీని వల్ల స్త్రీ వ్యభిచారం చేయాల్సిన పరిస్థితి వస్తోంది. కావున సమాజంలో మద్యపానాన్ని నిషేధించాలి. పడుపు వృత్తిని అవలంబిస్తున్న స్త్రీలతోపాటు మద్య దళారీలైన పురుషులకు కఠిన శిక్షలు విధించాలి.

సమాజంలో ఆధిపత్యవర్గాల సుఖాల కోసం ఈ వ్యవస్థను అనాది నుండి స్థిరత్వం కల్పించారు. చారిత్రకంగా మీ వృత్తి ఇదేనంటు కొన్ని కులాలకు ఆపాదించగా, ఆర్థికంగా కృంగిపోయి, అనాథలుగా సమాజంలో జీవనం కొనసాగించ లేని అనేకమంది కూడా ఈ వృత్తిలోనే కొనసాగుతున్నారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఈ వ్యవస్థ ఎక్కువగా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాలలో మరీ ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితి ఎందాకా వెళ్లిందంటే గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద మధ్యతరగతి మహిళలు తప్పని స్థితిలో, రకరకాల పద్ధతుల్లో ఈ రొంపిలోకి నెట్టబడుతున్నారు.

ఈ వృత్తిని తొలగించాలంటే సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఆర్థిక చేయూతను కల్పించాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను పెంపొందించాలి. మహిళల పట్ల ఉన్నటువంటి చెడు భావనను తొలగించాలి. స్త్రీలను వ్యాపార వస్తువుగా చూపించే అశ్లీల మీడియాను వెలివేయాలి. అశ్లీల సాహిత్యాన్ని నిషేధించాలి. ముఖ్యంగా స్త్రీలు స్వయం శక్తితో నిలబడగలిగే ఉపాధి మార్గాలను ప్రభుత్వం కల్పించాలి. అంతేగాక ఇప్పటికీ ఈ వృత్తులను కొనసాగిస్తున్న కుటుంబాల పట్ల, స్త్రీల పట్ల తోటి సమాజం సభ్యకరమైన ప్రవర్తనను ఆచరించే విధంగా చూడగలగాలి. ఆయా గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటుచేసి, ఈ వృత్తుల కుటుంబాలను ఆదుకోవాలి. ఈ వృత్తుల వారి పిల్లల విద్యాభ్యాసం కోసం ప్రత్యేక దృష్టితో ప్రభుత్వం, సమాజం చూడగలగాలి. ముఖ్యంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల స్త్రీలలో అభద్రమైన జీవన పరిస్థితులను తొలగించి వేయాలి. కేవలం డబ్బు ఒక్కటే మానవ సంబంధాలను నిర్ణయించగలిగే ఈ పరిస్థితుల్లో, సామాజిక దొంతరలలో పేరుకుపోయిన అమానవీయ సామాజిక వ్యవస్థ నుండి మానవీయ సామాజిక వ్యవస్థీకృత సంబంధాలను నిలబెట్టగలిగే ఒక మెరుగైన సమాజంకై కృషి చేయాలి. 'పడుపు వృత్తిని పడకవరకే ఆలోచించకుండా విశాలమైన సామాజిక దృక్పథంతో రూపుమాపడం బాధ్యతగా అందరూ గుర్తించి నిర్మూలనకు కృషిచేయాలి. వీ

వరంగల్ నగరపాలక సంస్థలో కార్పొరేటర్లుగా ఎంపికైన మహిళల నేపథ్యం, రాజకీయ నిర్ణయాలలో భాగస్వామ్యం, సాధికారతల గురించి వివరిస్తున్నారు **తట్ల సాంబలక్ష్మి, కొత్తపల్లి లలిత**

వరంగల్ నగరపాలక సంస్థ - మహిళలు

మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో సమానత్వం సాధించేంత వరకు ఏ దేశం అభివృద్ధి సాధించలేదనేది కాదనలేని వాస్తవం. ఏ జాతి అభివృద్ధి అయినా మహిళాభివృద్ధి మీదనే ఆధారపడి ఉంటుంది. 2001 సంవత్సరాన్ని భారత ప్రభుత్వం మహిళా సాధికారత సంవత్సరంగా ప్రకటించింది. మహిళా సాధికారతకు సంబంధించి మాట్లాడటమనేది ఈ రోజు ఫ్యాషన్‌గా పరిణమించింది. దానర్థం అధికార వికేంద్రీకరణ. మహిళలకు పురుషులతోపాటు సమానహోదా, సమానావకాశాలూ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలూ ఇస్తే తప్ప మహిళల అభివృద్ధి సాధ్యం కాదు.

సాధికారత అంటే స్త్రీ పురుషుల ఆలోచనా దృక్కోణంలో మార్పు. మహిళల జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పు, సామాజిక నిర్మితుల స్వభావాన్ని మార్చడమని అర్థం. సాధికారతలో నాలుగు ప్రధానాంశాలున్నాయి. అవి ఉత్పత్తి వనరులపై స్త్రీలు పూర్తిగా నియంత్రణ కలిగిఉండడం, తమ గురించి తాము తెలుసుకోవడం, సమాజాన్ని గురించి పరిజ్ఞానం కలిగి ఉండడం, స్త్రీలు తమ శక్తి సామర్థ్యాలను తాము తెలుసుకోవడం, తమకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో తగిన ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో వ్యవహరించడమని అర్థం. ప్రధానంగా సాధికారత అంటే కుటుంబంలో, సమాజంలో లింగ సంబంధాల పునర్నిర్మాణం చేసి, పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలను కలిగించడమని అర్థం.

పితృస్వామిక వ్యవస్థలో స్త్రీలు కుటుంబానికే పరిమితమవ్వడంతో రాజకీయాలు మగవారి సొంతం అనే భావన ప్రబలంగా ఉంది. అంతేకాదు, రాజకీయాలు స్త్రీలకు అచ్చిరావు అనేవారు కూడా లేకపోలేదు. స్త్రీలు సంఖ్యాపరంగా పురుషులతో సమానంగా లేకపోవడం వల్లనైతేనేమీ, స్త్రీలు కుటుంబానికి పరిమితమవ్వడం వల్లనైతేనేమీ ఏ రాజకీయ పక్షాలయినా - స్త్రీలకు పెద్దగా ప్రోత్సాహమిచ్చి అండగా నిలవకపోవడం వల్ల నైతేనేమీ, స్త్రీలకు నాయకత్వ లక్షణాలు లేవన్న అపోహల వల్లనైతేనేమీ స్త్రీలు రాజకీయాల్లో అనుకున్నంత సంఖ్యలో రాలేక పోతున్నారు. అయితే 1992లో చేసిన 73వ 74వ రాజ్యాంగ సవరణలు మహిళల పాలిట వరమైనవి. 1993లో 73వ రాజ్యాంగ సవరణ ఆచరణకు నోచుకోవడంతో ఆ రాజ్యాంగ సవరణ పంచాయితీరాజ్ వ్యవస్థలో 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పిస్తే పట్టణ ప్రాంతంలో స్థానికసంస్థల లో 74వ రాజ్యాంగ సవరణ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించింది. ఈ రోజు 32 లక్షలకు పైగా మహిళలు స్థానిక రాజకీయాలలో ఉన్నారంటే ఇది చట్ట ఫలితమేనని చెప్పవచ్చు. దీనినే ఒక 'నిశ్శబ్ద విప్లవంగా' పేర్కొనవచ్చు. పితృస్వామ్యం, అవిద్య, పేదరికం, మతపరమైన ఆంక్షలు, మౌఢ్యం, వనరులలేమి, స్త్రీలు ఎక్కువగా తిరగ లేకపోవడం, కుటుంబం, పిల్లల పెంపకం బాధ్యతలు, రాజకీయ పక్షాల వైఖరులు వంటి వాటిని పటాపంచలు చేస్తూ 73, 74 రాజ్యాంగ సవరణలు రాజకీయాల్లో ఒక కొత్త ఒరవడిని ప్రవేశపెట్టి అధిక సంఖ్యలో మహిళలకు రాజకీయాల్లో భాగస్వామ్యాన్ని కల్పించాయంటే అతిశయోక్తి కాదు. దైన్యం వీడి ధైర్యంగా మహిళలు పురుషులతో సమానంగా రాజకీయాల్లో భాగస్వాములు అయ్యే అవకాశం ఈ రోజు మహిళలకు కలిగింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక స్వపరిపాలన విధానం 1959లో బల్వంతరాయ్ మెహతా కమిటీ సూచించిన మూడు అంచెల పద్ధతి ద్వారా అమలు చేయబడింది. రాజస్థాన్ తర్వాత పంచాయతీరాజ్ విధానాన్ని అమలుపరిచిన ఘనత మన రాష్ట్రానికే దక్కింది. తర్వాత చాలా రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థ ఒకే రకంగా లేదు. ఒక చోట మూడు అంచెల పద్ధతిని పాటించగా మరోచోట రెండంచెల పద్ధతి అమలులో ఉంది. 1986 వరకు ఈ వ్యవస్థ అమలులో ఉన్నది. ఆ తర్వాత ఈ విధానంలో కొన్ని మార్పులు జరిగాయి. స్థానిక స్వపరిపాలన సంస్థలను స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి పట్టణ ప్రాంతాలనుద్దేశించి, రెండు గ్రామీణ ప్రాంతాల పాలనను ఉద్దేశించి.

పట్టణ ప్రాంతాల పాలనలో కనిపించేవి ఒకటి పురపాలక సంఘాలు రెండు మున్సిపల్ కార్పొరేషన్లు. అయితే పట్టణాలన్నీ ఒకే రకంగా ఉండవు. కొన్ని పెద్ద పట్టణాలైతే, మరికొన్ని చిన్న పట్టణాలు. పెద్ద పట్టణాల పరిపాలనకు మున్సిపల్ కార్పొరేషన్లు, చిన్న పట్టణాలైతే పురపాలక సంఘాలు స్వపరిపాలనకు ఏర్పడ్డాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3 మార్చ్ 1995న ఏర్పడింది. నగరంలో ఉన్న ప్రజల స్థానిక అవసరాలు తీర్చడానికి ఈ మున్సిపల్ కార్పొరేషన్ ఉపయోగపడుతుంది.

ప్రతీ వార్డ్‌కు ఒక కార్పొరేటర్‌ను, నగరం మొత్తానికి ఒక మేయర్‌ను, నగరంలోని ఓటర్లు రహస్య ఓటింగ్ ద్వారా కార్పొరేటర్లను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకొంటారు. ఈ కార్పొరేటర్లు అందరూ కలిసి ఒక ఉపమేయర్‌ను ఎన్నుకుంటారు. భారత రాజ్యాంగం చూపిన విధంగా షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు, వెనుకబడిన కులాలకు, మహిళలకు కొన్ని సీట్లు ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది. ఈ విధమైన సీట్ల

కేటాయింపులో వరంగల్ నగరంలో మొత్తం కార్పొరేటర్ల సంఖ్య 53 కాగా, ప్రత్యేకంగా మహిళలకు 33 శాతం కేటాయింపుతో 20 మంది మహిళా కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. వీరిని సామాజికంగా చూస్తే 50 శాతం వెనుకబడిన తరగతులకు సంబంధించినవారు. 5 శాతం మైనారిటీలకు గాను ఒక మహిళ ఎన్నికయ్యారు. 25 శాతం ఇతర రంగాల మహిళలు ఉండగా 20 శాతం షెడ్యూల్డ్ కులాలకు చెందిన మహిళలు ఉన్నారని ఈ కార్పొరేటర్ల రాజకీయ సాధికారత స్థితిగతులు పరిశీలించినపుడు తెలుస్తున్నాయి.

వరంగల్ జిల్లాలోని నగరపాలక సంస్థలో మొదటి మేయర్‌గా కాకుమాను పద్మావతి వెనుకబడిన తరగతికి చెందిన మహిళ (1995–2000), తర్వాత రెండవ మేయర్‌గా డా. టి.రాజేశ్వరరావు (బిజెపి) (2000 – 2002) పదవిలో కొనసాగారు. మూడవ మేయర్‌గా ప్రస్తుతం ఉన్న ఎర్రబెల్లి స్వర్ణ ఒ.సి. మహిళ ఆ రిజర్వేషన్ కేటాయింపు ఫలితంగా ఎన్నుకోబడి కొనసాగుతున్నారు. దీన్ని బట్టి చూసినట్లయితే మహిళా రిజర్వేషన్ల అమలు ఫలితంగా వరంగల్ జిల్లాలో నగర పాలక సంస్థలో మహిళలకు రెండు సార్లు మేయరు పదవి దక్కింది. ఈ వ్యాసం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన ఇరవై మంది మహిళల సామాజిక పూర్వరంగం రాజకీయ భాగస్వామ్యం, స్థితిగతుల విశ్లేషణ. వారితో జరిపిన చర్చలు పరిశీలనలలో వెల్లడయిన సమాహారం.

కులాల వారిగా సంఖ్య రీత్యా చూసినట్లైతే ఎన్నికైన 20 శాతం మంది మహిళా కార్పొరేటర్లలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు 20 శాతం, వెనుకబడిన తరగతులకు చెందినవారు 50 శాతం, ఒపెన్ కేటగిరికి చెందినవారు 25 శాతం. ఇక మైనారిటీకి చెందినవారు 5 శాతం ఉన్నారు. వీరందరిలో ఒకరు బిసి జనరల్ కోటాలో పోటీ చేసి గెలువగా మిగతావారందరూ కులాల వారిగా మహిళా రిజర్వేషన్‌ల స్థానంలో పోటీ చేసి గెలుపొందారు. దీన్ని బట్టి మహిళలు రాజకీయాల్లో ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికైన మహిళా కార్పొరేటర్ల సగటు వయస్సు 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగినవారు ఉన్నారు. మధ్య వయస్సు మహిళలు రాజకీయాలపట్ల ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మహిళా కార్పొరేటర్ల విద్యా విషయాలను గమనిస్తే 5–10వ తరగతి చదివిన వారు షెడ్యూల్డ్ కులాల వారు ఇద్దరు. బి.సి. వారు నలుగురు, మైనారిటీలు ఒకరు ఉన్నారు. ఇంటర్ చేసిన వారు ఎస్.సి. లు ఒకరు, బి.సి. లు ముగ్గురు, ఒ.సి. లు ఒకరు. డిగ్రీ చదివినవారు ఎస్.సి. లు ఒకరు, బి.సి.లు ఇద్దరు, ఒ.సి.లు ముగ్గురు. పి.జి. చదివిన వారు బి.సి.లో ఒకరు, ఒ.సి.లో ఒకరు ఉన్నారు. సమాజంలో అంతరాలు తొలగించే విద్య అందరికీ అందుబాటులో లేకపోవడం వల్ల మహిళలు విద్య కుసుమాలను అందుకోలేకపోతున్నారని ఈ పరిశీలనలో వెల్లడవుతోంది.

ఎన్నికైన మహిళా కార్పొరేటర్లు రాజకీయాలతో సంబంధం ఎవరి వలన? ఏ విధంగా ఏర్పడింది అనే విషయాన్ని పరిశీలిస్తే : ఎన్నికైన ఇరవై మంది మహిళా కార్పొరేటర్లలో నలుగురు ఎస్.సి.లు ఉండగా, అందులో ఒకరు కార్యకర్తగా ఉండి కార్పొరేటర్‌గా ఎన్నికైనట్లు తెలుస్తోంది. భర్త ద్వారా రాజకీయాల్లోకి వచ్చామంటూ ఇద్దరు చెబితే కొడుకు ద్వారా రాజకీయాల్లోకి వచ్చామని ఒకరు అన్నారు. కాగా, బి.సి.లలో చూస్తే పదిమంది మహిళా కార్పొరేటర్లు ఉండగా ఇద్దరు గతం నుండి కార్యకర్తలుగా ఉంటూ ప్రస్తుతం కార్పొరేటర్ దశకు వచ్చారు. ఏడుగురు తమ భర్తలు రాజకీయ పార్టీలో పనిచేస్తున్నందున, భర్తలకు పూర్వం పోటీ చేసిన అనుభవం ఉన్నందున రిజర్వేషన్‌ల స్థానంలో ప్రస్తుతం తాము పోటీ చేసినట్లు తెలుస్తోంది. ఇక తోటి కోడలు ద్వారా రాజకీయ బంధమేననేది స్పష్టంగా తేలితే మైనారిటీకి సంబంధించిన వారు రిజర్వేషన్‌ల స్థానంలో ఒక్కరు ఉండగా వారు భర్త ద్వారానే రాజకీయ సంబంధం ఉందంటున్నారు. ఒ.సి.లో మొత్తం మహిళా కార్పొరేటర్ల సంఖ్య ఐదుగురు ఉండగా, అందరూ తమ భర్తల ద్వారా రాజకీయాల్లోకి వచ్చినవారే. భర్తలు పూర్వం పోటీ చేసి ఉన్నందున తమకు ప్రస్తుతం ఉన్న మహిళా రిజర్వేషన్‌లు ఉపయోగించుకొని కార్పొరేటర్లుగా ఎన్నికైనామంటున్నారు.

ఒక మహిళగా పార్టీ రాజకీయాల్లోగానీ, సమాజ సేవ కార్యక్రమాలు చేయడంగానీ, సమస్యలపరిష్కార మార్గాలు నిర్ణయించడం లో గానీ ఎవరి పాత్ర ఎక్కువగా ఉంది అనేది పరిశీలిస్తే ఎస్.సి.లలో నలుగురు మహిళా కార్పొరేటర్లు ఉండగా, ఒక్కరు స్వయంగా నిర్ణయాలు తీసుకుంటున్నానంటున్నారు. ఒక్కరు, 'భర్త నిర్ణయిస్తాడు' అంటున్నారు. ఒక్కరు 'కొడుకు నిర్ణయిస్తాడంటున్నారు'. ఒకరు పార్టీ నిర్ణయిస్తుం దంటున్నారు. దీన్ని బట్టి చూస్తే ఎస్.సి.కి సంబంధించిన వారిలో ఒక్కరు మినహా అందరు ఇతరులపై ఆధారపడుతున్నారు.

ఇక బి.సి.లో పది మంది మహిళా కార్పొరేటర్లలో భర్త 'పాత్ర' ఎక్కువ అనే వారి సంఖ్య ఐదుగురు. పార్టీ అనే వారి సంఖ్య ఐదుగురు కావున స్వయంగా నిర్ణయం తీసుకునేవారు లేనట్లు నిర్ధారించవచ్చు. మైనారిటీకి చెందిన కార్పొరేటర్లు ఇదే దారిలో భర్త నిర్ణయాలు అంతిమ నిర్ణయాలు అని చెపుతున్నారు. ఒ.సి. లలో మాత్రం ఉన్న ఐదుగురు పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తున్నాము అంటున్నారు. ఈ విధంగా మహిళా కార్పొరేటర్లు నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వాములు అవుతున్నామని చెప్పారు. నిజానికి స్వయంగా గానీ, స్వతంత్రంగా గానీ నిర్ణయాలు తీసుకునే వారిని సంఖ్యలో కానీ, అంకెలో కానీ చెప్పలేం.

జిల్లాలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న ఇరవైమంది మహిళా కార్పొరేటర్ల రాజకీయాలు ఏ రాజకీయ పార్టీ కోసమో వెల్లడిస్తాయి.


జిల్లాలో ఉన్న మహిళా కార్పొరేటర్లలో ఎస్.సి. కి చెందిన వారు నలుగురు ఉండగా అందులో ఇద్దరు కాంగ్రెస్, ఒకరు టి.డి.పి., ఒకరు సి.పి.ఎం. పార్టీలకు చెందిన వారు. బి.సి. కి చెందిన మొత్తం మహిళా కార్పొరేటర్లు పది మంది కాగా, అందులో కాంగ్రెస్ పార్టీకి చెందినవారు ఇద్దరు, టి.డి.పి.కి చెందిన వారు ఎనిమిది మంది ఉన్నారు. మైనారిటీకి చెందిన వారు ఒక్కరు ఉండగా వారు టి.డి.పి. కి చెందినవారు. ఒ.సి.లో ఐదుగురు ఉండగా అందులో కాంగ్రెస్‌లో ముగ్గురు, టి.డి.పి.లో ఒకరు, టి.ఆర్.ఎస్.లో ఒకరు. వరంగల్ జిల్లాలోని మహిళా కార్పొరేటర్ల సంఖ్య రీత్యా ఎక్కువమంది టి.డి.పి. కి చెందిన వారేనని తెలుస్తోంది. వీరిలో బి.సి.లే ఎక్కువ కావడం గమనించాలి. ఈ కార్పొరేటర్లలో టి.డి.పి. ప్రాబల్యం ఎక్కువగా ఉందనేది గమనార్హం.

మహిళా కార్పొరేటర్లకు ప్రత్యక్ష రాజకీయాలు కొత్తయినా విధి నిర్వహణలో తమకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పర్చుకొని ముందుకు సాగిపోతున్నారు. అటు కుటుంబం ఇటు రాజకీయాలను సమన్వయిం చేసుకుంటూ భర్తల సహకారంతోపాటు రాజకీయ అనుభవంతో నగర రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారు. ☐

రాయలసీమ జనజీవితాన్ని అల్లకల్లోలం చేస్తున్న ముఠా హింసా సంస్కృతిపై వేంపల్లి గంగాధర్ రచించిన 'హిరణ్య రాజ్యం' పుస్తకాన్ని పరిచయం చేస్తున్నారు **దుప్పల రవికుమార్**

రాయలసీమ నెత్తుటి బతుకు చిత్రం

వివేకానందుడు తన సోదర శిష్యుడికి రాసిన ఓ ఉత్తరంలో ఈ భూమ్మీద దేవుడి పేరుమీద జరిగినంత రక్తపాతం మరింక దేనిమీదా జరగలేదంటాడు. ఈ వేళ ప్రపంచమంతటా, ప్రత్యేకంగా భారతదేశంలోనూ హింస రాజ్యమేలుతోంది. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ప్రజల జీవితాల్లో రేపుతున్న అల్లకల్లోలం ముందు ఏ ఉగ్రవాద దుశ్చర్యలూ సరితూగవు. అందుకే ప్రభుత్వ చర్యలను ఇప్పుడు మనం డెవలప్‌మెంట్ టెర్రరిజం అని పిలుస్తున్నాం. వీటికి తోడుగా రాజకీయ పార్టీలు స్వయంగా స్వలాభం కోసం పెద్ద ఎత్తున హింసను ప్రోత్సహిస్తున్నాయి. ఉదాహరణకు భారతీయ జనతా పార్టీ అనుబంధ సంస్థలనదగ్గ హిందుత్వ సంఘాలు కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాలలో జరుపుతున్న తీవ్ర దుశ్చర్యలు మానవత్వమున్న వారికి ఆందోళన కలిగించక మానవు.



రచయిత	:	**వేంపల్లి గంగాధర్**
వెల	:	**రు. 50**
ప్రతులకు	:	డా. పి. ఆదర్శరెడ్డి, చైర్మన్, శ్రీ పి.టి. వీరారెడ్డి ఫౌండేషన్, 21-460, పి.పి.స్ట్రీట్, 7 రోడ్స్, కడప – 516 001

హిందువులే కాని గిరిజనులను, హిందుత్వంతో విసిగి వేసారి క్రైస్తవం స్వీకరించిన బహుజనులను తిరిగి హైందవంలోకి రాబట్టే 'ఘన కార్యాన్ని హిందుత్వ సంస్థలు నిస్సిగ్గుగా నెరవేరుస్తున్న తీరును మన అగ్రకుల దురహంకార మీడియా స్వార్థ ప్రయోజనాలతో అంతగా ఫోకస్ చేయట్లేదు గాని, జరుగుతున్న దురాగతాలు ప్రజలకు చేరుతూనే ఉన్నాయి. తమ ఉనికి, స్వార్థ ప్రయోజనాలను కాపాడుకునే ఉద్దేశంతో కాంగ్రెస్‌ను బూచిగా చూపించే తీవ్ర గుంజాటనలో ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి తెలుగు పత్రికలు తలమునకలై ఉంటే, దీన్ని తిప్పికొట్టే విఫలయత్నంలో సాక్షి, ఆంధ్రప్రభ లాంటి పత్రికలు నానాపాట్లు పడుతున్నాయి. అందుకే నాలుగు దినపత్రికలు కలిపి చదివినా నిజంలో నాలుగోవంతు ప్రజలకు తెలియడంలేదని మనం ఆందోళన పడుతున్నది. గుజరాత్‌ను ఓ ప్రయోగశాలగా భావించి చేసిన ప్రయోగాలు ఘన విజయాలు సాధించిన తర్వాత అవే ప్రయోగాలను విస్తరించే ఉద్దేశంతో కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాలను హిందుత్వ సంస్థలు ఎంచుకున్నాయా అని అందరూ అనుమానిస్తున్నారు. మతమంటేనే సామాన్యుడు ఆమడ దూరం పారిపోయేలా చేస్తున్నాయి మన రాజకీయాలు.

ఇక దేవుడి పేరుమీద జరిగిన ఈ హింస తర్వాత స్థానాన్ని ఆక్రమించేది మనిషి స్వార్థంతో, మూర్ఖత్వంతో చేపడుతున్న దుర్మార్గం. దానిపేరు మన తెలుగునేలపై ఫ్యాక్షనిజం. రాష్ట్రంలో మరెక్కడాలేని విధంగా రాయలసీమ గడ్డపై ఈ నెత్తుటి చరిత్ర రక్తాక్షరాలతో లిఖించబడడానికి కారణమేమిటనేది ఆలోచనాపరులకు ఆసక్తి కలిగించే అంశం. ఇరవై తొమ్మిదేళ్ల యువకుడు వేంపల్లి గంగాధర్ ఈ అంశంపై లోతుగా దృష్టి సారించి తన ఆలోచనలను 'హిరణ్య రాజ్యం' పేరున మనతో పంచుకున్నారు. హిరణ్యమంటే బంగారమని అర్థం. చరిత్ర పుటల్లో రాయలసీమను హిరణ్య రాజ్యమని కీర్తించారు. ఈ హిరణ్య రాజ్యంలో పరిస్థితి ఇప్పుడెలా ఉంది? ఈ నేల ఎందుకిలా తయారయింది? మానవ వైరానికి అంతేలేదా? వాముకు వాము, పంటకు పంట, పశువుకు పశువు, మనిషికి మనిషి తెగ నరుక్కునే తీవ్ర హింస – ప్రతిహింసలకు కారణాలేమిటి? ఈ నిరంతర నరమేధం రావణకాష్టంలా రగులుకునే ఉండడానికి ఆజ్యం పోస్తున్నదెవరు? ఈ పగలకు, శత్రుత్వానికి, వైమనస్యానికి అనుక్షణం బితుకు బితుకుమంటూ గడిపే రాయలసీమ ప్రజల హృదయాల్లో స్వేచ్ఛా కుసుమాలు విరిసేదెన్నడు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ, మరెన్నో ఆలోచనలను మనకు అందించేందుకు వేంపల్లి గంగాధర్ చేసిన ప్రయత్నమే ఈ 'హిరణ్య రాజ్యం'.

అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటు (1970 ఫిబ్రవరి 2 న కర్నూలు నుండి విడివడి కొత్తగా ఏర్పడిన) ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు, మార్కాపురం తాలూకాలతో కలిపిన ప్రాంతమే రాయలసీమ. 1800 కు ముందు వీటిని సీడెడ్ జిల్లాలని, దత్తమండలాలని పిలిచేవారు. ప్రబంధకాలంలో ఉన్న రాయలసీమ

పేరును శ్రీకాకుళ జిల్లావాసి చిలుకూరి నారాయణరావు 1928లో ఖాయం చేసి స్థిరపరిచారు. ఘనచరిత్ర కలిగిన రాయలసీమ స్వాతంత్ర్యం వచ్చేనాటికి మనుషుల స్వార్థపరత్వపు తీవ్రతను భరిస్తోంది. కొన్ని గ్రామాలను ఒక సముదాయంగా చేసి దానికి ఒక పాలెగాణ్ణి నియమించే సంప్రదాయం నాయకరాజుల కాలంనాడే మొదలైంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఈ పాలెగాళ్లకు లభించిన మరిన్ని అధికారాలు, రాజులు మారుతున్న కొద్దీ అపరిమితంగా పెరిగాయే గాని తగ్గలేదు. బ్రిటిష్ పాలనకు వచ్చేసరికి ఈ పాలెగాళ్ల వ్యవస్థ ప్రబల రాజ్యేంగేతర శక్తిగా ఎదిగిందంటే వారెంత విశృంఖలంగా ఇటు ప్రజలను, అటు ప్రభువులను లొంగదీసుకున్నారో తెలుస్తుంది. గమ్మత్తుగా వీరిపట్ల జానపద సాహిత్యం లో ప్రేమ, ద్వేషపు కలగలుపు మిశ్రమ భావాలను మనం గమనిస్తాం. శిస్తులు వసూలు చేయడంలో అత్యంత పాశవికంగా ప్రవర్తించిన వీరే తమ స్వతంత్రానికి ముప్పు వస్తుందనుకున్నపుడు అంతే కిరాతకంగా తమ శత్రువులను ఎదుర్కొన్నారు.

1800లో నిజాం పాలన నుంచి పూర్తిగా బ్రిటిష్ పాలనకు రాయలసీమ చేరుకుంది. అదే ఏడాది థామస్ మన్రోను దత్త మండలాలకు ప్రిన్సిపల్ కలెక్టర్‌గా ఈస్ట్ ఇండియా కంపెనీ నియమించింది. అక్కడి పరిస్థితులను అవలోకనం చేసుకున్న మన్రో పాలెగాళ్ల వల్ల పాలన వ్యవస్థ దుర్భరంగా తయారైందని గమనించాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఆదాయాన్ని పెంచాలనుకున్నాడు. వెంటనే పాలెగాళ్లపై ఉక్కుపాదం మోపాడు. రైత్వారీ శిస్తు పద్ధతి ప్రవేశపెట్టాడు. పాలెగాళ్లను తరమడం మొదలుపెట్టాడు. ఈ దశలో పాలెగాళ్లు జనాన్ని సమీకరించి బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాటాలు కూడా నడిపారు. అందులో ప్రముఖంగా వినిపించే పేరు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. కంపెనీ ప్రభుత్వం నరసింహారెడ్డిని ఉరితీసింది. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో విడివిడిగా, సమష్టిగా పాలెగాళ్ల స్వతంత్ర పోరాటాలు జరిగాయి. దీనిని రెండు విధాలుగా చూడడం అవసరం. ఇదే పాలెగాళ్ల దురాగతాలు భరించలేక పొలాలను, గ్రామాలను సైతం విడిచిపెట్టి ప్రజలు పారిపోయిన సంగతి మరవకూడదు. వారి మీదికే ప్రమాదం ముంచుకొచ్చేసరికి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, వారిలో దేశభక్తి నూరిపోయడమే కాకుండా, తమ ప్రాణాలను సైతం త్యాగం చేయడం మరవకూడదు.

మొత్తానికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అంతరించి పోవాల్సిన పాలెగాళ్ల వ్యవస్థ రూపుమార్చుకుని ఫ్యాక్షన్ వ్యవస్థగా వేళ్లూనుకోవడం విషాద వాస్తవం. దానికి మన రాజకీయ వ్యవస్థ మరింత జవజీవాలను అందివ్వడం మన దురదృష్టం. అసమ అభివృద్ధి క్రమంలో ఈ వెర్రికి మరింత ఊతం లభించడం మనమందరం గుర్తించాల్సిన, గర్హించాల్సిన అంశం.

వర్గ ఆధిపత్యపోరులో తమ వర్గం నాయకుడికి రాజకీయ హోదా కూడా కట్టబెట్టాలనే తలంపుతో ఉన్నప్పుడే పల్లెల్లోని వర్గాల్లోకి రాజకీయ పార్టీలు ప్రవేశం చేసాయి. ఒక్కో వర్గం ఒక్కో రాజకీయ పార్టీని ఆశ్రయించాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఒక్కొక్కరు తమ చుట్టూ మంది మార్బలాన్ని పెంచి పోషించుకోవాల్సిందే. మొదట లావు కట్టెలతో తిరిగే ఈ అనుచర గణం, క్రమంగా వేట కొడవళ్లు, కత్తుల నుంచి పొడుగు గొట్టపు తుపాకుల నుంచి ఖరీదైన తుపాకులతో తిరగడం వరకు ఎదిగారు. పల్లెల్లో జరిగే చిన్న చిన్న తగాదాలూ, పంచాయతీలూ నెరవేర్చే ఫ్యాక్షన్ పెద్ద మనుషులు క్రమంగా భూముల సెటిల్మెంట్ల నుంచి భూముల, ఆస్తుల ఆక్రమణలు, సారా కాంట్రాక్టుల స్థాయి నుంచి చట్టసభల్లోకి వెళ్లడం వరకు అన్నీ మన కళ్లముందే జరిగిపోతున్నాయి.

రాయలసీమలో ఒక జిల్లా అయిన అనంతపురం రాష్ట్రంలో అతి పెద్ద జిల్లా. రానున్న వంద సంవత్సరాల లోపే అనంతపురం ఒక ఎడారిగా మారనున్నదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. గడిచిన 150 ఏళ్లలో అరవై ఏళ్లకు పైబడి కరువుపీడిత ప్రాంతంగా విలవిల్లాడుతున్న అనంతపురంతో పాటు, నీటి వసతులు లేక పొలాలు బీళ్లుగా మారిన దృశ్యాలు కడప, కర్నూలులో ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తాయి. చోద్యం చూస్తున్న ప్రభుత్వం ఇందుకు చేస్తున్నది ఏమీ లేదు. ఇలా అసమ అభివృద్ధి పుణ్యమా అని ఒకప్పటి రతనాల సీమ ఇప్పుడు రాయలసీమగా మారింది. సీమ ప్రధానంగా కరువు ప్రాంతం. ఆర్థిక వెనుకబాటుతనం వల్ల అవిద్య, అనారోగ్యం సహజ లక్షణాలుగా వచ్చాయి. దాంతో వచ్చిన నిరుద్యోగ సమస్య సహజంగానే యువతను ఫ్యాక్షన్ నీడను ఆశ్రయించేట్టు చేస్తోంది.

నెత్తుటి సీమలో జరుగుతున్న హింస – ప్రతిహింసల గొలుసు చర్య మూలాన్నీ, క్రమాన్నీ అర్థం చేసుకోకుండా దాన్ని ఛేదించడం, పరిష్కరించడం సాధ్యం కాదనే అంశం మనం గుర్తించాలి. దీనికి విరుగుడుగా మనం ఆలోచనలు జరిపినప్పుడు సహజంగానే అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలను చూసి మనకు అసహనం, ఈర్ష్యలు కలిగి మనకూ ప్రత్యేక రాష్ట్రం వస్తే మన సమస్యలు పరిష్కరించుకుంటాం కదా అనిపిస్తుంది. కానీ, ఫ్యాక్షన్ సమస్యకు అది పరిష్కారం కాదు. ప్రజల్లో ఎరుక కలిగించాలి. నిరుద్యోగాన్ని రూపుమాపాలి. ఫ్యాక్టరీలను స్థాపించాలి. విద్యావంతులను చేయాలి. నీటి వసతులను సమకూర్చాలి. పంటలు పండేలా, అవి రైతులకందేలా, వాటికి గిట్టుబాటు ధర లభించేలా చూడాలి. ఇవన్నీ ప్రభుత్వం స్వయంగా పూనుకుంటేనే గాని సాధ్యం కాని పనులు.

ఇలాంటి మరెన్నో ఆలోచనలను ఒక క్రమపద్ధతిలో అందించిన వేంపల్లి గంగాధర్ నిజంగా అభినందనీయులు. ఈ పుస్తక రచనలో కొన్ని తప్పులుండవచ్చు గాక, వాటన్నింటిని మనం మన్నించి ఇలాంటి భావాలను విస్తృతంగా ఆహ్వానించాలి. ఇంకొంచెం శ్రద్ధ వహిస్తే మరింతగా ఎడిట్ చేసి, మరిన్ని తక్కువ పేజీల్లోనే ఈ విలువైన సమాచారాన్ని అందించే వీలయ్యేది. ఒక్కో విషయాన్ని రెండు మూడు మార్లు చెప్పడం కూడా అభ్యంతరకరంగా భావించవచ్చు. తన నేలపై ప్రేమను పెంచుకుంటూ, సమాజహితాన్ని కోరే క్రమంలో ఉన్న యువ రచయిత చరిత్ర రచన శాస్త్రపు అధ్యయనంపై దృష్టి సారించాలి. పాలెగాళ్ల ఎదుగుదల క్రమాన్ని ఒకే పుస్తకంలో నాలుగైదు సార్లు వివరించినప్పుడు మనకు ఆవులింతలు రాకుండా ఉండడానికైనా రచయిత హిస్టరియోగ్రఫీని అధ్యయనం చేయాలి. కప్పట్రాళ్ల వెంకటకప్పనాయుడు ఫ్యాక్షన్ జీవితం ఆరంభమైందెప్పుడు? పేజీ 80లో 1970 అని, పేజీ 84లో 1975 అని రాశారు. పుస్తకం పూర్తయ్యాక రచయిత పాలెగాళ్లను ఆరాధిస్తున్నారో, అసహ్యించుకుంటున్నారో అంతు చిక్కదు. సమర్థమంతంగా, శక్తిమంతంగా అని రాశారు. సమర్థంగా,

***సెజ్‌లతో వ్యవసాయ భూములను కోల్పోయి, కూలీలుగా మారుతున్న చిన్న, సన్నకారు రైతుల ఛిద్రమైన జీవన స్థితిగతులను వివరిస్తున్నారు* బడుగు సదానందం, బేతమల్ల సుధాకర్**

రైతులను కూలీలుగా మారుస్తున్న సెజ్‌లు

ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్‌లు) అభివృద్ధికి కరదీపికలు, ఉపాధికి కల్పవృక్షాలు. రాష్ట్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన 97 సెజ్‌ల ద్వారా ముప్పైమూడు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తరలివస్తాయి. ఎనిమిది లక్షల మందికి ప్రత్యక్షంగా, పదహారు లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే ఏర్పాటైన వాటిలో 51,568 మందికి ఉపాధి లభించింది. 5,124 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. సెజ్‌ల ప్రస్తావన వచ్చినపుడల్లా ప్రభుత్వం చేసే వాదన ఇది. బలవంతపు భూసేకరణ లేదంటోంది. రైతులే స్వచ్ఛందంగా ఇచ్చారంటోంది. ఇచ్చిన పరిహారంతో వారు ఆనందంగా ఉన్నారని చెబుతోంది.

వాస్తవానికి రైతుల జీవనాధారమైన భూమి పోయింది. ఇచ్చిన పరిహారం హారతి కర్పూరమైంది. ఇంటి స్థలమిస్తామన్న హామీ నీటి మూటయింది. వస్తాయన్న కర్మాగారాలు కనుచూపు మేరలో కానరావడం లేదు. వచ్చినా ఉపాధి దక్కుతుందన్న హామీ లేదు. కూలిపనులతో కుటుంబం గడవక భవిష్యత్తు బాగుంటుందన్న నమ్మకం కుదరక అన్నదాత తాగుడుకు బానిసై ఇళ్లూ, ఒళ్లూ గుల్ల చేసుకుంటున్నాడు. పోనీ సెజ్‌లు ఏర్పడ్డాయా అంటే 90–95 శాతం ఇంకా ఏర్పడనేలేదు. మిగతావి కూడా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పన ఇంకా కొనసాగుతూనే ఉంది. భూములు కోల్పోయిన రైతులు సర్వం కోల్పోయి చెట్టుకొకరు పుట్టకొకరు చెల్లాచెదురైపోతున్నారు. ప్రస్తుత వ్యాసంలో చిత్తూరు జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గంలో సెజ్ వలన ఏర్పడిన పరిస్థితులను వివరించడం జరిగింది.

సత్యవేడు నియోజకవర్గంలో సెజ్ కోసం పదివేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడతలో తొమ్మిది గ్రామాల పరిధిలో 6433 ఎకరాల భూమిని సేకరించారు. జిల్లాలోని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులందరినీ ఇక్కడ మోహరించి రైతులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి భూములు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూముల్ని ప్రభుత్వం చేత ఆర్థికంగా, సామాజికంగా గుర్తించబడిన బడాబాబులకు చెందిన ఒక సంస్థకు అప్పగించారు. భూదాహం అంతటితో తీరక రెండో విడతలో మరో నాలుగు గ్రామాల్లో మిగిలిన భూమి (3567 ఎకరాలు) సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు నోటీసు కూడ ఇచ్చింది. తొలివిడత స్వాధీనం చేసుకున్న భూమి వల్ల 1236 కుటుంబాలు భూమిని కోల్పోయాయి. ఇందులో ఎక్కువ భాగం దళితుల, బలహీనవర్గాలకు చెందినవారే (1090). ఈ భూములన్నీ కూడా మూడు దశాబ్దాల క్రితం కుటుంబ నియంత్రణ పాటించినందుకుగాను పేదలకు ఇచ్చిన భూములే. ఇందులో అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి. వీటిని కూడా తిరిగి తీసుకున్నారు. భూమిని కోల్పోయిన వారిలో ఎక్కువమంది సన్న, చిన్నకారు రైతులు. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం ఏడాదిలోపే బ్యాంక్ రుణాలు, ఇతరత్రా అప్పుల చెల్లింపులకు, కుటుంబ జీవనానికి ఖర్చయిపోయింది. మళ్లీ భూమి కొనుగోలు చేసినవారు అతికొద్ది మందే. వందలాది రైతు కుటుంబాలు వీధిన పడ్డాయి. వ్యవసాయకూలీల జీవితాలు అల్లకల్లోల మయ్యాయి. ఏ కర్మాగారం ఎప్పుడొస్తుందో తెలియదుగాని పచ్చటి పొలాలన్నీ బీళ్లయ్యాయి.

భూమిని సేకరించేటప్పుడు ఏరో స్పేస్, ఆటో కాంపోనెంట్,

శక్తిమంతంగా అనడం సబబేమో. ఇవన్నీ భూతద్దంలో చూసిన సంగతులు. ఇలాంటి తప్పులు పరిమితంగా ఈ పుస్తకంలో ఉన్నాయి. ఒకవేళ వేలాదిగా ఉన్నాసరే, ఈ పుస్తకాన్ని ఆహ్వానించాల్సిందే. అది తక్షణ చారిత్రకావసరం.

ఈ పుస్తకానికి పరిచయ వాక్యాలు రాసిన మాసీమ రాజగోపాల రెడ్డి అనివార్యంగా 'ప్రత్యేక' ఆలోచనల్లోకి వెళ్లారు. రాష్ట్ర వైశాల్యంలో తెలంగాణ 41.80 శాతం, రాయలసీమ 26.36 శాతం, కోస్తా 23.94 శాతం ఆక్రమించినా అభివృద్ధి విషయంలో అంతా తిరోగమనంలో ఉందని వాపోతున్నారు. విస్తీర్ణం, నదులు, నీటి లభ్యత, ఖనిజాలు, ఇతర వనరులు గురించి ప్రస్తావించిన పరిచయకర్త ఈ వాక్యంతో వ్యాసం ముగిస్తారు. 'కావున అన్ని విషయాలను కూలంకషంగా చర్చించి, పరిగణనలోకి తీసుకొని, మన సంగతేమిటో తేల్చుకోవలసిన అవసరమెంతైనా ఉంది.' బహుశా ఆయన ఏం చెప్తున్నారో అర్థమైందనే అనుకుంటున్నాను. అసమ అభివృద్ధి క్రమంలో మన స్థానాలేమిటి, మన బతుకు తీరులేమిటి, మన భవిష్యత్తులు ఏమిటి, వంటి ప్రశ్నలు మనలో తలెత్తుతాయి.

తేలికైన మాటలతో, సూటిగా, స్పష్టంగా రాయలసీమ ఫ్యాక్షనిజం చారిత్రాత్మక నేపథ్యం, పరిణామ క్రమం – విశ్లేషణను 'హిరణ్యరాజ్యం'గా అందించిన వేంపల్లి గంగాధర్ పుస్తకం, మనం చదవడమేకాక, మిత్రులం దరిచేత చదివించాలి. మానవీయ ఆలోచనలను వ్యాప్తం చేయాలి. వీ

అపెరల్ ఫ్యాషన్, బయోటెక్ ఫార్మా, హెల్త్‌కేర్ ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్, ఐటి, బిపిఒ, లైట్ ఇంజనీరింగ్, క్రీడలు, బొమ్మలు ఇలా పలురంగాల్లో ప్రత్యేక కర్మాగారాలు/స్థలాలు వస్తాయనీ, అంతేకాకుండా భూమిని కోల్పోయిన వారి పిల్లలకు ఉద్యోగాలు కూడా ఇస్తామని రైతులకు ఆశ చూపారు. నిజానికి ఇలాంటి రంగాల్లో ఉపాధి పొందాలంటే నైపుణ్యమున్న సిబ్బంది అవసరం. భూములు కోల్పోయిన నిర్వాసితుల్లో అత్యధిక శాతం చదువుకోనివారే. వారి పిల్లల చదువులూ అంతంత మాత్రమే. కొందరు ఇంటర్ చదువుకున్నారు. డిగ్రీ చదివినవారినైతే వేళ్లపైనే లెక్కించవచ్చు. ఇంటర్మీడియట్ చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ఉద్యోగం చూపిస్తామన్నారు. కొందరిని శిక్షణ కోసం దుబాయ్‌కు కూడా పంపిస్తామని చెప్పారు. ఇవన్నీ నోటిమాటలేనని తేలిపోయింది. ఉద్యోగాలేవని నిర్వాసితులు అడిగితే ఉద్యోగాలకు కావలసిన చదువు అర్హత రైతులకు, వారి పిల్లలకు లేదనే సమాధానం వస్తుంది. అక్కడ నిర్వాసితులకు ఉపాధి కలలో మాట. ఆయా సంస్థలు 2010 లోగా పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తాయో లేదో తెలియదు. ఎందుకంటే ఇంతవరకు ఎవరూ పనులే మొదలుపెట్టలేదు. మౌలిక సదుపాయాలే ఇంకా పూర్తిగా కల్పించలేదు. రెండేళ్లలోపు కర్మాగారాలు వచ్చినా అప్పటిదాకా ఉపాధి కోసం ఎదురుచూడడం నిర్వాసితులకు సాధ్యమేనా అనేది ప్రశ్నార్థకం.

నిర్వాసితులకు ఇప్పటివరకు రెండు రకాల ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. ఒకటి సెక్యూరిటీ గార్డులైతే, రెండోది సూపర్‌వైజర్లు. సుమారు నాలుగు వందలమందికి ఈ ఉద్యోగాలిచ్చినట్లు సదరు ప్రభుత్వంచే భూమిని అప్పగించబడినటువంటి సంస్థ తెలియజేస్తుంది. సెక్యూరిటీ గార్డులకు నెలకు 2100 రూపాయలు, సూపర్‌వైజర్లకు 3000 రూపాయల చొప్పున వేతనమిస్తున్నారు. సెక్యూరిటీ గార్డుకు రోజుకు 70 రూపాయలు ఇస్తున్నారు. ఏ రోజైనా వెళ్లకపోతే ఆ మొత్తం కోత పడుతుంది. ఈ ఉద్యోగాలు కూడా శాశ్వతం కాదనీ, ఎక్కువనాళ్లు ఉండవనీ సదరు సంస్థ అధికారులు చెబుతున్నారు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు పొందిన కొందరు నష్టపరిహారం సొమ్ముతో మోటారు బైకులు కొనుగోలు చేశారు. వస్తున్న వేతనం పెట్రోలుకే సరిపోతుందని వారి పెద్దలు వాపోతున్నారు. నిర్వహణ భారమై చివరకు బైకులను కూడా అమ్మేసుకుంటున్నారు.

నిర్వాసితులకు అసైన్డ్ భూమికి ఎకరానికి రెండున్నర లక్షల రూపాయల చొప్పున నష్టపరిహామిచ్చారు. పట్టా భూమికి మూడు లక్షల రూపాయలిచ్చారు. పరిహారం పంపిణీ, భూముల స్వాధీనం నిరుడే జరిగిపోయాయి. నిర్వాసితుల్లో ప్రతి కుటుంబానికీ ఉద్యోగం, పక్కా ఇళ్లు లేనివారికి ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని చర్చల సందర్భంగా అధికార యంత్రాంగం, భూమిని పొందిన సంస్థ యాజమాన్యాలు హామీ ఇచ్చాయి. అన్నిటికంటే ముఖ్యంగా గ్రామాలను తరలించబోమని చెప్పాయి. ఇవన్నీ కూడా నోటిమాటే తప్ప రాతపూర్వకంగా ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఇప్పటికే మూడు దళిత వాడలను తరలించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆరూరకండ్రిగ, గొల్లపాళెం, అప్పయపాళెం గ్రామస్తుల తరలింపునకు కావలసిన ప్రత్యేక కాలనీ కూడా నిర్మించారు. ఇందులోకి వెళ్లడానికి నిర్వాసితులు సుముఖంగా లేరు.

ఏడాది క్రితం పొలం చేతిలో ఉండి పంటలు పండించినప్పటి పరిస్థితిని, ఇప్పటి జీవన స్థితిగతులను పోల్చి చూస్తే రైతులు అధోగతి పాలయ్యారన్నది స్పష్టమవుతోంది. సొంతగా పండించుకున్నప్పుడు ఎంతో కొంత ఆదాయం ఏటా చేతిలో మిగిలేది. ఉన్నదానిలోనే బతికేవారు. భూమి కోల్పోయిన ఏడాదికే గౌరవం అంతరించింది. పక్కా ఇళ్లు లేనివారికి ఐదు సెంట్ల ఇంటి స్థలమిస్తామన్న అధికారులు హామీ నెరవేరలేదు. ఫలితంగా చాలా మందికి నిలువనీడైనా లేకపోయింది. నిర్వాసితులు పది నుండి పదిహేను కిలోమీటర్ల దూరం వెళ్లి కూలీ పనులు చేసుకుంటున్నారు. కొందరు పొరుగునే ఉన్న తమిళనాడుకు వెళ్తున్నారు. తిండికే గడవని పరిస్థితుల్లో పిల్లలను చదువులు మాన్పించి, పనులకు పంపిస్తున్నారు. భూమిని తీసుకున్న యాజమాన్యాలు పశువులను మేపేందుకు పొలాల్లోకి రానివ్వడం లేదు. అడ్డుగా కంచెను నిర్మిస్తున్నారు. క్రమేపి గ్రామంలోకి రాకపోకలను కూడా అడ్డుకుని తమను ఊళ్లనుంచి తరిమేస్తారేమోనన్న ఆందోళన నిర్వాసితులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. ఈ పరిస్థితుల్లో చాలా మంది తాగుడుకు బానిసలవుతున్నారు. అనారోగ్యం పాలై ప్రాణాంతక వ్యాధులకు లోనవుతున్నారు. అభివృద్ధికి ప్రతీకలని చెబుతున్న సెజ్‌ల వల్ల కొత్త ఉపాధి అవకాశాల మాటెలా ఉన్నా ఉన్న ఉపాధి పోయి రైతులు చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెదిరిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి అనేక రకాలైన సెజ్‌లు పేరు ఏదైనప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్నాయి. ఫలితంగా ఎన్నో వేలమంది రైతులు శాశ్వతమైన ఉపాధిని కోల్పోయి నిరుద్యోగమూ, పేదరికమూ, అనారోగ్యానికీ గురై ఎంతో దుర్భరమైన పరిస్థితుల్లో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇందుకు చక్కటి ఉదాహరణే చిత్తూరు జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గం. ఇలాంటి సత్యవేడులు రాష్ట్ర వ్యాప్తంగా చాలా ఉన్నాయి. కావున లోతైన అధ్యయనం చేసి ఇలాంటి పరిస్థితిని నివారించడానికి తగిన చర్యలను చేపట్టి భూమిని కోల్పోయిన రైతులను సకాలంలో అన్ని విధాలుగా ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. వీ

చరిత్ర ఘటనల క్రమాలు, నాగరికతల్లోని మార్పులు, శాస్త్రీయమైన ఆలోచనా పద్ధతుల ఆధారంగా సమాజ గమనాన్ని అర్థం చేసుకోవాలంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

ఆర్య - ద్రావిడ సమ్మేళనం

చరిత్రలో సంఘటనలు ఎప్పుడెప్పుడు ఎలా జరిగాయో తెలిస్తే మన అవగాహన మెరుగవుతుంది. క్రీ.పూ. 8500 తరువాత పశ్చిమాసియాలోనూ, దాని పొరుగు ప్రాంతాల్లోనూ వ్యవసాయం, జంతువుల పెంపకం మొదలవడంతో మానవ సమాజాలకు పాతరాతియుగపు లక్షణాలన్నీ పోయి కొత్త ధోరణులు మొదలయ్యాయి. పొట్ట నింపుకోవటానికి వేటా, ఆహారసేకరణా బాగా తగ్గిపోయాయి.

స్థిరనివాసాలతోబాటుగా తాత్కాలిక అవసరాలకు మించిన ఆహారోత్పత్తిని సాధించడం, దాన్ని నిలవ ఉంచుకోవడం అలవడింది. జనసాంద్రత అపూర్వంగా పెరిగింది. సమాజంలో శ్రమవిభజన మొదలై, ఆహారోత్పత్తికి సంబంధించని కార్యకలాపాల్లో కొందరు నిపుణులు కాసాగారు. లోహాల ఉపయోగం, కుండలూ, పాత్రల తయారీ, సమాజానికి పనికొచ్చే వివిధ వస్తువుల రూపకల్పనా మొదలవడంతో నగరనిర్మాణానికీ, నాగరికతకూ మార్గం సుగమం అయింది. ప్రకృతి అనుకూలించని న్యూగినీవంటి ప్రాంతాల్లో మట్టుకు ఇటువంటిదేమీ జరగలేదు. వేటాడుతూ, ఆహారసేకరణలో నిమగ్నమైన ఆదిమ తెగల జీవితవిధానంలో ఎన్నో శతాబ్దాలపాటు మార్పులు కలిగే అవకాశం లేకుండాపోయింది. శ్రమవిభజన జరగని ఆ సమాజాల్లో ప్రతివారూ పొట్టపోసుకునేందుకే పాటుపడ్డారు. భాషా, మౌఖిక, లిఖిత సాహిత్యమూ, నగరాలూ, ఆయుధాలూ, సైన్యాలూ ఏవీ ఎరగని ఆ సమాజాలు తొలిసారిగా నాగరికులకు తారసపడినప్పుడు ఆదిమతెగలన్నీ లొంగిపోక తప్పలేదు.

ఈ సందర్భాలు ఎలా తలెత్తేవి? ఎప్పుడైనా, ఎక్కడైనా అవసరమనిపిస్తే తప్ప ప్రజలు ఉన్నచోటునుంచి కదిలే ప్రయత్నం చేసేవారుకారు. ప్రపంచంలో మనుషుల జనాభా పెరుగుతున్నకొద్దీ నివాసయోగ్యమైన ప్రదేశాలన్నీ జనవాసాలతో నిండసాగాయి. కొత్తచోటికి వచ్చినప్పుడల్లా ఈ సముదాయాలు ఒకరికొకరు ఎదురుపడేవారు. స్థానిక వనరుల కోసం సంఘర్షణ తప్పనిసరి అవుతూ ఉండేది. అప్పటికే సాధించిన పరిణతినిబట్టి వీటిలో కొందరిది పైచెయ్యి అయేది. ఇవన్నీ సాయుధ సంఘర్షణలే కానవసరంలేదు. తక్కిన విషయాల్లో ఔన్నత్యం సాధించినప్పటికీ ఇనప ఆయుధాలూ, పోరాటపటిమ లేనటువంటి సింధు ప్రజలు క్రమంగా క్షీణదశకు చేరుకున్నారు. క్రీ.పూ. 1000 ప్రాంతాల ప్రజలకు తమ పొరుగు ప్రాంతాల గురించిన అవగాహన కొంతవరకూ పెరిగింది. వివిధ సమాజాల మధ్య జరిగిన ప్రక్రియలన్నీ చరిత్రకు పునాది వేశాయి.

మనదేశంలో అశోకుడి కాలందాక రాతిమీద శాసనాలు చెక్కించే సంప్రదాయం మొదలవలేదు కాని, ఇరాన్ తదితర దేశాల్లో ఇది ఏనాడో మొదలయింది. అందువల్ల మనదేశపు ప్రాచీనచరిత్రకు ఆధారాలు సులువుగా దొరకవు. ఆ యుగానికి చెందిన పొరుగు దేశాల సంప్రదాయాలద్వారా కొంత సాక్ష్యం లభిస్తుంది. మనదేశానికి వచ్చిన ఆర్యభాషీయుల తొలి సాహిత్యమైన ఋగ్వేదానికీ, దాదాపు అదే కాలంలో రూపొందిన పార్శీ మతస్థుల పవిత్రగ్రంథం జెండ్అవెస్తాకూ భాషాపరంగానూ, మాటల్లోనూ, తాత్విక, మతవిశ్వాసాల్లోనూ ఎన్నో పోలికలున్నాయి. ఆ కారణంగా ఇండో ఇరానియన్ శాఖ ఒకటి మనదేశానికి వచ్చినంత పనిచేసి వెనక్కి వెళిపోయి ఉంటుందనే అనుమానం కలుగుతోంది.

మెసపొటేమియాలోని ప్రాచీన సంప్రదాయాన్ని సుమేరియన్ నాగరికత అంటారు. తరవాతి కాలంలో అది బాబిలోనియాగా ప్రసిద్ధికెక్కింది. అక్కడ క్రీ.పూ. పద్దెనిమిదో శతాబ్దంలో పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించినవాడు హమ్మురాబీ. ఇతని తరవాత ఆ ప్రాంతాలకు ఆర్యభాషీయులు మొదటగా వచ్చినట్టు అప్పటి క్యూనీఫాం రచనలూ, ఆధారాలవల్ల తెలుస్తోంది. రాజకీయ మార్పుల కారణంగా పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన ఈ బృందాల్లో కొన్ని సింధునది ప్రాంతాలకు వచ్చి ఉంటాయి. వీరందరిదీ ఒకే రకమైన సంప్రదాయం. అందుకే ఈ పాత లక్షణాలు కొన్ని ఋగ్వేదంలోనూ, జెండ్ అవెస్తాలోనూ కూడా కనబడతాయి. రెంటిలోనూ గోవులది ప్రముఖస్థానం. పార్శీవారు అగ్నిని పూజిస్తారు. క్రీ.పూ. ఆరో శతాబ్దంనాటి వాడైన పార్శీ ప్రవక్త జరతుష్ట్ర (జొరాస్టర్) తనను 'మంత్రం' తెలిసిన జోతర్‌గా (హోత్ర) అభివర్ణించుకున్నాడు. రెండు సంప్రదాయాల్లోనూ సోమరసానికి (హోమ) సంబంధించిన తంతులున్నాయి. జెండ్ అవెస్తాలో కనబడే "క్షాత్ర వైర్య" (శక్తి, భగవంతుడి సామ్రాజ్యం) వంటి కొన్ని మాటలు సంస్కృతంలాగే అనిపిస్తాయి.

ఇలాంటి అనేక సాక్ష్యాలవల్ల ఆర్యభాషీయులు మనదేశానికి చెందనటువంటి తాత్విక వైఖరితోనూ, పదజాలంతోనూ వచ్చారని తెలుస్తోంది. నేటి మన సమాజంలో ప్రాచుర్యంలో ఉన్న సంప్రదాయాలూ, తత్త్వధోరణులూ అన్నిటికీ అప్పటి సంఘటనలే కారణం. ఆగంతకుల దృష్టిలో సింధునది ప్రాంతపువారికి 'ఉండవలసిన' భాషా, విధి విధానాలూ ఏమీలేవు. మొదట్లో తమను ఆర్యులుగానూ, పొరుగువారిని దాసులుగానూ పేర్కొన్నప్పటికీ, తరవాతి దశల్లో ఆర్యులంటే

పూజనీయులనీ, దాసులంటే వైరభావనతో చూడవలసినవారనీ అర్థాలు ఏర్పడ్డాయి. అంతమాత్రాన ప్రతిచోటా వీరిమధ్య స్పర్ధలు తలెత్తాయని కాదు. భృగు, శంబర మొదలైన "దాస" నాయకులు యజ్ఞయాగాదులు చేసి రుత్విజులకు దక్షిణ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. దాసులతో పోలిస్తే తొలి ఆర్యులు పేదవారే. అందుకనే ఆర్యులు తరుచుగా "దాసపురాలను" కొల్లగొట్టి గోవులను దోచుకెళ్ళేవారు.

భాష విషయంలో కొత్తవారికి దేశీయ ద్రావిడ భాషలేవీ వచ్చేవికావు. క్రమంగా ఈ పరిస్థితి మారింది. తమలాగా యజ్ఞవిధులను నిర్వర్తించని స్థానికుల(దాసుల)పై దాడిచెయ్యడం ఆర్యులకు మొదట్లో సమర్థనీయంగానే ఉండేది. ఈ విభేదాలన్నీ జాతినిబట్టి కాక భాష, సంప్రదాయాలవల్ల తలెత్తేవి. ఆర్యభాషీయులలో రాజన్యులూ, రుత్విజులూ, కవులూ మొదలైనవారుండేవారు. కానీ కాలక్రమేణా అసురులూ, రాక్షసులలో పురువంశస్థులైన కొందరిలాగా దాసులుకూడా కొత్త సంప్రదాయాలని పాటించడం, కాస్త కాస్తగా ఆర్యభాష మాట్లాడడంవంటి పనులు చెయ్యసాగారు. వీరికి త్వరలోనే గుర్తింపు లభించింది. వీరి స్త్రీలను ఆర్యభాషీయులు పెళ్ళాడటం, పిల్లలూ, కొత్త వంశాలూ అభివృద్ధి చెందడం వగైరాలన్నీ మొదలయ్యాయి. సింధు ప్రాంతంలో వర్షాభావం ఏర్పడటంతో ప్రజలు తూర్పుగా తరలడం, రుత్విజులు ముందుగా వెళ్ళి అక్కడివారికి తమ పద్ధతులు నేర్పడం జరిగింది. మొదట్లో ఆర్యుల వేటకూ, ఆత్మరక్షణకూ పనికొచ్చిన ఇనప ఆయుధాలు క్రమంగా స్థానికులను భయపెట్టి లొంగదీసుకోవటానికి పనికొచ్చాయి.

క్రీ. పూ. 500 ప్రాంతానికల్లా దాసులు బలహీనులై అణచివేతకు గురయ్యారు. రాజన్యుల బలం పెరిగింది. రుత్విజులు దానాలూ, దక్షిణలూ పుచ్చుకోసాగారు. వర్ణవ్యవస్థ రూపు దిద్దుకోసాగింది. వేదకాలం పూర్తయేసరికి శరీరశ్రమ చెయ్యడం శూద్రులవంతయింది. కొత్త వ్యవస్థకు సంబంధించిన భావజాలమంతా ఆ తరవాతి కాలపు సాహిత్యంగా, తత్వధోరణిగా నిక్షిప్తం కాసాగింది. ఈ సమాజానికి, మొదటగా మనదేశానికి వచ్చిన తండాలకూ పోలికలే లేవు. భాషా, సంప్రదాయాలూ, కట్టుబాట్లూ అన్నీ భారతీయ లక్షణాలను సంతరించుకున్నాయి. తూర్పు ప్రాంతాలూ, వింధ్యపర్వతాలదాకా దక్షిణప్రాంతాలూ, అన్నీ ఈ సంస్కృతిని అలవరచుకున్నాయి. పశ్చిమ సముద్రతీరం, తూర్పు సముద్రతీరం వెంబడికూడా ఈ కొత్త పద్ధతులు దక్షిణానికి వ్యాపించాయి. దక్షిణ భారతదేశంలో మటుకు ప్రాచీన సంప్రదాయాలు అంతగా ప్రభావితం కాలేదు. వర్గ విభజన కారణంగా వర్ణవ్యవస్థ మాత్రం దాదాపు ఒకే పద్ధతిలో ప్రతిచోటా అమలుకాసాగింది. మొత్తంమీద కొన్ని శతాబ్దాల తరవాత ఆర్య, ద్రావిడ పద్ధతులన్నీ ఏకమైపోయినట్టుగా అనిపించసాగింది.

మనతో సమకాలికంగా ఈజిప్ట్‌లోనూ, పర్షియాలోనూ వివిధ రాజవంశాలు తలెత్తడం, అంతరించడం జరిగాయి. ప్రాంతాన్నిబట్టి వివిధదేశాల్లో ప్రజలకు తమ పొరుగువారితో మైత్రీ, వైషమ్యాలూ కలుగుతూ వచ్చాయి. అందుకే ప్రతిచోటా ఒక్కొక్క మతధోరణీ, తాత్విక దృక్పథమూ ఏర్పడ్డాయి. వీటికంటే ముఖ్యంగా భాషలూ, ఆచారవ్యవహారాలూ మొదలైనవాటిలో తేడాలు కలిగాయి. క్రీ. పూ. నాలుగో శతాబ్దంలో అలెగ్జాండర్ దండయాత్ర చేసేదాకా మనదేశపు పరిణామాలన్నీ తక్కిన దేశాలతో సంబంధించని దిశలో కొనసాగాయి. అందుకే మనదేశంలో అప్పటిదాకా జరిగిన సామాజిక పరిణామాలన్నీ ప్రత్యేకమైనవిగా అనిపిస్తాయి.

చరిత్రలో జరిగిన విషయాలని గురించి చెప్పుకుంటున్నప్పుడు క్రీ. పూ. అనీ క్రీ. శ. అనీ తారీఖులు పేర్కొంటూ ఉంటాం. వివిధ ప్రాచీన సంఘటనల మధ్య ఏ వెయ్యేళ్ళో, 500 ఏళ్ళో ఎడం ఉన్నప్పటికీ ఈనాడు మనకది విశేషంగా అనిపించదు. వ్యక్తిగత జీవితంలో మటుకు 50 ఏళ్ళ క్రితం జరిగినవి కూడా ఏనాడో గడిచిపోయినవిగా అనిపిస్తాయి. కాలం గడుస్తున్న కొద్దీ సమాజంలో జరిగే మార్పుల వేగం పెరుగుతూ పోతుంది. నా జీవితానికీ నా ముత్తాత జీవితానికీ ఉన్న తేడాల కంటే ఆయన జీవితానికీ, ఆయన ముత్తాత జీవితానికీ తేడాలు తక్కువగానే ఉండి ఉంటాయి. అయినప్పటికీ చారిత్రక సంఘటనల క్రమం ఎటువంటిదో కాస్త తెలుసుకోవడం మంచిది. సింధునాగరికతకు పూర్వదశ క్రీ. పూ. 7000–4300 నాటిదనీ, క్రీ. పూ. 4300–3200లోని మధ్యదశకు రాగి వస్తువులు సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయనీ, క్రీ. పూ. 3200–2600 నుంచీ మనం అభివర్ణిస్తున్న సింధునాగరికత మొదలైందనీ చరిత్రకారులు చెపుతారు. అంటే సింధునాగరికత ఉన్నతదశకు చేరుకునేముందు నాలుగున్నర వేల ఏళ్ళుగా మనుషులు అదే ప్రాంతంలో స్థిరనివాసాలు ఏర్పరుచుకుని జీవించారన్నమాట. ఇప్పటికీ, సింధునాగరికత కాలానికీ మధ్య ఎంత వ్యవధి ఉందో ఆ నాగరికత తలెత్తే ముందుకూడా అంతటి సమయమూ గడిచిందని గుర్తుంచుకోవాలి.

ఇంతటి సుదీర్ఘకాలంలో ఎంత వెనకబడిన జాతి అనుకున్నా అప్పటివారు తమ జీవనశైలిని గురించీ, సమాజ స్వరూపం, సామాజిక సంబంధాల గురించీ కొంత స్పష్టమైన వైఖరిని అవలంబించి ఉండాలి. రోజువారీ జీవితాలకు అత్యవసరమైన ఆహారోత్పత్తీ, అందులో ముఖ్యాంశాలైన వ్యవసాయమూ, పాడిపంటలూ, పల్లెలూ, వీధులూ, నివాసగృహాల నిర్మాణవిశేషాలూ, ప్రకృతి గురించిన కొంత పరిజ్ఞానమూ, అవగాహనా రూపుదిద్దుకుని ఉంటాయి. ప్రకృతివల్ల సహజంగా కలిగే విపత్తులూ, వానలూ, వరదలూ, రోగాలూ, రొష్టులూ, క్రూరమృగాల బెడదలూ అన్నిటినీ సహించడం, వాటికి పరిష్కార మార్గాలు వెతుక్కోవడం ప్రజలకు అలవడి ఉంటాయి.

అలాగే పిల్లల పెంపకం, ఆరోగ్యసూత్రాలూ, నీటి వనరులూ, పారిశుద్ధ్యమూ వగైరాల సమాచారం విలువైన జ్ఞానసంపదగా తరతరాలపాటు కొనసాగి ఉంటుంది. చావుపుటకల గురించిన ప్రాథమిక దృక్పథమూ, తాత్విక చింతనా, ఏదో ఒక రూపంలో మతభావనలూ, పూజలూ, తంతులూ, నమ్మకాలూ, ఆచారాలూ, కట్టుబాట్లూ, నియమనిబంధనలూ అమలులోకి వచ్చి ఉంటాయి. వీటి గురించి మనకేమీ తెలియదు. సింధు ప్రజల భాషా, లిపీ మొదలైనవాటిలాగే ఇవి కూడా "ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని" విషయాలు. వివరాలు తెలియనప్పటికీ ఇంతటి దీర్ఘకాలిక అనుభవం ఒక ఉన్నత నాగరికతకు పునాదిగా పనిచేసి ఉంటుందని మనం సులువుగా ఊహించవచ్చు.

ఈ వివరాల్లోకి వెళ్ళే ముందు భారతదేశాన్ని సామాజికంగా, చారిత్రకంగా, తాత్త్వికంగా ప్రభావితం చేసిన ముఖ్యసంఘటనల కాలక్రమాన్ని ఒకసారి క్లుప్తంగా పరిశీలించవచ్చు. ఇవన్నీ చరిత్రకారులు నిర్ణయించిన తారీఖులు. మొహెంజోదడో, హడప్పా నాగరికత క్రీ.పూ. 2300 నుంచీ బలపడి క్రీ.పూ. 1500 నాటికల్లా క్షీణదశకు చేరుకుంది. క్రీ.పూ. 2613లో ఈజిప్ట్‌లోని ఖియోప్స్ పిరమిడ్ నిర్మాణం జరిగింది. క్రీ.పూ. 1300–1200 ప్రాంతాల మనదేశానికి ఆర్యుల ఆగమనం మొదలైంది. సుమారు క్రీ.పూ. 1200లో ఋగ్వేదపు తొలి సూక్తులు ఆవిర్భవించాయి. క్రీ.పూ. 1200–900 మధ్యలో యజుర్వేదం, సామ, అథర్వణ వేదాల కూర్పు జరిగింది. క్రీ.పూ. 1193లో గ్రీకులు ట్రోయ్ నగరాన్ని ముట్టడించారు. రమారమిగా క్రీ.పూ. 1000లో మనదేశంలో ఇనుము వాడకం మొదలైంది. క్రీ.పూ. 900–600 మధ్యలో బ్రాహ్మణాల కూర్పు జరిగింది. ఇవన్నీ వేద సంప్రదాయాల, తంతుల వివరణలవంటివి. క్రీ.పూ. 600–100 మధ్యలో వర్ణాశ్రమ సూత్రాల నిర్వచనాలూ, చివరి ఉపనిషత్తులూ రూపొందాయి. క్రీ.పూ. 599–527 మధ్య కాలంలో మహావీరుడూ, క్రీ.పూ. 563–483 మధ్య కాలంలో గౌతమ బుద్ధుడూ జీవించారు. క్రీ.పూ. 550 ప్రాంతానికల్లా జైన, బౌద్ధ మతాలు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ఎదిరించి వేరుపడ్డాయి. క్రీ.పూ. 500 ప్రాంతాల వేదాలూ, ఆరణ్యకాలూ, ఉపనిషత్తులూ లిఖితం చెయ్యబడ్డాయి. క్రీ.పూ. 325లో చంద్రగుప్తమౌర్యుడి కాలంలో అలెగ్జాండర్ మనదేశానికి దండెత్తి వచ్చాడు. క్రీ.పూ. 261లో అశోకుడు కళింగ యుద్ధం చేశాడు. క్రీ.పూ. 200 – క్రీ.శ. 200 మధ్యలో మనుధర్మశాస్త్రమూ, రామాయణ మహాభారతాలూ రచింపబడ్డాయి. క్రీ.పూ. 100లో భగవద్గీత రచన జరిగింది. క్రీ.పూ. 30లో ఆంటొనీ, క్లియోపాత్రాలు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికే రోమ్‌లో జూలియస్ సీజర్ హత్యకు లోనవడం, ఆక్టేవియస్ అధికారాన్ని చేజిక్కించుకోవడం వగైరాలన్నీ జరిగాయి. ఏసుక్రీస్తు ఇంకా పుట్టలేదు.

క్రీ.శ. 78–144 ప్రాంతంలో కశ్మీరుకు ఉత్తరాన ఆఫ్ఘనిస్తాన్ ఉన్న ప్రదేశాన్ని ఏలిన కుషాణరాజు కనిష్కుడు బౌద్ధమతాన్ని ఆదరించాడు. మనదేశంలో క్రీ.శ. 200 ప్రాంతాల హిందూ వేదాంత తత్త్వం మొదలయింది. క్రీ.శ. 300–800 మధ్యలో శివ, బ్రహ్మ, విష్ణు, మార్కండేయ, మత్స్య పురాణాల రచన జరిగింది. క్రీ.శ. 320–540 మధ్యలో గుప్తసామ్రాజ్యం వర్ధిల్లింది. అదే కాలంలో శైవమతం తలెత్తింది. క్రీ.శ. 500 తరవాత బౌద్ధులను పీడించడం మొదలైంది. క్రీ.శ. 700 నాటికల్లా కులవ్యవస్థ బాగా విస్తరించి, వేళ్ళూనుకుంది. క్రీ.శ. 788–820 మధ్య కాలంలో శంకరాచార్యుడు జీవించాడు. క్రీ.శ. 1137లో రామానుజాచార్యుడు మరణించాడు. ఈ సంఘటనలన్నీ ముందు వెనకలుగా ఎలా జరిగాయో, సమాజం అంతకంతకూ ఎప్పుడెప్పుడు ఎటువంటి మార్పులకు లోనయిందో స్థూలంగా ఊహించుకోవచ్చు. సమాజంలోని అసమానతలూ, పేదల కష్టాలూ, రైతులూ, శ్రామికుల అగచాట్లూ, మూఢవిశ్వాసాలూ, రాజవంశాల ఆధిపత్యమూ, యుద్ధాలూ, ఉన్నత వర్గాల ఉదాత్త తత్వ ధోరణులూ అన్నీ చెట్టాపట్టాలేసుకుని కొనసాగాయి.

ఈ చరిత్ర క్రమాన్ని అర్థంచేసుకుంటే దేని తరవాత ఏం జరిగిందో తెలుస్తుంది. మన ఆచారాలన్నీ "అనాదిగా" కొనసాగుతున్నాయని చదువుకున్నవారికి కూడా అనిపిస్తూ ఉంటుంది. ఇందులో నిజం లేదు. మనకున్న రకరకాల దేవుళ్ళ, వారి అవతారాల సృష్టి ఎప్పుడెప్పుడు జరిగిందో తెలుసుకోవచ్చు. నిన్నా మొన్నా ముగ్గులోకి దిగిన సాయిబాబాలను కూడా "ప్రాచీన" సంప్రదాయంలో భాగమని నమ్మేవారికి చారిత్రక దృక్పథం ఉండదు. ఆసక్తి ఉండాలే కాని, బ్రాహ్మణులలోనూ, ఇతర కులాలలోనూ శాకాహార పద్ధతులు ఎప్పుడు, ఎందుకు మొదలయాయో, మతపరమైన మన విశ్వాసాల్లోని ఏయే ఆచారాలు ఎప్పుడు తలెత్తాయో తెలుసుకోవడం కష్టం కాదు. సింధునాగరికత ప్రస్తావనలో ద్రావిడ, ఆర్య ప్రజలను గురించిన చర్చ తప్పకుండా వస్తుంది. ఆధునిక రాజకీయ పక్షపాతవైఖరి లేకుండా చరిత్రకారులు ఈ విషయంలో ఏం చెపుతున్నారో తెలుసుకోవాలి. వేదాలు ఎంత పాతవైనా అంతకు ముందు ఐదు వేల ఏళ్ళ చరిత్ర జరిగిందని పై వివరాలనుబట్టి తెలుస్తుంది. వేదాలనే ఆధారం చేసుకున్న వివిధ తత్వధోరణులు ఆ తరవాత ఎలా ఎందుకు ఆవిర్భవించాయో, అంతకు పూర్వపు నాగరికత చిహ్నాలన్నిటినీ కావాలనో, తెలియకో ఎందుకు చెరిపెయ్యవలసివచ్చిందో మనమీనాడు ఆలోచించాలి.

బౌద్ధ, జైన మతాల పుట్టుకా, ప్రాబల్యం, అవి క్షీణించడానికి కారణాలూ అన్నీ విశ్లేషించబడ్డాయి. నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలకూ, మతం, ఆచారాల పేరున జరుగుతున్న దురాగతాలకూ, అన్యాయాలకూ బీజాలు చరిత్రలోనే కనబడతాయి. మనదేశమూ, ఇతర ఆసియా దేశాలూ ఒకప్పుడు అనేక వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో ఉన్నతిని సాధించినప్పటికీ తరవాతి కాలంలో ఎందుకు వెనకబడ్డాయో తెలుసుకోవాలి. వీటన్నిటికీ కారణాలు చరిత్రలోనూ, సామాజిక చరిత్రలోనూ కనబడతాయి. ఈ కథకు ప్రారంభం సింధునాగరికత కాలంలోనే లభిస్తుంది. అస్పష్టమైన ఆనాటి సాక్ష్యాలు తరవాతి సంఘటనలకు ఎలా దారితీశాయో మనం ఆలోచించుకుని అర్థం చేసుకోవాలి. వీ

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - మార్చ్ 2009 : రామ మనోహర్ లోహియా భావాలు - సమకాలీనత**
- **ఫోకస్ - ఏప్రిల్ 2009 : కేంద్ర - రాష్ట్ర బడ్జెట్లు**
- **హామీలు చేనేతకు - నిధులు టెక్స్‌టైల్‌కు - బండారు జ్వాలా నరసింహం**
- **చరిత్రలోనూ మానవ మనోధర్మంలోనూ హేతువాదం - నీతి - భగవత్ ప్రసాద్**

పాఠశాలలు, విద్యార్థులు ప్రాతినిధ్యం వహించే భిన్న సంస్కృతులకూ, సమాజాలకూ మధ్య ఉన్న విభేదాన్ని ఉపాధ్యాయులు గుర్తించినపుడే బోధనకూ, విద్యకూ మధ్య సజీవ సంబంధం ఏర్పడుతుందని అన్నారు **ఆంటోనియో గ్రాంసీ**

విద్యా సూత్రపు అన్వేషణలో...

పాతకాలపు ప్రాథమిక పాఠశాలలో చిన్నారి పిల్లల విద్యాభ్యాసంలో రెండు మౌలిక అంశాలుండేవి. వారికి ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల ప్రాథమిక అంశాలను బోధించేవారు. అలాగే పౌరుల హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించేవారు. మొదటి అంశమైన విజ్ఞాన శాస్త్ర భావనలను బోధించడం ద్వారా శిశువులలో ప్రాపంచిక విషయాల గురించి అవగాహన కల్పించడం జరిగేది. అదే విధంగా హక్కులు, బాధ్యతల పాఠాల ఉద్దేశం శిశువుకు ప్రభుత్వం గురించి, రాజ్యాంగ యంత్రం గురించి, పౌరసమాజం గురించి తెలియజెప్పడం. అయితే ఇక్కడ ఒక సమస్య వచ్చేది. పిల్లలు పాఠశాలలో నేర్చుకున్న విజ్ఞాన శాస్త్ర భావనలకు, తమ చుట్టూ జానపద గాథల ద్వారా ప్రపంచం గురించి, ప్రకృతి గురించి నేర్చుకునే లోకాతీత భావనలకు మధ్య ఘర్షణ వచ్చేది. అలాగే ఒకవైపు పాఠశాలలోనేమో పౌరహక్కుల గురించి, బాధ్యతల గురించి నేర్చుకుంటూ ఉండగా, తమ చుట్టూ జీవితంలోని వ్యక్తివాద, స్థానిక అనాగరిక ధోరణులు మళ్లీ జానపద గాథల నుంచి వాళ్లకు అందుతూ వాళ్లను ఘర్షణకు గురిచేస్తుండేవి. పాఠశాల సంప్రదాయాన్ని ఎదిరించడానికి, ప్రపంచం గురించిన సంప్రదాయిక భావనల అవశేషాలన్నిటినీ తొలగించడానికి ప్రయత్నిస్తుండేవి.

పాఠశాల ఒక ఆధునిక దృక్పథాన్ని బోధించడానికి ప్రయత్నించేది. ఆ ఆధునిక దృక్పథంలో ఒక సాధారణ మౌలిక వాస్తవం గురించిన అవగాహనే పునాదిగా ఉండేది. ఆ అవగాహన ఏమంటే మనిషి ఉనికిలోకి రాకపూర్వమే భౌతికమైన, మారడానికి వీలులేని ప్రాకృతిక నియమాలతో ప్రపంచం ఉందనేది. ఆ ప్రకృతి నియమాల మీద ఆధిపత్యం సంపాదించాలంటే మనిషి చేయగలిగిందల్లా మొదట ఆ నియమాలను అంగీకరించడమే. అదే విధంగా మానవ కార్యాచరణ ఫలితంగా ఏర్పడిన సామాజిక, పాలనా నియమాలు కూడా కొన్ని ఏర్పడి ఉన్నాయి. వాటిని గతకాలపు మానవులే రూపొందించారు. మనుషుల సామూహిక అభివృద్ధి క్రమంలో తమ ప్రయోజనాల కొరకు మనుషులు ఆ నియమాలను మార్చగలరు. రాజ్యాంగ యంత్రం గురించి, సమాజం గురించి ఏర్పడిన ఈ నియమాలు ఒక సమతా స్థితిని సాధిస్తాయి. ఆ సమతా స్థితియే చారిత్రకంగా మనుషులు ప్రకృతి నియమాలపై ఆధిపత్యం వహించగల శక్తిని ఇస్తుంది. అంటే మరో మాటలో చెప్పాలంటే ఈ ప్రకృతి నియమాలు, ఈ సామాజిక నియమాలు మనుషులు పని చేసేందుకు వీలు కలిగిస్తాయి. పని అనేదే మనుషులు తమ ప్రాకృతిక జీవితంలో క్రియాశీలంగా పాల్గొనే నిర్దిష్ట వ్యక్తీకరణ. ఆ పని ద్వారా మనుషులు తమ ప్రాకృతిక జీవితాన్ని మార్చుకుంటూ ఉంటారు. సామాజికం చేసుకుంటూ ఉంటారు. మరింత మరింత లోతుగానూ, విస్తృతంగానూ మార్చుకుంటూ ఉంటారు.

అంటే పాతకాలపు ప్రాథమిక పాఠశాలలకు పునాదిగా ఉన్న విద్యా సూత్రం 'పని' అనే భావనతో సన్నిహిత సంబంధంలో ఉండేదని చెప్పవచ్చు. మానవ శ్రమను దాని సకల విస్తృత శక్తితోను, ఉత్పాదకత తోను వాస్తవికం చేయాలంటే ప్రకృతి నియమాల గురించిన కచ్చితమైన, నిజమైన పరిజ్ఞానం ఉండవలసి ఉంటుంది. అలాగే మనుషుల ఉమ్మడి జీవితాన్ని లోలోపలి నుంచి నియంత్రించే చట్టపరమైన వ్యవస్థ కూడా ఉండవలసి ఉంటుంది. మనుషులు ఈ చట్టపరమైన వ్యవస్థను నిరంతరం యథాలాపపు సమ్మతితో గౌరవించవలసిందే తప్ప దాన్ని ఏదో బయటి నుంచి రుద్దిన నిర్బంధంగా భావించగూడదు. అది వారు తమంత తాము స్వేచ్ఛగా, అవసరంగా గుర్తించిన విషయంగా ఒక నిర్బంధ ఫలితంగా కాకుండా ఉండాలి.

శ్రమ అనేది సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మక కార్యక్రమంగానూ, ఒక భావనగానూ, ఒక వాస్తవంగానూ పాతకాలపు ప్రాథమిక పాఠశాలల విద్యా సూత్రంగా అంతర్గర్భితంగా ఉండేది. పని ద్వారానే సామాజిక, రాజ్యాంగ చట్రాన్ని, హక్కులను, బాధ్యతలను పరిచయం చేసి వాటిని ప్రకృతి ధర్మంలో భాగంగా కూడా చూపించేవారు. సామాజిక నియమాలకూ, ప్రకృతి నియమాలకూ మధ్య సంబంధాలు శ్రమ ద్వారానే నిర్ధారితమవుతాయనే వాస్తవాన్ని అంటే, మనిషి భావనాత్మకమైన, ఆచరణాత్మకమైన కృషి ద్వారానే వ్యక్తమవుతాడనే వాస్తవాన్ని గుర్తించడమే మొట్టమొదటి విద్య. అది మనిషికి ప్రపంచం గురించిన అతీత భావనలను, మూఢనమ్మకాలను తొలగించి వాస్తవ జ్ఞానాన్ని ఇస్తుంది. ప్రపంచం గురించిన చారిత్రకమైన, గతి తార్కికమైన దృక్పథాన్ని ఏర్పర్చుకోవడానికి ఆ తరువాతి కాలంలో మనిషి చేసే ప్రయత్నానికి అది పునాదిని కల్పిస్తుంది. అదే చలనాన్నీ, మార్పునూ అర్థం చేసుకోవడానికి పునాది కల్పిస్తుంది. గతకాలం ఎంత కృషి సాగిస్తే, ఎన్ని త్యాగాలు చేస్తే వర్తమానం ఏర్పడిందో గుర్తించడానికి, వర్తమానం ఎంత కృషి సాగిస్తే, ఎన్ని త్యాగాలు చేస్తే భవిష్యత్తు ఏర్పడుతుందో గుర్తించడానికి ఈ అవగాహనే పునాది కల్పిస్తుంది.

అంటే, సమకాలీన ప్రపంచం అనేది అన్ని పాతతరాల గతకాలపు

సమ్మిశ్రమణం అనీ ఇదే భవిష్యత్తులోకి ప్రవహిస్తుందని గుర్తించడానికి వీలుకల్పిస్తుంది. ప్రాథమిక పాఠశాలకు వాస్తవికమైన పునాది ఇది. ఈ అవగాహన నిజంగా ఫలితాలు సాధించిందా, తమ ముందర ఉన్న కర్తవ్యపు స్వభావం ఏమిటో, దాని తాత్విక మూలం ఏమిటో, ఆనాటి ఉపాధ్యాయులు గుర్తించారా అనేది వేరే ప్రశ్న. అది జరిగి ఉండకపోవచ్చు. ఎందువల్లనంటే అధ్యాపక వర్గం అనేది ఒక యావత్ జాతిలో ఒకానొక చిన్న వ్యక్తీకరణరూపం మాత్రమే. అదికూడా బలహీనమైన వ్యక్తీకరణ. కచ్చితంగా అగ్రగామి వ్యక్తీకరణ కాదు. అందువల్ల ఆ అవగాహన ఏర్పడిందా లేదా చూడాలంటే యావత్ జాతి పొంది ఉన్న పౌర చైతన్యపు స్థాయి ఏమిటో విశ్లేషించవలసి ఉంటుంది.

'విద్య' అనేదానికి 'బోధన' అనేదానికి చాలా తేడా ఉందనేది పూర్తిగా నిజం కాదు. కాని చాలామంది ఆదర్శ విద్యావేత్తలు ఈ రెండిటి మధ్య చాలా ఎక్కువ తేడా ఉందని చూపే ప్రయత్నం చేసి పెద్ద పొరపాటు చేశారు. ఆ క్రమంలోనే వారు పాఠశాల విధానాన్ని పునర్నిర్మించిన ఫలితంగా జరిగిన ప్రమాదాలను మనం ఇవాళ చూస్తున్నాం. బోధన అనేది విద్య నుంచి పూర్తిగా దూరమై ఉండడమంటే అర్థమేమంటే విద్యార్థి కేవలం ఒక నిష్క్రియాపరమైన వస్తువుగా, యాంత్రికమైన గ్రహీతగా మిగిలిపోతాడు. బోధనలో తనకందిన అమూర్త భావనలను గ్రహించడం తప్ప మరొక్క పనిచేయలేడు. ఇటువంటి బోధనకు అర్థం లేదు. 'ఫలానా' అని ఊహాత్మకంగా భావన గురించి చెప్పినప్పటికీ శిశువు చైతన్యంలో అది 'వాస్తవికమైనది' అనే అనిపిస్తుంది. అయితే శిశువు చైతన్యమనేది కూడా పూర్తిగా 'వయ్యక్తిమైనది' మాత్రమే కాదు, ఆ శిశువు పౌరసమాజపు ఏ రంగంలో భాగస్వామిగా ఉన్నాడో ఆ రంగాన్ని ప్రతిఫలిస్తుంది. ఆ శిశువు కుటుంబంలోను, ఇరుగుపొరుగు సమాజం లోను, గ్రామంలోను, అటువంటి అనేక చోట్ల ఏ సామాజిక సంబంధాలు ఉన్నాయో ఆ సామాజిక సంబంధాలనే శిశువు చైతన్యం ప్రతిఫలిస్తుంది.

అందువల్ల ఒక పాఠశాలలోని విద్యార్థులలో అత్యధిక పిల్లల వయ్యక్తిక చైతన్యాలను, వారు జీవిస్తున్న సాంఘిక, సాంస్కృతిక సంబంధాలు ప్రతిఫలించడం మాత్రమే కాక, పాఠశాల విద్యా ప్రణాళికలో చెపుతున్న విషయాలకు భిన్నంగానూ, వ్యతిరేకంగానూ ఉంటాయి. అంటే, ఒక భిన్నమైన సంస్కృతికి చెందిన అమూర్త భావన, మరొక శిలాసదృశ్యమైన కాలం చెల్లిన సంస్కృతీ చట్రంలో వాస్తవికంగా మారుతుంది. అందువల్ల పాఠశాలకు, జీవితానికి మధ్య పొంతన కుదరదు. ఐక్యత సాధ్యం కాదు. అంటే, బోధనకు, విద్యకు మధ్య సహజంగా ఏర్పడవలసిన ఐక్యత ఏర్పడదు. పాఠశాలలో బోధనకు, విద్యకు సత్సంబంధాన్ని ఏర్పర్చాలంటే అది ఉపాధ్యాయుడు సాధించే సజీవ కృషిలో మాత్రమే సాధ్యమవుతుంది. అది జరగాలంటే తాము పాఠశాలలో ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్కృతికీ, సమాజానికీ తన విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్కృతికీ, సమాజానికీ మధ్య ఉన్న విభేదం గురించి ఉపాధ్యాయులకు తెలిసి ఉండాలి. ఈ రెండు దృక్పథాల మధ్య వైరుధ్యం ఉందనీ, తమ పని శిశువుల వ్యక్తిత్వ వికాసాన్ని మొదటి దృక్పథానికి అనుకూలంగా తీర్చిదిద్దడమనీ, నియంత్రించడమనీ ఉపాధ్యాయులకు తెలిసి ఉండాలి. ఉపాధ్యాయవర్గం ఈ అవగాహనను తగినంత కలిగి ఉండకపోయినా, బోధనకూ, విద్యకూ మధ్య ఉండవలసిన సత్సంబంధం రద్దయిపోయినా, బోధనా సమస్యను మొత్తం ఏదో యాంత్రికమైన విషయాలను చెప్పడానికి మాత్రమే పరిమితం చేసినా, దాని ఫలితంగా ఉపాధ్యాయుల కృషి మొత్తమే పరిమితమై పోతుంది. మనకప్పుడు కేవలం అలంకారప్రాయమైన పాఠశాలలు మిగులుతాయి. వాటిలో లోతైన విషయాలను నేర్పడమేమీ ఉండదు. చెపుతున్న అమూర్త భావనల భౌతిక రూపాల గురించి విద్యార్థులకు అర్థం కాదు. విద్యార్థులకు అర్థమైన వాస్తవం కేవలం మాటల్లోనే ఉండిపోతుంది. అంటే మొత్తం కేవలం మాటల గారడీగా మారుతుంది.

ఈ పతనం ఉన్నత పాఠశాలల్లో, మరీ ముఖ్యంగా సాహిత్యం, తత్వశాస్త్రం పాఠ్యప్రణాళికల్లో మరింత స్పష్టంగా కనబడుతుంది. గతంలో విద్యార్థులకు నిర్దిష్ట వాస్తవాలకు సంబంధించిన కొంత 'సామగ్రి'ని కొన్ని 'పరికరాల'ను అందించడం జరిగేది. ఇప్పుడు ఉపాధ్యాయుడు నిర్దిష్టంగా ఒక తత్వవేత్తగానో, ఒక సౌందర్యవాదిగానో మారి పాఠాలు చెపుతుంటాడు గనుక విద్యార్థికి ఆ నిర్దిష్ట వాస్తవాలతో సంబంధం లేదు. అర్థమైనా కాకపోయినా కొన్ని సూత్రాలను, కొన్ని మాటలను తన మెదడులో నింపుకుంటే చాలు. వాటిని నింపుకున్నంత సులభంగా మరిచిపోయినా ఫరవాలేదు. పాత పాఠశాలల మీద పోరాడడం సరైనదే. కాని, వాటిని సంస్కరించడం అనుకున్నంత సులభం కాదు. సమస్య కేవలం ఆదర్శమంతమైన పాఠ్యప్రణాళికలది మాత్రమే కాదు. అది బోధించే ఉపాధ్యాయులది. ఉపాధ్యాయులది అంటే కేవలం ఉపాధ్యాయులది మాత్రమే కూడా కాదు. వారు వ్యక్తీకరించే యావత్ సామాజిక సందర్భానిది. వాస్తవం చెప్పాలంటే ఒక సాదాసీదా ఉపాధ్యాయుడు కూడా తన విద్యార్థులు నేర్చుకోవలసిన విషయాలన్ని నేర్పవచ్చు. కాని, వాళ్లు మెరుగైన విద్యావంతులుగా మారడంలో విజయం సాధించలేకపోవచ్చు. ఆ ఉపాధ్యాయుడు బోధనలోని యాంత్రిక భాగాన్ని తూ.చ. తప్పకుండా కచ్చితంగా, నిజాయితీతో చెప్పవచ్చు. విద్యార్థి క్రియాశీలమైన ప్రతిభ ఉన్నవాడైతే ఉపాధ్యాయుడు చెపుతున్న విషయాలను తన పద్ధతిలో అర్థం చేసుకోవచ్చు. తనకు అప్పటికే ఉన్న సామాజిక నేపథ్యం సహాయంతో వచ్చిన 'సామగ్రి'ని అందిపుచ్చుకోవచ్చు. అదంతా పాత రోజుల కథకాగా ఇప్పుడు కొత్త పాఠ్య ప్రణాళికతో అదే సమయంలో ఉపాధ్యాయ వృత్తి ప్రమాణాల స్థాయి సాధారణంగానే పడిపోతూ ఉండగా అసలు విద్యార్థి అందుకోవడానికి 'సామగ్రి' అంటూ ఏమీలేనేలేదు. అసలు ఈ కొత్త పాఠ్యప్రణాళిక పరీక్షలను పూర్తిగా రద్దు చేసి ఉండవలసింది. ఎందుకంటే ఈ పాఠ్యప్రణాళికతో పరీక్షలనేవి దారుణమైన జూదం మాత్రమే. పరీక్షకుడు ఎవరైనా తేదీ తేదీగానే ఉంటుంది. నిర్వచనం నిర్వచనంగానే ఉంటుంది. కాని, ఒక సాహిత్య రచన గురించి, కళగురించి తీర్పు విషయమో? తాత్విక విశ్లేషణ విషయమో?

పాతకాలపు ఇటలీ ఉన్నత పాఠశాలల విద్యా సామర్థ్యాన్ని అది కేవలం ఒక విద్యా వ్యవస్థ అనే పునాదిపై మాత్రమే సమర్థించడానికో, వ్యతిరేకించడానికో వీల్లేదు. దాని నిర్మాణమూ, పాఠ్య ప్రణాళిక సంప్రదాయిక మేధోపద్ధతిలో, నైతిక జీవన పద్ధతిలో రూపొందాయని, ఇటలీ సమాజం మొత్తంలో ప్రాచీన సంప్రదాయం ఆధారంగా ఒక సాంస్కృతిక వాతావరణాన్ని వ్యాపింపజేయాలనేదే దాని ప్రయత్నమని గుర్తించవలసి ఉంది. ఈ వాతావరణమూ, ఈ జీవన విధానమూ పతన

దశకు వచ్చాయని, పాఠశాలనేది జీవితం నుంచి దూరమైపోయిందని కూడా గుర్తించవలసి ఉంది. అందువల్లనే విద్యా విధానం సంక్షోభంలో పడింది. ఇవాళ ఎవరైనా పాత పాఠశాల విద్యా విధానపు పాఠ్య ప్రణాళికను, క్రమశిక్షణా వ్యవస్థలను విమర్శిస్తున్నారంటే ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని విమర్శించవలసిందే. అలా విమర్శించినపుడు మళ్లీ ఒకసారి పాఠశాలా, జీవితమూ ఒకదానికొకటి సంబంధంలో ఉండాలని, పాఠశాలలో విద్యార్థి నిజమైన, క్రియాశీలమైన భాగస్వామ్యం ఉండాలని కోరుకోవలసి ఉంటుంది. కొత్త పాఠ్య ప్రణాళిక విద్యార్థుల క్రియాశీల కృషిని, ఉపాధ్యాయుడితో సజీవ ఆచరణాత్మక సంబంధాన్ని ప్రకటిస్తున్నాయంటే, సైద్ధాంతీకరిస్తున్నాయంటే ఇంతకాలం విద్యార్థి నిష్క్రియాపరుడుగా ఉండిపోయాడని గుర్తిస్తున్నాయన్నట్లే.

విద్యారంగంలో పిల్లలకు మనం శ్రద్ధగా ఉండడం, కచ్చితంగా ఉండడం, హుందాగా ఉండడం, ప్రత్యేకమైన విషయాలమీద కేంద్రీకరించగల శక్తిని పొందడం వంటి విషయాలను రంగరిస్తాం. ఈ పనులు పిల్లలు తమ నిత్యజీవితంలో భాగం చేసుకోవాలంటే వాటిని క్రమశిక్షణతో, పద్ధతి ప్రకారం, యాంత్రికంగా పునరుక్తం చేయక తప్పదు. ఒక నలభై సంవత్సరాల పండితుడు, తన రాతబల్ల దగ్గర రోజుకు పదహారు గంటలు నిర్విరామంగా కూర్చుని పనిచేయడమనేది అతను పిల్లవాడిలా, తప్పనిసరిగా, యాంత్రికమైన నిర్బంధం ద్వారా, అందుకు తగిన మానసిక, శారీరక అలవాట్లను అలవర్చుకోకపోతే సాధ్యమవుతుందా? ఎవరైనా మహా పండితులను తయారు చేయదలచుకుంటే సరిగ్గా ఈ బిందువు దగ్గరే ప్రారంభించాలి. విద్యా వ్యవస్థ మొత్తంగాను ఒత్తిడి పెంచుతూ పోవాలి. ప్రతి సంస్కృతికి అత్యవసరంగా కావలసిన అత్యున్నత ప్రమాణాల పండితులను వేల సంఖ్యలోనో, వందల సంఖ్యలోనో కనీసం డజను సంఖ్యలోనో తయారు చేయాలంటే ఈ పద్ధతి తప్పదు.

సంప్రదాయిక సంస్కృతిలోని, దానికి జీవితం పట్ల, మనిషి పట్ల ఉండే అవగాహనలోని లోతైన సంక్షోభం ప్రస్తుత పాఠశాలల్లో నానాటికి దిగజారుడుగా, పతనంగా వ్యక్తమవుతోంది. తక్షణ, ఆచరణాత్మక ప్రయోజనాలను నెరవేర్చడానికి తయారైన వృత్తివిద్య పాఠశాలలు పాతరోజుల సాధారణ పాఠశాలల కన్నా ఎక్కువ ప్రాధాన్యతను పొందుతున్నాయి. సాధారణ పాఠశాలలకు తక్షణం 'ప్రయోజనం' లేదని అంటున్నారు. అయితే ఈ వ్యవహారంలోని విచిత్రమైన అంశమేమంటే, ఈ కొత్తరకమైన పాఠశాలలు ఎంతో ప్రజాస్వామికమైనవని చెప్తున్నప్పటికీ, వాస్తవంలో అవి సామాజిక విభజనలను మరింతగా పెంచి పోషించబోతున్నాయి.

సంప్రదాయిక పాఠశాల ఉన్నతవర్గాలకు మాత్రమే చెంది ఉండేది. ఎందుకంటే అది కొత్తతరం పాలకవర్గాలను తయారు చేయడానికి ఉద్దేశించినది. కాని, దాని బోధనా పద్ధతిమాత్రం ఉన్నత వర్గాలకు మాత్రమే చెందినదిగా మాత్రమే ఉండేది కాదు. అక్కడ విద్యార్థులకు కేవలం పాలించడం ఎట్లాగో మాత్రమే నేర్పేవారు కాదు. ప్రతిభావంతులను తయారుచేయడం దాని లక్ష్యం కాదు. అలా చేసి ఉంటే ఆ పాఠశాలకు ఒక సాంఘిక స్వభావం వచ్చి ఉండేది. కాని, ఏ పాఠశాల సాంఘిక స్వభావమైన ప్రతి సామాజిక బృందానికి తనదైన పాఠశాల ఉంటుందనే వాస్తవం మీద మాత్రమే ఆధారపడుతుంది. అప్పుడు ఆ పాఠశాల ఒక స్పష్టమైన, సంప్రదాయిక విధిని, పాలనా విధినిగాని, పాలిత విధినిగాని నిర్వర్తిస్తుంది. ఈ పద్ధతిని గనుక రద్దు చేయదలచుకుంటే వృత్తి విద్య పాఠశాలలను ఇబ్బడిముబ్బడిగా పెట్టే బదులు వేరు వేరు రకాల వృత్తి విద్య పాఠశాలలు పెట్టే బదులు ఒకే రకమైన సాధారణ పాఠశాలలను ప్రాథమిక స్థాయిలోనూ, ఉన్నత స్థాయిలోనూ రూపొందించాలి. ఆ పాఠశాలలు ఒక శిశువును చిన్ననాటినుంచి ఉద్యోగంలో చేరేవరకు తీర్చిదిద్దాలి. ఒక శిశువును వ్యక్తిగా, ఆలోచించే, అధ్యయనం చేసే, పాలించే లేదా పాలించే వారిని అదుపు చేసే వ్యక్తిగా తీర్చిదిద్దాలి.

కాని, వృత్తివిద్య పాఠశాలలు వేరు వేరు రూపాలలో విపరీతంగా పెంచుతూ పోయినకొద్దీ సంప్రదాయిక, సాంఘిక విభజనలు మరింతగా పెరిగిపోతాయి. అదే సమయంలో ఈ విభజనల లోపలే ఒక్కొక్క దానిలో అంతర్గతంగా వైవిధ్యాన్ని ఈ పాఠశాలలు ప్రోత్సహిస్తాయి గనుక ఇదంతా ప్రజాస్వామిక ధోరణేమో అనే అభిప్రాయం తలెత్తుతుంది. ఉదాహరణకు ఒక శ్రామికుడు నిపుణుడైన కార్మికుడిగా మారవచ్చు. ఒక రైతు సర్వేయర్‌గానో, చిన్నపాటి వ్యవసాయ శాస్త్రవేత్తగానో మారవచ్చు. కాని ప్రజాస్వామ్యమంటే నిర్వచనం ప్రకారమే కేవలం నైపుణ్యం లేని కార్మికుడు నైపుణ్యం గల కార్మికుడుగా మారడం మాత్రమే కాదు. దాని అర్థమేమంటే ప్రతి 'పౌరుడు' పాలించగలడూ అని. సమాజం సాధారణ అర్థంలోనైనా ప్రతి పౌరునికి ఆ స్థితిని సాధించే శక్తి ఇస్తుందని. రాజకీయ ప్రజాస్వామ్యమంటే పాలకులను, పాలితులను సమానం చేయడం. అంటే, ప్రభుత్వం పాలితుల సమ్మతి ప్రకారమే పాలించడం. ఆ క్రమంలో అది ప్రతి పాలితుడికి పాలనకు అవసరమైన నైపుణ్యాలలో సాధారణ సాంకేతిక పరిజ్ఞానంలో అవసరమైన ఉచిత శిక్షణ ఇవ్వాలి. మరి ఇవాళ ప్రజల పాఠశాలల పేరుతో రూపొందిస్తున్న రకం పాఠశాలలో కనీసం ఈ భ్రమను కాపాడే ప్రయత్నమైనా జరగడం లేదు. పాలనా నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇంకా ఇంకా తక్కువ మందికి పరిమితం చేసే పద్ధతిలోనే ఈ పాఠశాలల్లో బోధన సాగుతోంది.

మరొకవైపు చుట్టూ నెలకొని ఉన్న సామాజిక, రాజకీయ నేపథ్యంలో అటువంటి నైపుణ్యాలను, సాంకేతిక, రాజకీయ యోగ్యతలను పొందేందుకు వ్యక్తిగత చొరవ సాధించడం చాలా కష్టం. అంటే, కొత్త పాఠశాలలతో నిజానికి మనం వర్గవిభజనలను అధిగమించే దిశగా ప్రయాణించడం లేదు. చట్టపరంగా నిర్ణయమైన ఘనీభవించిన విభజనల లోకి మరింతగా పయనిస్తున్నాం. శిశువు విద్యాభ్యాసం ప్రారంభమైన తొలి రోజుల నుంచే ప్రత్యేకమైన వృత్తివిద్య పాఠశాలలు ఉండడం, పెరగడం ఈ ధోరణికి ఒక గుర్తించదగిన వ్యక్తీకరణ. కొత్త విద్యాశాస్త్రం తన దాడినంతా విద్యా బోధనలో 'పిడివాదాన్ని' ఖండించడానికీ, నిర్దిష్ట వాస్తవాలను నేర్చుకోవడాన్ని ఖండించడానికీ వెచ్చిస్తోంది. కాని, ప్రాథమిక విద్యా బోధనలలో ఒకరకమైన పిడివాదం ఆచరణాత్మకంగా అనివార్యమైనదే. దాన్ని క్రమక్రమంగా మొత్తం విద్యా క్రమంలో పునః పరీక్షకు పెట్టి రద్దు చేయవలసి ఉంటుంది. మరొక పక్క మత తత్వశాస్త్రపు రంగంలో అత్యున్నత స్థాయి పిడివాదాన్ని ప్రవేశపెట్టడానికి కొత్త పాఠ్య ప్రణాళికలకు అభ్యంతరం లేదు. అందువల్ల మొత్తం తత్వశాస్త్ర చరిత్రంతా

కేవలం అర్థంలేని వాదవివాదాల చరిత్రగా కనబడుతోంది. కొత్త తత్వశాస్త్రపు పాఠ్యప్రణాళిక అసలు బోధననే కురచబారుస్తుంది. దాని స్థాయిని దిగజారుస్తుంది. పైకి చూడడానికి హేతుబద్ధంగా, ఉత్తమంగా ఉన్నట్టు అనిపిస్తూనే అది ఎందుకూ పనికిరాకుండా పోతుంది. అందుకు భిన్నంగా పాతరోజుల్లోని వర్ణనాత్మక తత్వశాస్త్రం దానితో పాటు తత్వశాస్త్ర చరిత్ర కొంతమంది తత్వవేత్తల రచనలను అధ్యయనం చేయడం మెరుగనిపిస్తుంది. వ్యాకరణం లాగా, గణిత శాస్త్రం లాగా వర్ణనాత్మక, నిర్వచనాత్మక తత్వశాస్త్రం ఒక పిడివాద సాధారణీకరణలాగ కనిపించవచ్చు. కాని విద్యాపరంగానూ సైద్ధాంతిక అవగాహనను పెంచే క్రమంలోనూ అది ఒక అవసరం. 'ఒకటి అంటే ఒకటి' అనే సూత్రం అమూర్త సూత్రమే కావచ్చు. కాని ఆ సూత్రాన్ని నేర్చుకున్న వారెవరు 'ఒక ఈగ, ఒక ఏనుగు సమానమే' అని అనుకోరు. ప్రామాణిక తత్వశాస్త్ర సూత్రాలు కూడా అటువంటివే. అవి మామూలు ఆలోచనల వ్యాకరణం లాంటివి. అయినా వాటిని అధ్యయనం చేయవలసి ఉంటుంది. అవి మనలో సహజంగా రూపొందేవి కావు. వాటిని మన ఆచరణ ద్వారా, ఆలోచన ద్వారా గ్రహించవలసిందే. కాని, కొత్త పాఠ్య ప్రణాళిక ఏమనుకుంటుందంటే ఈ ప్రామాణిక తర్క సూత్రాలు మనిషిలోపల సహజంగా ఉంటాయని, ఆలోచనతో పాటే అవి అమలులోకి వస్తాయని. అందువల్ల వాటిని ఎట్లా నేర్చుకోవాలో వివరించడం లేదు. అవి పుట్టుకతోనే వస్తాయన్నట్టు భావిస్తున్నారు.

ప్రామాణిక తర్కం వ్యాకరణం లాంటిది. దాని వాస్తవిక శిక్షణా క్రమం ఒక పద్ధతి ప్రకారం అమూర్తంగా సాగేదే అయినప్పటికీ, దాన్ని 'సజీవ' క్రమంలో మాత్రమే అలవర్చుకోవడం జరుగుతుంది. ఎందుకంటే ఇక్కడ నేర్చుకునే వ్యక్తి నిష్క్రియాపరుడైన, యాంత్రికమైన గ్రహీత కాదు. ఒక గ్రామఫోన్ రికార్డ్ కాదు. అప్పుడప్పుడూ పరీక్షల్లో విద్యార్థులు రాసే సమాధానాలు చూస్తే వాళ్లు యాంత్రిక గ్రహీతలేమో అనిపిస్తుంది కాని, అది నిజంకాదు. ఈ విద్యారూపాలకూ, శిశువు మనస్తత్వానికి మధ్య సంబంధం ఎల్లవేళలా క్రియాశీలంగా, సృజనాత్మకంగా ఉంటుంది. సరిగ్గా ఒక శ్రామికుడికి తన పనిముట్లతో ఎటువంటి క్రియాశీలమైన, సృజనాత్మకమైన సంబంధ ముంటుందో శిశువుకు, విద్యా రూపాలకు అటువంటి సంబంధమే ఉంటుంది. సామర్థ్యం అనేది అనేక అమూర్త భావనల సమ్మేళనం. కాని, సామర్థ్యాన్ని వాడకుండా నిజమైన వస్తువులను సృష్టించడం సాధ్యంకాదు. ఇక్కడ నిజమైన వస్తువులంటే సామాజిక సంబంధాలే. ఆ సామాజిక సంబంధాలలో ఎన్నో భావనలు అంతర్గర్భితంగా కలగలసి ఉంటాయి.

అధ్యయనం, చదవడం కూడా ఒక వృత్తేనని, చాలా కష్టభరితమైన వృత్తేనని చాలామంది చేత ఒప్పించవలసి ఉంది. అది ఎంత కష్టభరితమైన వృత్తి అంటే దానికి దాని ప్రత్యేకమైన శిక్షణ ఎంతో అవసరం. ఆ శిక్షణలో కండరాలు ఉపయోగించాలి, నరాలు ఉపయోగించాలి, మెదడు కూడా ఉపయోగించాలి. అది ఎప్పటికప్పుడు మనను మనం మార్చుకొనే ప్రక్రియ. కృషితో, సాధనతో బహుశా బాధతో కూడా మనకు మనం గ్రహించవలసిన, పొందవలసిన అలవాటు అది. ఉన్నత పాఠశాల విద్యలో ఎక్కువ పాల్గొంటున్న కొద్దీ అధ్యయన క్రమశిక్షణను తగ్గించుకునే వెసులుబాటుల కొరకూ, విశ్రాంతి కొరకు చూసే ధోరణి పెరుగుతుంది. నిజానికి చాలామంది ఏమనుకుంటారంటే, అసలు విద్యార్జన క్రమంలో ఇబ్బందులనేవి ఊహాత్మకమైనవని, కృత్రిమమైనవని. శారీరక శ్రమలో మాత్రమే చమటా, కష్టమూ ఉన్నాయని అనుకోవడానికి వాళ్లు అలవాటుపడ్డారు. కాని, ఇక్కడ సమస్య సంక్లిష్టమైనది. సంప్రదాయికంగా విద్యావంతులైన కుటుంబంలోని శిశువు ఇటువంటి శారీరక, మానసిక శ్రమలకు సులభంగా అలవాటు పడతాడనేది నిజమే. ఆ శిశువు తన తరగతి గదిలో ప్రవేశించడానికి ముందే తన సహ విద్యార్థులకన్న ఎక్కువ అవకాశాలను పొంది ఉన్నాడు. తన కుటుంబ వాతావరణంలో నేర్చుకున్న కొన్ని వైఖరులు అతనికి అప్పటికే ఉన్నాయి. 'కదలకుండా కూర్చోవడం' వగైరా పనులు అతనికి అప్పటికే అలవాటై ఉన్నాయి గనుక అతను ఏ విషయం మీదనైనా సులభంగా కేంద్రీకరించగలడు.

అదే విధంగా ఒక పట్టణ కార్మికుడి కొడుకు కార్ఖానాలో పని చేయడానికి వెళ్లినపుడు గ్రామీణ జీవితం అనుభవించిన రైతు కొడుకు కన్నా, రైతు యువకుడి కన్నా తక్కువ ఇబ్బంది పడతాడు. (అంతేకాదు, ఆయా సామాజిక బృందాల భోజన అలవాట్లకు కూడా వాటి పాత్ర ఉంటుంది.) అందువల్లనే చాలామంది ఏమనుకుంటారంటే, చదవడంలో ఉన్న కష్టం ఏదో తమకు అర్థం కావడం లేదని, అది తమ అవకాశాలను తగ్గిస్తున్నదని అనుకుంటారు. లేదా స్వాభావికంగానే తమది మొద్దు బుర్ర అని అనుకునేవాళ్లూ ఉంటారు. అందుకు భిన్నంగా 'పెద్ద మనుషులు', 'బుద్ధిజీవులు' సంపూర్ణమైన వ్యక్తులని, తమ పిల్లలు కన్నీరు కార్చినా, రక్తమోడ్చినా సాధించలేని పనులు ఆ పెద్ద మనుషులు వేగంగా, సులభంగా సాధించగలరని, అందులో ఏదో నిగూఢత్వం ఉన్నదని అనుకుంటారు. భవిష్యత్తులో ఈ ప్రశ్నలు మరింత తీవ్రతరమవుతాయి. వక్రీకరించకుండా, సులభంగా అర్థం చేసుకోలేని దాన్ని సులభంగా చూపెట్టడం అనే ధోరణిని ఇప్పటికైనా మనం ప్రతిఘటించవలసి ఉంది. సంప్రదాయికంగా సముచిత పరిజ్ఞానాన్ని ఆర్జించడంలో వెనుకబడి ఉన్న సామాజికబృందాల నుంచి అత్యున్నతస్థాయి ప్రత్యేక పరిజ్ఞానం గల నిపుణులతోసహా కొత్తతరహా మేధావులను సృష్టించడమనేది మన లక్ష్యమైతే, మనం అధిగమించవలసిన సమస్యలు అసాధారణమైనవి.

(ఆంటోనియో గ్రాంసీ ఇటలీ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు. ఇటలీలో ముస్సోలినీ నాయకత్వంలో ఫాసిస్ట్ పాలన ప్రారంభమైన తరువాత 1926లో గ్రాంసీని అరెస్ట్ చేసి ముస్సోలినీ మీద హత్యా ప్రయత్నం కేసులో విచారణ జరిపారు. ముప్పై ఐదు సంవత్సరాల వయసులో అప్పటికే సుప్రసిద్ధ మేధావిగా, రచయితగా పేరొందిన గ్రాంసీ మీద నేరారోపణ చేస్తూ ప్రభుత్వ న్యాయవాది 'ఈ మెదడును కనీసం ఇరవై సంవత్సరాల పాటు పనిచేయకుండా ఆపాలి' అన్నాడు. కాని, ఇరవై ఏళ్లు గడపకుండానే 1935లో ఆయన జైల్లోనే మరణించాడు. జైల్లో గడిపిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ఆయన తత్వశాస్త్రం, రాజకీయాలు, సంస్కృతి, చరిత్ర, మార్క్సిజం, ప్రజాస్వామ్యం లాంటి అనేక అంశాల మీద దాదాపు మూడు వేల పేజీలు రచనలు చేశాడు. ఆయన మరణానంతరం వెలుగులోకి వచ్చిన 'ప్రిజన్ నోట్‌బుక్స్' లో విద్యారంగం పై ఆయన రాసిన వ్యాసాలలోని ఒక భాగం ఇది. అప్పటి ఇటలీ ప్రభుత్వ పాఠశాల విద్యావిధానం మీద వ్యాఖ్యగా సాగిన ఈ రచనలో సమకాలీన నేపథ్యంతో పాటే ఎల్లకాలానికి వర్తించే తాత్విక దృక్పథం కూడా ఉంది.) వీ

నానావతి కమిషన్ గడువు పెంపు

గుజరాత్‌లో 2002లో జరిగిన మతకల్లోలాలపై విచారణ కోసం నియమించిన జస్టిస్ నానావతి కమిషన్ నివేదిక గడువును ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. రెండో భాగం నివేదిక సమర్పించేందుకు కమిషన్ మరో ఏడాది గడువు కోరింది. కమిషన్ గడువు పొడిగించడం ఇది పదకొండోసారి.

ఉత్తరప్రదేశ్‌లో ఇంజనీరు హత్య

పి.డబ్ల్యూ.డి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇ.ఇ.) ఎం.కె. గుప్తా హత్యతో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం అట్టుడికి పోయింది. ముఖ్యమంత్రి మాయావతి పుట్టినరోజు వేడుకల కోసం విరాళం ఇవ్వనందుకే ఆయనను కొట్టిచంపారంటూ బి.ఎస్.పి. శాసనసభ్యుడు శేఖర్ తివారిపై ఆరోపణలు వచ్చాయి. డిసెంబర్ 23 రాత్రి ఎం.ఎల్.ఎ. తన అనుచరులతో గుప్తా ఇంట్లోకి బలవంతంగా చొరబడి అతని భార్యను స్నానాల గదిలో బంధించి, గుప్తాపై దాడికి పాల్పడ్డారు. చిత్రహింసల మూలంగా గుప్తా మరణించినట్లు పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడయింది. డిసెంబర్ 25న రాష్ట్రవ్యాప్త బంద్‌తోపాటు పలుచోట్ల ధర్నాలు, రైల్‌రోకోలు జరిగాయి. ఎం.ఎల్.ఎ. తివారిని, అతనికి సహకరించిన వారిని విచారణ నిమిత్తం పోలీసులు అరెస్ట్ చేశారు.

కాశ్మీర్ ఎన్నికల ఫలితాలు

జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 28న వెల్లడయ్యాయి. మొత్తం 87 శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరగగా, నేషనల్ కాన్ఫరెన్స్ 28 సీట్లతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. తరువాతి స్థానాల్లో పిడిపి - 21; కాంగ్రెస్ - 17; బిజెపి - 11; ఇతరులు - 10 సీట్లు సాధించాయి. ఈ ఎన్నికల్లో 61 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నప్పటికీ, ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. కాంగ్రెస్ మద్దతుతో నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా (38) జమ్మూకాశ్మీర్ పదకొండవ ముఖ్యమంత్రిగా జనవరి 5న ప్రమాణ స్వీకారం చేశారు.

గువాహతీలో పేలుళ్లు

రెండు నెలల క్రితం జరిగిన పేలుళ్ల నుంచి తేరుకోకముందే అసోం రాజధాని గువాహతీలో జనవరి 1న మళ్లీ పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో ఐదు మంది చనిపోగా యాభై మందికి పైగా గాయపడ్డారు. మధ్యాహ్నం మూడు గంటలకు బిరుబరి తినేలీ ప్రాంతంలోని చెత్తకుండీ లో, ఐదున్నర గంటలకు బూత్‌నాథ్ ప్రాంతంలోని మార్కెట్లో మళ్లీ పదిహేను నిమిషాల తేడాలో ఈ పేలుళ్లు జరిగాయి. ఇది ఉల్ఫా చర్యగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రాణాలు తీస్తున్న చలి

ఉత్తర భారతాన్ని చలి గడగడలాడిస్తోంది. డిసెంబర్ చివర మొదలై జనవరి మొదటివారం వరకు పెరిగిన చలికి ప్రజలు ఇళ్లలోనే బందీలైపోయారు. పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దైనాయి. చలి ప్రభావం జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో తీవ్రంగా ఉంది. జనవరి 4న ఉత్తరప్రదేశ్‌లో పన్నెండు మంది, జమ్మూకాశ్మీర్‌లో ముగ్గురు చనిపోయారు. వీరితో చలికి చనిపోయిన వారి సంఖ్య నలభై ఆరుకు చేరింది.

గిరిజనుల కాల్చివేత

ఆంధ్రా చత్తీస్‌ఘడ్ సరిహద్దులోని దండకారణ్యంలో సల్వాజుడుం స్పెషల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్.పి.ఒ.)లు మావోయిస్టుల పేరుతో పద్దెనిమిది మంది గిరిజనుల ప్రాణాలను బలితీసుకున్నారు. జనవరి 8న మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సింగారం అటవీ ప్రాంతంలోని పలు గిరిజన గూడాల్లోకి వందల మంది సల్వాజుడుంకి చెందిన ఎస్.పి.ఒ.లు చొరబడ్డారు. ముప్పై మందిని అడవిలోకి తీసుకెళ్లి కాల్చి చంపారు. అనంతరం కాల్చి చంపారు. పదిహేడు మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగిలినవారి ఆచూకి తెలియలేదు.

నందిగ్రామ్‌లో తృణమూల్ విజయం

పశ్చిమ బెంగాల్‌లో మూడు శాసనసభ స్థానాలకు జరిగిన ఉపఎన్నికలో అధికార వామపక్ష కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జనవరి 5న జరిగిన ఉపఎన్నికలో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజా బీబి తన ప్రత్యర్థి సి.పి.ఐ. అభ్యర్థి పరమానంద భారతిపై 39,551 ఓట్ల తేడాతో విజయం సాధించింది. సి.పి.ఐ. కి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గాన్ని కోల్పోవడం గమనార్హం. సెజ్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యమించిన నందిగ్రామ్ వాసులపై జరిగిన కాల్పులు, ఆ తర్వాతి పరిణామాలు, ఉద్యమ ప్రభావం ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది.

లారీల సమ్మె

జనవరి 4 నుంచి దేశవ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యజమానులు సమ్మె చేశారు. అఖిల భారత మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణసింగ్ లోహారా, మరో ఐదుగురి పై జాతీయ భద్రతా చట్టాన్ని (నాసా) ప్రయోగించి అరెస్ట్ చేశారు. ఇదే కాలంలో చమురు కంపెనీ ఉద్యోగులు కూడా సమ్మె చేపట్టడంతో పరిస్థితి అతలాకుతలమైంది. కంపెనీ ఉద్యోగుల సమ్మెను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించి విరమింపజేసింది.

కట్నం తీసుకున్నట్లు రుజువు చేయక్కర్లేదు

అత్తింటివారు కట్నం తీసుకున్నట్టు కచ్చితంగా నిరూపించాలంటే, ఇక దోషులెవరికీ శిక్షలు పడవని ఒక వరకట్నం మృతికేసులో సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. జస్టిస్ అర్జిత్‌పసాయిత్, జస్టిస్ ముకుందకమ్ శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఆయా సందర్భాలలో లభించే ఆధారాలే వరకట్న కేసుల్లో కీలక పాత్ర పోషిస్తాయని, వీటి ఆధారంగా న్యాయస్థానాలు నేరనిర్ధారణలో ఓ అంచనాకు రావచ్చని కోర్టు తెలిపింది.

62 మందికి యావజ్జీవం

కేరళలోని కోజికోడ్ జిల్లా మరద్ గ్రామంలో ఐదేళ్ల క్రితం జరిగిన తొమ్మిది మంది హత్య కేసులో స్థానికకోర్టు అరవై రెండు మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఒక కేసులో ఇంతమందికి యావజ్జీవ శిక్ష పడడం దేశంలోనే ఇది తొలిసారి. అదనపు సెషన్స్‌జడ్జి బాబూ మాథ్యూ పి. జోసెఫ్ ఈ తీర్పునిచ్చారు. వి

2.5 కోట్ల ఉద్యోగులకు ఉద్వాసన

ఆర్థిక మాంద్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉపాధి కోల్పోయే వారి సంఖ్య 2010 నాటికి 2.5 కోట్లకు చేరుతుందని ఫ్రాన్స్‌లోని ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఒ.ఇ.సి.డి.) అధిపతి ఎంజెల్ గురియా తెలిపారు. నిర్మాణరంగంలో పరిస్థితి తీవ్రంగా ఉంటుందని అన్నారు.

675 కోట్లు దాటిన ప్రపంచ జనాభా

ప్రపంచ జనాభా 1 జనవరి 2009 నాటికి 675 కోట్లకు చేరనుందని జర్మనీకి చెందిన ప్రపంచ జనాభా సంస్థ (డబ్ల్యు.పి.ఎఫ్.జి.) 23 డిసెంబర్ 2008 న పేర్కొంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనే జనాభా వేగంగా పెరుగుతోందని వెల్లడించింది. జర్మనీలో వ్యక్తి సగటు వయసు 79 సంవత్సరాలు ఉండగా, ఆఫ్రికాలో ఇది 54కు పడిపోయిందని ఈ సంస్థ కార్యదర్శి రీనెట్‌బేర్ తెలిపారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులు

డిసెంబర్ 27న ఇజ్రాయిల్ ఏకపక్షంగా గాజాపై యుద్ధ విమానాలతో, రాకెట్లతో విరుచుకుపడింది. 'తీవ్రవాద మౌలిక సదుపాయాల ధ్వంసం' పేరిట జరిపిన ఈ దాడులలో 195 మంది చనిపోయారు, మూడు వందల మంది గాయపడ్డారు. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా నలభై హమాస్ ప్రధాన స్థావరాలు లక్ష్యంగా ఇజ్రాయిల్ విమానాలు మూప్పైసార్లు రాకెట్లు ప్రయోగించాయి. హమాస్ భద్రతా వ్యవస్థను బలహీనం చేయడం లక్ష్యంగా చేసిన ఈ దాడుల్లో పోలీస్ ఛీఫ్ జనరల్, హమాస్ భద్రతా యూనిట్ అధిపతి జబ్బార్, సెంట్రల్ గాజా గవర్నర్లు చనిపోయారు. గత ఇరవై ఏళ్ల పాలస్తినా – ఇజ్రాయిల్ సంఘర్షణలో ఒకే రోజు ఇంతమంది చనిపోవడం ఇదే మొదటిసారి. జనవరి 18 నాటికి దాడుల్లో మరణించిన పాలస్తినీయుల సంఖ్య 1200కి చేరింది.

బంగ్లాదేశ్ ఎన్నికలు

బంగ్లాదేశ్ ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ ఘనవిజయం సాధించింది. మూడు వందల స్థానాలు ఉన్న పార్లమెంట్‌లో అవామీలీగ్ కూటమి 258 స్థానాలు గెలుచుకుంది. అవామీ లీగ్ ఒక్కటే 229 సీట్లు సాధించింది. 1971లో బంగ్లాదేశ్ ఏర్పడిన తరువాత అవామీలీగ్‌కు ఇదే అతి పెద్ద విజయం. బేగం ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ కూటమికి కేవలం 31 స్థానాలు వచ్చాయి. ఐదు స్థానాలు స్వతంత్రులు, ఇతర చిన్న పార్టీలకు దక్కాయి. నాలుగు చోట్ల ఫలితాలు వాయిదా వేశారు. బంగ్లాదేశ్ గత రెండేళ్లుగా సైనిక పాలనలో ఉంది.

సద్దుమణిగిన యుద్ధ వాతావరణం

ముంబై దాడుల అనంతరం ఏర్పడ్డ పరిణామాలతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధవాతారణం నెలకొంది. సంయమనంతో కూడిన ప్రకటనలతో ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం తాత్కాలికంగా సద్దుమణిగింది. ముంబైలో ఉగ్రవాదుల ఖండిస్తూ పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ డిసెంబర్ 25న ఏకగ్రీవంగా తీర్మానించింది. 'యుద్ధం ప్రసక్తే లేదం'టూ భారత ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించడాన్ని పాకిస్థాన్ మీడియా స్వాగతించింది.

బ్రిటన్‌లో భారతీయ ఖైదీలు

బ్రిటన్ జైళ్లలో ఉన్న భారతీయుల సంఖ్య సెప్టెంబర్ 2005తో పోల్చుకుంటే 35 శాతం పెరిగినట్లు ఆ దేశ న్యాయమంత్రిత్వ శాఖ తెలిపింది. సెప్టెంబర్ 2008 నాటికి బ్రిటన్‌లోని పలు ఖైదీల్లో భారతీయ ఖైదీల సంఖ్య 259 నుంచి 350 కు పెరిగినట్లు పేర్కొంది. మొత్తం విదేశీ ఖైదీల సంఖ్య ఇదే కాలంలో 10,265 నుంచి 11,168 కి పెరిగింది.

క్యూబా విప్లవానికి యాభై ఏళ్లు

క్యూబా విప్లవానికి ఈ జనవరి 1తో యాభై ఏళ్లు నిండాయి. 1959 జనవరి 1న అర్జెంటీనా నాయకుడు చేగువేరా వంటి కమ్యూనిస్టు నాయకులతో కలిసి ఫిడెల్ కాస్ట్రో క్యూబా నియంతపై దాడి చేసి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఆ సందర్భంగా జరిగిన యుద్ధంలో నియంత ఫుల్గెన్సియా బటిస్టాను పదవీచ్యుతుణ్ని చేశారు. 1961లో క్యూబా ప్రభుత్వంపై అమెరికా గూఢచార సంస్థ సి.ఐ.ఎ. దాడి విఫలమైన తరువాత, సోవియట్ అనుకూల మార్క్సిస్ట్ దేశంగా క్యూబా ప్రకటించుకుంది. ఇటీవలే 82 ఏళ్ల ఫిడెల్ కాస్ట్రో పదవి నుంచి తప్పుకోగా ఆయన సోదరుడు రౌల్ కాస్ట్రో అధికారంలోకి వచ్చారు.

ఎల్.టి.టి.ఇ. పై పట్టు బిగించిన సైన్యం

దశాబ్దాలుగా అనధికారికంగా ఎల్.టి.టి.ఇ. కి రాజధానిగా వెలుగొందుతున్న కిల్లినోచ్చి నగరంపై శ్రీలంక సైన్యం పట్టు సాధించింది. జనవరి 2 ఉదయం సాగిన భీకర పోరాట అనంతరం శ్రీలంక సైన్యం కిలినోచ్చిని స్వాధీనం చేసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. కిలినోచ్చిని కోల్పోయినట్టు, ఈశాన్య ప్రాంతాలకు స్థావరాలను మారుస్తున్నట్టు ఎల్.టి.టి.ఇ. ప్రకటించింది. ఈ భీకర పోరులో వంద మంది టైగర్లు చనిపోయారు.

బరాక్ ఒబామా ప్రమాణ స్వీకారం

అమెరికా నలభై నాలుగవ అధ్యక్షుడిగా బరాక్ హుస్సేన్ ఒబామా (47) జనవరి 20న వాషింగ్టన్ శ్వేతసౌధంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఒకప్పుడు ద్వితీయశ్రేణి పౌరులుగా తలవంచుకుని బతికిన నల్లజాతికి చెందిన పౌరుడు ఇప్పుడు దేశ ప్రథమ పౌరుడుగా ఎంపికయిన చారిత్రక సందర్భం. సీనియర్ బరాక్ ఒబామా, స్టాన్లీ ఆన్ దున్హామ్ దంపతులకు ఆయన 1961 ఆగస్ట్ 4న హవాయిలో జన్మించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం సంక్షోభంలో ఉన్నామనీ, ఇళ్లు, ఉద్యోగాలు పోయాయనీ, ఈ సంక్షుభిత సందర్భంలో మనందరికి కొన్ని బాధ్యతలు ఉన్నాయని అన్నారు. దేశం యుద్ధం ముంగిట ఉందని, హింసా, ద్వేషాలపైననే ఈ యుద్ధమని అన్నారు.

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 డిసెంబర్ 2008 నుండి 20 జనవరి 2009 వరకు)

జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)
ఆదిలాబాద్	8	0	23	0	0	0	5	1	0	2	16	26	13	0	0	0	4	0
హైదరాబాద్	0	0	34	0	0	0	11	19	0	0	40	38	0	0	0	0	18	0
కరీంనగర్	17	4	71	0	0	0	7	8	2	0	32	27	13	0	2	0	7	0
ఖమ్మం	1	0	27	0	0	0	4	0	0	6	23	14	16	0	0	0	0	0
మహబూబ్‌నగర్	2	0	29	3	0	0	8	10	1	2	36	25	4	0	0	0	0	0
నిజామాబాద్	0	0	50	0	0	0	11	5	0	3	24	19	0	0	0	0	0	0
నల్గొండ	2	1	11	0	0	1	6	4	0	1	9	50	3	0	0	0	0	0
మెదక్	12	0	24	0	0	0	16	3	1	2	55	2	4	0	0	0	0	0
వరంగల్	7	3	1	0	0	0	1	11	4	0	8	1	4	0	0	0	0	0
కర్నూల్	12	0	33	0	0	0	3	11	0	5	43	23	21	0	0	0	0	0
అనంతపురం	9	1	19	0	0	0	9	1	0	5	38	4	14	0	0	0	0	0
చిత్తూరు	0	0	16	0	0	0	20	14	0	12	25	0	9	0	0	0	0	0
తూర్పు గోదావరి	0	0	32	0	0	0	8	7	0	2	42	34	7	0	0	0	0	0
గుంటూరు	1	0	20	0	0	0	0	10	0	9	31	18	2	0	0	0	1	0
కృష్ణా	0	0	5	0	0	0	40	6	0	18	80	46	5	0	0	0	7	6
నెల్లూరు	6	1	20	0	0	0	3	15	5	5	28	29	17	0	0	0	0	0
విజయనగరం	0	0	3	0	0	0	5	3	0	4	22	2	4	0	0	0	0	0
విశాఖపట్నం	0	0	15	0	0	0	5	10	0	4	21	8	0	0	0	0	0	1
శ్రీకాకుళం	0	3	7	0	0	0	10	0	0	0	23	19	9	0	0	0	0	0
*ఇతర జిల్లాలు	0	0	3	0	0	0	6	0	0	0	0	2	0	1	0	0	0	0
మొత్తం	**77**	**13**	**443**	**3**	**0**	**1**	**178**	**138**	**13**	**80**	**594**	**387**	**145**	**1**	**2**	**0**	**37**	**7**

అందిస్తున్నవారు : హైదరాబాద్ – డి. విజయభాస్కర్; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; కరీంనగర్ – ఎల్. సంతోష్; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; వరంగల్ – ఎ.కుమార్; నల్గొండ – డి. మహేష్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; నెల్లూరు – శ్యాంసన్; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – కె.వి. రమణ; కృష్ణా – బి. రమేష్‌బాబు; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; అనంతపురం – ఆదిశేషయ్య; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి

* ఇతర జిల్లాల సమాచారం

వీక్షణంలో వ్యాపార ప్రకటనల గురించి....

వీక్షణం ప్రతి సంచికలోనూ అచ్చవుతున్న ప్రభుత్వ ప్రకటన గురించి, ఇటీవల అచ్చయిన కొన్ని వ్యాపార ప్రకటనల గురించి కొందరు గౌరవనీయ మిత్రులు తమ అభ్యంతరాలను, సందేహాలను వ్యక్తం చేశారు. అటువంటి అభ్యంతరాలే, సందేహాలే మరికొందరు మిత్రులలో, అభిమానులలో కూడ ఉండవచ్చు.

ఏ పత్రిక అయినా అచ్చువేసే వ్యాపార ప్రకటనలతో ఆ పత్రికకు ఏకీభావం ఉండాలనే నియమమేమీలేదు. ఆ వ్యాపార ప్రకటనలను స్వీకరించడమాలేదా అన్నది పత్రిక ఇష్టాయిష్టాలకు సంబంధించిన అంశం కాదు. పత్రికారంగ ఆర్థిక స్థితికి సంబంధించిన విషయం. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం అమ్మకాల ఆదాయం మీద మాత్రమే ఆధారపడి ఏ పత్రికా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పత్రిక ఉత్పత్తి వ్యయంలో కొంతభాగాన్ని మాత్రమే పూరించగలుగుతుంది. అందువల్లనే పత్రికారంగం సాధారణంగా వ్యాపార ప్రకటనల ద్వారా ఆ లోటును పూరించుకోవడం మాత్రమే గాక లాభాలు కూడ చేసుకుంటుంది. వీక్షణం వంటి ప్రత్యామ్నాయ పత్రికలకు లాభాల సంగతి అలా ఉంచి, కనీస మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులయినా కావాలి. అందుకోసం కొన్ని వ్యాపార ప్రకటనలనయినా అంగీకరించకతప్పదు.

ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలన్నిటినీ పెద్ద పత్రికలు, పాలకపార్టీ ఆశ్రిత పత్రికలు, పైరవీకారులు కబ్జా చేస్తున్నారని, ఆ ప్రకటనల విధానంలో పారదర్శకత ఉండాలని, చిన్న పత్రికలకు ప్రాధాన్యత ఉండాలని ఎంతో కాలంగా ఆందోళన జరిగిన ఫలితంగా కొన్ని సంవత్సరాల కింద ప్రభుత్వ ప్రకటనలలో చిన్న పత్రికలకు తప్పనిసరిగా కొంతభాగం కేటాయించాలనే నిబంధనలు అమలులోకి వచ్చాయి. అందువల్ల వీక్షణంకు వస్తున్న ప్రభుత్వ ప్రకటన చిన్న పత్రికల హక్కుగా వస్తున్నదే తప్ప వీక్షణంలో అచ్చయ్యే రచనల మీద ప్రభావం వేయగలిగినది కాదు. నిజానికి ఆ ప్రకటన వల్ల వీక్షణం తన వైఖరిలో ఎప్పుడయినా ఏ మెతకవైఖరినయినా ప్రదర్శించి ఉంటే ఎవరయినా దాన్ని ఎత్తిచూపి సరిదిద్దవచ్చు.

పత్రిక నిర్వహణ కొరకు వ్యాపార ప్రకటనలను స్వీకరించకతప్పని దుస్థితిలో అవి రచనల మీద ప్రభావం వేయకుండా జాగ్రత్త పడడం తప్ప ప్రస్తుతానికి మరేమీ చేయగల అవకాశం లేదు. వ్యాపార ప్రకటనలను ఎంతమాత్రం స్వీకరించబోమని ప్రకటించాలంటే పత్రికకు విస్తారమైన ప్రజాసంఘీభావం ఉండాలి. అది ఆర్థిక స్వావలంబనగా మారగలిగిన స్థితి ఉండాలి. లేకపోతే కొంతకాలం విరాళాలమీదనో, అప్పుల మీదనో నడిపి ఆ తర్వాత పత్రికను ఆపివేయడం మినహా మరోమార్గం లేదు. ఈ అంశాలను పాఠకుల, అభిమానుల దృష్టికి తీసుకురావడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

వీక్షణంలో మీ ప్రకటనలకై చెల్లించాల్సిన రుసుం

చివరి కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	:	రు. 15,000
రెండవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	:	రు. 10,000
మూడవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	:	రు. 10,000
లోపల పేజీ (బ్లాక్ అండ్ వైట్‌లో ఫుల్ పేజీ)	:	రు. 7,500

వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com

సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

RNI Regn.No.APTEL/2003/11482 • Published on 29/1/2009 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

ఈ నిజాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.



ఈ రోజు నాకు కొత్త జీవితం దొరికింది. ఈ నిజాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. మధ్యలోనే ఆరిపోతుందనుకున్న నా జీవితానికి నిండు నూరేళ్ళు ప్రసాదించిన రాజీవ్ ఆరోగ్యశ్రీకి కృతజ్ఞతలు

- రాష్ట్రంలో 7.5 కోట్ల మంది పేదలకు ఉచిత వైద్యం
- ప్రమాదకరమైన గుండె జబ్బులు, క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధులతో పాటు సుమారు 850 రకాల వ్యాధులకు చికిత్స
- ప్రతి మండలానికి విస్తరించనున్న 108 అంబులెన్స్ సేవలు
- ఇంతవరకూ 190 కోట్ల రూపాయలతో 45 వేల శస్త్రచికిత్సలు





ప్రియమైన సోదరసోదరీమణులారా!

పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది. లక్షలాదిమందికి కొత్త జీవితాన్నిచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీని రాష్ట్రమంతటా అమలు చేస్తున్నాం. పేదల ఆరోగ్యమే నాకు మహా భాగ్యం. ఈ తృప్తి చాలు...

మీ వై.యస్.రాజశేఖర రెడ్డి.

R.O.No. 918/Sou/Advt.I/2008-09

జారీచేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao